సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 259

బుధవారం 10-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

హార్దిక్ సూపర్ షో

తొలి టీ20లో దక్షిణాఫ్రికాపై 101 పరుగుల తేడాతో భారత్ గెలుపు -13లో

భారత్‌లో భారీగా పెట్టుబడి

రూ.1.58 లక్షల కోట్ల మేర పెట్టుబడి పెట్టనున్న మైక్రోసాఫ్ట్ -13లో

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం..

సమర సంతకం

చంద్రబాబు సర్కారు తీరుపై కోట్ల మంది కన్నెర్ర

- సర్వం సిద్ధంగా ఉన్న వైద్య కళాశాలలను పప్పు బెల్లాలకు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తారా?
- రాష్ట్రానికి మెడికల్ సీట్లు, పేదలకు ఉచిత వైద్యం దూరం చేస్తారా?
- కాలేజీల ప్రైవేటీకరణపై పల్లె నుంచి పట్నం వరకూ పెల్లుబుకుతున్న వ్యతిరేకత
- కోటి సంతకాల సేకరణకు భారీ స్పందన
- తమ బిడ్డల భవిష్యత్తు, వైద్య రంగాన్ని కాపాడుకునేందుకు అన్నివర్గాల పోరాటం
- చంద్రబాబు కుట్రపూరిత విధానాలను నిరసిస్తూ ప్రజా ఉద్యమానికి పిలుపునిచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్
- అక్టోబర్ 10న మొదలైన కోటి సంతకాల సేకరణ.. ఊరూవాడా ఉద్యమ వేడి
- నవంబర్ 12న నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ర్యాలీల్లో కదం తొక్కిన విద్యార్థులు, యువత,
- నేడు నియోజకవర్గ కేంద్రాల్లో మీడియా సమావేశాలు, కోటి సంతకాల ప్రదర్శన
- అనంతరం జిల్లా కేంద్రాలకు తరలింపు
- 13 నాటికి జిల్లా కేంద్రాల నుంచి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి ర్యాలీగా కోటి సంతకాలు
- 17న కోటి సంతకాలను గవర్నర్‌కు అందజేయనున్న వైఎస్సార్‌సీపీ నేతలు

10లో

అనంతపురంలో సంతకాలు చేస్తున్న విద్యార్థులు, ప్రజలు

ప్రజలను మోసం చేయడానికే బాబు అంకెల గారడీ

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ధ్వజం

- 2025-26లో తొలి 6 నెలలకు సంబంధించిన చంద్రబాబు జీఎస్‌డీపీ ముందస్తు అంచనాలు తప్పలతడక
- రాష్ట్ర జీఎస్‌డీపీ సీఏజీఆర్ 10.40 శాతంగా ఉన్నట్లైతే.. రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం ఆ స్థాయిలో ఎందుకు పెరగలేదు? కేవలం 2.58 శాతానికే ఎందుకు పరిమితమైంది?
- మీరు సీఎంగా ఉన్న 2014-19 మధ్య దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 4.45% ఉంటే.. అదే మా (2019-24) హయాంలో 4.78%
- 2013-14, 2018-19 టీడీపీ పాలనలో దేశ తలసరి ఆదాయంలో రాష్ట్రం 18వ స్థానంలో ఉంటే.. అదే మా ప్రభుత్వంలో రెండేళ్లు కోవిడ్ ఉన్నప్పటికీ 15వ స్థానానికి ఎగబాకాం

2లో

'సాక్షి' చానల్‌ను ఎలా బ్లాక్ చేస్తారు?

వార్తా చానల్‌ను అంధకారంలోకి నెట్టేయడం అత్యంత తీవ్రమైన అంశం

- బాబు సర్కారుపై సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ నరసింహ ధర్మాసనం ఆగ్రహం
- ఇది ముమ్మాటికీ భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమేనని మండిపాటు
- ఈ అన్యాయంపై తక్షణమే విచారణ జరపాలని టీడీ శాట్‌కు ఆదేశాలు
- 'సాక్షి' గొంతు నొక్కాలన్న కుతంత్రంపై సర్వోన్నత న్యాయస్థానం నిలదీత
- ట్రిబ్యునల్ విచారణను మార్చి నెలకు వాయిదా వేయడంపై అసహనం
- వెంటనే విచారణ చేపట్టి న్యాయం చేయాలని స్పష్టమైన ఆదేశాలు

14లో

సాయంత్రం 6 దాటాక

51 లక్షల ఓట్లా?

- ఏపీ ఎన్నికల చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదు
- ఈవీఎంలపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయి.. బ్యాలెట్ పేపరే శరణ్యం
- కౌంటింగ్ రోజున ఈవీఎం బ్యాటరీ చార్జింగ్ ఎలా పెరిగింది?
- లోక్‌సభలో నిలదీసిన వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి

2లో



ప్రజలను మోసం చేయడానికే
బాబు అంకెల గారడీ

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజం

- 2025-26లో తొలి ఆర్నెల్లకు సంబంధించి చంద్రబాబు విడుదల చేసిన జీఎస్‌డీపీ ముందస్తు అంచనాలు తప్పులతడక
- రాష్ట్ర జీఎస్‌డీపీ సీఏజీఆర్ 10.40 శాతంగా ఉన్నట్లయితే.. రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం ఆ స్థాయిలో ఎందుకు పెరగలేదు? కేవలం 2.58 శాతానికే ఎందుకు పరిమితమైంది?
- కేంద్రం ఆదాయాలు, జీడీపీ పెరుగుదల సమానంగా ఉన్నాయి
- నువ్వు సీఎంగా ఉన్న 2014-19 మధ్య దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 4.45% ఉంటే... అదే మా ప్రభుత్వ (2019-24) హయాంలో 4.78%
- 2013-14, 2018-19 టీడీపీ పాలనలో తలసరి ఆదాయంలో రాష్ట్రం 18వ స్థానంలో ఉంటే... అదే మా ప్రభుత్వంలో రెండేళ్లు కోవిడ్ ఉన్నప్పటికీ 15వ స్థానానికి ఎగబాకాం
- మీ పాలన బాగున్నట్లయితే తలసరి ఆదాయంలో రాష్ట్రం 18వ స్థానానికి ఎందుకు పరిమితమైంది?
- ఇటీవలి కాగ్ గణాంకాల ప్రకారం రాష్ట్ర ఆదాయాల పెరుగుదల అతి దారుణంగా పడిపోయింది...
- చరిత్రలో ఎప్పుడూ లేని స్థాయిలో అప్పులు పెరిగాయి.. మూలధన వ్యయం అత్యంత తక్కువ స్థాయికి చేరింది
- రెవెన్యూ లోటు, ద్రవ్యోల్బణం ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి
- మీ విచ్చలవిడి అవినీతి వల్ల రాష్ట్ర ఆదాయాలకు భారీగా గండిపడింది
- ఇప్పుడు చెప్పండి.. ఎవరి పాలన బాగుందో..?
- కాగ్, ఎంవోఎస్‌పీఐ గణాంకాలతో సీఎం చంద్రబాబును కడిగిపారేస్తూ 'ఎక్స్'లో వైఎస్ జగన్ పోస్టు

సాక్షి, అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో తొలి ఆర్నెల్లకు సంబంధించి సీఎం చంద్రబాబు సోమవారం విడుదల చేసిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) ముందస్తు అంచనాలను తప్పులతడక అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివర్ణించారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ... తన మార్గదర్శకత్వంలో ఆర్థికంగా వృద్ధి చెందుతోందని ప్రజలను మభ్యపెట్టడానికే ఈ అంకెలను తయారు చేసినట్టుగా చంద్రబాబు చెప్పకనే చెప్పారంటూ దెప్పిపొడిచారు. దేశ ఆర్థిక పరిస్థితి చూస్తే కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయాలు, జీడీపీ పెరుగుదల సమానంగా ఉన్నాయని... ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలోనైనా ఆదాయాలు, జీడీపీ పెరుగుదల సమానంగా ఉంటాయని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు చెబుతున్నట్లుగా రాష్ట్ర జీఎస్‌డీపీ సీఏజీఆర్ (సగటు వార్షిక వృద్ధి రేటు) 10.40 శాతంగా ఉన్నట్లయితే... రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం ఆ స్థాయిలో ఎందుకు పెరగలేదని, అది కేవలం 2.58 శాతానికే ఎందుకు పరిమితమైందని ప్రశ్నించారు. 'కొందరిని కొంతకాలంపాటు మభ్యపెట్టగలవు... కొంతమందిని ఎల్లప్పుడూ మోసం చేయగలవు... కానీ, అందరినీ ఎల్లకాలం మభ్యపెట్టలేవు' అంటూ అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ చెప్పిన మాటలను గుర్తు చేస్తూ సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్), కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంవోఎస్‌పీఐ) నివేదికల్లోని గణాంకాలను ఉటంకిస్తూ చంద్రబాబు విధానాలను కడిగిపారేస్తూ మంగళవారం 'ఎక్స్'లో వైఎస్ జగన్ పోస్టు చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే...

తీవ్ర ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రం

''చంద్రబాబు, టీడీపీ కూటమి ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరం తొలి ఆర్నెల్లకు సంబంధించిన జీఎస్‌డీపీ అంచనాలను విడుదల చేసింది. ముందస్తు అంచనాల గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం తయారు చేయగలుగుతుంది. కావాలనుకుంటే వక్రీకరించగలుగుతుంది కూడా. కానీ, రాజ్యాంగబద్ధ సంస్థ కాగ్... రాష్ట్ర ఖాతాలను ఆడిట్ చేసి వెల్లడించే గణాంకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ వక్రీకరించలేరు. రాష్ట్ర ఖాతాలను పరిశీలించి కాగ్ విడుదల చేసిన గణాంకాల ద్వారానే ఏపీ ఆర్థిక పరిస్థితి వాస్తవికత ఏంటో తెలుస్తుంది. కాగ్ గణాంకాలు చంద్రబాబు సలహా ప్రకారమో లేక ఆయన మార్గనిర్దేశంలోనో తయారైనవి కావు. రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చిన నిజమైన ఆదాయాలు, చేసిన వాస్తవ ఖర్చుల ఆధారంగా ఈ సమగ్ర గణాంకాలు వెల్లడవుతాయి. ఈ ఆర్థిక ఏడాది మొదటి అర్ధభాగంలో కాగ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం వాస్తవం ఏమిటంటే... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉంది. ఆదాయాల పెరుగుదల అతి దారుణంగా పడిపోయింది. చరిత్రలో ఎప్పుడూ లేని స్థాయిలో రాష్ట్ర అప్పులు పెరిగాయి. మూలధన వ్యయం అత్యంత తక్కువ స్థాయికి చేరింది. మూలధన వ్యయం, సగటు పౌరుడు చేసే ఖర్చులు ప్రమాదకరంగా తగ్గాయి. రెవెన్యూ లోటు, ద్రవ్యోల్బణం ఆందోళనకర స్థాయిలో ఉన్నాయి. భారీ అవినీతి వల్ల రాష్ట్ర ఆదాయాలకు భారీగా గండి పడుతోంది. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా సరే, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బ్రహ్మాండంగా ఉందంటూ ప్రజలను మోసం చేయడానికి టీడీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ సందర్భంగా అబ్రహం లింకన్ గారి మాటలను గుర్తు చేయాల్సి వస్తోంది. లింకన్ గారు అన్న మాటలు ఇప్పుడు చంద్రబాబుకు సరిపోతాయి.

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలరా?

నేను అడిగే ఈ ప్రశ్నలకు చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పగలరా?

- నిజంగా రాష్ట్ర ఆర్థికవ్యవస్థ అభివృద్ధి చెందుతున్నట్లైతే, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకింత ఆర్థికపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది?
- 2014–19 మధ్య మీ పాలనలో జీఎస్‌డీపీ వృద్ధి అంత గొప్పగా ఉన్నట్లైతే దేశ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో రాష్ట్రం వాటా 4.45 శాతానికి మాత్రమే ఎందుకు పరిమితమైంది?
- వైఎస్సార్‌సీపీకి ప్రజలిచ్చిన ఐదేళ్ల కాలంలో కోవిడ్ మహమ్మారి కారణంగా రెండేళ్ల పాటు సంక్షోభం తలెత్తినా సరే... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో దేశ జీడీపీలో రాష్ట్రం వాటా (2019–24) మధ్య 4.78 శాతంగా ఉన్న మాట వాస్తవం కాదా?
- మీ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అంత బాగా నడిచినట్లైతే, తలసరి ఆదాయంలో జాతీయ స్థాయిలో రాష్ట్రం ర్యాంకు ఒక్క మెట్టు అయినా ఎందుకు పెరగలేదు?

((చంద్రబాబు వాస్తవిక సమర్థత గురించి, అలాగే 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన వాస్తవ ఆర్థిక పురోగతిని వివరిస్తూ, ఆయన అబద్ధాలను బట్టబయలు చేస్తూ ఈ ట్వీట్‌కు స్లైడ్‌లను జత చేశాం. వీటిని అందరూ ఓసారి పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.))

బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట

- 2014–19 కాలానికి చెందిన జీఎస్‌డీపీ సీఏజీఆర్‌ను, 2019–24 కాలానికి చెందిన సీఏజీఆర్‌తో పోల్చి.. తాను 2019–24 మధ్య అధికారంలో కొనసాగి ఉంటే 2023–24లో రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు 13.5 శాతం అయ్యేదంటూ చంద్రబాబు అత్యంత బాధ్యతారాహిత్యంగా మాట్లాడారు.
- 2019–24 మధ్య ప్రపంచంలోని ప్రతి ప్రభుత్వం కోవిడ్ కారణంగా అనూహ్యమైన ఆర్థిక సంక్షోభాన్ని, అలాగే దాన్నుంచి కోలుకోవడంలో కఠినమైన ఆర్థిక పరిస్థితులను ఎదుర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో, తాను అధికారంలో ఉంటే 13.5 శాతం వృద్ధి సాధించేవాడినని చంద్రబాబు చెప్పడం రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టడానికి చేసిన ప్రయత్నం తప్ప మరొకటి కాదు.
- సీఏజీఆర్ అనేది మొదటి సంవత్సరం, చివరి సంవత్సరాన్ని మాత్రమే ఆధారంగా తీసుకుని లెక్కిస్తారు. కానీ, ప్రతి సంవత్సరానికీ గణాంకాలను విడివిడిగా విశ్లేషిస్తేనే సంపూర్ణమైన, నిజమైన పోలిక సాధ్యమవుతుంది. ఆ వివరాలను ఒక్కసారి చూస్తే... 2014–19 కాలంలో దేశ జీడీపీలో ఏపీ వాటా 4.54 శాతం మాత్రమే. అదే 2019–24 మధ్య మా ప్రభుత్వ హయాంలో 4.78 శాతం. ఇది మాత్రమే కాదు.. అత్యంత తీవ్రమైన సంక్షోభ సంవత్సరాలైన 2020–21, 2021–22లో దేశ జీడీపీలో ఏపీ వాటా వరుసగా 4.93 శాతం, 4.79 శాతం.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద, మధ్యతరగతి వర్గాలకు అనుకూలంగా తీసుకొచ్చిన విధానాలు, దీంతోపాటు అభివృద్ధి మీద పెట్టిన దృష్టి కారణంగా... కోవిడ్ సంక్షోభం వల్ల తలెత్తిన ఆర్థిక ఒత్తిడిని దేశంతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో మరింత సమర్థంగా ఎదుర్కోగలిగాం. ఇంత స్పష్టమైన గణాంకాలు అందుబాటులో ఉన్నప్పటికీ, అత్యంత దారుణ పనితీరును చంద్రబాబు ప్రదర్శించినప్పటికీ, తాను ఇంకా మెరుగ్గా పనిచేసే వాడిని అని ఆయన ఎలా చెప్పగలరు?

భారీగా అవినీతి... రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం తగ్గడమే దీనికి నిదర్శనం

- టీడీపీ కూటమి ప్రభుత్వం వెల్లడించిన అంచనాల ప్రకారం 2024–25 తొలి ఆర్నెల్లలో రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు 9.89 శాతం.. 2025–26 తొలి ఆర్నెల్లలో 10.91 శాతం. ఈ రెండేళ్ల మొత్తాన్ని కలిపిచూస్తే జీఎస్‌డీపీ సీఏజీఆర్ 10.40 శాతం మాత్రమే కనిపిస్తోంది.
- సహజంగానే, ఈ స్థాయి జీఎస్‌డీపీ వృద్ధితో పాటు రాష్ట్ర సొంత ఆదాయాలు కూడా కనీసం 10 శాతం సీఏజీఆర్‌తో పెరగాలి. కానీ, వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. అంతేకాదు ఇంకా నిరాశాజనకంగా ఉంది.
- రాష్ట్రంలో ప్రజల కొనుగోలు శక్తిని ప్రతిబింబించే ఎస్‌జీఎస్‌టీ ఆదాయాల సీఏజీఆర్ 4.35 శాతం మాత్రమే పెరిగాయి. సేల్స్ ట్యాక్స్ ఆదాయాల సీఏజీఆర్ –2.80 శాతానికి తగ్గిపోయాయి. మొత్తంగా చూస్తే, రాష్ట్ర సొంత ఆదాయాల సీఏజీఆర్ కేవలం 2.58 శాతం మాత్రమే.
- కొత్త ప్రభుత్వం మద్యం విధానంలో పెద్ద పెద్ద మార్పులు చేసినప్పటికీ.. మద్యం రిటైల్‌ను ప్రైవేటీకరించడం, షాపులు పెంచడం, విక్రయ వేళలపై పరిమితులను ఎత్తివేయడం, బెల్ట్ షాపులను ప్రోత్సహించడం, అక్రమ పర్మిట్ రూమ్‌లను తిరిగి అనుమతించడం తదితర తీవ్ర మార్పుల తర్వాత కూడా ఎక్సైజ్ సుంకం సీఏజీఆర్ కేవలం 5.10 శాతం మాత్రమే పెరిగింది. లిక్కర్ వ్యవహారంలో భారీ అవినీతి జరుగుతుందనే విషయాన్ని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్ర ఆదాయాల సీఏజీఆర్ ఎక్కడా 10 శాతానికి దగ్గరగా కూడా లేదు. అది కేవలం 2.58 శాతం మాత్రమే. అన్నిటికంటే ముఖ్యంగా, రాష్ట్ర ప్రభుత్వం చేసిన మూలధన వ్యయం (కేపిటల్ ఎక్స్‌పెండేచర్) భయంకరంగా పడిపోయి సీఏజీఆర్ –16 శాతంగా నమోదైంది.
- నిజమైన వృద్ధి కనిపించిన ఏకైక అంశం... కేంద్ర పన్నులలో రాష్ట్రానికి లభించిన వాటా. అది కూడా సీఏజీఆర్ 17.78 శాతం. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పనితీరుకు సంబంధించినది. రాష్ట్ర ఆర్థిక సామర్థ్యానికి సంబంధించింది కాదు.

దేశ జీడీపీలో మన రాష్ట్రం వాటా ఇలా...

Financial year	AP GSDP (Cr.)	India GDP (Cr.)	Share in GDP	Share in GDP
2014-15	5,24,976	1,24,67,959	4.211%	4.454%
2015-16	6,04,229	1,37,71,874	4.387%	
2016-17	6,84,416	1,53,91,669	4.447%	
2017-18	7,86,135	1,70,90,042	4.600%	
2018-19	8,73,721	1,88,99,668	4.623%	
2019-20	9,25,839	2,01,03,593	4.605%	4.784%
2020-21	9,78,581	1,98,54,096	4.929%	
2021-22	11,31,629	2,35,97,399	4.796%	
2022-23	13,09,464	2,68,90,473	4.870%	
2023-24	14,22,094	3,01,22,956	4.721%	

చంద్రబాబు అధికారంలో ఉన్న 2014-15 నుంచి 2018-19 మధ్య జీడీపీలో మన రాష్ట్ర సగటు వాటా 4.454 శాతం కాగా, వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న 2019-20 నుంచి 2023-24 మధ్య 4.784 శాతానికి పెరిగిందని స్పష్టం చేసిన కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక ఇది

వార్షిక వృద్ధి రేటు చూడండి...

Particulars	First six months of FY 2023-24	First six months of FY 2025-26	Compounded Annual Growth Rate (over two year period)
State Goods & Services Tax	15,100.25	16,441.74	4.35%
Stamps & Registration	4,875.23	5,345.60	4.71%
Land Revenue	10.83	86.79	183.09%
Sales Tax	9,375.33	8,857.78	-2.80%
State Excise Duty	7,925.75	8,755.10	5.10%
Other Taxes	2,546.68	2,566.17	0.38%
State's own tax revenues	**39,834.07**	**42,053.18**	**2.75%**
States Non-tax revenues	**2,602.80**	**2,600.66**	**-0.04%**
States own revenues	**42,437.26**	**44,653.84**	**2.58%**
Funds from Central Government	**39,702.03**	**29,581.10**	**-13.68%**
Tax devolutions	18,431.82	25,566.87	17.78%
Grants in aid from CG	21,270.21	4,014.23	-56.56%
Revenue Receipts	**82,139.29**	**74,234.94**	**-4.93%**
Capital Expenditure	**16,576.88**	**11,715.09**	**-15.93%**

2023-24 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో సేల్స్ టాక్స్ రూ.9,375.33 కోట్లు కాగా, అదే ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో 2.80 శాతం తగ్గి రూ.8,857.78 కోట్లకే పరిమితమైంది

విద్యుత్ సంస్థల అప్పుల్లోనూ బాబే టాప్

Particulars	As of June 2nd 2014	As of 31st March, 2019	As of 31st March, 2024 (P)
Debt in the books of State power sector PSUs (Cr.)	26,658	64,675	1,11,864
Power purchase liabilities of DISCOMs (Cr.)	2,893	21,541	10,654
Total liabilities of the power sector (Cr.)	**29,552**	**86,215**	**1,22,518**
Absolute Increase (Cr.)		**56,664**	**36,303**
CAGR (Compounded annual growth rate)		**23.88%**	**7.28%**

చంద్రబాబు ఐదేళ్ల పాలనలో విద్యుత్ సంస్థల అప్పుల వృద్ధి శాతం 23.88 శాతం కాగా, అది వైఎస్ జగన్ పాలనలో కేవలం 7.28 శాతమే...

విద్యుత్ రంగంపై వాస్తవాలకు భిన్నంగా బాబు మాటలు

విద్యుత్ వినియోగదారులపై ఎలాంటి భారం వేయలేదని చంద్రబాబు చెబుతున్నారు. వాస్తవాలకు ఇది పూర్తి విరుద్ధం. ఎఫ్‌పీపీసీఏ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్) పేరుతో, చంద్రబాబు ప్రభుత్వం ఒకటిన్నర సంవత్సరాల్లో రాష్ట్ర ప్రజలపై రూ.18,272 కోట్లు భారం వేసింది. గత ప్రభుత్వం భవిష్యత్తు ఆదాయాలపై సెక్యూరిటీ సృష్టించింది. ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టింది అని చంద్రబాబు ఆరోపిస్తున్నారు. సరే గత ప్రభుత్వం రూ.25 వేల కోట్ల రుణం కోసం రూ.1,941 కోట్ల విలువైన ఆస్తులను తాకట్టు పెట్టింది. కానీ, ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం రూ.9 వేల కోట్ల బాండ్‌ల విడుదల కోసం రూ.1,91,000 కోట్ల విలువైన ఖనిజ సంపదను సెక్యూరిటీగా పెట్టింది. భవిష్యత్తు ఆదాయాలనూ అప్పుల కోసం పణంగా పెట్టింది. ఇంకా, రాష్ట్ర సంచిత నిధి (కన్సాలిడేటెడ్ ఫండ్) మీద బాండ్ హోల్డర్లకు హక్కు కల్పించింది. ఇది రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని, అత్యంత ప్రమాదకర చర్య. చంద్రబాబు గారు... వైఎస్సార్‌సీపీ పాలనలో విద్యుత్ రంగం దెబ్బతిన్నదని ఆరోపిస్తున్నారు. కానీ, వాస్తవాలు మాత్రం ఆయన ప్రకటనకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. టీడీపీ పాలనలో (2014–19) విద్యుత్ రంగపు అప్పులు సీఏజీఆర్ 23.88 శాతం. వైఎస్సార్‌సీపీ పాలనలో (2019–24) ఆ అప్పుల పెరుగుదల సీఏజీఆర్ 7.28 శాతం మాత్రమే. అంటే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని సమర్థవంతంగా నిర్వహించిందని స్పష్టమవుతోంది.

తలసరి ఆదాయం ర్యాంక్‌లు ఇలా..

State	2013-14	Rank
Delhi	227900	1
Goa	215776	2
Chandigarh	203356	3
Sikkim	194624	4
Puducherry	148147	5
Haryana	137770	6
Uttarakhand	126356	7
Maharashtra	125261	8
Kerala	123388	9
Karnataka	118829	10
Tamil Nadu	116960	11
Himachal Pradesh	114095	12
Gujarat	113139	13
Telangana	112162	14
Andaman & Nicobar	111087	15
Punjab	103831	16
Arunachal Pradesh	94135	17
Andhra Pradesh	**82870**	**18**
Mizoram	77584	19

State	2018-19	Rank
Goa	423716	1
Sikkim	375773	2
Delhi	338730	3
Chandigarh	307812	4
Haryana	223022	5
Telangana	209848	6
Kerala	205437	7
Karnataka	205245	8
Andaman & Nicobar	204254	9
Puducherry	204140	10
Gujarat	197457	11
Tamil Nadu	194373	12
Uttarakhand	186207	13
Maharashtra	182865	14
Himachal Pradesh	174804	15
Mizoram	164708	16
Arunachal Pradesh	155103	17
Andhra Pradesh	**154031**	**18**
Punjab	149974	19

State	2023-24	Rank
Sikkim	587743	1
Goa	585953	2
Delhi	459408	3
Chandigarh	453457	4
Telangana	347714	5
Karnataka	339813	6
Haryana	319363	7
Tamil Nadu	313329	8
Gujarat	300957	9
Kerala	281269	10
Maharashtra	278681	11
Andaman & Nicobar Islands	276000	12
Puducherry	252164	13
Uttarakhand	246178	14
Andhra Pradesh	**237951**	**15**
Mizoram	234996	16
Himachal Pradesh	234721	17
Arunachal Pradesh	217325	18
Punjab	205374	19

చంద్రబాబు సీఎంగా ఉన్న 2013-14, 2018-19లో తలసరి ఆదాయం ర్యాంకింగ్స్‌లో 18వ స్థానంలో ఉన్న ఏపీ... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న 2023-24 ఆర్థిక సంవత్సరంలో 15వ స్థానానికి చేరింది

వైఎస్సార్‌సీపీ పాలనలో పారిశ్రామిక ప్రగతి

చంద్రబాబు గారు... వైఎస్సార్‌సీపీ పాలనలో పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌ను విడిచిపెట్టారని చేసిన ఆరోపణ కూడా పూర్తిగా అవాస్తవం. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఆయన తయారు చేసిన అబద్ధమే ఇది. ఎంవోఎస్‌పీఐ గణాంకాల ప్రకారం.. ఏపీలో పరిశ్రమల జీవీఏ (స్థూల విలువ జోడింపు) వృద్ధి (2019–24) సీఏజీఆర్ 11.14 శాతం. అదే కాలంలో దేశ పరిశ్రమల జీవీఏ వృద్ధి సీఏజీఆర్ 8.96 శాతం. అంటే, వైఎస్సార్‌సీపీ పాలనలో పారిశ్రామిక వృద్ధిలో దేశ సగటు కంటే రాష్ట్రం ఎక్కువ వృద్ధిని సాధించిందన్నది స్పష్టమవుతోంది. పారిశ్రామిక వృద్ధికి సంబంధించి ఇలాంటి స్పష్టమైన విజయాలు ఉన్నప్పటికీ, పెట్టుబడిదారులు రాష్ట్రాన్ని విడిచిపెట్టారని చంద్రబాబు గారు ఎలా అంటారు? అది నిజానికి అసత్య ఆరోపణ... ప్రజలను మభ్యపెట్టే ప్రచారం మాత్రమే.

పరిశ్రమల రంగంలో జీవీఏ ఇలా..

Particulars	2018-19 (Cr.)	2023-24 (Cr.)	CAGR (2019-24)
India Industry GVA	46,14,137	70,89,650	8.970%
Andhra Pradesh Industry GVA	1,88,601	3,19,869	11.144%

2019-24 మధ్య దేశ పరిశ్రమల జీవీఏ వృద్ధి 8.97 శాతం కాగా, దానికన్నా ఎక్కువగా రాష్ట్ర సీఏజీఆర్ 11.14శాతం

National figures (Cr.)			
Particulars	2023-24	2025-26	CAGR over two years
GDP during first half of the financial year	1,44,52,325	1,71,30,434	8.87%
Gross tax revenues during first half of the financial year	16,19,271	18,65,354	7.33%

కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయాలు, జీడీపీ పెరుగుదల దాదాపు సమానంగా ఉన్నాయని తెలియజేస్తున్న కాగ్ నివేదిక

''చినబాబుతో వార్ రూమ్ ఏర్పాటు చేయించమంటారా?''

సాయంత్రం 6 దాటాక 51 లక్షల ఓట్లా?

ఏపీ ఎన్నికల చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదు

- ఈవీఎంలపై ప్రజల్లో అనుమానాలున్నాయి.. బ్యాలెట్ పేపరే శరణ్యం
- కౌంటింగ్ రోజున ఈవీఎం బ్యాటరీ చార్జింగ్ ఎలా పెరిగింది?
- వీవీప్యాట్ స్లిప్పులు అడిగితే తగులబెట్టామన్నారు
- ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో గళమెత్తిన వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలని, అప్పుడే గెలిచిన వారికైనా, ఓడిన వారికైనా వ్యవస్థపై నమ్మకం ఉంటుందని వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్ష నేత, ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి చెప్పారు. ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఈవీఎంలపై నెలకొన్న అనుమానాలను, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో గత ఎన్నికల్లో జరిగిన వింత పోకడలను ఎండగట్టారు. ప్రపంచంలోని అత్యాధునిక సాంకేతికత కలిగిన దేశాలే ఈవీఎంలను పక్కనపెట్టి బ్యాలెట్ పేపర్‌వైపు వెళుతుంటే.. మనం ఇంకా ఈవీఎంలను పట్టుకుని వేళ్లాడటంలో అర్థం లేదని చెప్పారు. ఏపీ ఎన్నికల్లో పోలింగ్ సరళిపై మిథున్‌రెడ్డి తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారు. 'ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 3 కోట్ల 38 లక్షల ఓట్లు పోలయ్యాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. కానీ ఆశ్చర్యకరంగా సాయంత్రం 6 గంటల తర్వాత ఏకంగా 15 శాతం ఓట్లు.. అంటే సుమారు 51 లక్షల ఓట్లు రికార్డయ్యాయి. రాష్ట్ర చరిత్రలో 2014లోగానీ, 2019లోగానీ ఎప్పుడూ ఇలా జరగలేదు. ఈ ఆకస్మిక పెరుగుదల ఎలా సాధ్యమైందో అర్థం కావడం లేదు. ఒడిశాలోనూ ఇలాంటి ఫిర్యాదులే వచ్చాయి' అని ఆయన సభ దృష్టికి తెచ్చారు.

చార్జింగ్ పెరగడం.. స్లిప్పులు తగులబెట్టడం..

'విజయనగరంలో కౌంటింగ్ రోజున ఈవీఎం బ్యాటరీ చార్జింగ్ 99 శాతంగా ఉంది. కానీ పోలింగ్ రోజున అది 60 శాతమే ఉంది. వాడకం తర్వాత బ్యాటరీ చార్జింగ్ తగ్గాలి. కానీ, ఎలా పెరుగుతుంది? అని మా మాజీ ఎంపీ ఫిర్యాదు చేశారు. దీనిపై ఈసీ నుంచి స్పందన లేదు. స్ట్రాంగ్‌రూమ్ సీసీటీవీ ఫుటేజీ అడిగితే ఇవ్వలేదు. కనీసం వీవీపాట్ స్లిప్పులు లెక్కించమని అడిగితే.. వాటిని తగులబెట్టేశాం, ధ్వంసం చేశాం అని సమాధానం ఇచ్చారు. అనుమానం ఉన్న ఈవీఎంలను కాకుండా వేరేవాటిపై మాక్ పోలింగ్ నిర్వహించారు' అని మిథున్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒక పోలింగ్ బూత్‌లో మరీ విడ్డూరం

'హిందూపురం నియోజకవర్గంలోని ఒక పోలింగ్ బూత్‌లో మరీ విడ్డూరం జరిగింది. ఒకేరోజు, ఒకే సమయాన జరిగిన ఎన్నికల్లో.. ఒక బూత్‌లో మా ఎంపీ అభ్యర్థికి 472 ఓట్లు వచ్చాయి. కానీ అదే బూత్‌లో మా ఎమ్మెల్యే అభ్యర్థికి కేవలం ఒక్క ఓటు మాత్రమే వచ్చింది. అక్కడ మాకు ఐదుగురు ఏజెంట్లున్నారు. వాళ్ల కుటుంబసభ్యుల ఓట్లే 30 వరకు ఉంటాయి. గత 30 ఏళ్లుగా మేము గెలుస్తున్న బూత్ అది. ఎంపీ అభ్యర్థికి 472 ఓట్లు పడినచోట, ఎమ్మెల్యే అభ్యర్థికి ఒక్క ఓటు పడటం ఈవీఎంల పనితీరుపై అనుమానాలకు తావిస్తోంది' అని చెప్పారు.

అమెరికానే బ్యాలెట్ వైపు వెళ్తోంది

టెక్నాలజీలో ఎంతో ముందున్న ఎలాన్ మస్క్ వంటి వారే ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని చెబుతున్నారని, అమెరికాలో 92 శాతం ఎన్నికలు బ్యాలెట్ పేపర్ మీదే జరుగుతున్నాయని మిథున్‌రెడ్డి చెప్పారు. నెదర్లాండ్స్, జర్మనీ, ఐర్లాండ్, ఫిన్లాండ్, బంగ్లాదేశ్ వంటి దేశాలన్నీ ఈవీఎంలను రద్దుచేసి బ్యాలెట్ పేపర్‌కు మళ్లాయని తెలిపారు. 'నేను మూడుసార్లు ఎంపీగా గెలిచింది ఈవీఎంల మీదనే అయినా, ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికి బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి తీసుకురావాలి' అని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ప్రతి పోలింగ్ బూత్‌లో వెబ్‌కాస్టింగ్ ఉండాలని, ఆ ఫుటేజీని అన్ని రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలని మిథున్‌రెడ్డి సూచించారు.

కేంద్రమంత్రి పెమ్మసానిపై మిథున్‌రెడ్డి సెటైర్లు

ఎస్ఐఆర్‌పై జరిగిన చర్చలో మిథున్‌రెడ్డి మాట్లాడుతుండగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అడ్డుపడ్డారు. దీంతో 'ఉపాధిహామీ పథకం డబ్బులు ఇంతవరకు ఇవ్వలేదు. రాష్ట్రంలోని కూలీల పరిస్థితులపై నీకు సరైన అవగాహన లేదు. బ్యాలెట్ పేపర్ విషయంపై మాట్లాడుతుండగా ఈ విషయంలో నువ్వెందుకు మాట్లాడుతున్నావు' అంటూ మిథున్‌రెడ్డి ప్రతిఘటించారు. 'లేదు వచ్చాయి, అయ్యాయి' అంటూ పెమ్మసాని ఏదో చెప్పబోతుండగా.. 'ఎలా వచ్చాయి? బస్సులో వచ్చాయా?' అంటూ మిథున్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఉపాధిహామీ నిధులపై మిథున్‌రెడ్డి ప్రస్తావించిన సమయంలో కూటమి ఎంపీలు ఎవరూ నోరు మెదపకపోవడం, పెమ్మసానికి సపోర్ట్‌గా మాట్లాడకపోవడం గమనార్హం.

క్లుప్తంగా...

స్క్రబ్ టైఫస్ లక్షణాలతో మహిళ మృతి

మృతురాలు కోయ నాగేంద్రమ్మ

సంతనూతలపాడు: ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన కోయ నాగేంద్రమ్మ (55) స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలతో గుంటూరు జనరల్ ప్రభుత్వ హాస్పిటల్లో మంగళవారం మృతిచెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. నాగేంద్రమ్మ మృతితో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రుద్రవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం మమత గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో ఈ వ్యాధిపై మెడికల్ ఆఫీసర్ జే నాగరాజు, సీహెచ్ఓ మాధవరావు అవగాహన కల్పించారు. గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్ లో మృతి చెందిన నాగేంద్రమ్మ మృతదేహాన్ని మంగళవారం సాయంత్రం వారి కుటుంబ సభ్యులు రుద్రవరం గ్రామానికి తరలించారు.

రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు నేడు 'ఈ - లాటరీ'

తాడికొండ: రాజధాని అమరావతి నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ) పరిధిలో భూ సమీకరణ పథకంలో సీడ్ యాక్సిస్ రహదారి నిర్మాణానికి భూములు అందజేసిన ఉండవల్లి గ్రామ రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించనున్నారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి రాయపూడిలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ–లాటరీ ఈ ప్లాట్ల కేటాయింపు జరుగుతుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ– లాటరీలో భాగంగా 14 మంది రైతులకు 22 ప్లాట్లను ఆన్లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయిస్తామని, వీటిలో 14 రెసిడెన్షియల్ ప్లాట్లు కాగా 8 కమర్షియల్ ప్లాట్లు ఉంటాయని పేర్కొన్నారు. సంబంధిత రైతులు ఈ–లాటరీ కార్యక్రమానికి హాజరు కావాలని సీఆర్డీఏ అధికారులు ఒక ప్రకటనలో కోరారు.

రైతుల ప్లాట్లలో రెండేళ్లలో పనులు పూర్తి

మంత్రి పొంగూరు నారాయణ

పనులు పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

తాడికొండ: రాజధాని ప్రాంతంలో మంత్రి పొంగూరు నారాయణ ఏడీసీ చైర్పర్సన్ డి.లక్ష్మీ పార్థసారథితో కలిసి మంగళవారం పర్యటించారు. సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణ పనులు, గుంటూరు ఛానల్పై స్టీల్ బ్రిడ్జి నిర్మాణం, రైతుల ప్లాట్లలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పన పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన ప్లాట్లలో రెండేళ్లలో డ్రైనేజీలు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులు పూర్తి అవుతాయన్నారు. సీడ్ యాక్సిస్ రహదారిని మంగళగిరి రహదారికి అనుసంధానించి త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. అవసరమైన ప్రాజెక్టులకు అనుగుణంగా తదుపరి భూసమీకరణ చేపడతామని తెలిపారు. 450 మంది రైతులకు ఇవ్వాల్సిన 1,891 ప్లాట్లలో కుటుంబ సభ్యుల సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు సీఆర్డీఏ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నెయ్యి కేసులో ఇద్దరిని కస్టడీకి తీసుకున్న సీబీఐ-సిట్

తిరుపతి తుడా: టీటీడీ నెయ్యి కేసులో రిమాండ్లో ఉన్న ఏ16 అజయ్కుమార్, ఏ29 ఆర్ఎస్వీఆర్ సుబ్రహ్మణ్యంను సీబీఐ–సిట్ అధికారులు మంగళవారం కస్టడీకి తీసుకున్నారు. తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం తమ కస్టడీకి తరలించారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

ఫీజు బకాయిలు చెల్లించే వరకు మా పోరాటం ఆగదు

- వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిది ముమ్మాటికీ అక్రమ అరెస్టే
- రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోంది
- శాంతియుత నిరసనలపై పోలీసు దమనకాండ
- ఫీజులు చెల్లించాలని అడిగితే పిడిగుద్దులు, అక్రమ అరెస్టులు
- విద్యార్థులను రాత్రి 11 గంటల వరకు ఊరూరూ తిప్పారు
- ఇది చంద్రబాబు ఫాసిస్టు పాలనకు నిదర్శనం
- ప్రభుత్వ తీరుపై మండిపడిన వైఎస్సార్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర

సాక్షి,అమరావతి: రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని, లోకేశ్ రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోందని వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ అధ్యక్షుడు ఎ.రవిచంద్ర మండిపడ్డారు. తాడేపల్లి వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ... వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు చైతన్యది ముమ్మాటికీ అక్రమ అరెస్టు అని, ఇలాంటి అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని తేల్చిచెప్పారు. ఫీజులు చెల్లించాలని అడిగితే పోలీసులతో పిడిగుద్దులు కురిపించారని, అక్రమ అరెస్టులు చేయించారని, ఫాసిస్ట్ పాలన సాగిస్తున్న చంద్రబాబుకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఆయన ఏమన్నారంటే..

విద్యార్థులపై పోలీసుల కర్కశత్వం..

''పెండింగ్లో ఉన్న రూ.7,800 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్పులు తక్షణమే విడుదల చేయాలంటూ సోమవారం తాడేపల్లిలోని సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయం వరకు వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన భారీ ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. శాంతియుతంగా, ప్రజాస్వామ్యయుతంగా ర్యాలీ నిర్వహిస్తుంటే.. పోలీసులే బారికేడ్లుతో అడ్డగించి... ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులపై పిడిగుద్దులు కురిపించారు. లాఠీలతో నెట్టివేశారు. అమానుషంగా, కర్కశంగా వ్యవహరించారు. సోషల్ వెల్ఫేర్ కార్యాలయంలోకి బృందంగా వెళ్లి, డైరెక్టర్ని కలిసి వినతిపత్రం ఇస్తామని విన్నవించినా పోలీసులు అనుమతించలేదు. మా నాయకులను కాళ్లతో తంతూ, చేతులతో గుద్దుతూ అప్పటికే సిద్ధం చేసిన వ్యాన్లలో కుక్కారు. వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు చైతన్యని, విద్యార్థులను అరెస్టు చేసి జైలుకు పంపారు. అరెస్టు చేసిన విద్యార్థులను ఏ పోలీస్ స్టేషన్కి తీసుకెళ్తున్నారో కూడా చెప్పలేదు. ముందు తాడేపల్లి అని చెప్పి అక్కడి నుంచి ఏపీఎస్పీ బెటాలియన్కు అక్కడి నుంచి తెనాలి, ఆపై దుగ్గిరాల పోలీస్ స్టేషన్కు తీసుకుని వెళ్లారు. అక్కడ ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్బంధించి అక్కడ నుంచి తాడేపల్లి పోలీస్ స్టేషన్కు తీసుకుని వెళ్తున్నామని చెప్పి.. మంగళగిరి పోలీస్ స్టేషన్కు తీసుకుని వచ్చారు. మా దగ్గర ఉన్న సెల్ ఫోన్లు అన్నింటినీ బలవంతంగా లాక్కున్నారు. అక్కడ నుంచి తాడేపల్లి దగ్గరకు తీసుకుని వచ్చి, ఆధార్ కార్డులు, సంతకాలు తీసుకుని మళ్లీ మంగళగిరి పోలీస్ స్టేషన్ అని చెప్పి కోర్టుకు తీసుకుని వచ్చారు. అక్కడి నుంచి రాత్రి 11.30 గంటలకు న్యాయమూర్తి ఇంటికి తీసుకుని వెళ్లి సరెండర్ చేశారు.'' అని రవిచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దిరెడ్డి నరేందర్ రెడ్డి, రాష్ట్ర జోనల్ ప్రెసిడెంట్ దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి,, రాష్ట్ర నాయకులు జి.సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చైతన్య అరెస్టు దారుణం:ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): రాష్ట్రంలో నెలకొన్న సమస్యలపై ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను నొక్కేయడం చంద్రబాబు ప్రభుత్వానికి అలవాటైందని ఎమ్మెల్సీ, వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మండిపడ్డారు. గుంటూరు జిల్లా జైల్లో ఉన్న వైఎస్సార్సీపీ స్టూడెంట్స్ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్యను మంగళవారం ములాఖత్లో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, వైఎస్సార్సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా, నాయకులు పరామర్శించారు. అనంతరం మీడియాతో అప్పిరెడ్డి మాట్లాడుతూ పానుగంటి చైతన్య ఏం అన్యాయం చేశారని జైల్లో పెట్టారని ప్రశ్నించారు. పేద విద్యార్థుల పక్షాన ఉద్యమించడమే ఆయన చేసిన తప్పా అని నిలదీశారు. చైతన్య అరెస్టు దారుణమన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తోందని మండిపడ్డారు. ఫీజు బకాయిలపై బాబు సర్కారు దిగి వచ్చే వరకు పోరాటం ఆగదన్నారు. వైఎస్సార్సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్మెంట్ రాపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ సీఈసీ సభ్యులు మందపాటి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

బాబు ఫైబర్నెట్ కుంభకోణానికి ఆధారాలు ఉన్నాయి

చంద్రబాబు అక్రమాలపై సీఐడీ అన్ని ఆధారాలు సేకరించింది

- 90 మంది సాక్షులను విచారించింది.. ఫోరెన్సిక్ ఆడిట్ సైతం చేయించింది
- ఆధారాలన్నీ రికార్డుల్లో ఉన్నాయి.. కోర్టు వాటిని పరిగణనలోకి తీసుకోవాలి
- చట్ట ప్రకారం ఈ కేసులో కోర్టుకు మూడే ఆప్షన్లు ఉన్నాయి
- కేసును విచారణకు స్వీకరించాలి లేదా తదుపరి దర్యాప్తునకు ఆదేశించాలి
- లేదంటే ప్రొటెస్ట్ పిటిషన్ను ప్రైవేటు ఫిర్యాదుగా తీసుకోవాలి
- సీఐడీ క్లోజర్ రిపోర్ట్ను తీవ్రంగా వ్యతిరేకించిన పొన్నవోలు
- ఏసీబీ కోర్టులో సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్రెడ్డి వాదనలు

సాక్షి, అమరావతి: చంద్రబాబు సీఎంగా ఉన్న 2014–19 మధ్య కాలంలో జరిగిన ఏపీ ఫైబర్ నెట్ కుంభకోణానికి సంబంధించి ఆధారాలు ఉన్నాయని ఫైబర్నెట్ మాజీ చైర్మన్ పూనూరు గౌతం రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్రెడ్డి విజయవాడలోని ఏసీబీ కోర్టుకు తెలిపారు. ఈ కుంభకోణంపై నమోదు చేసిన కేసును మూసివేయాలని కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్పైన, సీఐడీ పిటిషన్ను వ్యతిరేకిస్తూ ఫైబర్నెట్ లిమిటెడ్ పూర్వ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి దాఖలు చేసిన ప్రొటెస్ట్ పిటిషన్ పైన కోర్టులో వాదనలు మంగళవారం పూర్తయ్యాయి. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి భాస్కరరావు ఈ నెల 11న నిర్ణయం వెలువరిస్తానని ప్రకటించారు. అంతకుముందు పొన్నవోలు వాదనలు వినిపించారు. 'చంద్రబాబు హయాంలో ఫైబర్నెట్ కాంట్రాక్ట్ అప్పగింత వ్యవహారంలో రూ.320 కోట్ల మేర అక్రమాలు జరిగాయి. దీనిపై గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఫైబర్నెట్ లిమిటెడ్ చైర్మన్ గౌతం రెడ్డి సీఐడీకి ఫిర్యాదు చేశారు. టెండర్ ప్రక్రియలో అక్రమాలపై సీఐడీ ప్రాథమిక విచారణ జరిపి, ఆధారాలు సేకరించింది. వాటి ఆధారంగా కేసు నమోదు చేసింది. ఈ విషయంలో సీఐడీ హడావుడిగా వ్యవహరించలేదు. ప్రాథమిక ఆధారాలతోనే చంద్రబాబును నిందితునిగా చేర్చింది. అన్ని సాక్ష్యాధారాలు సేకరించి, చార్జిషీట్ కూడా దాఖలు చేసింది. సీఐడీ 90 మంది సాక్షులను విచారించింది. మొత్తం ఆధారాలను ఫోరెన్సిక్ ఆడిట్ చేయించింది. అక్రమాలు జరిగినట్లు అందులో కూడా నిర్ధారణ అయింది. ఈ రికార్డులన్నీ కోర్టు ముందున్నాయి' అని తెలిపారు. ప్రభుత్వం మారడం, చంద్రబాబు సీఎం అవడంతో ఆ ఆధారాలను, సాక్ష్యాలను సీఐడీ మూలన పడేసిందన్నారు. చంద్రబాబుపై కేసులో సాక్ష్యాలు లేవని, అందువల్ల కేసును మూసివేయాలని కోరుతూ క్లోజర్ రిపోర్ట్ దాఖలు చేసిందన్నారు. ఇందుకు చట్ట నిబంధనలు అంగీకరించవని చెప్పారు. సీఐడీ సేకరించిన ప్రతి ఆధారం కోర్టు రికార్డుల్లో ఉందని అలాంటప్పుడు సీఐడీ క్లోజర్ రిపోర్ట్ ఆధారంగా నిర్ణయం తీసుకోవడానికి వీల్లేదన్నారు.

ఇలా చేస్తే ప్రజలకు కోర్టులపై విశ్వాసం పోతుంది..

ఈ కేసులో కోర్టుకు చట్ట ప్రకారం 3 ఆప్షన్లు మాత్రమే ఉన్నాయని సుధాకర్రెడ్డి వివరించారు. కోర్టు ముందున్న సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకుని కేసును విచారించడం లేదా సాక్ష్యాధారాలు సరిపోవనుకుంటే తదుపరి దర్యాప్తునకు ఆదేశించడం లేదా గౌతంరెడ్డి దాఖలు చేసిన ప్రొటెస్ట్ పిటిషన్ను ప్రైవేటు ఫిర్యాదుగా తీసుకోవడం అని చెప్పారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కోర్టులపై ప్రజలు విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ న్యాయాధికారులను ఉద్దేశించి మాట్లాడిన మాటలను కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల మనసుల్లో న్యాయవ్యవస్థపై నమ్మకం సన్నగిల్లితే వారు కోర్టులకు రారని, ఇది అంతిమంగా అరాచకానికి దారి తీస్తుందని, దీని వల్ల ప్రజలు వీధుల్లోనే తమ వివాదాలను పరిష్కరించుకునే పరిస్థితి వస్తుందని చెప్పారని వివరించారు.

అధికార బలంతో తప్పును కడిగేసుకుంటున్నారు..

రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే గత ప్రభుత్వం ఈ కేసు పెట్టిందని, అందులో భాగంగా ఈ ప్రొటెస్ట్ పిటిషన్ కూడా దాఖలు చేశారని సీఐడీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై సుధాకర్రెడ్డి తీవ్రంగా స్పందించారు. మీరు అధికారం బలంతో మీ తప్పులను కడిగేసుకుంటున్నారంటూ మండిపడ్డారు. సీఐడీ తరఫు న్యాయవాది స్పందిస్తూ, సీఐడీ క్లోజర్ రిపోర్టులను ఆమోదిస్తూ ఈ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల కాపీలను ఈ పిటిషన్కు జత చేయలేదని అనగా.. సుధాకర్రెడ్డి తీవ్రంగా ప్రతిస్పందించారు. తమకు సర్టిఫైడ్ కాపీలు ఇవ్వొద్దని సీఐడీ చాలా గట్టిగా చెప్పిందన్నారు. దీంతో ఈ కోర్టు తమకు ఆ కాపీలు ఇవ్వలేదని, అలాంటప్పుడు వాటిని ఎలా తెస్తామని ప్రశ్నించారు. కాపీలు ఇవ్వొద్దన్న సీఐడీనే ఇప్పుడు వాటిని జత చేయలేదని ఎలా ఫిర్యాదు చేస్తుందని నిలదీశారు.

'బాలల కమిషన్'పై తర్జనభర్జనే..

- బాలల కమిషన్ పాలకుల ఎంపికకు ఇంటర్వ్యూల తేదీలపై కసరత్తు
- చైర్మన్, సభ్యుల పదవులకు మాజీ ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతల దరఖాస్తు
- నోటిఫికేషన్ నుంచి ఎంపిక ప్రక్రియ వరకు నిబంధనలకు పాతర

సాక్షి, అమరావతి: రాజ్యాంగబద్ధమైన ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నియామకానికి సంబంధించిన ఇంటర్వ్యూల నిర్వహణకు తర్జనభర్జన సాగుతూనే ఉంది. ఇప్పటికే మూడుసార్లు నోటిఫికేషన్ల రద్దు, మూడుసార్లు ఇంటర్వ్యూల వాయిదాలతో ఎనిమిది నెలలు గడుస్తోంది. చంద్రబాబు ప్రభుత్వ తీరుతో రాజ్యాంగబద్ధమైన కమిషన్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారుతోందనే విమర్శలు వినవస్తున్నాయి. తాజాగా ఈ నెల 3 నుంచి వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ముందురోజు రాత్రి రద్దుచేసిన సంగతి తెలిసిందే. దీంతో మళ్లీ ఈ నెల 11, 12, 13 తేదీల్లో కమిషన్ నియామకానికి సంబంధించిన ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 11న మంత్రివర్గ సమావేశం ఉండటంతో 12, 13, 14 తేదీలైతే ఎలా ఉంటుందనే దానిపై చర్చలు సాగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇంటర్వ్యూలు నిర్వహించి పారదర్శకంగా నియామకాలు చేయాలని బాలల హక్కుల కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. వైఎస్సార్సీపీ పాలనలో నియమించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్ 19తో ముగిసింది. కొత్తగా కమిషన్ నియామకానికి జూన్ 5న చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన తొలి నోటిఫికేషన్లో విద్యార్హత పీజీ ఉండాలనే నిబంధన పెట్టారు. దానిపై వివాదం నెలకొనడంతో రెండువారాల తరువాత విద్యార్హతను సవరించి డిగ్రీ చాలు అని మరో నోటిఫికేషన్ ఇచ్చారు. ఆ తర్వాత మూడో నోటిఫికేషన్ ఆన్లైన్లో ఇచ్చి.. తరువాత దాని గడువు పొడించారు. వాస్తవానికి రాష్ట్ర విభజన తరువాత రెండుసార్లు చేపట్టిన కమిషన్ నియామకంలో ఇచ్చిన నోటిఫికేషన్లో డిగ్రీ విద్యార్హత అనే నిబంధన పెట్టలేదు. దీంతో 2017లో నియమించిన కమిషన్లో ఇద్దరు సభ్యులు, 2022లో కమిషన్లోని ఒకరికి డిగ్రీ విద్యార్హత కూడా లేకపోవడం గమనార్హం. విద్యార్హత నిబంధన పెట్టాలంటే రాష్ట్ర ప్రభుత్వం రూల్స్ ఫ్రేమ్ చేసి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలని, అందుకు విరుద్ధంగా తోచినట్లు చేయడం శోచనీయమని స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు మండిపడుతున్నారు.

'పదేళ్ల అనుభవం'పై ఫేక్ సర్టిఫికెట్లు

కమిషన్ చైర్మన్, ఆరుగురు సభ్యుల నియామకానికి 650 దరఖాస్తులు వచ్చాయి. వడపోత అనంతరం 359 మందిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. మూడేళ్లు కొనసాగే చైర్మన్కు నెలకు రూ.2 లక్షలు, సభ్యుడికి రూ.1.50 లక్షల గౌరవ వేతనం ఉంటుంది. బాలల న్యాయచట్టం ప్రకారం.. బాలలకు సంబంధించిన చట్టాల్లో అనుభవం, విద్య, ఆరోగ్యం, రక్షణ, సంరక్షణ, అభివృద్ధితోపాటు దివ్యాంగ బాలలు, బాలకార్మిక, బాల్య వివాహలు, అణగారిన బాలలు, బాలల సైకాలజీ తదితర అంశాలలో పదేళ్లపాటు పనిచేసిన వారిని కమిషన్ చైర్మన్, సభ్యులుగా ఎంపిక చేయాల్సి ఉంది. బాలల కోసం నిజంగా పనిచేస్తే వారి గుర్తింపు కార్డు, హాజరు, జీతాల వివరాలతోపాటు పనిచేసినకాలంలో ప్రెస్ క్లిప్పింగ్స్, ఫొటోల ఆధారాలుండాలి. కానీ.. ఇంటర్వ్యూలకు హాజరయ్యే చాలామంది.. పదేళ్లపాటు బాలల కోసం పనిచేసినట్లు ప్రభుత్వేతర సంస్థలు (ఎన్జీవోలు), ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి తీసుకున్న నకిలీ ధ్రువీకరణ పత్రాలు జతచేసినట్లు తెలిసింది. దరఖాస్తుదారుల్లో న్యాయవాదులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వశాఖల్లో శాశ్వత ప్రాతిపదికన పనిచేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రైవేటు ఉద్యోగులు ఉన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు, మాజీ ఎంపీపీలు, టీడీపీ నాయకులు సైతం ఫేక్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసినట్టు తెలిసింది. తప్పుడు ధ్రువపత్రాలు ఇచ్చినవారిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు కూడా అధికారులకు అందాయి.

తాజాగా 26 జిల్లాల సీడబ్ల్యూసీలకు నోటిఫికేషన్

రాష్ట్ర కమిషన్ తీరు ఇలా ఉంటే.. రాష్ట్రంలోని 26 జిల్లాల బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ)ల నియామకాన్ని కూడా ప్రభుత్వం వాయిదాల పర్వంతోనే సాగదీస్తోంది. ఇప్పటికే మూడుసార్లు నోటిఫికేషన్ రద్దుచేసిన ప్రభుత్వం.. తాజాగా మంగళవారం 26 జిల్లాల సీడబ్ల్యూసీల నియామకానికి నోటిఫికేషన్ జారీచేసింది. అర్హత కలిగినవారు ఈ నెల 22వ తేదీలోపు హెచ్టీటీపీఎస్డబ్ల్యూడీసీడబ్ల్యూ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్సైట్లో దరఖాస్తు డౌన్లోడ్ చేసుకుని పూర్తిచేసిన తరువాత మెయిల్ ద్వారా పంపాలని నోటిఫికేషన్లో పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రులపై విశ్వాసం సన్నగిల్లుతోంది

- దీనికి వైద్యుల నిర్లక్ష్య వైఖరే కారణం
- మంత్రి సత్యకుమార్

సాక్షి, అమరావతి: వైద్యుల నిర్లక్ష్య వైఖరితో ప్రభుత్వాస్పత్రులపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోందని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. మంగళగిరిలో మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆపరేషన్ల సమయంలో రోగి శరీరంలో బ్లేడులు వదిలేయడం, ఒంటికి పడని ఇంజక్షన్లు ఇవ్వడం, గంటల తరబడి చికిత్స చేయకుండా బాధితులతో దురుసుగా ప్రవర్తించే ధోరణులపై అసహనం వ్యక్తం చేశారు. పాడేరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో 100 ఎంబీబీఎస్ సీట్లు ప్రవేశాలకు ముందుగానే ఎన్ఎంసీ అనుమతి ఇచ్చిందన్నారు. అధికారుల సమన్వయ లోపంతో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 50 సీట్లు కోల్పోయామన్నారు. పిడుగురాళ్లలో కేంద్ర ప్రాయోజిత పథకం(సీఎస్ఎస్) కింద చేపట్టిన వైద్య కళాశాలల్లో 2026–27లో ఎంబీబీఎస్ ప్రవేశాలకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో చేపడుతున్న ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల వైద్య కళాశాలల్లో 2026–27లో ప్రవేశాలకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. స్క్రబ్ టైఫస్ సూచనలు కనిపించిన వెంటనే డాక్సిసైక్లిన్ వాడకం ద్వారా అరికట్టవచ్చన్నారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా జన ఔషధి దుకాణాలు

రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్ ద్వారా మండలానికొక జన ఔషధి దుకాణాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఫలితంగా రోగులకు మందుల కోసం అయ్యే ఖర్చులను తగ్గిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ ఫార్మసీల సంఖ్యను పెంచుతోందని తద్వారా ఏపీకి అధిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఔషధ నియంత్రణ పరిపాలన శాఖలో ఖాళీగా ఉన్న అనలిస్టులు, ఇతర పోస్టులను మెడికల్ సర్వీస్ రిక్రూటుమెంటుబోర్డు ద్వారా భర్తీ చేయనున్నట్టు చెప్పారు. మంగళవారం వర్చువల్గా రూ.11.12 కోట్లతో నిర్మించిన 11 ఔషధ పరిపాలనా భవనాలు, టెస్టింగ్ ల్యాబ్లను మంత్రి ప్రారంభించారు.

అమరావతి నిర్మాణం ఆగకుండా మెటీరియల్ సరఫరా

సాక్షి, అమరావతి: అమరావతి నిర్మాణ పనులు ఆగకుండా చూసేందుకు అవసరమైన మెటీరియల్ సరఫరా చేసే నిమిత్తం ప్రభుత్వం 4 జిల్లాల అధికారులకు బాధ్యతలు అప్పగించింది. గ్రావెల్, రోడ్ మెటల్, మట్టి, ఇసుక సరఫరాలో కొంతకాలంగా సమస్యలు ఏర్పడిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వ ఆదేశాల అమలు కోసం 2 స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసింది. జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ గ్రావెల్, రోడ్ మెటల్, మట్టి వంటి మెటీరియల్ డిమాండ్, సరఫరా పరిస్థితిని చూసి, పెండింగ్లో ఉన్న క్వారీ లీజ్ దరఖాస్తులు, రెవెన్యూ ఎన్వోసీల జారీ, మైనింగ్ ప్లాన్, పర్యావరణ అనుమతులు వంటివన్నీ వెంటనే క్లియర్ చేయించే బాధ్యతను ఈ కమిటీకి ఇచ్చారు.

ఆర్డీవోకు భూ సమస్యల పరిష్కార బాధ్యత

- జేసీల నుంచి ఆర్డీవోలకు అధికారాల బదలాయింపు
- ముఖ్యమంత్రి చంద్రబాబు

సాక్షి, అమరావతి: భూముల సమస్యలను పరిష్కరించేందుకు ప్రస్తుతం జాయింట్ కలెక్టర్లకు ఉన్న అధికారాలను ఆర్డీవోలకు అప్పగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు రెవెన్యూ శాఖను ఆదేశించారు. మార్కెట్ విలువలతో భూముల ధరను అప్ గ్రేడ్ చేయాలని చెప్పారు. వెలగపూడిలోని సచివాలయంలో మంగళవారం రెవెన్యూ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. సీఎం వివిధ అంశాలపై చర్చించి మార్పులు సూచించారు. వివాదాస్పద భూముల సమస్యలను ఆర్డీవోలు త్వరగా పరిష్కరించాలని చెప్పారు. చుక్కల భూములను 22ఏ జాబితా నుంచి తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. 1999 వరకు ప్రాథమిక సహకార సంఘాల వద్ద తాకట్టు పెట్టిన అసైన్డ్ భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగించాలన్నారు. బంజరు భూములకు సంబంధించి 1954 కంటే ముందు సేల్ డీడ్స్ రిజిస్ట్రార్ ఆఫ్ హోల్డింగ్స్ను 22ఏ నుంచి తొలగించాలని సూచించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు సహా అన్నింట్లోనూ రియల్టైమ్లో ఆటో మ్యుటేషన్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ఆటో మ్యుటేషన్ జరిగేలా వ్యవస్థను మార్చాలన్నారు. రెవెన్యూ శాఖను ఏడాదిలోగా పూర్తిగా ప్రక్షాళన చేయాలన్నారు. భూముల రీసర్వేను 2027 డిసెంబర్కి పూర్తి చేయాలని ఆదేశించారు. 22ఏ ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మంత్రుల కమిటీ సిఫార్సు మేరకు మున్సిపాలిటీల పరిధిలో ఉన్న అసైన్డ్ భూములు 250 చదరపు గజాల్లోపు 50 శాతం బేస్ వాల్యూతో రెగ్యులరైజ్ చేయాలని చెప్పారు. ఆక్వా కల్చర్ చేస్తున్న అసైన్డ్ భూముల్ని సబ్ రిజిస్ట్రార్ విలువ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలన్నారు.

త్వరలో ఫ్రీహోల్డ్ భూములకు పరిష్కారం

మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ భూములకు 2 నెలల్లోపే పూర్తి స్థాయి పరిష్కారం చూపిస్తామని చెప్పారు. ప్రభుత్వం, కోర్టుల నుంచి వేలంలో కొన్న భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

అటల్ సందేశ్ యాత్రలో పాల్గొనాలి

ఈ నెల 11– 25 వరకు జరిగే 'అటల్ సందేశ్–మోదీ సుపరిపాలన యాత్ర'లో పాల్గొనాలని సీఎం చంద్రబాబు టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఆయన మంగళవారం పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్లో మాట్లాడారు. వాజ్పేయ్ శతజయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు.

అపరిశుభ్రతే అసలు జబ్బు

సమాజంలో అసలు జబ్బు అపరిశుభ్రతే అని, దీన్ని మార్చగలిగితే అనేక వ్యాధులను దూరం చేయవచ్చని చంద్రబాబు అన్నారు. పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం పెంచాలని చెప్పారు. స్క్రబ్ టైఫస్పై అధ్యయనానికి జాతీయ స్థాయి వైద్య నిపుణులతో ప్రత్యేక టాస్క్ఫోర్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం మంగళవారం సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షించారు. అలాగే, రాష్ట్రంలోని 3 ప్రాంతాల అభివృద్ధికి పూర్వోదయ పథకం నిధులను వినియోగించుకొనేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. నీటి పారుదల ప్రాజెక్టులు, ఉద్యాన పంటలు, గ్రామీణ రోడ్లు వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. పూర్వోదయ పథకం నిధుల వినియోగంపై సీఎం మంగళవారం సమీక్ష నిర్వహించారు.

“ సత్యం వైపు వెళ్లే మార్గంలో ఒకరు చేయగలిగే తప్పులు రెండు మాత్రమే; పూర్తిగా వెళ్లకపోవటం, అసలే వెళ్లకపోవటం.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 10 డిసెంబర్ 2025

ఇండిగో బ్లాక్‌మెయిలింగ్

ప్రయాణికులపట్ల దురుసుగా ప్రవర్తిస్తూ తరచు వార్తల్లోకెక్కే ‘వివాద’యాన సంస్థ ఇండిగో... తనకు నచ్చని నిబంధనలు అమల్లోకి రావటాన్ని జీర్ణించుకోలేక వారం రోజులపాటు దేశంలో పౌర విమానయానాన్ని దాదాపు స్తంభింపజేసింది. కనీవినీ ఎరుగని రీతిలో దేశవ్యాప్తంగా మూడు వేలకు పైగా విమాన సర్వీసులు రద్దయి, వేలాదిమంది ప్రయాణికులు దారీతెన్నూ తోచక ఇబ్బందులు పడ్డారు. కనీసం ప్రత్యామ్నాయాలు వెదుక్కుందామన్నా లగేజీ ఆచూకీ దొరక్క నరకయాతన అనుభవించారు. వారం గడుస్తున్నా యథాపూర్వ స్థితి ఇంకా ఏర్పడలేదు. కాకపోతే కాస్త మెరుగైంది. ఈ పాపంలో కేంద్ర ప్రభుత్వానికీ వాటా ఉంది. ఇండిగో ధిక్కరణను పసిగట్టలేని అమాయకత్వం క్షంతవ్యమేనా? తక్కువ చార్జీలతో ప్రయాణికులను ఆకట్టుకుని, సామర్థ్యాన్ని మెరుగుపర్చుకుంటూ, ఎవరికీ అందని స్థాయిలో విస్తరించుకుంటూపోయిన ఇండిగో ఆ రంగంలో గుత్తాధిపత్యాన్ని నెలకొల్పింది. గత పాతికేళ్లలో మూతబడిన జెట్ ఎయిర్‌వేస్, ఎయిర్ సహారా, ఎయిర్ డెక్కన్, కింగ్‌ఫిషర్ వగైరా 9 సంస్థలు ఇండిగో చకచకా ఎదగటానికి దోహదపడ్డాయి. పర్యవసానంగా పౌర విమానయాన రంగంలో ఇండిగో 61 శాతం వాటాను సాధించగలిగింది. మరో సంస్థ ఎయిరిండియా 30 శాతం దగ్గర నిలిచింది.

పోటీదారులందరినీ దాటుకుని శరవేగంతో దూసుకుపోవటం, లాభార్జన అదే స్థాయిలో పెరగటం, స్వల్ప కాలంలోనే సమర్థవంతమైన సంస్థగా పేరు తెచ్చుకోవటం, ఏటా పది కోట్ల మంది ప్రయాణికులను చేరేయటం ప్రశంసించదగ్గ విజయమే కావొచ్చు. కానీ గగనతలంలో 35,000 అడుగుల ఎత్తున ఎగిరే విమానాలతోపాటే దాని అహంకారమూ పడగలెత్తింది. విమానయాన రంగాన్ని శాసిస్తున్న తనకు విధివిధానాలు నిర్దేశించటానికి పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) ఎవరన్న స్థాయికి చేరుకుంది. అందుకే ఉద్దేశపూర్వకంగా ధిక్కారాన్ని ప్రదర్శించింది. ‘కేవలం అవగాహన లేమి వల్లా, ప్రణాళికల రూపకల్పనలో జరిగిన లోటుపాట్ల వల్లా’ సర్వీసులకు అంతరాయం ఏర్పడిందన్న ఇండిగో ప్రకటన ఉత్త వంచన. ఎందుకంటే దేశీయ విమాన సర్వీసుల్ని ఎడాపెడా రద్దు చేసిన ఆ సంస్థ... అంతర్జాతీయ సర్వీసుల్లో కేవలం 10 శాతానికి మాత్రమే కోతపెట్టింది. ఆ సర్వీసులు ఇష్టానుసారం రద్దు చేస్తే భారీ మొత్తాల్లో జరిమానాలుంటాయి మరి.

డీజీసీఏ ఏర్పరిచిన నిబంధనలు ఇప్పటివి కాదు. గత ఏడాది మొదట్లోనే... అంటే దాదాపు రెండేళ్లనాడే ఆ ప్రతిపాదనలు రూపుదిద్దుకున్నాయి. లాభార్జన కోసం తక్కువ మందితో ఎక్కువ సర్వీసులు నడిపే ధోరణి ప్రమాదకరమన్న ఉద్దేశంతో విధించిన పరిమితులవి. వారంలో పైలెట్లకుండే విశ్రాంతి సమయాన్ని 36 గంటలనుంచి 48 గంటలకు పెంచటం, రాత్రి వేళల్లో పైలెట్లు పనిచేసే సమయాన్ని 10 గంటలకు పరిమితం చేయటం, ఒక పైలెట్ వారానికి రెండుసార్లకు మించి నైట్ ల్యాండింగ్‌లు చేయరాదన్న నిబంధన అందులో భాగమే. ఇవన్నీ గత నెల 1 నుంచి అమలు చేయాలని కోరింది. ఈ ఏడాది కాలంలో ఇండిగో ఇందుకోసం సాగించిన కసరత్తేమీ లేదు. పైగా ఒకరి పైలెట్లను మరొకరు తీసుకోరాదని వేరే సంస్థలతో లాలూచీకి దిగి పనిగంటలు పెంచింది. సిబ్బంది వేతనాలను స్తంభింపజేసింది. ఇతర సంస్థలన్నీ దారిలోకి వచ్చినప్పుడు ఇండిగోకు మాత్రమే ఏమిటి సమస్య? గండం గట్టెక్కటానికి గత్యంతరం లేక డీజీసీఏ తన నిబంధనలు సడలించుకోవాల్సి వచ్చింది. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఏర్పరిచిన నిబంధనలకే దిక్కులేకపోవటం విషాదం కాదా? బ్లాక్‌మెయిలింగ్‌కు లొంగటం కాదా?

ప్రతిదానికీ ప్రైవేటు మంత్రం జపించే పాలకులకు ఇండిగో వ్యవహారం కనువిప్పు కావాలి. సంక్షోభ సమయాల్లో టిక్కెట్ ధరలు పెంచి ప్రయాణికుల జేబులు కొల్లగొడుతున్నా పట్టనట్టుండే ధోరణి ఇండిగో వంటి సంస్థలకు కొమ్ములూ కోరలూ తెచ్చింది. ధిక్కరణకు పురిగొల్పింది. ఉన్న రెండు ప్రధాన విమానయాన సంస్థల్ని సరిగా పర్యవేక్షించలేని కేంద్ర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు చేతగానితనం ఈ పర్యాటక సీజన్‌లో దేశం పరువు తీసింది. ఈ వ్యవహారంలో జవాబుదారీతనాన్ని నిగ్గు దేల్చి కేంద్రమంత్రితో సహా బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.షష్ఠి రా.7.09 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.8.07 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.8.04 నుండి 9.40 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.31 నుండి 12.15 వరకు, **అమృత ఘడియలు:** ఉ.6.31 నుండి 8.06 వరకు, తిరిగి తె.5.41 నుండి 7.16 వరకు (తెల్లవారితే గురువారం).

సూర్యోదయం : 6.23
సూర్యాస్తమయం: 5.22
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ టాక్

సంపాదన



ఏఐ అంటే మీకు భయం అయితే నేర్చుకోవటం ప్రారంభించండి. ఏఐ మిమ్మల్ని అబ్బురపరుస్తుంటే ఏఐతో కలిసి అద్భుతాలు చేయటం ప్రారంభించండి. ఏదైనా సరే, ప్రారంభించండి. మీరు ఎంత వేగంగా ఉంటే అంత వేగంగా సంపాదించటం మొదలుపెడతారు.

– డాన్ మార్టెల్, ఆంట్రప్రెన్యూర్

మీరైతే...



ప్రతి రోజూ మంచిరోజు కాకపోవచ్చు. మీరైతే మంచి ఆలోచనతోనే ఉండండి. అందరూ మీకు నిజమే చెప్పరు. మీరైతే నిజాయితీగానే ఉండండి. అందరూ దయగా ఉండరు. మీరైతే దయతోనే ఉండండి. అప్పుడు ప్రపంచం కూడా మీలా మారిపోతుంది.

– డీన్ పాండే, వెల్‌నెస్ కోచ్

చూపు



ప్రతి ‘రోజు’ తనలో ఒక అందమైన విషయాన్ని కలిగి ఉంటుంది. ఆ అందాన్ని పసికట్టడానికి మీ కళ్లకు శిక్షణ ఇవ్వండి. ప్రతి ఒక్క రోజు పట్లా కృతజ్ఞతగా ఉండండి. హృదయంలోని కృతజ్ఞత ప్రేమగా వికసిస్తుంది. అప్పుడు జీవితాన్ని మీరు చూసే విధానం మారుతుంది.

– ప్రేమ్ రావత్, ఇండో–అమెరికన్ ‘గురు’

సరళం



మీ గురించి మీరు ఎలా భావిస్తున్నారో ప్రతిదీ ఆ భావనతోనే మొదలవుతుంది. ఉత్తమ జీవితాన్ని పొందటానికి యోగ్యమైన, విలువైన, అర్థమైన ఆలోచనలను మీ గురించి మీరు నింపుకోండి. ఈ స్వీయప్రేమ జీవితాన్ని సరళం చేస్తుంది.

– కామ్నా జఠ్మలానీ, నటి

ప్రశాంతత

ఈ పరుగుల ప్రపంచంలో ఎదురు దెబ్బలు ఉంటాయి, తోటివారి కంటే వెనకపడిపోవటమూ ఉంటుంది. కానీ మీ మీద మీరు నమ్మకం కోల్పోకండి. మీ ప్రతిభను మీరు అనుమానించకండి. ప్రశాంతంగా అనుభవం నుంచి పాఠాలు నేర్చుకోండి.

– అర్జున్ మైనీ, రేస్ కార్ డ్రైవర్

అంగీకారం

మీ కలలన్నీ నిజం అవుతాయి, వాటిని కొనసాగించే ధైర్యం మీలో ఉంటే కనుక! చేస్తున్న పనిలో పట్టుదలను కలిగి ఉండండి. సిద్ధమౌతున్న పోటీకి సర్వశక్తులనూ కూడదీసుకోండి. మీరు ఓటమిని అంగీకరించనంత కాలం ఎవరూ మిమ్మల్ని ఓడించలేరు.

– మనోజ్ కుమార్, బాక్సర్

ఈసీపై నమ్మకం పెరిగేనా?

విశ్లేషణ

అశోక్ లవాసా

గట్టిగా బెట్టు చేసిన తర్వాత, ఎన్నికల సంస్కరణలపై పార్లమెంట్‌లో చర్చించేందుకు ప్రభుత్వం దిగివచ్చింది. కానీ ఓటర్ల జాబితాల ప్రత్యేక సునిశిత సవరణ (సర్)పై నెలకొన్న వివాదం పరిష్కారమయ్యేందుకు ఇది తోడ్పడుతుందా? అసాధారణమైన రీతిలో సర్ నిర్వహించాలని భారత ఎన్నికల కమిషన్ (సీఈసీ) గైకొన్న నిర్ణయం అత్యంత వివాదాస్పదమైన నిర్ణయాలలో ఒకటిగా నిలుస్తుంది. ‘లొసుగులు లేని’ ఓటర్ల జాబితాలను రూపొందిస్తున్నామని కమిషన్ చెప్పుకుంటూంటే, ఇది చాలామంది ఓటు హక్కును కాలరాసేదిగా తయారైందని ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి.

సంస్కరణలకు ముందున్న పార్లమెంట్

ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల తర్వాత ముఖ్యమైన భాగస్వాములైన రాజకీయ పార్టీలు ఎన్నికల సంస్కరణలు తీసుకురావడంలో ముందు నిలిచిన సందర్భాలు అరుదు. సుప్రీం కోర్టు ముందుకు నెట్టిన సందర్భాలలో తప్పించి, ప్రభుత్వాలు కూడా సంస్కరణలకు విముఖంగానే ఉంటూ వస్తున్నాయి.

పోలింగ్‌లో ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనేటట్లు చేసేందుకు, సాంకేతిక ప్రగతిని వాడుకునేందుకు, నేరస్థులు పోటీ చేయకుండా అరికట్టేందుకు, పారదర్శకతను పెంచేందుకు, ఎన్నికల ప్రచారంలో నడచుకోవాల్సిన తీరును మెరుగుపరచేందుకు గణనీయమైన సంస్కరణలు తీసుకురావడంలో పార్లమెంట్ ముఖ్య భూమిక వహించింది. ఓటు హక్కు వినియోగించుకునే వయో పరిమితిని 1988లో 21 ఏళ్ళ నుంచి 18 ఏళ్ళకు తగ్గించారు. తర్వాత, 2021లో అర్హత గడించుకునే తేదీలను పెంచారు. వయోజనులు 18 ఏళ్ళు వచ్చిన తర్వాత, తదుపరి ఏడాది జనవరి 1 వరకు వేచి చూడనవసరం లేకుండా– జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల మొదటి తేదీలలో కూడా తమ పేర్లను ఓటరుగా నమోదు చేసుకోవచ్చని మంచి మార్పు తెచ్చారు. అలాగే, 1993లో ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రా (ఈవీఎం)లను వినియోగించడాన్ని 1998లో దశల వారీగా మొదలుపెట్టి, అవి సక్రమంగా ఉన్నాయో లేవో సరిచూసేందుకు, ‘ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్’ (వీవీప్యాట్)లను 2019లో తప్పనిసరి చేశారు. సుప్రీం కోర్టు ఆదేశం పుణ్యమా అని ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ పూర్వాపరాలను వెల్లడించడం 2003 నుంచి మొదలైంది.

◆ ఒక రాజ్యాంగబద్ధమైన సంస్థగా ఎన్నికల సంఘం తన తలుపులను తెరచి ఉంచితే, జనం ఇతర సంస్థల తలుపులు తట్టాల్సిన అవసరం ఉండదు.

దోషులుగా తేలిన లెజిస్లేటర్లను, లిల్లీ థామస్ కేసు పర్యవసానంగా, వెంటనే అనర్హులుగా చేయడం 2013లో మొదలైంది. పోలింగ్ కేంద్రాలను ఆక్రమించుకున్నా లేదా పెద్ద యెత్తున హింస చోటు చేసుకున్నా పోలింగ్‌ను వాయిదా వేసే లేదా రద్దు చేసే అధికారాన్ని పార్లమెంట్ 1989లో ఎన్నికల కమిషన్‌కు కట్టబెట్టింది. ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలనే లక్ష్యంతోనే ఎన్నికల కమిషన్, పార్లమెంట్, సుప్రీం కోర్టు ఆ యా సంస్కరణలు తెచ్చాయి.

అవసరమైన సంస్కరణలు

ఎగువ పేర్కొన్న శాసనపరమైన మార్పులు తెచ్చినప్పటికీ, పెండింగ్‌లో ఉన్న సంస్కరణల జాబితా పెద్దదే. అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించడానికి సంబంధించిన చట్టాన్ని మరింత కఠినతరం చేయడం నుంచి రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చేందుకు ప్రత్యామ్నాయ పద్ధతులను రూపొందించడం, ఎన్నికల ప్రచార ఖర్చులపై ఒక పరిమితి విధించడం వరకు చాలానే ఉన్నాయి. రాజకీయ పార్టీల లీగల్ స్టేటస్‌పై స్పష్టత లోపించడం ఇప్పటికీ ఆందోళనకర అంశమే. రాజకీయ పక్షాలను సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం కూడా ఉంది. కీలకమైన ఈ అంశాలను పక్కన పెట్టేసి, ‘సంస్కరణలన్నింటికీ’ తల్లిగా చెబుతున్న ‘ఒక దేశం – ఒకే ఎన్నిక’పై చర్చించడంలో పార్లమెంట్ చొరవను ప్రదర్శించింది.

‘సర్’పై ఆవేశకావేషాలను చల్లార్చవలసిన బాధ్యత కమిషన్‌పైనే ఉంది. తమ ఓటు హక్కును తొలగిస్తున్నారని కొందరు అంటూంటే, దానికి తక్కువ సమయంలో ఎక్కువ పని చేయ వలసి రావడం వల్ల ఒత్తిడి తట్టుకోలేక చాలా మంది పోలింగ్ కేంద్ర స్థాయి (బీఎల్వో) అధికారులు చనిపోయినట్లు చెబుతున్న అంశం తోడవుతోంది. కమిషన్ కున్న నిష్పాక్షిక ప్రతిష్ఠను సవరణ తతంగం మసకబారేటట్లు చేసింది. సాఫీగా, శాంతియుతంగా నిర్వహించదగిన ఓటర్ల జాబితా సవరణను, అనర్హత రాక్షసిపై యుద్ధంగా మార్చినందుకు కమిషన్ నిందను స్వీకరించవలసిన అవసరం లేదా?

బిహార్‌లో ఏం సాధించినట్టు?

బిహార్‌లో తుది ఓటర్ల జాబితాను లోపాలు లేకుండా మెరుగుపరచడం ద్వారా గడించిన ప్రస్ఫుట ప్రయోజనాలు ఏమిటో కమిషన్ తప్పకుండా ఆత్మపరిశీలన చేసుకుని, ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది. అది గతంలో డూప్లికేషన్ సాఫ్ట్‌వేర్‌ను విజయవంతంగా వినియోగించుకుంది. ఇపుడు దాన్ని ఉపయోగించి అన్ని రాష్ట్రాల ఓటర్ల జాబితాలను తనిఖీ చేయాలి. తద్వారా, డూప్లికేట్ ఓటర్లను గుర్తించి, వారి పేర్లను జాబితాల నుంచి తొలగించవచ్చు. కానీ అది ఆ సాఫ్ట్‌వేర్‌ను పక్కన పెట్టడానికి గల కారణం తెలియడం లేదు. ‘‘డూప్లికేషన్‌ను నివారించేందుకు ఒకే ఒక్క సేకరణ ఫారాన్ని’’ మనఃసాక్షి ననుసరించి సమర్పించవలసిందిగా ఓటర్లను కోరడంపై అది ఆధారపడుతోంది. తాను ఎప్పుడూ అనుసరించే సాధారణ సవరణ విధానాల ప్రకారం కాకుండా, దేశవ్యాప్తంగా సునిశిత సవరణ ద్వారా తాను ఏం సాధించదలచుకున్నదీ కమిషన్ స్పష్టంగా వివరించి తీరాలి. అన్నింటికన్నా ముఖ్యంగా ‘అర్హత లేని’ ఓటరును వెతికి పట్టు కునేందుకు ఇపుడు ఉన్న ఓటర్లు అందరినీ హాజరు పరచి తనిఖీ చేసే వ్యామోహాన్ని కమిషన్ వదులుకోవాలి. బిహార్‌లో సునిశిత సవరణ ద్వారా అది ఆ పని చేయలేకపోయింది.

ప్రజలకు తనపై ఉన్న నమ్మకాన్ని తిరిగి గడించుకోవడంలో పార్లమెంట్‌లో జరిగే చర్చ కమిషన్‌కు ప్రేరణ నిస్తుందని ఆశిద్దాం. పార్లమెంట్ లేదా సుప్రీం కోర్టు మాదిరిగానే ఎన్నికల కమిషన్ కూడా ఒక రాజ్యాంగబద్ధమైన సంస్థ. అది తన తలుపులను తెరచి ఉంచితే జనం ఇతర సంస్థల తలుపులు తట్టాల్సిన అవసరం ఉండదు. మన రిపబ్లిక్ అవతరించకముందే పురుడుపోసుకున్న కమిషన్‌కు పౌరులతో పేగు బంధం ఉంది. ఈ రక్త సంబంధాన్ని ఏ సుప్రీం కోర్టు ఉత్తర్వో గుర్తు చేయవలసి వస్తే అది విషాదకరం అవుతుంది. రాజకీయ సంక్షోభం దానికి కారణమైతే, అంతకుమించిన విషాదం మరొకటి ఉండదు.

వ్యాసకర్త ఎన్నికల సంఘం మాజీ కమిషనర్
(‘ద ట్రిబ్యూన్’ సౌజన్యంతో)

మనకు తెలియని మరో దేశం

పుస్తక ప్రపంచం

ది హిందీ హార్ట్ ల్యాండ్

గజాలా వహాబ్,
జర్నలిస్టు – రచయిత్రి

అనేక భాషలు, సంస్కృతుల సమ్మేళనంగా, వివిధ ప్రాంతాల సమాఖ్యగా భారతదేశం విశాలమైనది. అంతకు మించి వైవిధ్యభరితమైనది. అలాంటి చోట ‘హిందీ బెల్ట్’గా రాజకీయ, ఆర్థిక జనవ్యవహారంలో పాపులరైన ప్రాంతం రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల భూమి. మహాజనపదాల కాలం నుంచి ఇవ్వాల్టి దాకా భారత రాజకీయ భవితవ్యాన్ని నిర్దేశించడంలో ఈ ప్రాంత ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. చెప్పాలంటే, మొత్తం దేశ విస్తీర్ణంలో దాదాపు 38 శాతం, అలాగే భారత జనాభాలో 42కి పైగా శాతం ఇక్కడిదే. దేశ పార్లమెంట్ సభ్యుల్లో 40 శాతం పైగా ఇక్కడివారే. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దేశానికి 15 మంది ప్రధానమంతులైతే, వారిలో సగానికి పైగా (8 మంది) ఇక్కడివారే. అయినా ఇప్పటికీ వెనుకబడిన ప్రాంతంగా మిగిలి, నిరక్షరాస్యత, నిరుద్యోగం, అవినీతి, హింస తదితర జాడ్యాలతో సతమతమవుతోంది. దేశ వనరుల్లో అధిక భాగం ఇక్కడే ఖర్చవుతున్నా ఈ వెనుకబాటుతనానికి కారణాలేమిటి? ఆ ప్రశ్నకు జవాబుగా ఆ ప్రాంతంపై వివిధ కోణాల్లో వేసిన ఫోకస్‌లైట్... గజాలా వహాబ్ రచన ‘ది హిందీ హార్ట్‌ల్యాండ్’.

ప్రధానంగా అయిదు విభాగాలుగా సాగిన ఈ రచన కీలకమైన హిందీ ప్రాంతం ప్రత్యేకతను సంతరించుకోవడానికి దోహదం చేసిన చారిత్రక కారణాలనూ, అలాగే వెనుకబాటు సహా సమకాలీన చరిత్రను

ప్రతిఫలించే అక్కడి అనుభవాలనూ అందంగా గుదిగుచ్చింది. అవి చదువుతుంటే ఆ ప్రాంత సామాజిక, రాజకీయ, ధార్మిక చలనసూత్రాలపై మునుపున్న అవగాహన మరింత విస్తరిస్తుంది. స్వతంత్ర భారతావనిలో కాలగతిలో పెరుగుతూ వచ్చిన మత విద్వేషాలకు కారణాలపైనా ఈ రచన దృష్టిపెట్టింది. రచయిత్రి ప్రాథమికంగా పాత్రికేయురాలు కావడంతో ఇంటర్వ్యూలు, సంభాషణలు, స్థానికంగా పర్యటనలతో సమాచారం సేకరించి, పరిణామాలన్నిటినీ క్షేత్రస్థాయి నుంచి, ప్రత్యక్ష సాక్షుల ద్వారా పాఠకుల కళ్ళ ముందుంచారు. కుల మతాల చిచ్చులోపడి కునారిల్లుతున్న ఈ ప్రాంతంలో ముస్లిమ్‌లతో సంఘర్షణ కేవలం 144 ఏళ్ళ నుంచేననీ, ఎప్పుడో 12వ శతాబ్దం నుంచి ఉన్న సామరస్య సహజీవనాన్ని కొనసాగిస్తే అభివృద్ధి సాధ్యమేననీ రోడ్‌మ్యాప్ చూపారు.

1857 తర్వాత పెరుగుతూ వచ్చిన హిందూ – ముస్లిమ్ విభేదాలతోనే శుద్ధ హిందీని హిందువుల భాషగా, ఉర్దూను ముస్లిమ్‌ల భాషగా చిత్రీకరించే యత్నం మొదలైంది. ఇటీవల బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పోలీసు పరిభాష నుంచి ఉర్దూ పదాలను ప్రభుత్వాలు తొలగించడం దాకా అది జరుగుతూనే ఉందని చారిత్రక ఆధారాలతో తెలుసుకుంటాం. భాష, సంస్కృతి పేరిట సాగుతున్న రాజకీయాలతో పాటు టాకీల తొలినాళ్ళ నుంచి హిందీ చిత్రసీమలో అధిక భాగం రచయితలు, కవులు హిందీ బెల్ట్ నుంచి ముంబయ్‌కి వెళ్ళినవారేనన్నది ఆలోచింపజేసే వాస్తవం. కులం, మతం, భాషా రాజకీయాల సూక్ష్మ వాస్తవాల విశ్లేషణ ఈ పుస్తకంలోని అధ్యాయాల నిండా పరుచుకుంది. లౌకికవాదం అనే మాటను సైతం దోషంగా భావిస్తూ, సామరస్యపూర్వక సాంస్కృతిక సమ్మిళిత జీవనాన్ని చెప్పే గంగా–జమునా తెహజీబ్‌ను తప్పుగా ఎంచే కాలానికి మన దేశం, ముఖ్యంగా హిందీ ప్రాంత ప్రయాణాన్ని ఆవేదనాభరితంగా బొమ్మ కడుతుంది.

చరిత్ర, స్వాతంత్ర్యోద్యమం, ఎమర్జెన్సీ... ఇలా ఎన్నింటినో స్పృశిస్తూ సాగే ఈ రచన కనిపించని కథలెన్నో వెలికితీసింది. శివాజీ పట్టాభిషేకం, బ్రిటిషర్లపై చివరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్ తిరుగుబాటు వెనుక కథలెన్నో ఆసక్తి రేపుతాయి. నిజానికి, విస్తృత చారిత్రక క్యాన్వాస్ ఉన్న పుస్తకాన్ని ఏకబిగిన చదవడమే అనుకుంటే, రాయడం మరీ కష్టం. కానీ, గజాలా పడిన కష్టమేమో కానీ హాయిగా చదివించడం ఈ రచన ప్రత్యేకత. చదువుతుంటే రచయిత్రి పక్కనే కూర్చొని కాశీ నుంచి కశ్మీర్ దాకా ప్రయాణించిన అనుభూతి. కళ్ళ ముందు జరుగుతున్న కథలా చరిత్రను తెలుసుకుంటున్న భావన. ఈ రచనకున్న అతి పెద్ద బలాలు అవే! ❑

మానవ హక్కుల్లో మనమెక్కడ?

ఇన్ బాక్స్

అంతర్జాతీయ సమాజం ‘మానవ హక్కుల దినోత్సవా’న్ని ప్రతి సంవత్సరం ఐక్య రాజ్య సమితి సాధారణ సభ ‘మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన’ను ఆమోదించిన (1948) డిసెంబర్ 10న జరుపుకొంటుంది. మానవ హక్కులు... సమానత్వం, న్యాయానికి సంబంధించిన సూత్రాల సమ్మేళనం. అవి భయం, వేధింపులు లేదా వివక్ష లేని జీవితాన్ని గడపడం; మానవులుగా మన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి అవసరమైన స్వేచ్ఛను గుర్తిస్తాయి. 2025 మానవ హక్కుల దినోత్సవ ఇతివృత్తం ‘మానవ హక్కులు, మన రోజువారీ అవసరాలు’. ఆహారం, నీరు, భద్రత వంటి ప్రాథమిక అంశాలు ప్రపంచానికి సాధించదగినవీ, అవసరమైనవీ అని చూపించడం ఈ ఇతివృత్తం లక్ష్యంగా పెట్టుకుంది.



ప్రపంచవ్యాప్తంగా చైనా, రష్యా, ఉత్తర కొరియా, ఇరాన్, సౌదీ అరేబియా, ఎరిత్రియా, మయన్మార్, అఫ్గానిస్తాన్ వంటి అనేక దేశాలు మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నాయని హ్యూమన్ రైట్స్ వాచ్, అమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థల నివేదికలు చెబుతున్నాయి. మానవ హక్కులపై సార్వత్రిక ప్రకటనను ఆమోదించని లేదా సంతకం చేయని కొన్ని దేశాలలో ఉత్తర కొరియా, ఇరాన్ వంటివి ఉన్నాయి. హ్యూమన్ రైట్స్ ఇండెక్స్ ప్రకారం, మానవ హక్కుల పరిరక్షణలో స్థిరంగా ఉన్నత స్థానంలో ఉన్న దేశాలలో స్విట్జర్లాండ్, న్యూజిలాండ్, డెన్మార్క్, స్వీడన్, ఫిన్లాండ్, ఎస్టోనియా, ఐర్లాండ్, కెనడా ఉన్నాయి.

భారతదేశం, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, అనేక రంగాలలో గణనీయమైన పురోగతిని సాధించింది. అయితే గణనీయమైన మానవ హక్కుల సవాళ్లను కూడా ఎదుర్కొంది. 2025లో వచ్చిన కొన్ని అంతర్జాతీయ నివేదికలు మానవ హక్కుల పరంగా భారత్ స్కోర్‌ను తగ్గించి చూపుతున్నాయి. ‘రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్’ ద్వారా వచ్చిన ‘వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్’ భారతదేశాన్ని 180 దేశాలలో 151వ స్థానంలో ఉంచింది. కేంద్రీకృత మీడియా యాజమాన్యం, రాజకీయ ఒత్తిడి, జర్నలిస్టుల భద్రతకు ముప్పు ఇప్పటికీ చాలా ఉంది. రాజ్యాంగ రక్షణలు ఉన్నప్పటికీ సెన్సార్‌షిప్, వ్యక్తీకరణలపై పెరిగిన ఆందోళనలను ప్రతిబింబిస్తూ... ‘ద ఫ్యూచర్ ఆఫ్ ఫ్రీ స్పీచ్ ఇండెక్స్’ ప్రకారం 33 దేశాలలో భారతదేశానికి 24వ స్థానం. మానవ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, పౌర సమాజం, వ్యక్తులు కలిసి పనిచేయగల బహుముఖ విధానం అవసరం.

– డా॥ పి.ఎస్. చారి । కామర్స్– మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్, తిరుపతి
(నేడు మానవ హక్కుల దినోత్సవం)

డేటా పాయింట్



నర్మదాయై నమః

జ్యోతిర్మయం

ఇక్ష్వాకు వంశంలో పేరు పొందిన రాజు పురుకుత్సుడు. ఒక సందర్భంలో అంగిరసులనే ఆరు కోట్ల గంధర్వులు నాగలోకాన్ని ముట్టడించి దివ్యరత్నములను, సౌందర్యవతులైన నాగనారీరత్నములను అపహరించి నాగలోకాన్ని ఆక్రమించి నాగులను తరిమేశారు. భుజగతతులు విష్ణుమూర్తి వద్దకు వెళ్ళారు, బహువిధాలైన గానాలతో కీర్తించారు. యోగనిద్ర నుండి కనులు విచ్చి చూసిన విష్ణుమూర్తికి, నాగముఖ్యులు తమ గోడును వెళ్ళబోసుకున్నారు. భూలోకంలో తన అంశతో విరాజిల్లుతున్న ఇక్ష్వాకు చక్రవర్తి పురుకుత్సుడిని కలవమని చెప్పి పంపించాడు. సంగతి తెలిసిన ఒక మునిపుంగవుడు వారి వద్దకు వెళ్ళి, పురుకుత్సుడు నర్మదానది యందు బద్ధానురాగుడై ఉన్నాడు కాబట్టి, ఆమెను ఆశ్రయించి ఆమె ద్వారా కార్యం సాధించుకొమ్మని ఉపాయం చెప్పాడు. దైవవశంగా సరిగ్గా ఆ సమయానికి నాగలోకానికి వచ్చిన నర్మదతో, నాగప్రముఖులు అప్పటి వరకు జరిగినదంతా చెప్పి ‘నీవు మాకు ఈ ఉపకారం చేస్తే, మేము కూడా నీకు దీనికి సాటి దైన ప్రత్యుపకారం చేస్తాము’ అని ప్రార్థించారు. అంగీకరించిన నర్మద మానవ రూపంలో భూలోకానికి వెళ్ళి, తన అనురాగంతో పురుకుత్సుడిని ఆనందపరిచి, నాగలోకానికి తీసుకు వెళ్ళింది. నాగులు ఆయన్ని భక్తితో ఆరాధించారు. ఆ తరువాత జరిగిన యుద్ధంలో పురుకుత్సుడి చేతిలో గంధర్వులు పరాజయం పాలయ్యారు. నాగ లోకం పూర్వ వైభవాన్ని తిరిగి పొందింది. మాట ఇచ్చిన ప్రకారంగా, భుజగ ప్రము ఖులు నర్మదకు ఈ వరాన్ని ఇచ్చారని వెన్నెలకంటి సూరన ‘ఆంధ్ర శ్రీవిష్ణుపురాణం’ పంచమాశ్వాసంలో ఇలా చెప్పాడు:

తే. అంబ నీ దివ్యనామధేయము జతుర్థి / నమర జేసి నమః పదాంతముగ నుభయ / సంధ్యలందును దప్పక స్మరణసేయు / నతనికెన్నడు విషమెక్కదహుల వలన. నర్మద పేరును చతుర్థీ విభక్తిలో చివరన నమః చేర్చి – ‘నర్మదాయై నమః’ అని ప్రతి రోజు ఉభయ సంధ్యలలో స్మరణ చేస్తే అహుల వలన – అనగా సర్పముల వలన కలిగే – విష ప్రభావాన్నుండి రక్షించబడతాడని భావం.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

టీటీడీకి రూ.కోటి విరాళం

తిరుమల : టీటీడీ శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు తమిళనాడులోని ఈరోడ్‌కు చెందిన ఎం.సౌమ్య మంగళవారం రూ.కోటి విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుపతిలోని టీటీడీ అదనపు ఈవో బంగ్లాలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు. ఈ సందర్భంగా దాతను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

హిడ్మాకు నివాళులర్పిస్తూ ఏవోబీలో బ్యానర్లు



ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా సరిహద్దులో మావోయిస్టు అగ్రనేత మడివి హిడ్మాకు నివాళులర్పిస్తూ బ్యానర్లు దర్శనమిచ్చాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలోని మాకవరం పంచాయతీ కుమ్మిపుట్టు గ్రామ సమీపంలో డుడుమకు వెళ్లే ఆర్ అండ్ బీ ప్రధాన రహదారికి పక్కన చెట్లకు మడివి హిడ్మాకు నివాళులర్పిస్తూ బ్యానర్లు కట్టి ఉన్నాయి. ఆ బ్యానర్లపై ఈ విధంగా ఉంది. 'అమరవీరుడు హిడ్మాకు జోహార్లు. ఓ వీరుడా నువ్వు కన్న కలదోపిడీ లేని స్వేచ్ఛ దేశం. నువ్వు పోరాడిన సాయుధ పోరాటం ప్రజల గుండెల్లో చరిత్ర లేఖలాగా ఉంటుంది మడివి హిడ్మా, మడకం రాజ్'' అని బ్యానర్లు దర్శనమిచ్చాయి. ఎవరు బ్యానర్లు వేశారనేది మాత్రం లేదు. దీనిపై స్థానికంగా చర్చ జరుగుతోంది.

సీఐడీ అదనపు నివేదికను సీజే ముందుంచండి

రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: తిరుమల పరకామణిలో జరిగిన రూ.72 వేల విలువైన 900 డాలర్ల చోరీ కేసులో లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్న వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్న సీఐడీ తాజాగా అదనపు నివేదికను హైకోర్టుకు సమర్పించింది. న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ మంగళవారం స్పందిస్తూ.. ఈ నివేదిక కాపీలను సీల్డ్ కవర్‌లో సీజే ధర్మాసనం ముందుంచాలని రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌ను ఆదేశించారు. సీఐడీ అదనపు నివేదికను తాను చదివి.. బుధవారం విచారణ చేపడతానని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, పరకామణిలో చోరీ కేసును రాజీ చేస్తూ లోక్ అదాలత్ జారీ చేసిన ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చే వ్యవహారంపై సీజే ధర్మాసనం సుమోటోగా విచారణ జరుపుతోంది. దీంతో సీఐడీ అదనపు నివేదిక కాపీలను ధర్మాసనం ముందుంచాలని న్యాయమూర్తి ఆదేశించారు.

లైంగిక వేధింపుల కేసులో ఇద్దరు అధ్యాపకుల అరెస్ట్

- ఒడిశాలో బాధితురాలిని విచారించిన తిరుపతి పోలీసులు
- వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి పార్లమెంట్‌లో ప్రస్తావనతో అధికారుల్లో చలనం

నిందితులను డీఎస్పీ ఆఫీస్‌కు తీసుకొస్తున్న పోలీసులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో ఇటీవల సంచలనం సృష్టించిన లైంగిక వేధింపుల కేసులో మరో ముందడుగు పడింది. బాధితురాలు స్వరాష్ట్రం ఒడిశాకు తిరుపతి పోలీసుల బృందం మంగళవారం చేరుకుంది. ఒడిశా జార్స్‌పూర్‌లో బాధితురాలిని మహిళా ఎస్ఐ ఆధ్వర్యంలో పూర్తి స్థాయి విచారణ చేపట్టి వివరాలను సేకరించారు. యువతి స్టేట్‌మెంట్‌ను వీడియో రికార్డ్ చేసి భద్రపరిచారు. ఇప్పటికే ఈ కేసు విషయంపై తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి పార్లమెంట్ వేదికగా ప్రస్తావించడంతో ఇటు పోలీసులు, అటు వర్సిటీ అధికారులలో కదలిక వచ్చినట్లు తెలుస్తోంది. అధ్యాపకుడు లక్ష్మణ్ కుమార్ తనను పలు మార్లు లైంగికంగా వేధించారని, మరో అధ్యాపకుడు శేఖర్‌రెడ్డితో ఏకాంతంగా గడిపిన వీడియోలు ఉన్నాయంటూ లక్ష్మణ్ కుమార్ పలుమార్లు బెదిరింపులకు దిగారని బాధితురాలు తెలిపినట్లు సమాచారం. దీంతో ఈ స్టేట్‌మెంట్‌లను ఆధారం చేసుకొని, పోలీసులు ఆ ఇద్దరి అధ్యాపకులను అరెస్ట్ చేశారు. అనంతరం ఈస్ట్ పోలీసులు స్థానిక డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. విచారణ అనంతరం అధ్యాపకులకు వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరుస్తారని తెలుస్తోంది.

కస్తూర్బా బాలికల వసతి గృహం విద్యార్థినికి గర్భం!

బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన హాస్టల్ సిబ్బంది

గొలుగొండ: అనకాపల్లి జిల్లా గొలుగొండ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) వసతి గృహంలో 10వ తరగతి చదువుతున్న మైనర్ బాలిక గర్భవతిగా ఉండటం కలకలం రేపుతోంది. ఈ విషయం తెలియగానే ఇక్కడి సిబ్బంది బాలికను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, ఐదు నెలల గర్భంతో ఉన్నట్లు వైద్య సిబ్బంది చెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో బాలిక పరిస్థితి బోగోలేదని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి రప్పించారు. గుట్టుచప్పుడు కాకుండా బాలికను వారికి అప్పగించి, ఇంటికి పంపించారు. ఇదిలా ఉండగా కేజీబీవీలో బోధన, బోధనేతర సిబ్బంది అందరూ మహిళలే కావడం గమనార్హం.

రైతులకు యూరియా యాతన

కాకినాడ జిల్లా పెదపూడిలో అర్ధరాత్రి నుంచి రైతుల పడిగాపులు

చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం

పెదపూడి: రబీ సీజన్‌లోనూ రైతులకు యూరియా యాతన తప్పట్లేదు. తమ పనులు, నిద్ర మానుకొని.. అర్ధరాత్రి నుంచే వణికించే చలిలో యూరియా కోసం సొసైటీల ఎదుట పడిగాపులు కాస్తున్నారు. కాకినాడ జిల్లా పెదపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) వద్ద మంగళవారం యూరియా ఇస్తారని తెలుసుకున్న స్థానిక రైతులు సోమవారం అర్ధరాత్రి నుంచే బారులుదీరారు. యూరియా కోసం ప్రతిసారీ రెండు రోజుల పాటు పనులు మానుకుని సొసైటీ వద్దే వేచి ఉండాల్సి వస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ యూరియా కోసం ఇన్ని ఇబ్బందులు పడలేదని వారు చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లోనూ ఇదే దుస్థితి కొనసాగిందని వాపోయారు. ఇలా అయితే పంటలు పండించేదెలా? అని వారు ప్రశ్నించారు. కాగా, పీఏసీఎస్ సీఈవో ఎం.దుర్గారావు మాట్లాడుతూ.. ఒక్కో రైతుకు 2 బస్తాల చొప్పున యూరియా అందజేస్తున్నామని చెప్పారు.

పంటలు ఎండిపోతున్నా నీళ్లివ్వరా..?

సాగునీటి కోసం కేసీ కెనాల్ గేట్లు మూసి రైతు నిరసన

నంద్యాల(అర్బన్): ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు నీరు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ నంద్యాల జిల్లా గోస్పాడు మండలం ఎం.చింతకుంట్ల గ్రామానికి చెందిన రైతు దూదేకుల ఇసుకపల్లి చిన్న హుసేనయ్య స్థానిక కేసీ కెనాల్ కార్యాలయ ప్రధాన గేట్లను మూసి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా హుసేనయ్య మాట్లాడుతూ.. సాగు చేసిన పంటలకు నీరు అందక ఎండు దశకు చేరుకుంటున్నాయన్నారు. ఎకరా మిరపను సాగు చేయగా రెండు ఎకరాల్లో జొన్న పంట సాగు చేశానన్నారు. ఇటీవల పొన్నాపురం సబ్ చానల్‌కు అధికారులు నీటి సరఫరాను తగ్గించడం, కానాల చెరువు తూములు మూసి వేయడంతో నాలుగు గ్రామాలకు చెందిన దాదాపు 2,500 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.

విద్యుత్ కష్టాలతో రోడ్డెక్కిన రైతన్నలు

ఆత్మకూరు రూరల్: నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం కరివేన గ్రామంలో మంగళవారం జాతీయ రహదారిని రైతులు మూడు గంటల పాటు స్తంభింపజేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే రెండో అత్యధిక వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఉన్న గ్రామం కరివేన. ముగ్గురు లైన్‌మేన్‌లు ఉండాల్సిన గ్రామంలో ఒక్కరూ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే మొక్కజొన్న అధిక వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయారు. రెండో పంట సాగు చేసుకునేందుకు విద్యుత్ కోతలతో సాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయి. విద్యుత్ సరఫరాలో సమస్య వస్తే అందుబాటులో లైన్‌మెన్ లేకపోవడంతో రోజుల తరబడి పంటలకు నీరందించలేక పోతున్నారు. ఈ క్రమంలో సోమవారం పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆత్మకూరు ట్రాన్స్‌కో కార్యాలయంలోని అధికారులు సమస్యను విన్నవించినా ఎటువంటి చర్యలు తీసుకోలేక పోవడంతో గ్రామస్తులు సోమవారం రాస్తారోకో చేపట్టారు. అటు శ్రీశైలం వైపు.. ఇటు కర్నూలు వైపు పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. సీఐ రాము గ్రామానికి చేరుకుని ఆందోళన విరమించాలని కోరారు. అయితే విద్యుత్ అధికారులు వచ్చి సమాధానం చెప్పే వరకు ఆందోళన కొనసాగిస్తామని రైతులు భీష్మించడంతో సీఐ వెంటనే ఫోన్‌లో ఆత్మకూరు ట్రాన్స్‌కో ఏడీతో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

1న జీతాలు.. కలే

వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ప్రతి నెలా 1వ తేదీ వేతనాలు చెల్లించకుండాబాబు ప్రభుత్వం ఉద్యోగుల బతుకుల్ని రోడ్డున పడేసి వారి జీవితాలతో చెలగాటం ఆడుకుంటోందని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల పదోతేదీ వచ్చినా.. దాదాపు లక్షమంది ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు జమకాలేదని చెప్పారు. ఆయన మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వస్తే ప్రతినెలా 1వ తేదీన వేతనాలు ఇస్తామని ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఒక్క నెలకే దానికి నీళ్లొదిలేశారని ఎద్దేవా చేశారు. ఒక్క నెల తప్ప ఏ నెలా 1న జీతాలు చెల్లించలేదని చెప్పారు. దాదాపు లక్షమంది ఉద్యోగులకు నవంబర్ నెల వేతనాలు ఈ రోజుకు కూడా ఇవ్వలేదన్నారు. కానీ ఉద్యోగులకు అన్నీ ఇచ్చినట్లు, ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసినట్లు బహిరంగసభల్లో గొప్పగా చెప్పుకొంటున్నారని విమర్శించారు. ఇది అత్యంత హేయమని దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తూనే ఉద్యోగులకు మధ్యంతర భృతి (ఐఆర్) ఇస్తామని చెప్పిన చంద్రబాబు.. 18 నెలలు గడిచినా ఆ మాట నిలబెట్టుకోలేదని గుర్తుచేశారు. ఇప్పటికీ పీఆర్‌సీ చైర్మన్‌ను కూడా నియమించలేదన్నారు.

కృష్ణార్పణం.. ఏడాదికి అద్దె వెయ్యే!

అన్ని ప్రభుత్వ భవనాలు రూ. వెయ్యి లీజుకే

పీసీబీ చైర్మన్‌కు చంద్రబాబు సర్కారు కానుక

- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పేరుతో ధారాదత్తం
- బీసీ, ఎస్సీ సామాజిక భవనాలు, టీటీడీ కళ్యాణ మండపం, ఆర్బీకే అప్పగింతకు రెడీ
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు.. ప్రతిపాదనను విరమించుకోవాలని కలెక్టర్‌కు వినతి
- తప్పదన్న కలెక్టర్.. ఆందోళనకు సిద్ధమవుతున్న గ్రామస్తులు

వెంకన్నపురంలో ప్రభుత్వ భవనాలుండే ప్రవేశ ద్వారం

సాక్షి టాస్క్‌ఫోర్స్: సీఎం చంద్రబాబు ప్రభుత్వ ఆస్తులను అతి తక్కువ ధరకు పప్పు బెల్లాల్లా అనుయాయులకు కట్టబెట్టేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పల్లెల్లోనే ప్రజలకు సర్కారు సేవలందించేందుకు నిర్మించిన బీసీ, ఎస్సీ సామాజిక భవనాలు, టీటీడీ కల్యాణ మండపం, ఆర్బీకే వంటి ఖరీదైన భవనాలను దశాబ్దాల పాటు లీజు పేరుతో ధారాదత్తం చేస్తున్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం వెంకన్నపురంలో ఈ భవనాలన్నీ బాబు అనుయాయుల పరమవుతున్నాయి. చంద్రబాబు సన్నిహితుడైన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) చైర్మన్ కృష్ణయ్య బావమరిది పరమవుతున్నాయి. ఈ ప్రయత్నాలను గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

వెంకన్నపురం రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య స్వగ్రామం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ గ్రామంలో టీటీడీ నిధులతో కల్యాణ మండపం, డైనింగ్ హాలు నిర్మించారు. పంచాయతీరాజ్, ఎంపీ ల్యాడ్స్ (రాజ్యసభ సభ్యుడు), కార్పొరేట్ సీఎస్ఆర్ నిధులతో 14,400 చదరపు అడుగుల స్థలంలో ఎస్సీ, బీసీ సామాజిక భవనాలు, మహిళా భవనం నిర్మించారు. వీటిని గ్రామస్తులే కాక సమీపంలోని బసవాయపాళెం, దామేగుంట, గుండాలమ్మపాళెం, పద్మనాభసత్రం తదితర గ్రామాల ప్రజలు వినియోగించుకొంటారు. ఇక్కడి కళ్యాణ మండపంలో వివాహాలు చేసుకొన్నవారు భోజనాలకు సమీపంలోని డైనింగ్ హాల్‌ను వినియోగిస్తారు. పొదుపు మహిళల సమావేశాలకు, ప్రభుత్వ కార్యక్రమాలకు మహిళా భవనాన్ని ఉపయోగిస్తున్నారు. బీసీ భవనంలో ఆర్బీకే ఉంది. ఎస్సీ సామాజిక భవనాన్ని వేంకటేశ్వరస్వామి ఆలయ పూజారి నివాసానికి కేటాయించారు. తుపాను, వరదల్లాంటి విపత్తుల సమయంలో గ్రామంలోని వారు ఈ భవనాల్లోనే తలదాచుకొంటారు.

అసౌకర్యమైన చోట స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటేమిటి?

వెంకన్నపురం గ్రామానికి ఇరువైపులా ఉన్న రోడ్లు దారుణంగా దెబ్బతిని ఉన్నాయి. సొంత వాహనాలు తప్ప రవాణా సౌకర్యం ఉండదు. ఇక్కడే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పెడతామనడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు అంటున్నారు. ఇదే మండలంలో జాతీయ రహదారికి ఆనుకొని చంద్రశేఖరపురం వద్ద ఇదే కృష్ణయ్య ఏపీఐఐసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కు ఉంది. అందులో కావాల్సినంత స్థలం ఉందని, అక్కడ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు అన్ని విధాలా సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు. కానీ గ్రామంలోని ప్రభుత్వ భవనాలను చెరబట్టడం వెనుక పెద్ద కుట్రే దాగి ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

99 ఏళ్ల పాటు లీజు.. ఏడాదికి రూ. వెయ్యే!

తన స్వగ్రామంలోని ఈ ప్రభుత్వ భవనాలపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య కన్ను పడింది. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సాకుతో వీటిని సొంతం చేసుకోవాలనుకొన్నారు. కృష్ణయ్య బావమరిది పి.లక్ష్మీ శ్రీనివాస ప్రసాద్ పేరుతో తొలుత 33 ఏళ్ల లీజు, తర్వాత మరో రెండు పర్యాయాలు 33 సంవత్సరాల వంతున ఏకంగా 99 ఏళ్లపాటు లీజు పొడిగించుకొనే వెసులుబాటుతో అన్ని భవనాలకు కలిపి ఏడాదికి కేవలం రూ.వెయ్యి అద్దె ప్రతిపాదనను పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శికి ప్రతిపాదన పంపారు. కృష్ణయ్య రిటైర్డ్ ఐఏఎస్ కావడం, సీఎం చంద్రబాబుకు సన్నిహితుడు కావడంతో ఫైల్ చకచకా కదిలింది. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్‌కు, అక్కడి నుంచి జిల్లా కలెక్టర్‌కు చేరింది. కలెక్టర్ ఆమోదం పొందగానే డీపీఓకు, డిప్యూటీ ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులకు ఉత్తర్వులందాయి. వెంటనే భవనాలను స్వాధీనం చేసుకొనేందుకు సిద్ధమైపోయారు. ఈ విషయం గ్రామస్తులకు చేరడంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు వినియోగించుకొనే ప్రభుత్వ భవనాలను ప్రైవేటు వ్యక్తులకు ఎలా ధారాదత్తం చేస్తారంటూ మండిపడ్డారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా గ్రామాభివృద్ధిపై సమీక్ష సమావేశానికి మంగళవారం గ్రామానికి వచ్చారు. గ్రామస్తులంతా పెద్ద సంఖ్యలో వచ్చి ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అనేక గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉండే ప్రభుత్వ భవనాలను ప్రైవేటు పరం చేయొద్దని గట్టిగా కోరారు. కలెక్టర్ నుంచి వారికి సానుకూల సమాధానం రాలేదు. గ్రామంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వల్ల ఉపయోగం ఉంటుందని చెప్పారు. దానికి ఒక భవనం సరిపోతుందని, ఇన్ని అవసరం లేదంటూ గ్రామస్తులు చెప్పారు. ఇదంతా పెద్ద కుట్ర అని, దీనికి సమ్మతించేది లేదని, ఉద్యమం తప్పదని తెగేసి చెప్పారు.

ఇంతకంటే దారుణం లేదు

గ్రామంలో 60 శాతం పేద ఎస్సీలే. వీరి అవసరాలకు గ్రామంలోని ప్రభుత్వ భవనాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ భవనాలను ప్రభుత్వ పెద్దల అండతో హస్తగతం చేసుకోవడం దారుణం. కలెక్టర్ కూడా వారికే సహకరించడం విడ్డూరంగా ఉంది. దళితులు ఎక్కువగా ఉన్న గ్రామంలో ఇంతటి దారుణానికి ఒడిగట్టడం చంద్రబాబు ప్రభుత్వానికే చెల్లింది.

– బండి పెంచలయ్య, సర్పంచ్, వెంకన్నపురం

టీటీడీ సేవలపై భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ

అభిప్రాయాలు సేకరిస్తున్న శ్రీవారి సేవకులు

తిరుమల,: టీటీడీ సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడానికి భక్తుల నుంచి విలువైన అభిప్రాయాన్ని సేకరించేందుకు వివిధ రకాల ఫీడ్ బ్యాక్ సర్వేలను టీటీడీ ప్రారంభించింది. టీటీడీ ఐవీఆర్ఎస్, వాట్సాప్, శ్రీవారి సేవకుల ద్వారా భక్తుల నుంచి ఎప్పటికప్పుడు అభిప్రాయాలు సేకరిస్తోంది.

ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ సర్వే

ఈ సర్వే ద్వారా భక్తులు తిరుమల యాత్ర పూర్తి అనుభవం, అన్న ప్రసాదం, కళ్యాణ కట్ట, శ్రీవారి ఆలయం, వసతి, లగేజ్ కౌంటర్, ప్రైవేట్ హోటళ్ల ధరలపై మొత్తం 17 ప్రశ్నలపై తమ అభిప్రాయాలను వ్యక్తపరచవచ్చు.

వాట్సాప్ ఫీడ్ బ్యాక్

తిరుమల, తిరుపతిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లను మొబైల్‌తో స్కాన్ చేస్తే (వాట్సాప్ నెం: 9399399399) టీటీడీ అభిప్రాయ సేకరణ పేజీ ఓపెన్ అవుతుంది. ఇక్కడ భక్తులు తమ పేరు, విభాగం (అన్నప్రసాదం, శుభ్రత, కల్యాణకట్ట, లడ్డూ ప్రసాదం, లగేజీ, దర్శన అనుభవం, క్యూలైన్, గదులు మొదలైనవి) ఎంచుకోవాలి. అనంతరం, అభిప్రాయం తెలిపేందుకు టెక్స్ట్ లేదా వీడియో ఫార్మేట్‌ను ఎంచుకుని సేవా ప్రమాణాన్ని ఉత్తమం, సగటు/మరింత మెరుగుదల అవసరం, లేదా బాగాలేదని రేటింగ్ చేయాల్సి ఉంటుంది. భక్తులు తమ అభిప్రాయాన్ని గరిష్ఠంగా 600 అక్షరాల పరిమితిలో టైప్ చేయవచ్చు లేదా వీడియోగా అప్‌లోడ్ చేయవచ్చు.

శ్రీవారి సేవకుల ద్వారా అభిప్రాయ సేకరణ

తిరుమల, తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో టీటీడీ భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై శ్రీవారి సేవకుల సహకారంతో ప్రత్యక్షంగా అభిప్రాయ సేకరణ చేయడం జరుగుతోంది. ఈ విధానంలో సేవకులు ప్రశ్నావళితో కూడిన పత్రాలను అందిస్తారు. ఇందులో భక్తులు వివరాలు నమోదు చేసి తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చు.

అక్రమార్కుడికి ప్రభుత్వ పింఛన్

- 18 నెలల కాలంలో ఒక్క పింఛన్ ఇవ్వని వైనం
- వయసు మార్చుకున్న వ్యక్తికి మాత్రం 2024 జూలై నుంచి పింఛన్
- అధికారుల అత్యుత్సాహం... కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు
- విచారణకు ఆదేశం

కర్నూలు(అగ్రికల్చర్): చంద్రబాబు ప్రభుత్వం 18 నెలల కాలంలో కొత్తగా పింఛను ఇచ్చిన దాఖలాలు లేవు. కానీ కర్నూలు జిల్లా ఆస్పరి మండలం అట్టికల్లు గ్రామానికి చెందిన కె.వీరేష్‌కు మాత్రం వృద్ధాప్య పింఛన్ ఇస్తున్నారు. ఆధార్ కార్డులో వయసును ఏకంగా 15 ఏళ్లు పెంచుకొని దర్జాగా వృద్ధాప్య పింఛను పొందుతుండటం గమనార్హం. ఈయన అసలు పుట్టిన తేదీ 1974. అయితే వృద్ధాప్య పింఛన్‌పై కన్నేసిన వీరేష్ ఆధార్‌లో పుట్టిన సంవత్సరాన్ని 1959గా మార్చుకున్నాడు. దీంతో చంద్రబాబు ప్రభుత్వం వీరేష్‌కు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేసింది. దీనిపై సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ప్రతి నెలా పింఛన్ తీసుకుంటుండటంతో స్థానికులకు అనుమానం వచ్చింది. ఈయనకు 50 ఏళ్లు కూడా లేవు.. వృద్ధాప్య పింఛన్ ఎలా తీసుకుంటున్నాడనే దానిపై ఆరా తీశారు. ఆధార్ కార్డులో వయసు మార్చుకుని పింఛన్ పొందుతున్నట్లు గుర్తించారు. మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ తతంగాన్ని గమనించిన వీరేష్ అక్టోబరు, నవంబరు నెలల్లో పింఛన్లు తీసుకోలేదు. అయితే అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి ఆయనను పిలిపించి మూడు నెలల పింఛన్ ఇప్పించారు. తాము దొంగ పింఛన్‌పై ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా వీరేష్‌కు ఒకేసారి మూడు నెలల పింఛన్ ఇవ్వడంపై ఈనెల 8న గ్రామస్తులు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని డీఆర్‌డీఏ పీడీని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఇండిగో వ్యవహారంలో పాలకులు విఫలం

సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

సాక్షి, అమరావతి: ఇండిగో విమానయాన సంస్థ దేశంలోని లక్షలాది మంది విమాన ప్రయాణికులను ఇబ్బందికి గురిచేసిందని, ఈ వ్యవహారాన్ని చక్కదిద్దడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఈ విషయమై ఆయన మంగళవారం సెల్ఫీ వీడియో విడుదల చేశారు. కార్పొరేట్లకు పాలకులు సాగిలపడటం వల్లే విమాన ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు వచ్చాయన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఇండిగో పాటించకుండా తన ఇష్టారీతిగా వ్యవహరించిందన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇండిగో వ్యవహారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తమై ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని రామకృష్ణ పిలుపునిచ్చారు.

బాబు ప్రభుత్వంలో ట్రాక్టర్లకు మళ్లీ ట్యాక్స్!

- ట్యాక్స్ చెల్లించాలని యజమానులకు మెసేజ్‌లు
- గ్రామాల్లో మాటువేసి మరీ కేసులు రాస్తున్న రవాణా శాఖ అధికారులు
- ఇప్పటికే నీటితీరువా పేరిట రూ.21.81 కోట్ల భారం మోపిన బాబు ప్రభుత్వం
- రైతులకు అండగా నిలిచిన గత జగన్ ప్రభుత్వం

సాక్షి, భీమవరం: రైతును రాజును చేస్తామంటూ చంద్రబాబు ప్రభుత్వం వారి నడ్డి విరుస్తోంది. నీటి తీరువాను తెరపైకి తెచ్చి వడ్డీ సహా భారం మోపింది. తాజాగా ట్రాక్టర్లకు ట్యాక్స్ చెల్లించాలంటూ రవాణా శాఖ మెసేజ్‌లు పంపుతోంది. గత ప్రభుత్వంలోని ఐదేళ్ల కాలానికి జరిమానాతో పాటు వసూళ్లకు పాల్పడుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలో 2,106 ట్రాక్టర్లు, 3,740 ట్రాలీలు ఉన్నాయి. పొలం దమ్ము, పంట ఉత్పత్తులు, పశుగ్రాసాల తరలింపు తదితర పనుల కోసం అధిక శాతం ట్రాక్టర్లను వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తుంటారు. ట్రాక్టర్ యజమానుల్లో అధిక శాతం రైతులే. వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం ట్రాక్టర్లకు పన్ను నుంచి మినహాయింపు ఇచ్చింది. ట్రాలీలకు సైతం పన్నులు వసూలు చేయలేదు. దీంతో వ్యవసాయ పనుల్లో పంట ఉత్పత్తుల తరలింపునకు రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవలేదు. తాజాగా, చంద్రబాబు ప్రభుత్వం కమర్షియల్ పేరిట ట్రాలీలకు పన్నులు విధించడం మొదలెట్టింది. 762 కిలోల నుంచి నాలుగు టన్నుల వరకు బరువును బట్టి రూ.260 నుంచి రూ.720 వరకు పన్ను విధిస్తోంది. దీంతో 2019 నుంచి ఇప్పటివరకు జరిమానాలు సహా రూ.15 వేల వరకు ట్యాక్స్ పడుతున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు వస్తున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా రవాణా శాఖ అధికారులు గ్రామాల్లో కూడా కేసులు రాస్తున్నారని రైతులు చెబుతున్నారు. ప్రధాన రహదారుల్లో తప్ప గతంలో ఎప్పుడూ రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవంటున్నారు. వచ్చే సీజన్ నుంచి ట్రాక్టర్ల వ్యవసాయ పనుల ధరలు పెరుగుతాయని, ప్రభుత్వం తమపై కర్కశంగా పన్నుల భారం అదనంగా మోపుతోందని ఆవేదన చెందుతున్నారు.

అన్నదాత నడ్డివిరిచి..

రైతులకు మేలు చేస్తూ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని చంద్రబాబు ప్రభుత్వం నిలిపివేసింది. ఈ–క్రాప్ నమోదు ప్రామాణికంగా సాగు విస్తీర్ణం అంతటికీ రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని గతంలో ప్రభుత్వమే చెల్లించింది. బాబు పాలనలో ఈ పథకాన్ని ఎత్తివేయడంతో ప్రీమియం వాటాను రైతులే భరించాల్సి వస్తోంది. మరోపక్క గత ప్రభుత్వం పక్కన పెట్టిన నీటితీరువాను తెరపైకి తెచ్చి, మూడేళ్లకు గాను పాత బకాయిలు, వడ్డీలతో కలిపి ఒక్కసారే రైతులపై రూ.21.81 కోట్ల భారాన్ని మోపింది.

రెండు కార్లు ఢీ..ముగ్గురి మృతి

మృతులు సంతానం, శంకర్ సుబ్రమణి, అరుణ్ కుమార్ (ఫైల్)

నగరి: చిత్తూరు జిల్లా నగరి మండలం వీకేఆర్ పురం సమీపం జాతీయ రహదారిపై మంగళవారం రెండు కార్లు ఢీకొని ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు..తిరుచానూరు ఎస్‌వీపీ కాలనీవాసి సంతానం(39), శంకర్ సుబ్రమణి(50) తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయ పోటులో పనిచేస్తున్నారు. ప్రతి మంగళవారం వీరిద్దరూ కారులో తిరుత్తణికి వెళ్లి సుబ్రమణ్యస్వామిని దర్శించుకుంటుంటారు. ఇలా వారు తిరుత్తణికి కారులో బయలుదేరారు. అలాగే మరో కారులో చెన్నైకి చెందిన అరుణ్ కుమార్ (40) కుటుంబ సభ్యులతో పాటు తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి బయలుదేరారు. ఈ కార్లు వీకేఆర్ పురం వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో రెండూ నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదంలో సంతానం, శంకర్ సుబ్రమణి, అరుణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. అరుణ్‌కుమార్ భార్య తమిళ్‌సెల్వి (36), ఆయన చెల్లెలి కుమారుడు యశ్వంత్ (11), వారి డ్రైవర్ మదన్ (40) తీవ్రంగా గాయపడ్డారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. క్షతగాత్రులకు ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు.

ANDHRA PRADESH POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA, VIJAYAWADA-520004
NIT/RFxNo.610002133
APGENCO invites tender for "Manual uploading of coal from wagons at Road No.4, 4A, 24 & Ext. Road No.23 with Proclainers from 01-02-2026 (or) from commencement of work to 31-07-2026 (or) till completion of quantities whichever is later" through APGENCO e-Procurement. Estimated Value of Contract: Rs.2,62,92,575/-. Schedule available date & time: from 18:00 Hrs onwards 08-12-2025. Bid submission closing date & time: Upto 13:00 Hrs on 17-12-2025. For details visit website viz., www.apgenco.gov.in (or) https://etender.apgenco.gov.in/irj/portal.
DIPR Ro No.4650PP/CL/ADVT/1/1/2021-22, Dt: 09-12-2025

प्रगत संगणन विकास केन्द्र
సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్
ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం యొక్క సైంటిఫిక్ సొసైటీ
ప్రవేశ ప్రకటన
ఇండస్ట్రీ - రెడీ స్కిల్స్‌తో మీ కెరీర్‌లో పురోగతి సాధించండి!!!
పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్ - ఫిబ్రవరి 2026 బ్యాచ్
- ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్ (PGCP-ESD)
- అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ (PGCP-ASSD)
- బిగ్ డేటా అనలిటిక్స్ (PGCP-BDA)
- VLSI డిజైన్ (PGCP-VLSI)
- అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (PGCP-AC)
- IT ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సిస్టమ్స్ & సెక్యూరిటీ (PGCP-ITISS)
C-DAC's R&D ఎక్స్‌పర్ట్స్ ద్వారా ట్రైనింగ్
అత్యుత్తమ ప్లేస్‌మెంట్ రికార్డ్స్
C-CAT రిజిస్ట్రేషన్స్ కొరకు చివరి తేది : 29 డిసెంబర్ 2025
C-CAT తేది : 10 మరియు 11 జనవరి 2026
కోర్సు ప్రారంభం : 25 ఫిబ్రవరి 2026
మరింత సమాచారం కోసం QR కోడ్ స్కాన్ చేయండి
రిజిస్ట్రేషన్ కొరకు దర్శించండి: acts.cdac.in (or) www.cdac.in
C-DAC, ప్లాట్ నం. 6 & 7, హార్డ్‌వేర్ పార్క్, సర్వే నం.1/1, శ్రీశైలం హైవే, పహాడీ షరీఫ్ వయా, కేశవగిరి (పోస్ట్), హైదరాబాద్-501510
మరిన్ని వివరాల కొరకు: ఫోన్: +91 7382053731/32, ఇ-మెయిల్: training-hyd@cdac.in
CBC 06110/12/0002/2526

అది అతిపెద్ద దేశద్రోహం

ఈసీతో కలిసి బీజేపీ సర్కార్ బడా మోసానికి తెరతీసింది

- ఏకంగా భారతీయ భావననే పెళ్లగిస్తున్నారు
- 'ఓట్ల చోరీ'కి పాల్పడిందంటూ మోదీ సర్కార్‌పై రాహుల్‌గాంధీ పెను విమర్శలు
- లోక్‌సభలో చర్చ సందర్భంగా సుదీర్ఘంగా ప్రసంగించిన విపక్షనేత

రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘంతో కలిసి మోదీ సర్కార్ ఓట్ల చోరీకి పాల్పడుతూ భారత్‌లోనే అతిపెద్ద దేశద్రోహానికి ఒడిగట్టిందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయి విమర్శలతో విరుచుకుపడ్డారు. ఎన్నికల సంస్కరణలు అంశంపై మంగళవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా విపక్షాల తరపున కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత హోదాలో రాహుల్‌గాంధీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఈసీపై, మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సర్కార్‌పై విమర్శల జడి కురిపించారు.

అతిపెద్ద నేరమేదంటే.. అది ఇదే

''అతిపెద్ద దేశద్రోహ నేరమంటూ ఉందంటే అది ఓట్ల చోరీనే. మీరు చేసిన 'ఓట్ల చోరీ' స్థాయి అతిపెద్ద నేరం దేశంలో ఇంతవరకు జరగలేదు. నిజమైన పౌరుల వాస్తవిక ఓటును హరించి దేశ ప్రజాస్వామ్య వస్త్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా మార్చేస్తున్నారు. నవభారత్‌ను విధ్వంసం చేస్తున్నారు. భారత్ అనే భావనను కూలదోస్తున్నారు. లోక్‌సభలో అటు పక్క అధికార కుర్చీల్లో కూర్చున్న వాళ్లంతా కలిసి దేశ వ్యతిరేక దుశ్చర్యలు తెగిస్తున్నారు'' అని అన్నారు.

ఈవీఎం సంగతేంటి?

''ఈవీఎంతో మీరెన్నో గిమ్మిక్కులు చేస్తున్నారు. మాకూ ఈవీఎంను తనిఖీచేసే అవకాశం ఇవ్వండి. మా సాంకేతిక నిపుణులు సైతం ఈవీఎంల పనిపడతారు. అసలు ఈవీఎంలోపల ఏం పెట్టారో తేలుస్తారు. ఇప్పటిదాకా మాకు ఈవీఎంలపై కనీస హక్కు లేదు'' అని రాహుల్ అన్నారు. ఎలక్షన్ కమిషన్లనుద్దేశిస్తూ రాహుల్ పలు వ్యాఖ్యలుచేశారు. ''వాళ్లకో విషయం చెబుతున్నా. ఇప్పుడున్న సవరణ చట్టాన్ని భవిష్యత్తులో మేం అధికారంలోకి వచ్చాక మళ్లీ మారుస్తాం. అధికారంలో ఉన్నప్పుడు కమిషనర్లు తీసుకున్న తప్పుడు నిర్ణయాలకు వాళ్లనే బాధ్యులను చేస్తాం. కారకుల భరతం పడతాం'' అని రాహుల్ పరోక్షంగా హెచ్చరించారు.

మళ్లీ బ్రెజిల్ యువతి ప్రస్తావన

హరియాణాలో బ్రెజిల్ యువతి పేరు ఓటర్ల జాబితాలో 22 సార్లు వచ్చిందన్న అంశాన్ని రాహుల్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ''బ్రెజిల్ యువతి మాత్రమేకాదు ఎంతో మందిపేర్లు ఇలా హరియాణా ఓటర్ల జాబితాలో పలుమార్లు పునరావృతమయ్యాయి. ఒక మహిళ పేరు ఏకంగా 200 సార్లు ఉంది. ఇవన్నీ చూశాక హరియాణా ఎన్నికలు చోరీ అయ్యాయనేది సుస్పష్టం. ఇది ఎలక్షన్ కమిషన్ కనుసన్నల్లోనే జరిగింది'' అని రాహుల్ వ్యాఖ్యానించారు.''బిహార్‌లో ప్రతిష్టాత్మకంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే చేపట్టామని ఈసీ ఘనంగా చెప్పుకుంది. మరి అలాంటప్పుడు మళ్లీ 1.2 లక్షల డూప్లికేట్ ఫొటోలు ఎలా తుది జాబితాలో ప్రత్యక్షమయ్యాయి? ఈ ప్రశ్నకు ఈసీ దగ్గర సూటి సమాధానమే లేదు'' అని రాహుల్ ఎద్దేవాచేశారు.

మనది గొప్పదైన ప్రజాస్వామ్యం

అందరూ మనది అతిపెద్ద ప్రజాస్వామ్యం అంటారు. వాస్తవానికి మనది గొప్పదైన ప్రజాస్వామ్యం. అమెరికా తమది పురాతన ప్రజాస్వామ్యం అంటుంది. నిజానికి మనదే గొప్పది. అత్యధిక మంది ఓటర్లు, భిన్న ప్రాంతాలు, మతాలు, భాషలు, రాష్ట్రాల సమ్మేళనంగా భారత ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోంది. ప్రజలందర్నీ ఒక్కతాటి మీదకు తెస్తున్న ఇదే ప్రజాస్వామ్యభావనకే బీజేపీ తూట్లు పొడుస్తోంది. ధ్వంసం చేస్తున్నామని వాళ్లకూ తెలుసు. ఆనాడు గాంధీజీని ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తి నాథూరాం గాడ్సే మూడు బుల్లెట్లు ఛాతీలో దింపి మహాత్ముడి ప్రాణాలను బలితీసుకున్నాడు. బీజేపీ వాళ్లు నాటి చేదు నిజాన్ని ఒప్పుకోవాల్సిందే. గాంధీజీ హత్యతో అక్కడితో ఆ ఘోర క్రతువు ఆగిపోలేదని నేడు ఇప్పుడు నాకు అనిపిస్తోంది. ఓటు చోరీతో సాధించిన అధికారంతో రాజ్యాంగబద్ధ సంస్థలన్నింటినీ ఆర్‌ఎస్‌ఎస్ గుప్పిటపట్టే దుస్సాహసానికి తెరతీసింది. నాడు గాంధీజీ హత్యోదంతం తొలి మెట్టు అయితే తర్వాతి మెట్టు ఇప్పటి రాజ్యాంగబద్ధ వ్యవస్థను కబళించడం'' అని అన్నారు. '' ఓటు చోరీ అనేది అతిపెద్ద దేశద్రోహం. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసంచేసేందుకు బీజేపీ, ఈసీ మూకుమ్మడిగా బయల్దేరాయి. ప్రజల గొంతుకను తొక్కిపెడుతున్నాయి'' అని తర్వాత 'ఎక్స్'లో రాహుల్ ఒక పోస్ట్ పెట్టారు.

3 ప్రశ్నలకు సమాధానం చెప్తారా?

చర్చ సందర్భంగా మోదీ సర్కార్‌పై రాహుల్ మూడు సూటి ప్రశ్నలను సంధించారు.

1. ''ఎలక్షన్ కమిషన్ల నియామక ప్యానెల్ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తప్పించారు?. సీజేఐను తొలగించడానికి వెనుక మతలబు ఏంటి? సీజేఐ అంటే మాకు పూర్తి విశ్వాసం ఉంది. అలాంటి సీజేఐకు ఎలక్షన్ కమిషన్ నియామక ప్రక్రియ నుంచి ప్రభుత్వం ఏ కారణంతో పక్కకు తప్పించింది?. ఆనాడు ఎలక్షన్ కమిషన్ల ఎంపిక సంబంధ భేటీకి నేనూ హాజరయ్యా. ఇటు పక్క నేను కూర్చున్నా. అటు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆసీనులయ్యారు. అక్కడ నా వాదనలకు వీసమెత్తయిన విలువ లేకుండా పోయింది. వీళ్లిద్దరు ఏం ఆలోచించారో అది మాత్రమే ఆచరణలోకి వచ్చింది. కేవలం ఫలానా వ్యక్తులు మాత్రమే ఎలక్షన్ కమిషనర్‌లుగా రావాలని ఎందుకు ప్రధాని, హోం మంత్రి అంతగా దృష్టిసారిస్తున్నారు?

2. ''దేశ చరిత్రలో గతంలో ఏ ప్రధాని చేయనట్లుగా మోదీ 2023 డిసెంబర్‌లో చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్లకు నేర విచారణ నుంచి మినహాయింపు కల్పిస్తూ చట్టసవరణ తీసుకొచ్చారు. దీంతో ఎలక్షన్ కమిషనర్లు ఈసీలో విధుల్లో ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలు పక్షపాతంతో కూడినవి అని తేలినా సరే వాళ్లపై ఎలాంటి విచారణ మొదలుపెట్టలేని దురవస్థ ఏర్పడింది. వాళ్లపై కేసుల ఈగ వాలకుండా మోదీ రక్షణ కల్పించారు. కమిషనర్లకు ఇంతటి రక్షణను ప్రధాని, హోం మంత్రి ఎందుకు ఇవ్వాల్సి వచ్చింది?

3. ''ఎన్నికలు పూర్తయిన కేవలం 45 రోజులకే సంబంధిత సీసీటీవీ ఫుటేజీని ధ్వంసంచేయాలంటూ మోదీ సర్కార్ చట్టాన్నే మార్చేసింది. అంత అవసరం ఏమొచ్చింది?. ఇది డేటాకు సంబంధించిన అంశమంటూ ప్రభుత్వం తప్పించుకోవాలని చూసింది. ఇది డేటాకు సంబంధించిన అంశం కాదు. దీనికి ఎన్నికల చోరీతో సంబంధముంది. ఎన్నికలకు నెల రోజుల ముందే మెషీన్ చదవగలిగే ఓటర్ల జాబితాను రాజకీయపక్షాలకు అందివ్వాల్సిందే. సీసీటీవీ ఫుటేజీ తొలగింపు చట్టాన్ని సవరించాల్సిందే. అసలు సీసీటీవీ ఫుటేజీ డిలీట్ చేయాల్సిన అవసరం ఎందుకొచ్చింది?

ఎస్ఐఆర్ పాతదే: మేఘ్వాల్

రాహుల్ వ్యాఖ్యలకు ప్రభుత్వం దీటైన జవాబు

మేఘ్వాల్

న్యూఢిల్లీ: ఎస్ఐఆర్ పేరిట మోదీ సర్కార్ మరోమారు పలు రాష్ట్రాల్లో ఓట్ల చోరీకి తెగిస్తోందంటూ కేంద్ర ప్రభుత్వంపై పదునైన విమర్శలు చేసిన లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీకి ప్రభుత్వం తరఫున బీజేపీ నేతలు దీటైన జవాబులిచ్చారు. మంగళవారం లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై చర్చలో ప్రభుత్వం తరపున న్యాయశాఖ సహాయమంత్రి అర్జున్‌సింగ్ మేఘ్వాల్ మాట్లాడారు. '' వాస్తవానికి తొలి సార్వత్రిక ఎన్నికల్లోనే కాంగ్రెస్ పార్టీ ఓట్ల చోరీకి పాల్పడింది. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను ఓడించాలనే దుర్బుద్ధితో ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడింది. ఈవీఎంలు, ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పదేపదే ఆరోపణలు గుప్పిస్తోందిగానీ సహేతుక కారణాలను వెల్లడించలేక చతికిలపడింది. 1952 నుంచి 2002 ఏడాదిదాకా ఎస్ఐఆర్‌ను పలుమార్లు చేపట్టారు. ఇది కొత్తదేమీ కాదు. గత 2 దశాబ్దాలుగా ఎస్ఐఆర్ నిర్వహించట్లేరు. దీంతో వలసలు, మరణాలు, సవరణలు, పట్టణీకర కారణాలతో ఓటర్ల జాబితాలో మార్పులొచ్చాయి. వాస్తవాలు ప్రతిబింబించేలా పారదర్శకంగా ఎస్ఐఆర్‌ను తాజాగా చేపట్టాల్సిన సమయం వచ్చింది. అందుకే బిహార్‌లో పూర్తిచేశాం. మిగతా రాష్ట్రాల్లోనూ చేస్తాం. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు సూచించిన కమిటీ అనేది తాత్కాలిక ఏర్పాటు మాత్రమే. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకే నూతన చట్టం తెచ్చాం'' అని మేఘ్వాల్ చెప్పారు.

ఈవీఎంలు రాజీవ్ హయాంలోనే..

ఈవీఎంలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందన్న రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై జార్ఖండ్ నేత, గోధా నుంచి గెలిచిన బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే తప్పుబట్టారు. ''ఈవీఎంలపై విపక్ష పార్టీలు యాగీచేస్తున్నాయి. వాస్తవానికి నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ హయాంలో 1987లో పైలట్ ప్రాజెక్ట్‌గా ఈవీఎంలను పరీక్షించారు. 1991లో కాంగ్రెస్ నేత పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఎన్నికల్లో ఉపయోగించారు. ఇప్పుడు విమర్శిస్తున్న ఇదే కాంగ్రెస్‌లోని ఆనాటి నేతలు ఈవీఎంలను వేనోళ్ల పొగిడారు. అత్యంత పారదర్శకమైన ఎన్నికల నిర్వహణ పరికరం ఇదేనని ఆకాశానికి ఎత్తేశారు. రిగ్గింగ్‌ను నివారించేందుకు ఈవీఎంలే సరైన పరిష్కారమని 1961లో కమిటీ సైతం అభిప్రాయపడింది'' అని దూబే.. రాహుల్‌కు దీటైన బదులిచ్చారు.

బ్యాలెట్ పేపర్‌కు మళ్లుదాం

లోక్‌సభ చర్చలో విపక్షాల డిమాండ్



న్యూఢిల్లీ: ఎన్నికల నిర్వహణలో ఈవీఎంల వినియోగానికి స్వస్తిపలికి మళ్లీ బ్యాలెట్ పేపర్ విధానాన్ని పునరుద్ధరించాలని మంగళవారం ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో జరిగిన చర్చలో విపక్షాలు డిమాండ్‌చేశాయి. ఈ మేరకు పలు విపక్షపార్టీల ఎంపీలు మాట్లాడారు. '' పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు చాంతాడంత క్యూ లైన్లలో నిల్చునే ప్రతి ఒక్క ఓటరులో తమ ఓటు సద్వినియోగం అవుతోందన్న భరోసాను కల్పించాలి. ఈవీఎంలతో మోసగిస్తున్నారని నేను చెప్పడంలేదు. కానీ ఈవీఎంలను దుర్వినియోగం చేయొచ్చు అనేది మాత్రం నేను ఘంటాపథంగా చెప్పగలను. ఈవీఎంలపై ఓటర్లలో గూడుకట్టుకుపోయిన అపోహలను తొలగించాలంటే రెండే మార్గాలున్నాయి. ఈవీఎం ఓట్లకు సరిసమానంగా వీవీప్యాట్ చిట్టీలను అన్నింటినీ లెక్కించాలి. లేదంటే ఈవీఎంలను పక్కనపడేసి మళ్లీ పేపర్ బ్యాలెట్ విధానానికి వెళ్లాలి. పేపర్ బ్యాలెట్ విధానమే అత్యంత ఉత్తమం. ఎందుకంటే సాంకేతికంగా ఎంతో పురోగమించిన జపాన్, అమెరికా సైతం ఈవీఎంలాంటి ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానాలను పక్కనబెట్టేసి పేపర్‌బ్యాలెట్‌కు జై కొట్టాయి. ఎంతకాదన్నా ఈవీఎంలు అనేది మెషీన్లు. ఎలాంటి మెషీన్‌లో అయినా మార్పులు చేయొచ్చు'' అని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ అన్నారు. '' పేపర్ బ్యాలెట్ పట్ల ఓటర్లలో ఎంతో విశ్వసనీయత, నమ్మకం ఉన్నాయి. బ్యాలెట్ విధానం మంచిది'' అని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అన్నారు. ''మీట అయితే ఓటరు నొక్కుతున్నాడుగానీ తన ఓటు ఎటు పోతుందనేది ఇప్పటికీ అతనికి ఇక చిక్కు ప్రశ్నగానే మిగిలిపోయింది. ఈవీఎంలో ఇదే స్పష్టత కరువైంది. ఓటరు మదిలో సూక్ష్మస్థాయి అనుమానం ఉన్నాసరే దానిని నివృత్తిచేయాల్సిందే. అనుమానాలతో ఎన్నికల క్రతువును కొనసాగించడం నిజమైన ప్రజాస్వామ్యం అనిపించుకోదు'' అని శివసేన (యూబీటీ) నేత అనిల్ దేశాయ్ అన్నారు. సీపీఐ(ఎం) నేత ఆమ్రా రామ్, రాష్ట్రీయ జనతాదళ్ ఎంపీ అభయ్ కుమార్ సిన్హా సైతం ఇదే వాదనకు తమ మద్దతు ప్రకటించారు. 2004 ఏడాది నుంచి ఐదు సార్లు సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలను ఉపయోగించిన విషయం విదితమే.

మెహుల్ చోక్సీ అప్పగింతకు తొలగిన ఆఖరి అడ్డంకి

అప్పగింతకు ఇక చర్యలు షురూ: బెల్జియం అధికారుల వెల్లడి

న్యూఢిల్లీ: రూ.13 వేల కోట్ల మేర పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేసిన కేసులో పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ అప్పగింతకు ఆఖరి అవరోధం తొలగిపోయింది. భారత్‌కు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ చోక్సీ వేసిన పిటిషన్‌ను బెల్జియం సుప్రీంకోర్టు 'ది కోర్ట్ ఆఫ్ కెసేషన్' కొట్టివేసింది. అతడిని భారత్‌కు అప్పగించాలంటూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. దీంతో, చోక్సీని భారత్‌కు అప్పగించే ప్రక్రియ మొదలవుతుందని అధికారులు తెలిపారు. కుంభకోణం బయటపడుతున్న తరుణంలో 2018 జనవరిలో చోక్సీ దేశం నుంచి దొంగచాటుగా ఆంటిగ్వా అండ్ బార్బుడాకు వెళ్లిపోయాడు. అక్కడి నుంచి వైద్యం కోసం బెల్జియం వెళ్లాడు. దీంతో, చోక్సీని అప్పగించాలంటూ ముంబైలోని ప్రత్యేక న్యాయస్థానం 2024లో వారెంట్లు జారీ చేసింది. ఈ మేరకు బెల్జియం అధికారులు అతడిని అరెస్ట్ చేశారు.

ఓటరు తుది జాబితా ప్రకటన.. ఆ వెంటనే బెంగాల్‌లో ఎన్నికలు

- చట్ట పరమైన అడ్డంకులు రాకుండా కేంద్రం పక్కా స్కెచ్
- సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు

కూచ్ బెహార్: ప్రస్తుతం పశ్చిమబెంగాల్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా ఎస్ఐఆర్‌పై సీఎం మమతా బెనర్జీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓటరు తుది జాబితా ప్రకటించిన మరునాడే అసెంబ్లీ ఎన్నికల ప్రకటన వెలువడనుందని పేర్కొన్న ఆమె..ఇదంతా పథకం ప్రకారం చేసిన కుట్ర అని ఆరోపించారు. కూచ్ బెహార్‌లోని రస్ మేలా గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన బహిరంగ సభలో మమత ప్రసంగించారు. 'ఓటర్ల పేర్ల తొలగింపు, ఓట్లను విభజించడం, పౌరులను భయానికి గురిచేయడమే లక్ష్యంగా 2026 ఎన్నికలకు కొన్ని నెలలముందుగానే పక్కా ప్రణాళికతో చేసిన రాజకీయ కుట్ర ఎస్ఐఆర్ అని'ఆమె అభివర్ణించారు. 'ఓటరు తుది జాబితా వెల్లడవుతుంది. వెంటనే ఆ మరునాడే ఎన్నికల ప్రకటన కూడా వస్తుంది. దీనివల్ల ఓటరు జాబితా సవాల్ చేస్తూ కోర్టుకు వెళ్లేందుకు సమయముండదు. ఇదే వాళ్ల(కేంద్రం) పథకం. న్యాయపరమైన పోరాటాన్ని కోర్టులకు వదిలేస్తున్నాం. మేం రాజకీయపోరాటం కొనసాగిస్తాం'అని తెలిపారు. 'నవంబర్ 4 నుంచి రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్‌తో ప్రజల్లో ఎంతో భయం నెలకొంది. ముఖ్యంగా, మైనారిటీలు, వలస కార్మికులు, వివాహిత మహిళలు'అని ఆమె అన్నారు. దేశంలో ఉంటున్న మనల్ని మరోసారి పౌరసత్వం నిరూపించుకోవాలనడాన్ని మించిన అవమానం మరొకటి ఉంటుందా అని ప్రశ్నించారు. ఎన్నికలు మరికొద్ది నెలల్లో ఉండగా ఉద్దేశపూర్వకంగానే కేంద్రంలోని బీజేపీ రాష్ట్రంలో ఎస్ఐఆర్‌ను హడావుడిగా చేపట్టిందన్నారు. జీవించి ఉన్న వారిని కూడా చనిపోయినట్లు చూపి స్తున్నారు. పెళ్లయిన మహిళల పేర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారు అంటూ ఆమె ఆరోపణలు చేశారు.

వందేమాతరంను విభజించడం వల్లే దేశం ముక్కలు

రాజ్యసభ చర్చలో హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్య



న్యూఢిల్లీ: వందేమాతర గీతానికి వ్యతిరేకంగా మాట్లాడటం కాంగ్రెస్ రక్తంలోనే ఉందని హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ వందేమాతర గీతాన్ని బుజ్జగింపు రాజకీయాల కోసం రెండుగా విడగొట్టడమే దేశ విభజనకు కారణమైందని, లేకుంటే దేశం ముక్కలై ఉండేది కాదని వ్యాఖ్యానించారు. వందేమాతర గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యసభలో మంగళవారం చేపట్టిన చర్చను మంత్రి ప్రారంభించి, మాట్లాడారు. వందేమాతరం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న వేళ 1937లో జవహర్‌లాల్ నెహ్రూ ఈ గీతాన్ని రెండు ముక్కలుగా చేసి, కేవలం రెండు చరణాలకే పరిమితం చేశారన్నారు. బుజ్జగింపు రాజకీయాల్లో భాగంగానే ఆయన అలా చేసినట్లు చాలా మంది భావించారని, వందేమాతరంను రెండుగా విభజించకుంటే దేశం ముక్కలయ్యేది కాదని కూడా అనుకున్నారని తెలిపారు. ఇప్పటికీ కాంగ్రెస్ అలాంటి రాజకీయాలు చేస్తోందన్నారు. వందేమాతర గీతం 100 ఏళ్లు పూర్తి చేసుకున్న వేళ దేశంలో అత్యవసర పరిస్థితి విధించి, ప్రతిపక్ష నేతలను జైళ్లకు పంపించిందన్నారు. జాతీయ గీతాన్ని త్వరలో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలతో ప్రతిపక్షం ముడిపెట్టడాన్ని ఆయన నిరసించారు. దేశ సాంస్కృతిక జాతీయవాదాన్ని మేలుకొల్పిన మంత్రం వందేమాతరమని ఆయన చెప్పారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఆ గీతం ఎలాంటి ప్రముఖ పాత్ర పోషించిందో నేటికీ ఆ గీతానికి అంతే ప్రాముఖ్యత ఉందన్నారు. భవిష్యత్ వికసిత్ భారత్‌కు కూడా వందేమాతరం ఎంతో అవసరమైందని చెప్పారు. ఇతర అంశాల నుంచి దృష్టి మళ్లించేందుకే వందేమాతరంపై ప్రభుత్వం చర్చకు పెట్టిందని చాలా మంది కాంగ్రెస్ సభ్యులు అనుకుంటున్నారన్న ఆయన.. కీలక అంశాలపై చర్చకు ప్రభుత్వం ఎన్నడూ భయపడలేదన్నారు. పార్లమెంట్ నుంచి వాకౌట్ చేయకుండా, సరిగ్గా కార్యకలాపాలు జరగనిస్తే అన్ని అంశాలపైనా చర్చకు అవకాశమేర్పడుతుందని అమిత్ షా తెలిపారు.

బెంగాల్ ఎన్నికల్లో లబ్ధికే వందేమాతరంపై చర్చ

కేంద్రంపై రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే ధ్వజం

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో సామాన్య ప్రజల సమస్యలపై చర్చించి, పరిష్కరించిన రోజున మాత్రమే భారత మాతకు నిజమైన నివాళి అని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తెలిపారు. త్వరలో బెంగాల్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రధాని మోదీ వందేమాతరంపై చర్చను చేపట్టారని ఆయన విమర్శించారు. నిరుద్యోగం, దెబ్బతిన్న ఆర్థికవ్యవస్థ, రూపాయి విలువ పతనం తదితర దేశం ముందున్న ప్రధానమైన సమస్యలపై అందరి దృష్టినీ మళ్లించేందుకు కూడా ఈ చర్చను కేంద్రం నిర్వహిస్తోందని ఆరోపించారు. మంగళవారం ఆయన వందేమాతర గీతానికి 150 ఏళ్లవుతున్న సందర్భంగా జరిగిన చర్చలో పాల్గొని, దాదాపు గంటపాటు మాట్లాడారు. వందే మాతర గీతాన్ని రెండు చరణాలకే పరిమితం చేశారంటూ నెహ్రూపై ప్రధాని మోదీ, అమిత్‌షాలు విమర్శలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ అంశంపై మహాత్మాగాంధీ, సుభాష్ చంద్ర బోస్, మదన్ మోహన్ మాలవీయ, ఆచార్య కృపలానీ, రవీంద్రనాథ్ ఠాకూర్ వంటి మహామహులతో కలిసి ఆయన తీసుకున్న నిర్ణయమన్నారు. అప్పట్లో వందేమాతరం ఆలపించేందుకు ఇష్ట పడిన వారు సైతం నేడు వందేమాతరం అంటున్నారని, ఇదే జాతీయ గీతం గొప్పదనమని ఖర్గే చెప్పారు. 'దక్షిణాసియా దేశాలను బాహాటంగానే చైనా తన వైపు లాక్కుంటోంది. తన ఛాతీ 56 అంగుళాలని చెప్పుకుంటున్న ప్రధాని మోదీ చైనాకు వ్యతిరేకంగా ఒక్క మాటైనా మాట్లాడారా?'అని ఖర్గే ప్రశ్నించారు. యూపీఏ హయాంలో 55 రూపాలయ వరకు ఉన్న డాలరు విలువ నేడు ఏకంగా ఆకాశమంత ఎత్తుకు పెరిగి రూ.90కి చేరుకుందన్నారు. వందేమాతరం గురించి మాట్లాడటమంటే, ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ పరిణామాలను గురించి మాట్లాడుతున్నారంటూ అధికార పక్షాల సభ్యులు అభ్యంతరం తెలపగా అధ్యక్ష స్థానంలో ఉన్న చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ వారితో ఏకీభవించారు.

ఇండోనేసియాలో అగ్ని ప్రమాదం

- 22 మంది బలి
- నిండు గర్భిణి సైతం అగ్నికి ఆహుతి
- డ్రోన్ల బ్యాటరీ నిల్వ, పరీక్షా కేంద్రంలో రాజుకున్న మంటలు
- దట్టమైన పొగతో ఊపిరాడక పలువురు సిబ్బంది దుర్మరణం
- జకార్తా నగరంలో దుర్ఘటన

జకార్తా: ఇండోనేసియా రాజధాని నగరం జకార్తాలో ఏడంతస్తుల భవంతిలో ఉవ్వెత్తున ఎగసిపడిన అగ్నికీలల ధాటికి 22 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో నిండు గర్భిణి సైతం అగ్నికి ఆహుతయ్యారు. జకార్తా సిటీలోని కెమయోరన్ ప్రాంతంలోని ఒక భవంతిలోని మొదటి అంతస్తులో నిల్వచేసిన డ్రోన్ బ్యాటరీల్లో ఒకటి పేలడంతో అంటుకున్న నిప్పు రవ్వలు మెరుపువేగంతో పై అంతస్తులకు ఎగబాకి పెద్దస్థాయిలో మంటల్ని రాజేశాయి. దీంతో భవంతిలోని వాళ్లు వెంటనే తప్పించుకునే అవకాశం లేకుండాపోయిందని సెంట్రల్ జకార్తా పోలీస్ చీఫ్ సుసత్యో పూర్ణోమో కాండ్రో వెల్లడించారు. బుధవారం సిబ్బంది మధ్యాహ్న భోజనాలు చేసే సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. భవనానికి నిప్పు అంటుకుందని తెల్సిన వెంటనే వందలాది మంది అగ్నిమాపక సిబ్బంది, 28 అగ్నిమాపక యంత్రాలు ఘటనాస్థలికి చేరుకుని మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నించారు. ఒక డ్రోన్ల తయారీ కంపెనీకి సంబంధించిన ఆఫీస్ ఈ బహుళ అంతస్తుల భవంతిలో ఉంది. మొదటి అంతస్తులో బ్యాటరీలను నిల్వచేయడంతోపాటు పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడి బ్యాటరీ పేలడంతోనే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. బ్యాటరీలకు చార్జింగ్ పెడుతుండగా షార్ట్ సర్క్యూట్ జరిగి మెరుపులు వచ్చి చివరకు అగ్గిరాజుకుందని మరో ప్రత్యక్ష సాక్షి ఇన్టాన్ పుష్పిత చెప్పారు. మంటలు పై అంతస్తులకు ఎగబాకుతుండటంతో పొడవాటి నిచ్చెనల సాయంతో ఆరో అంతస్తులో చిక్కుకున్న కొందరు కార్మికులకు ఎలాగోలా బయటకు తీసుకురాగలిగారు. బ్యాట రీలు పేలడంతో వెలువడిన పొగ భవంతిని కమ్మేసిన దృశ్యాలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టాయి. దట్టమైన పొగ కారణంగా ఊపిరాడక చాలా మంది చనిపోయారని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఘటనకు వాస్తవిక కారణా లను ఆధా రసహి తంగా కనిపెట్టాల్సి ఉందని పోలీసులు తెలిపారు. భవంతిలో అత్యయిక పరిస్థి తుల్లో తప్పించుకునే ఏర్పాట్లు లేవని ఘటనాస్థలిని పరిశీలించిన జకార్తా గవర్నర్ ప్రమోనో అనుగ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రమాదం జరిగిన భవంతిలో పీటీ రెట్రా డ్రోన్ ఇండోనేసియా అనే కంపెనీ కార్యాలయం నడుస్తోంది. ఇది నిర్మాణం , గనులు, ముడిచమురు, సహజవాయువు, ఇంధన, వ్యవ సాయం, పట్టణ ప్రణాళిక రంగ కంపెనీలకు డ్రోన్ల ను సమకూరుస్తోంది.

కొన్ని గాల్లో.. ఇంకొన్ని నేలపై

- సర్వీసుల సంఖ్య మెరుగైనా మంగళవారం 422 ఇండిగో విమానాలు రద్దు
- సాధారణ స్థితికి చేరుకున్నామన్న ఇండిగో

న్యూఢిల్లీ/ముంబై: గత రెండు రోజులుగా ఇండిగో విమాన సర్వీసుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వరుసగా ఎనిమిదో రోజు సైతం విమానాల రద్దు పర్వం కొనసాగింది. మంగళవారం మరో 422 ఇండిగో విమానాలు రద్దయ్యాయి. ఒక్క ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లోనే 152 విమానాలు రద్దయ్యాయి. బెంగళూరులో 121, హైదరాబాద్‌లో 58, చెన్నైలో 50, ముంబైలో 41 విమానాలు రద్దయి హ్యాంగర్‌లకే పరిమితమయ్యాయి. సంక్షుభిత ఇండిగో మాత్రం తమ సర్వీసులు దాదాపు మళ్లీ సాధారణస్థాయికి చేరుకుంటున్నాయని ప్రకటించింది. ఈ మేరకు ఇండిగో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పీటర్ ఎల్బర్స్ మంగళవారం ఒక వీడియో సందేశం విడుదలచేశారు. ''ఇండిగో మళ్లీ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తోంది. గతంలో విమానాల రద్దు ఘటన విషయంలో మరోసారి ప్రయాణికులకు క్షమాపణలు చెబుతున్నా. మా వెబ్‌సైట్‌లో కనిపించే దాదాపు ప్రతి విమానం షెడ్యూల్ సమయానికి రాకపోకలు సాగించేలా శతథా కృషిచేస్తున్నాం'' అని ఆయన అన్నారు.

ఇండిగో సర్వీసులపై కేంద్రం కోత

తరచూ విమానాలు రద్దవడంతో ఇండిగో టికెట్లు కొన్న ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు, ఈ కంపెనీ టికెట్లు కొని అవస్థలు పడకుండా నివారించేందుకు దేశవ్యాప్త షెడ్యూల్‌లో సంస్థకు చెందిన 5 శాతం సర్వీసులపై మోదీ ప్రభుత్వం కోత విధించింది. ఆ మేరకు 5 శాతం షెడ్యూల్ స్లాట్‌ను ఇతర కంపెనీలకు కేటాయించింది. ముఖ్యంగా అత్యంత రద్దీ ఉండే, ప్రధాన రూట్లలో ఈ 5 శాతం షెడ్యూల్‌ను ఇతర కంపెనీలకు కేటాయించింది. దేశీయ పౌరవిమానయాన రంగంలో 65 శాతం వాటాను ఆక్రమించిన ఇండిగోపైనే పూర్తిగా ఆధారపడకుండా ఇతర కంపెనీలకూ అవకాశాలు మెరుగుపడాలనే ఉద్దేశంతో వాటికి 5 శాతం స్లాబ్‌ను కేటాయించామని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అనుమతించిన షెడ్యూల్‌లో విమానాలను నడపలేక విఫలమైన ఇండిగోకు ప్రభుత్వం ఇలా స్లాట్ కోత రూపంలో పాక్షికంగా శిక్షించింది.

బియ్యం 'అతి'ని అడ్డుకుందాం

- అవసరమైతే భారత్‌పై అధిక సుంకాలు విధిద్దాం
- అమెరికా రైతులకు ట్రంప్ భరోసా

న్యూయార్క్/వాషింగ్టన్: భారత్‌పై అధిక సుంకాల భారం మోపేందుకు తహతహలాడే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈసారి భారతీయ బియ్యం దిగుమతులపై దృష్టిసారించారు. అమెరికా రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా భారత్ నుంచి అత్యధికస్థాయిలో బియ్యం దిగుమతులు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చినట్లు సోమవారం శ్వేతసౌధంలో జరిగిన ఒక రౌండ్‌టేబుల్ భేటీలో చెప్పారు. అమెరికా రైతులకు దాదాపు రూ.1,07,810 కోట్ల ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించారు. వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో రైతులు, వ్యవసాయరంగ ప్రతినిధులు, అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బిసెంట్, వ్యవసాయ శాఖ మంత్రి బ్రూక్ రోలిన్స్‌సహా పలువురు ట్రంప్ కేబినెట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లూసియానాలో కుటుంబ వ్యాపారమైన కెన్నడీ రైస్‌మిల్లును నడుపుతున్న మహిళా రైతు మెర్లిన్ కెన్నడీ మాట్లాడారు. '' అమెరికా మార్కెట్లోకి ఇబ్బడిముబ్బడిగా వచ్చిపడుతున్న విదేశీ చవక బియ్యం కారణంగా అమెరికన్ రైతులకు నష్టాలొస్తున్నాయి. విదేశీ బియ్యం అమెరికా దక్షిణ రాష్ట్రాలను ముంచెత్తుతోంది'' అని ఆరోపించారు. ఏఏ దేశాల నుంచి అమెరికాలోకి బియ్యం వస్తోందని ట్రంప్ ప్రశ్నించారు. '' భారత్, చైనా, థాయ్‌లాండ్‌ల నుంచి అత్యధిక బియ్యం దిగుమతి అవుతోంది. గతంలో ప్యూర్టోరీకోకు అమెరికా బియ్యం ఎగుమతులు జరిగేవి. ఇప్పుడు అవి పూర్తిగా ఆగిపోయాయి. ఈ దేశాలే ఎగుమతి చేస్తున్నాయి. బియ్యం దిగుమతులపై టారిఫ్ విధిస్తున్నా అది సరిపోదు. రెట్టింపు చేయాల్సిందే'' అని ఆమె డిమాండ్ చేశారు. ''అయితే మీరు భారత్ వంటి దేశాల బియ్యంపై అధిక సుంకాలు విధించాలంటారు. నాకు అమెరికా రైతుల సమస్య అర్థమైంది. భారతీయ బియ్యం అధిక దిగుమతులకు మనం వీలు కల్పించామా?'' అని వాణిజ్యమంత్రి స్కాట్ బిసెంట్‌ను ట్రంప్ ప్రశ్నించారు. ''అలాంటిదేమీలేదుగానీ భారత్‌తో త్వరలో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతున్నాం. సంబంధిత చర్చలు ఇంకా కొనసాగుతున్నాయి'' అని ఆయన గుర్తుచేశారు.

ఒక్క రోజులో పరిష్కరిస్తా...

''భారత్ వంటి దేశాలు ఇలా బియ్యాన్ని మనపై గుమ్మరిస్తే ఎలా? ఇలాంటిది కుదరదు. ఇతర దేశాలు సైతం ఇలా చేయకూడదు'' అని ట్రంప్ అన్నారు. '' ఇప్పటికే భారత్‌పై ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)లో కేసు నమోదైంది. అసలు ఇలాంటి దేశాల జాబితాను రాసి ఇవ్వండి.దీనిపై ఆలోచిస్తా'' అని ట్రంప్ కోరగా.. ''భారత్, థాయిలాండ్, చైనా.. ఇవే పెద్ద అపరాధం చేశాయి. అమెరికన్ రైతులు దేశీయంగానేకాదు ప్రపంచం ఆకలిని తీర్చగలరు. అమెరికాకు స్వేచ్ఛాయుత వాణిజ్యం అవసరం అంతేగానీ ఉచిత వాణిజ్యంకాదు'' అని మంత్రి స్కాట్ బిసెంట్ అన్నారు. ''ఈ సమస్యను పరిష్కరించడం చాలా తేలిక. అధిక బియ్యాన్ని ఇక్కడికి తరలించే దేశాలపై అధిక టారిఫ్‌లు విధిస్తే సరిపోతుంది. ఒక్క రోజులో సమస్యను పరిష్కరిస్తా'' అని ట్రంప్ అన్నారు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి 2,010 క్యూసెక్కులు పశ్చిమ డెల్టాకు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 11 అడుగుల నీటిమట్టం ఉంది.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 109 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4400 క్యూసెక్కులు వదులుతున్నారు. నిల్వ 43.3532 టీఎంసీలు.



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.1200, మోడల్ ధర రూ.1000 వరకు పలికింది.

ధాన్యంపై సెస్సుకు బురిడీ

- చెన్నై లారీల్లో ఆంధ్ర ధాన్యం తెలంగాణకు...
- చెక్‌పోస్టుల్లో రూ.500–700 చొప్పున మామూళ్లతో రవాణా
- ఇక్కడ సెస్సు తప్పించుకుని అక్కడ రైతుల పేరుతో సబ్సిడీలు

కృష్ణా డెల్టాలో వరి నూర్పిళ్లు జోరుగా సాగుతున్నాయి. రైతుల నుంచి వ్యాపారులు/దళారులు ధాన్యం కొనుగోలు చేసి రవాణా చేస్తున్నారు. పలువురు వ్యాపారులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రెండు శాతం సెస్సును ఎగ్గొట్టి అడ్డదారుల్లో రవాణా చేస్తున్నారు. తమిళనాడు నుంచి లారీలను రప్పించి ఆ వాహనాల్లో తెలంగాణకు పంపుతున్నారు. ఇక్కడ సెస్సు ఎగ్గొడుతూ, అక్కడి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని అందుకుంటున్నారు.

తెనాలి: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే ట్రేడర్లు/వ్యాపారులు ఆ విలువలో రెండు శాతం సెస్సును ప్రభుత్వానికి చెల్లించాలి. గతంలో ఒక శాతం ఉండే సెస్సు ఇప్పుడు రెట్టింపు చేశారు. ధాన్యం క్వింటాలు రూ.2400 చొప్పున 20 టన్నుల ధాన్యం లారీకి ఎత్తితే, మొత్తం విలువ రూ.4.80 లక్షలు అవుతుంది. దీనిపై రెండు శాతం సెస్సు అంటే దాదాపు రూ.10 వేలను వ్యాపారి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. పది చక్రాల లారీల్లో 20 టన్నులు లోడు చేస్తే, 12 చక్రాల లారీల్లో 25 టన్నులు, 14 చక్రాల లారీల్లో 30 టన్నుల చొప్పున లోడు చేసి, రవాణా చేస్తున్నారు. ఆ ప్రకారం విలువకు రెండు శాతం సెస్సును ప్రభుత్వం వసూలు చేయాలి.

లారీల్లో ధాన్యం రవాణా

తెలంగాణలో బస్తాకు రూ. 500 సబ్సిడీ...

తెలంగాణలో ధాన్యంపై సెస్సు ఒక శాతం మాత్రమే. అంతేకాకుండా అక్కడి ప్రభుత్వం, ధాన్యం ఇచ్చిన రైతులకు బస్తాకు రూ.500 చొప్పున సబ్సిడి ఇస్తోందని చెబుతున్నారు. అందుచేత అక్కడి వ్యాపారులు పలువురు తెలివిగా ఇక్కడి నుంచి ధాన్యం కొనుగోలు చేస్తూ రాష్ట్రానికి చెందాల్సిన సెస్సు ఎగ్గొడుతూ, తెలంగాణలో రైతుల పేరుతో సబ్సిడీ తీసుకుంటున్నారని ఆరోపణలున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు ధాన్యం లారీలను అనుమతించటం లేదు. తమిళనాడు నుంచి అయితే తెలంగాణ ప్రభుత్వం అభ్యంతర పెట్టటం లేదని చెబుతున్నారు. దీనితో వ్యాపారులు చెన్నై నుంచి లారీలను రప్పించి, డెల్టాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని తెలంగాణ చేరుస్తున్నారు. తెనాలి ప్రాంతంలో కూచిపూడి, పెదరావూరు-2, అత్తోట-2, కొలకలూరు, తూములూరు అడ్డరోడ్డు, కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లో కాటాలున్నాయి. ధాన్యం కొనుగోలు చేసిన లారీలు ఏదొక కాటా పాయింట్ వద్ద కాటా వేయించి బయలుదేరుతున్నాయి. అధికారులు ఆయా కాటాలకు వెళ్లి, రాండమ్‌గా పది కాటా చీటీలు తీసుకుని, వాటికి సంబంధించి ఎక్కడైనా సెస్సు చెల్లించిన దాఖలాలు ఉన్నాయా, అని పరిశీలిస్తే సెస్సు ఎగవేత వ్యవహారం బహిర్గతం కాగలదని స్థానిక వ్యాపారి ఒకరు చెప్పారు. అలాగే ట్రాక్టర్లలో రవాణా అయ్యే ధాన్యానికి సెస్సు చెల్లింపులు జరగటం లేదంటున్నారు.

అడ్డదారుల్లో అక్రమ రవాణా..

సెస్సు భారంగా మారిందన్న భావనతో పలువురు వ్యాపారులు అడ్డదారుల్లో వెళుతున్నారు. డ్రైవర్ల జేబులో రూ.3 వేలుంచి పంపుతున్నారు. వాళ్లు మార్గమధ్యంలోని చెక్‌పోస్టుల్లో రూ.500, రూ.700 చొప్పున మామూళ్లు ఇస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ప్రస్తుతం కృష్ణా పశ్చిమడెల్టాలో ముమ్మరంగా నూర్పిళ్లు జరుగుతున్నాయి. ఇక్కడ నుంచే వ్యాపారులు ధాన్యం ఎగుమతి చేస్తున్నారు. సెస్సుకు గండి కొడుతూ కరకట్ట నుంచి బ్యారేజి వరకు, అక్కడి నుంచి విజయవాడ ఔటర్‌లోకి, ఖమ్మంవైపు దొంగ దారుల్లో లారీలకు లారీలు వెళ్లిపోతున్నాయి.

ప్రయివేటీకరణపై ప్రజా వ్యతిరేకత

- జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో 70 వేల మందికిపైగా ప్రజలు సంతకాలు
- నేడు నియోజకవర్గాల నుంచి జిల్లా పార్టీ కార్యాలయానికి సంతక పత్రాలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటుపరం చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న దుర్మార్గ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంలో భాగంగా గుజ్జనగుండ్ల, జిల్లా కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన శిబిరాలను మంగళవారం ఆయన సందర్శించారు. ప్రజల నుంచి సంతకాలు సేకరించారు.

అనూహ్య స్పందన

ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ... మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు పోరాటాలు నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ మంగళవారం ముగియనుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గం నుంచి 60 వేల మంది ప్రజల సంతకాలు సేకరించాలనేది లక్ష్యం కాగా ప్రజల నుంచి అనూహ్యరీతిలో స్పందన వచ్చిందని తెలిపారు. ఇలా ప్రతి నియోజకవర్గంలో 70 వేల మందికి పైగా ప్రజలు సంతకాలు చేశారని చెప్పారు. బుధవారం ప్రతి నియోజకవర్గం నుంచి ఆ సంతకాలతో కూడిన పత్రాలను గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయానికి తీసుకురానున్నట్లు వివరించారు. అనంతరం ఈ నెల 15న తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయానికి పంపుతామని చెప్పారు. ఈ నెల 17న పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ పత్రాలను రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తారని వివరించారు. తద్వారా కోటి మంది ప్రజల నుంచి వచ్చిన డిమాండ్‌కు అనుగుణంగా మెడికల్ కళాశాలల విషయంలో పీపీపీ విధానాన్ని ఉపసంహరించుకుని, ప్రభుత్వ యాజమాన్యంలోనే నిర్వహించేలా చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మిర్చియార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నగర యువజన విభాగ అధ్యక్షుడు యేటి కోటేశ్వరరావు, పార్టీ 24వ డివిజన్ అధ్యక్షుడు యూనిస్‌బాషా, కన్వీనర్లు షేక్‌బాజీ, అంజిబాబు, సింగు నరసింహారావు, మామిడి కిషోర్, బుడ్డా, అబ్రహం, యాపర్తి కోటి, మార్కెట్‌బాబు, షఫీ, ఉడతా కృష్ణ, జగన్ కోటి, మున్నా, కోవుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుజ్జనగుండ్లలో వృద్ధురాలితో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

న్యూస్‌రీల్

నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించాలి

రేపల్లె: నాయీ బ్రాహ్మణులకు రాష్ట్రంలో అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పించాలని ఏపీ నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ద్రాక్షారపు సూరిబాబు అన్నారు. రేపల్లెలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయీ బ్రాహ్మణులను ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా ప్రోత్సహించాలన్నారు. రాష్ట్రంలో పోలీసు, హాస్టల్స్, హెల్త్ శాఖలలో క్షౌర వృత్తి పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో నాయీ బ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ప్రభుత్వం క్షౌరశాలలకు 200ల యూనిట్‌లు విద్యుత్ ఉచితంగా ఇవ్వటాన్ని స్వాగతిస్తున్నామని, ఇది త్వరితగతిన అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు యడ్లపల్లి కిషోర్‌బాబు, కె.అప్పారావు, విజయ్, కె.శివయ్య, సుబ్రహ్మణ్యం, కె.శివబాజీ, కొడాలి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన లైన్‌ను పరిశీలించిన రైల్వే జీఎం

తెనాలి రూరల్: కృష్ణా కెనాల్ జంక్షన్ నుంచి తెనాలి మీదుగా గూడూరు వరకు నిర్మించిన మూడో రైల్వే లైన్‌ను దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ప్రత్యేక రైలులో సాయంత్రం తెనాలి వచ్చారు. విండో ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా జీఎం రైలులోనే ఉండి ట్రాక్‌ను పరిశీలిస్తూ ప్రయాణించారు. ఇదే రైలులో వచ్చిన విజయవాడ, గుంటూరు డీఆర్‌ఎంలు మోహిత్ సొనాకియా, సుదేష్ణసేన్ తెనాలిలో దిగిపోయారు. అమృత్ భారత స్టేషన్‌గా ఎంపికైన తెనాలి స్టేషన్ అభివృద్ధి పనులకు రూ.28 కోట్లు మంజూరు కాగా, వాటికి సంబంధించి జరుగుతున్న గూడ్స్ షెడ్డు నిర్మాణం, స్టేషన్‌లో కాలినడక వంతెనలు, ఇతర పనులను విజయవాడ డీఆర్‌ఎం మోహిత్ సొనాకియా అధికారుల బృందంతో పరిశీలించారు. స్టేషన్ మేనేజర్ టీవీ రమణకు పలు సూచనలు చేశారు.

‘మెడ్ ఫ్యూషన్’ ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు మెడికల్: సుమారు 30 ఏళ్ల తర్వాత మళ్లీ మెడికల్ ఎగ్జిబిషన్ నిర్వహణకు గుంటూరు మెడికల్ కళాశాల విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. 2026 జనవరి 30న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నారు. ఎగ్జిబిషన్ టైటిల్, పోస్టర్‌ను గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ సమక్షంలో అధ్యాపకులు, వైద్య విద్యార్థులు మంగళవారం ఆవిష్కరించారు. ఎగ్జిబిషన్‌కు ‘గుంటూరు మెడికల్ కాలేజ్ మెడ్ ఫ్యూషన్’ అని నామకరణం చేశారు. డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ఆరోగ్య సమాచారం, అవగాహన కల్పించేలా ప్రదర్శనలు ఉండాలని సూచించారు. విశిష్ట అతిథి రాజా కర్ణం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారికి రూ.లక్ష అందజేసి ఎగ్జిబిషన్ విజయవంతానికి తన మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో అడ్మిన్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కో ఆప్షన్ మెంబర్ ఎన్నికకు నామినేషన్ పక్రియ

వేమూరు: కో ఆప్షన్ మెంబర్ ఉప ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి పి.పద్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కో ఆప్షన్ మెంబర్ ఆకస్మికంగా మృతి చెందడంతో ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఈ నెల 11వ తేదీన ఉదయం 10 గంటల నుంచి నామినేషన్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 12 గంటలలోపు నామినేషన్ పరిశీలన, అనంతరం చెల్లుబాటు నామినేషన్ పేర్లు ప్రకటించడం జరుగుతుందన్నారు. ఒంటి గంటలోపు నామినేషన్ ఉపసంహరణ, తర్వాత కో ఆప్షన్ మెంబర్ ఎన్నిక జరుగుతుందన్నారు.

పల్స్‌పోలియో ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా

21న ‘పల్స్ పోలియో’ కార్యక్రమం

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలలోపు వయస్సు గల ప్రతి చిన్నారికి రెండు పల్స్ పోలియో చుక్కలు ఇవ్వాలన్నారు. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, వివిధ కూడళ్లలో శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగేలా ప్రచార పోస్టర్లు. కరపత్రాలు, ర్యాలీలు నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టర్‌తోపాటు అధికారులు పల్స్‌పోలియో ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మార్గదర్శకాల ప్రకారం జాబితా

నిర్దేశించిన మార్గదర్శకాలు ప్రకారం అభ్యర్థుల జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కేర్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో వివిధ వైద్య ఆరోగ్య కేంద్రాల్లో భర్తీ చేయనున్న ఉద్యోగాలకు వైద్య ఆరోగ్యశాఖ నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించాలని సూచించారు.

ల్యాండ్ పూలింగ్‌కు సిద్ధం కావాలి

రెండవ విడత ల్యాండ్ పూలింగ్‌కు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో రెండవ విడత ల్యాండ్ పూలింగ్‌పై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలను రూపొందించిందని గుర్తుచేశారు. దానికనుగుణంగా భూ సమీకరణ జరుగుతుందని అన్నారు. గ్రామ సభలు నిర్వహించేందుకు ముందుగా తేదీలను తెలియజేయాలని సూచించారు. వక్ఫ్ భూములను పరిరక్షించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పంట వైవిధ్యతను పాటించాలి

కొరిటెపాడు(గుంటూరు వెస్ట్) : ప్రకృతి వ్యవసాయం చేసి, పంట వైవిధ్యతను పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఎం.పద్మావతి అన్నారు. ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కృషిభవన్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఐదు రోజుల శిక్షణ సదస్సును జిల్లా వ్యవసాయ అధికారిణి ఎం.పద్మావతి, జిల్లా వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ పీడీ జి.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగు చేస్తున్న పంటల పద్ధతులపై సిబ్బంది అవగాహనతో పని చేయాలని అన్నారు. రసాయన పద్ధతులు పాటిస్తున్న రైతుల్లో కూడా ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి కలిగించాలని సూచించారు. ఆత్మ పీడీ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం, యూరియా వినియోగాన్ని తగ్గించే దిశగా రైతులను ప్రోత్సహించాలని అన్నారు. త్వరలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను స్వయంగా సందర్శిస్తానని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ అభివృద్ధికి అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విశ్రాంత ఐఏఎస్‌లు విజయ్‌కుమార్, రాయుడు వీసీ ద్వారా మాట్లాడారు. సదస్సులో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి, జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పద్మావతి

డీఈవోగా సలీమ్ బాషా

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారిగా షేక్ సలీమ్ బాషా నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారిగా పని చేస్తున్నారు. మంగళవారం జరిగిన డీఈవోల బదిలీల్లో భాగంగా సలీమ్ బాషా గుంటూరుకు, సీవీ రేణుక ప్రకాశం జిల్లాకు డీఈవోలుగా బదిలీ అయ్యారు.

10 నుంచి టెట్ నిర్వహణ

ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న ఏపీ టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్ (ఏపీ టెట్)కు గుంటూరు జిల్లాలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

చంద్రబాబు సర్కారుపై ప్రజాగ్రహం

- మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణపై వెల్లువెత్తిన వ్యతిరేకత
- కోటి సంతకాల ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు
- మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 75 వేల సంతకాల సేకరణ
- చంద్రబాబు ప్రభుత్వం తీరు మారకుంటే ఉద్యమిస్తాం
- ఎమ్మెల్సీ మురుగుడు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

సంతకాల ఉద్యమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, సమన్వయకర్త, ఆప్కో మాజీ చైర్మన్ తదితరులు (ఫైల్)

తాడేపల్లి రూరల్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమ కార్యక్రమానికి మంగళగిరి నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. మూడు మండలాల నుంచి సుమారు 75 వేలకుపైగా సంతకాలు సేకరించారు. ఇచ్చిన లక్ష్యం కంటే ఎక్కువ సంతకాలు సేకరించడంతో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు అద్దం పడుతోంది. ఇంకా పదివేలకు పైగా సంతకాలు సేకరించనున్నట్లు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్)లు పేర్కొన్నారు.

పేదలకు అండగా వైఎస్ జగన్

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్న సమయంలో పేదలకు మేలు చేసేలా రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని చేపట్టారు. తర్వాత వచ్చిన చంద్రబాబు సర్కారు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటుపరం చేయడానికి కుట్రలు పన్నారు. దీంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. మంగళగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్సీ, సమన్వయకర్తతోపాటు మంగళగిరి తాడేపల్లి పట్టణ రూరల్ అధ్యక్షులు, దుగ్గిరాల అధ్యక్షులు ఆకురాతి రాజేష్, బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, నాళి వెంకటకృష్ణ, అమరా నాగయ్య, తాడిబోయిన శివ గోపయ్యల ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. చంద్రబాబు ప్రభుత్వ కుట్రలపై ప్రజలకు అవగాహన కల్పించి సంతకాల సేకరణ చేపట్టారు. పెనుమాక, మంగళగిరి, తాడేపల్లి, ఉండవల్లి, దుగ్గిరాలలో విద్యార్థులు తమ ఆవేదనను సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డితోపాటు స్థానిక నాయకులకు విన్నవించుకున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి దారుణంగా ఉందని, ఇలాంటి సమయంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేస్తే ప్రజలకు వైద్యం మరింత దూరం అవుతుందని నాయకులు అవగాహన కల్పించారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే సేకరించిన 75,800 సంతకాల ప్రతులను పట్టణ, మండల నాయకులు కలిపి మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిలకు అందజేశారు. మరో ఐదు రోజుల్లో పదివేల సంతకాలు పూర్తికానున్నట్లు దొంతిరెడ్డి వేమారెడ్డి వెల్లడించారు.

సంతకాల పత్రాలతో దొంతిరెడ్డి వేమారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ర్యాలీకి భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

స్వచ్ఛందంగా మద్దతు

మంగళగిరి నియోజకవర్గంలో జరుగుతున్న కోటి సంతకాల సేకరణ ఉద్యమానికి మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. వైద్య విద్య ప్రైవేటుపరం కాకూడదని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని కోరుతూ మద్దతు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొడం చంద్రబాబు ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను చెబుతోంది. నియోజకవర్గంలో ఈ కార్యక్రమం మహోద్యమంగా మారింది. పార్టీలకు అతీతంగా ప్రజలు తమ హక్కుల కోసం ముందుకు వచ్చారు. ప్రభుత్వానికి ఇది ఒక హెచ్చరికగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

– మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్సీ

ప్రజాచైతన్యానికి సంకేతం

మంగళగిరి నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు 75 వేల సంతకాలు సేకరించడం అంటే ప్రజల్లో చైతన్యమే కారణం. చంద్రబాబు సర్కార్‌కి బుద్ధి చెప్పడానికి నిదర్శనం ఈ సంతకాలే. ఈ సంతకాల ప్రతులను ఈ నెల 10వ తేదీన జిల్లా పార్టీ కార్యాలయానికి పంపుతాం. ఈ నెల 16వ తేదీన వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో గవర్నర్‌కు కోటి సంతకాల ప్రతులు అందజేయనున్నారు. నియోజకవర్గంలో కార్యక్రమం విజయవంతం కావడానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కీలకపాత్ర పోషించారు. విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు.

– దొంతిరెడ్డి వేమారెడ్డి, వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త

దివ్యాంగులకు గృహాలపై కలెక్టర్ సమీక్ష

అర్హుల జాబితా తయారు చేయాలని అధికారులకు ఆదేశం

గుంటూరు వెస్ట్: దివ్యాంగులకు గృహాల మంజూరుకు అర్హుల జాబితా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో దివ్యాంగుల గృహాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హుల జాబితా తయారు చేయాలని అందులో వారి ఆధార్ చిరునామా, జాబ్ కార్డు తదితర వివరాలను పరిశీలించాలన్నారు. అవసరమైతే ఆధార్ చిరునామా మార్పు చేయాల్సి ఉంటుందని, అందుకు వారి సంసిద్ధతను తెలుసుకోవాలని సూచించారు.
– జిల్లాలో వివిధ ప్రాంతాల్లో అక్రమంగా గ్రావెల్ రవాణా, అక్రమంగా తవ్వకాలు జరగడం లాంటి అంశాలపై వివిధ మీడియాల్లో కథనాలు వస్తున్నాయని.. జిల్లాలో ఉన్న క్వారీలు తదితర అంశాలపై సంపూర్ణ నివేదికను సమర్పించాలని ఆదేశించారు. అక్రమ రవాణా చేసే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, సీజ్ చేయాలన్నారు. తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామంలో బండరాళ్లు దొర్లుకుంటూ రావడం పట్ల కలెక్టర్ గనుల శాఖ అధికారులను ప్రశ్నించారు. ఇటువంటి అంశాలు పునరావృతం కాకుండా పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

యూకో బ్యాంక్ | గుంటూరు మిడ్ కార్పొరేట్ బ్రాంచి (0223), 9/1, అరండల్‌పేట, గుంటూరు–522002. ఫోన్ : 9230500223. E-mail: guntur@ucobank.co.in

స్థిరాస్తి కోసం ఇ-వేలం అమ్మకం యొక్క బహిరంగ ప్రకటన

[సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (SARFAESI) చట్టం 2002కి అనుగుణంగా]

బ్యాంక్ యొక్క అధీకృత అధికారి SARFAESI చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీచేశారు మరియు ఆ తర్వాత SARFAESI చట్టం 2002 లోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని బ్యాంకుకు తనఖాపెట్టిన ఆస్తులను SARFAESI చట్టం 2002 లోని సెక్షన్ 13(4) క్రింద స్వాధీనం చేసుకున్నారు. అధీకృత అధికారి కోటాలో దిగువ సంతకందారు "ఎక్కడ ఏది ఉన్నదో అది", "ఎలా ఉన్నది అలా మరియు "అక్కడ ఏది ఉంది అది" ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా [illegible]

1) ఋణగ్రహీత పేరు : మెస్సర్స్ ఫ్యాబరేట్ ఎంటర్‌ప్రైజెస్, యజమాని : శ్రీ కసిన సూర్యప్రకాష్ రెడ్డి, డి.నెం.25-18-48/ఎ, 12/3వ లైను, శ్రీనివాసరావుతోట, టుబాకో బోర్డ్ ఎదురు, గుంటూరు–522004, ఫ్యాక్టరీ : డి.నెం.19-9-2/8, [illegible], ఏటుకూరు రోడ్డు, గుంటూరు–522017. హామీదారులు మరియు తనఖాదారులు : శ్రీమతి షేక్ నవీరా బాను, భర్త : కసిన సూర్యప్రకాష్ రెడ్డి, [illegible], గుంటూరు–522004.
బకాయి మొత్తం : ది.31-03-2021 నాటికి రూ.3,10,01,117/- [illegible] (ది.31-12-2020 నుండి వడ్డీ) ప్లస్ తదుపరి ఖర్చులు, డిమాండ్ నోటీసు తేది: 06-04-2021 మరియు స్వాధీనత నోటీసు తేది: 30-06-2021 న జారీచేయడం జరిగింది.
స్థిరాస్తుల వివరణ : ఐటమ్ నెం.1 : నరసరావుపేట యస్.ఆర్.ఒ లోని ది.27-07-2018 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.10790/2018 ప్రకారం కసిన సూర్యప్రకాష్ రెడ్డి, తండ్రి : [illegible]
ఐటమ్ నెం.2 : గుంటూరు యస్.ఆర్.ఒ లోని ది.17-09-2018 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.13962/2018 ప్రకారం కసిన సూర్యప్రకాష్ రెడ్డి, తండ్రి : [illegible]

రిజర్వు ధర : రూ.1,46,30,000/- (అక్షరాల ఒక్క కోటి నలభైఆరు లక్షల ముప్పై వేల రూపాయలు మాత్రమే), బయానా : రూ.14,63,000/- (అక్షరాల పద్నాలుగు లక్షల అరవైమూడు వేల రూపాయలు మాత్రమే) బిడ్ గుణకాలు : రూ.2,00,000/-

2) ఋణగ్రహీత: శ్రీ మిట్టపల్లి రమేష్‌బాబు, డి.నెం.4-19-94/1, 6వ లైను, వికాస్ నగర్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్–522006, [illegible]
బకాయి మొత్తం : ది.28-01-2025 నాటికి రూ.6,18,40,750.56 పై. [illegible] ది.10-02-2025 నాటి డిమాండ్ నోటీసు ప్రకారం మరియు స్వాధీనత నోటీసు తేది: 19-04-2025 న జారీచేయడం జరిగింది.
స్థిరాస్తుల వివరణ : గుంటూరు యస్.ఆర్.ఒ లోని ది.01-02-2014 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.970/2014 ప్రకారం [illegible] అసెస్‌మెంట్ నెం.9480, డి.నెం.67 & 68 మరియు ఫ్లాట్ నెం.24, పాత వార్డు నెం.02, కొత్త వార్డు నెం.03, బ్లాక్ నెం.2, డోరు నెం.5-93-39 నందు 586 చ.గజాలు లేదా 490-11 చ.మీ.ల విస్తీర్ణముగల [illegible]

రిజర్వు ధర : రూ.6,99,40,000/- (అక్షరాల ఆరు కోట్ల తొంభైతొమ్మిది లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే), బయానా : రూ.69,94,000/- (అక్షరాల అరవైతొమ్మిది లక్షల తొంభైనాలుగు వేల రూపాయలు మాత్రమే) బిడ్ గుణకాలు : రూ.2,00,000/-

3) ఋణగ్రహీత పేరు : 1) మెస్సర్స్ వెంకటేశ్వర కాటన్ ట్రేడర్స్, [illegible]
బకాయి మొత్తం : ది.20-10-2020 నాటికి రూ.5,14,85,006.26 పై. [illegible] డిమాండ్ నోటీసు తేది: 20-10-2020 మరియు స్వాధీనత తేది: 03-03-2021.
స్థిరాస్తుల వివరణ : ఆస్తి నెం.1 : ది.14-10-2010 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.4077/2010 ప్రకారం ఆలపాటి గోపాలకృష్ణ మరియు ఆలపాటి రవికుమార్ పేరున గల ఆస్తి : [illegible]
ఆస్తి నెం.2 : ది.14-10-2010 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.4078/2010 ప్రకారం [illegible]
ఆస్తి నెం.3 : ది.14-10-2010 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.4079/2010 ప్రకారం [illegible] మొత్తం ఆస్తి విస్తీర్ణము : యు॥1.10+ 2.90+ 1.30= యు॥ 5.30 సెంట్లు విస్తీర్ణము.

రిజర్వు ధర : రూ.8,69,51,000/- (అక్షరాల ఎనిమిది కోట్ల అరవైతొమ్మిది లక్షల యాభైఒక్క వేల రూపాయలు మాత్రమే), బయానా : రూ.86,95,000/- (అక్షరాల ఎనభైఆరు లక్షల తొంభైఐదు వేల రూపాయలు మాత్రమే) బిడ్ గుణకాలు : రూ.2,00,000/-

4) ఋణగ్రహీత: మెస్సర్స్ ఎవిఎస్ఆర్ కాటన్ ట్రేడర్స్ [illegible]
బకాయి మొత్తం : ది.30-06-2019 నాటికి రూ.16,69,51,474.31 పై. [illegible] ది.05-07-2019 నాటి డిమాండ్ నోటీసు ప్రకారం మరియు స్వాధీనత నోటీసు తేది: 12-12-2024 న జారీచేయడం జరిగింది.
స్థిరాస్తుల వివరణ : ఆస్తి నెం.1 వివరములు : ది.31-03-2003 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.1471/2003 ప్రకారం [illegible]

రిజర్వు ధర : రూ.6,36,75,000/- (అక్షరాల ఆరు కోట్ల ముప్పైఆరు లక్షల డెబ్బైఐదు వేల రూపాయలు మాత్రమే), బయానా : రూ.63,67,000/- (అక్షరాల అరవైమూడు లక్షల అరవైఏడు వేల రూపాయలు మాత్రమే) బిడ్ గుణకాలు : రూ.2,00,000/-

ఆస్తి నెం.2 వివరములు : ది.22-12-2009 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.8079/2009 ప్రకారం [illegible]

రిజర్వు ధర : రూ.99,98,000/- (అక్షరాల తొంభైతొమ్మిది లక్షల తొంభైఎనిమిది వేల రూపాయలు మాత్రమే), బయానా : రూ.9,99,000/- (అక్షరాల తొమ్మిది లక్షల తొంభైతొమ్మిది వేల రూపాయలు మాత్రమే) బిడ్ గుణకాలు : రూ.2,00,000/-

ఆస్తి నెం.3 వివరములు : ది.22-12-2009 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.8080/2009 ప్రకారం [illegible]

రిజర్వు ధర : రూ.33,06,000/- (అక్షరాల ముప్పైమూడు లక్షల ఆరు వేల రూపాయలు మాత్రమే), బయానా : రూ.3,30,000/- (అక్షరాల మూడు లక్షల ముప్పై వేల రూపాయలు మాత్రమే) బిడ్ గుణకాలు : రూ.2,00,000/-

5) ఋణగ్రహీత పేరు : మెస్సర్స్ శ్రీ సాయి కాటన్ ట్రేడర్స్, [illegible]
బకాయి మొత్తం : క్యాష్ క్రెడిట్ అకౌంట్ ప్రకారం రూ.5,00,40,717.78 పై॥ [illegible] ఫండెడ్ ఇంటరెస్ట్ అకౌంట్ ప్రకారం రూ.29,61,296.07 పై॥ [illegible] ది.09-01-2021 నుండి [illegible] డిమాండ్ నోటీసు తేది: 15-06-2021 మరియు స్వాధీనత తేది: 01-10-2021 న జారీచేయడం జరిగింది.
స్థిరాస్తుల వివరణ : ప్రత్తిపాడు యస్.ఆర్.ఒ లో ది.19-01-2013 న రిజిస్టర్ కాబడిన విక్రయ దస్తావేజు నెం.171/2013 ప్రకారం [illegible]

రిజర్వు ధర : రూ.1,05,19,000/- (అక్షరాల ఒక్క కోటి ఐదు లక్షల పందొమ్మిది వేల రూపాయలు మాత్రమే), బయానా : రూ.10,51,000/- (అక్షరాల పది లక్షల యాభైఒక్క వేల రూపాయలు మాత్రమే) బిడ్ గుణకాలు : రూ.1,00,000/-

6) ఋణగ్రహీత పేరు : మెస్సర్స్ [illegible] ప్రైవేట్ లిమిటెడ్, [illegible] గుంటూరు–522019, [illegible]
బకాయి మొత్తం : ది.28-06-2020 నాటికి రూ.3,81,18,996.12 పై॥ [illegible] ది.18-03-2021 నాటి డిమాండ్ నోటీసు ప్రకారం మరియు స్వాధీనత నోటీసు తేది: 27-04-2022.
స్థిరాస్తుల వివరణ : షెడ్యూలు ఆస్తి నెం.1 : విజయవాడ యస్.ఆర్.ఒ లోని ది.07-11-2016 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.11014/2016 ప్రకారం [illegible]

రిజర్వు ధర : రూ.1,04,73,000/- (అక్షరాల ఒక్క కోటి నాలుగు లక్షల డెబ్బైమూడు వేల రూపాయలు మాత్రమే), బయానా : రూ.10,47,000/- (అక్షరాల పది లక్షల నలభైఏడు వేల రూపాయలు మాత్రమే) బిడ్ గుణకాలు : రూ.1,00,000/-

షెడ్యూలు ఆస్తి నెం.2 : విజయవాడ యస్.ఆర్.ఒ లోని ది.07-11-2016 నాటి రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం.11016/2016 ప్రకారం [illegible]

రిజర్వు ధర : రూ.1,04,73,000/- (అక్షరాల ఒక్క కోటి నాలుగు లక్షల డెబ్బైమూడు వేల రూపాయలు మాత్రమే), బయానా : రూ.10,47,000/- (అక్షరాల పది లక్షల నలభైఏడు వేల రూపాయలు మాత్రమే) బిడ్ గుణకాలు : రూ.1,00,000/-

ఇ-వేలం మరియు సమయం: 29-12-2025 (సోమవారం ఉ॥11.00 గం.ల నుండి సా॥5.00 గం.ల మధ్య, ప్రతిసారి 10 నిమిషాల అపరిమిత పొడిగింపుతో.

విక్రయ నిబంధనలకు [illegible] https//baanknet.com [illegible] గుంటూరు మిడ్ కార్పొరేట్ బ్రాంచ్, 9/1, అరండల్‌పేట, గుంటూరు–522002 [illegible] ఫోన్ నెంబరు : 9230500223, ఇ-మెయిల్ :guntur@ucobank.co.in [illegible]
తేది : 06-12-2025 & 08-12-2025, స్థలం : గుంటూరు — సం/- అధీకృత అధికారి, యూకో బ్యాంక్, గుంటూరు మిడ్ కార్పొరేట్ బ్రాంచ్, గుంటూరు.

నిర్మల మనసుతో సేవానిరతి

- మృతిచెందిన తన భార్య డాక్టర్ నిర్మల పేరిట పలు కార్యక్రమాలు
- గుంటూరు జీజీహెచ్, వైద్య కళాశాలలో అభివృద్ధి పనులు
- రూ.2 కోట్లతో పేదల ఆస్పత్రిలో అభివృద్ధి
- రూ.15 కోట్లతో ఆమె పేరుతో భవనం కట్టించేందుకు సిద్ధం
- దాత రాజాకర్ణంకు కలెక్టర్ అభినందనలు

రాజా కర్ణంను సన్మానిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ప్రజాప్రతినిధులు

రాజాకర్ణం

డాక్టర్ నిర్మల (ఫైల్)

గుంటూరు మెడికల్: భార్య, భర్త ఇద్దరూ ఉన్నత చదువులు చదివారు.. జిల్లా విడిచి అమెరికా వెళ్లారు. వైద్య వృత్తిలో ఆమె బిజీగా ఉండగా.. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఆయన రాణించాడు. సుమారు 45 ఏళ్లకు పైగా భార్యభర్తలు ఇద్దరు తమ తమ రంగాల్లో రాణించి, కష్టపడి సంపాదించారు. కాలచక్రం గిర్రున తిరిగింది. ఇరువురూ ఏడు పదుల వయసుకు చేరుకున్నారు. ఈక్రమంలో హఠాత్తుగా భార్య మృతి చెందింది. భార్య జ్ఞాపకాలతో అమెరికాలో ఉండలేక ఆమె మృతిచెందిన మూడేళ్లకు ఇండియాకు వచ్చేశారు. ఇక్కడకు వచ్చిందే తడవుగా తన భార్య చదివిన మెడికల్ కళాశాలకు, జీజీహెచ్‌కు ఏదొకటి చేయాలని తలంచారు. సుమారు మూడు నెలలుకు పైగా గుంటూరు జీజీహెచ్‌లో పలు సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఆయనే గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం కాట్రపాడుకు చెందిన రాజా కర్ణం.

భార్యపై ప్రేమతో....

రాజాకర్ణం భార్య డాక్టర్ నిర్మల వై.కర్ణం అమెరికాలో మానసిక వైద్య నిపుణురాలిగా విశేషమైన సేవలందిస్తూ మూడేళ్ల క్రితం మృతిచెందారు. భార్య మరణంతో మూడు నెలల క్రితం రాజా కర్ణం గుంటూరు జిల్లాకు వచ్చారు. తన భార్య చదువుకున్న గుంటూరు వైద్య కళాశాలలో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్స్ ఆరు ఏర్పాటు చేయించారు. అనంతరం గుంటూరు జీజీహెచ్‌లో మరో ఆరు ఆర్వో వాటర్ కూలింగ్ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేసి రోగులకు మంచినీరు, సురక్షిత చల్లటి నీరు తాగేందుకు అవకాశం కల్పించారు. సుమారు రూ.80లక్షలతో వైద్య కళాశాల, ఆస్పత్రిలో ఆర్వో ప్లాంట్స్‌ను నిర్మించారు. తదుపరి శుశ్రుత విగ్రహాన్ని జీజీహెచ్ ఓపీ విభాగం వద్ద ఏర్పాటు చేయించారు. ఇటీవల యాంపీ థియేటర్ నిర్మాణం ఆస్పత్రిలో చేపట్టారు. తన భార్య పేరుతో ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణం చేపట్టిన రాజాకర్ణంను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. డాక్టర్ పాదిల ప్రసాద్ మిలీనియం బ్లాక్‌కు రూ.50లక్షలు, మాతా, శిశు సంరక్షణ వైద్య విభాగానికి(ఎంసిహెచ్) రూ.కోటి విరాళం ఇచ్చారు. జీజీహెచ్‌కు అనుబంధంగా బొంగరాల బీడులో ప్రభుత్వం కేటాయించిన ఆరు ఎకరాల స్థలంలో సుమారు రూ.15 కోట్లతో తన భార్య పేరుమీదుగా సైకియాట్రీ బ్లాక్ నిర్మాణం చేసేందుకు ముందుకొచ్చారు. చనిపోయిన భార్య పేరు మీదుగా 70 పదుల వయస్సు దాటిన రాజా కర్ణం మూడు నెలలుగా జీజీహెచ్‌లో చేస్తున్న సేవా కార్యక్రమాలు చూసి ఎంతో మంది ఆయన్ను అభినందిస్తున్నారు.

ముగిసిన ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర మహాసభలు

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో జరుగుతున్న రాష్ట్ర ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర మహాసభలలో భాగంగా అరండల్ పేట వైన్ డీలర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన ప్రతినిధుల సభ మంగళవారం విజయవంతంగా జరిగింది. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పాండా, రైల్వే కార్మిక నాయకుడు వీరయ్య, చేనేత కార్మిక నాయకుడు వెంకట్రావు సభకు అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి జె.కిషోర్‌బాబు, రాష్ట్ర కోశాధికారి డీవీఎన్ స్వామి, రాష్ట్ర నాయకులు కామ్రేడ్ ఎంఎస్ శాంతి, అప్పారావు స్టీరింగ్ కమిటీగా వ్యవహరించారు. సభలో సంస్థ జాతీయ కార్యదర్శి పీకే షాహి మాట్లాడుతూ వేతనాల పెంపు కోసం, శ్రమ దోపిడీని అంతం, కార్మిక వర్గంలో రాజకీయ చైతన్యాన్ని కల్పించడానికి ఏఐఎఫ్‌టీయూ (న్యూ(కృషి చేస్తుందన్నారు. తెలియజేశారు. స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షురాలు సి.విజయ, పీడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, జన సాహితి రాష్ట్ర అధ్యక్షుడు దివి కుమార్ తదితరులు సభలో మాట్లాడారు. అనంతరం సంస్థ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌బాబు ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికను చర్చించిన అనంతరం మహాసభ ఆమోదించింది. గణేష్ పాండా అధ్యక్షుడిగా, కిషోర్ బాబు కార్యదర్శిగా, డీవీఎన్ స్వామి కోశాధికారిగా వివిధ జిల్లాల నుంచి మరో 9 మంది కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీని మహాసభ ఎన్నుకుంది. సభలో వివిధ రంగాలు, వివిధ ప్రాంతాల కార్మిక ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ వాచర్లను క్రమబద్ధీకరించాలి

మంగళగిరి టౌన్: ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న ప్లాంటేషన్ వాచర్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని వాచర్ల సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. మంగళగిరి ఆటోనగర్‌లోని అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ అటవీ సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి. శ్రీధర్‌కు వాచర్ల సంఘాలు వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు అంకయ్య మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2016లో యూనియన్లతో కూడిన ఒప్పందం మేరకు 7 సంవత్సరాలు సేవ పూర్తిచేసిన వాచర్లను 2019 వరకు క్రమబద్ధీకరించినప్పటికీ అనంతరం ఈ ప్రక్రియ నిలిచిపోయిందని వెల్లడించారు. ప్రస్తుతం క్రమబద్ధీకరించిన వాచర్లు నెలకు రూ. 27546/–లు వేతనం పొందుతున్నప్పటికీ తాత్కాలిక వాచర్లకు మాత్రం రోజుకు కేవలం రూ. 597/–లు మాత్రమే అందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఎలాంటి తేడా లేకున్నప్పటికీ వేతనాల్లో ఉన్న అసమానతలు తొలగించి సమాన ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ సిపిఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి యామల మధు, తదితరులు ఉన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో జాన్‌సైదాకు సిల్వర్ మెడల్

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు జెడ్పీ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి పి.జాన్‌సైదా తాంగ్‌తా మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించినట్లు పాఠశాల హెచ్ఎం ఎల్.సాంబయ్య తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థి జాన్‌సైదాను అభినందించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6,7 తేదీల్లో అనకాపల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తాంగ్‌తా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో జాన్‌సైదా సిల్వర్ మెడల్ సాధించాడన్నారు. విద్యార్థి, పీడీ సుజాతను ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లాలో విజిబుల్ పోలీసింగ్ బలోపేతం

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: జిల్లాలో క్షేత్రస్థాయిలో విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణకై విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ప్రజా భద్రతను పెంపొందించేందుకు, నేరాలను ముందస్తుగా అరికట్టేందుకు ప్రతి రోజు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రధాన కూడళ్లల్లో నిఘా నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రధాన కూడళ్లు, వాణిజ్య కేంద్రాలు, ఆసుపత్రులు, బ్యాంక్‌లు, పాఠశాలలు, కళాశాలలు, జన సంచారంతో రద్దీగా ఉండే ప్రాంతాల్లో గస్తీ కొనసాగుతుందని చెప్పారు. జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలో అనుమానిత వ్యక్తులను గుర్తించడం, చోరీలు, అక్రమ కార్యకలాపాలు జరుగకుండా నిరంతరం తనిఖీలు చేస్తున్నామని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణకై జిల్లాలోని ప్రధాన రహదారులు, కూడళ్లల్లో పోలీస్ బృందాలు విధుల్లో ఉంటున్నాయని, ప్రమాదాలు వాటిల్లకుండా పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని రౌడీషీటర్లు, గంజాయి కేసుల నిందితులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉందన్నారు.

రూ.12.28 లక్షల బయో ఉత్పత్తులు స్వాధీనం



నరసరావుపేట రూరల్: తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న రూ.12,28,740 విలువైన బయో ఉత్పత్తులు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 7వ తేదీన విజిలెన్స్ అధికారులు పట్టణంలోని పార్సిల్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న వివిధ కంపెనీల బయో ఉత్పత్తులను నిలుపుదల చేశారు. వ్యాపారులు అందజేసిన బిల్లులు, అనుమతి పత్రాలను పరిశీలించిన అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండా తెలంగాణ నుంచి బయో ఉత్పత్తులు రవాణా చేస్తున్నట్టు నిర్ధారించారు. ఈ మేరకు రూ.12లక్షల విలువైన 188.8లీటర్ల ఆరు రకాల బయో ఉత్పత్తులను వ్యవసాయ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో విజిలెన్స్ ఏవో సీహెచ్ ఆదినారాయణ, సీఐ కె.చంద్రశేఖర్, నరసరావుపేట ఏవో ఐ.శాంతి పాల్గొన్నారు.

సీతానగరంలో రోడ్డుపై మృతదేహం

- కాలువలోనుంచి బయటకు తీసి వదిలేసి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు
- అనుమానాలు వ్యక్తం చేస్తున్న స్థానికులు

తాడేపల్లి రూరల్: సీతానగరం బకింగ్‌హామ్ కెనాల్ రైల్వే బ్రిడ్జి సమీపంలో రోడ్డు పక్కనే మృతదేహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం వదిలి వెళ్లిపోయారు. సేకరించిన వివరాల ప్రకారం.. ఉండవల్లి సెంటర్ నుంచి ఎన్‌టీఆర్ కరకట్టకు వెళ్లే మార్గంలో రైల్వే బ్రిడ్జి వద్ద గోడపక్కనే ఒక మృతదేహం ఉంది. దీంతో ఆ మృతదేహాన్ని నీటిలోనుంచి తీసి బయట పెట్టినట్లు స్థానికులు గుర్తించారు. మృతుని శరీరంపై కేవలం అండర్‌వేర్ మాత్రమే ఉంది. బకింగ్‌హామ్ కెనాల్‌లో మృతదేహం కొట్టుకుని వస్తే ఆ మృతదేహాన్ని ఎవరైనా తీసి అక్కడ వదిలి వెళ్లారా? లేదా ఏదైనా ఘర్షణ జరిగి నీటిలో ముంచి చంపి అక్కడ వదిలి వెళ్లారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నీటిలో కొట్టుకు వచ్చిన మృతదేహాలను సహజంగా ఎవరూ బయటకు తీయరు. అలాంటిది ఈ మృతదేహాన్ని ఎక్కడ నుంచి అయినా తీసుకువచ్చి ఇక్కడ పెట్టి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి శరీరంపై దుస్తులు తొలగించి ఈతకు వచ్చినట్లు చిత్రీకరించి ఇలాంటి ఘటనకు పాల్పడ్డారా అనే అనుమానం వ్యక్తమవుతోంది. ఈ మధ్యకాలంలో సీతానగరం పుష్కర ఘాట్‌లో సీతానగరం, ప్రకాశం బ్యారేజ్ ప్రాంతాల్లో గంజాయి మత్తులో యువకులు తిరుగుతూ పలువుర్ని బెదిరించి డబ్బులు లాక్కు వెళ్లారు. ఇలాంటి వారు ఎవరైనా అతన్ని చంపి దుస్తులు లేకుండా నీటిలో ముంచి చంపి బయట పెట్టి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లి పోలీసులు పోస్ట్‌మార్టం అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని.. ఎవరైనా ఈ మృతుడిని గుర్తిస్తే 08645272186 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తెనాలిలో స్క్రబ్ టైఫస్ తొలి కేసు

తెనాలి అర్బన్: తెనాలిలో స్క్రబ్ టైఫస్ కేసు నమోదు కావటం కలకలం రేపింది. రూరల్ మండలం అంగలకుదురు గ్రామానికి చెందిన యాభై ఏళ్ల మహిళకు చర్మంపై మచ్చ కనిపించటం, జ్వరంగా ఉండటతో వైద్యం కోసమని మంగళవారం మధ్యాహ్నం తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు స్క్రబ్ టైఫస్ కేసుగా అనుమానించారు. సంబంధిత పరీక్ష కిట్లు ఆసుపత్రిలో లేకపోవటంతో బయటనుంచి కొనుగోలు చేసి తెప్పించారు. ఆ కిట్‌తో పరీక్ష చేయగా నిర్ధారణ అయింది. దీంతో ఆమెను ఆసుపత్రిలోనే ఉంచి చికిత్స చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

■ మాచర్ల, శ్రీశైలం రోడ్, అఖిల్ టవర్స్ 3వ ఫ్లోర్‌లో 1250 చ.అ.ల డబుల్‌బెడ్ రూమ్ ఫ్లాట్ SBI వేలం ద్వారా అమ్మకం రిజర్వు ధర: 25 లక్షలు. 99663 93649

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును ✆ 8790741166

WANTED

■ గుంటూరులో గల కాలేజి నందు పని చేయుటకు 35 సంవత్సరాల పైబడిన లేడి వార్డెన్ మరియు వంట చేయుటకు హెల్పర్లు కావలెను. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్. 81224 61164

■ యాడ్ ఏజన్సీ నందు పనిచేయుటకు అకౌంటెంట్ Min 2 సం॥ అనుభవం కలిగిన (స్త్రీ) (M.S. Office, Excel & Word) కావలెను. (Salary 25,000) గ్రాఫిక్ డిజైనర్ Photoshop, Coreldraw లో 2 సం॥ అనుభవం కలిగిన వారు కావలెను. శాలరీ 30,000. లేజర్ యాడ్స్, అరండల్‌పేట, గుంటూరు. Cell: 77028 34555

■ శ్రీవసుధ డెవలపర్స్ గుంటూరులో పని చేయుటకు మేనేజర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్, డ్రైవర్స్, అకౌంటెంట్ & సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: 77319 51999

■ APSRTC ఆవరణలో పనిచేయుటకు యువతి యువకులు కావలెను. అర్హత: 10th-డిగ్రీ, ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ 9705263264

■ మా ఆఫీసు నందు పనిచేయుటకు టాలీ అకౌంటెంట్స్, సివిల్ డిప్లొమా ఇంజనీర్స్, కారు డ్రైవర్స్, ఆఫీస్‌బాయ్స్, ఆఫీస్‌బాయ్స్ GNTలో నివసించే వారు మాత్రమే. 9985268300, 9394107300

■ GNT నారాకోడూరులో ప్రముఖ కంపెనీ నందు సెక్యూరిటీ గార్డ్స్, ఆఫీసర్స్ కావలెను డ్యూ. 8గం, జీ: 10-14k. Q10th, వ20-50✆8520977729, 59

■ 30 to 65 yrs బ్యాంకు అనుబంధ సంస్థలో జీతం + Inc 35 వేలు. టీం మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్. Q: 10th -డిగ్రీ, రిటైర్డ్, బిజినెస్, ఇన్సూరెన్స్ ఏజెంట్స్, మ్యూచువల్ ఫండ్స్, మార్కెటింగ్ నో టార్గెట్. ✆ 90524 70111

■ ప్రముఖ బ్యాంక్ నందు పని చేయుటకు డిగ్రీ అర్హత కల CSO క్లర్క్, క్యాషియర్, బ్యాంక్ ఆఫీసర్ అర్జెంటుగా కావలెను (M/F): 9032590579

■ E-Kart నందు అర్జెంటుగా స్త్రీ/పు కావలెను. Qly: Inter, Any డిగ్రీ, జీతం: 15,000/- Online are Available. Cont: 7731816950.

■ సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ జీ: 15000 కోదాడ దగ్గర మేళ్ళచెరువులో కావలెను. 8 గం॥ డ్యూటీ, తక్కువ రేటుకు భోజనం. ఫ్రీ ఫ్యామిలీ రూం. ✆ 90143 51804, 86884 17132

■ ప్రభుత్వ సంస్థలలో కాంట్రాక్ట్ & ఔట్‌సోర్సింగ్ జాబ్స్ అటెండర్స్, క్లర్క్, డేటా ఎంట్రీ, ఆఫీసు అసిస్టెంట్స్. Cell : 9703602687

■ యూనిటీ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంటపనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫోన్: 8121631212, 9640016901

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ఎడిషన్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు [illegible]

సంతకాల సేకరణకు విశేష స్పందన

17న అధినేతతో కలిసి గవర్నర్‌కు ప్రతుల అందజేత

సేకరించిన సంతకాల ప్రతులను అందుకుంటున్న మురుగుడు, వేమారెడ్డి

కొర్నపాడులో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలని చంద్రబాబు సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. ప్రైవేటీకరణ వ్యతిరేకంగా పలు కళాశాలల్లో సేకరించిన సంతకాల ప్రతులను మంగళవారం ఆత్మకూరు నియోజకవర్గ కార్యాలయంలో మురుగుడు, వేమారెడ్డికి పార్టీ నాయకులు అందజేశారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సంతకాల సేకరణకు విశేష స్పందన వచ్చిందని నాయకులు తెలిపారు. నాయకులు ప్రదీప్, సయ్యద్ గౌస్ మొహిద్దీన్, విక్టర్ ఇమ్మానియేల్, మేకతోటి హర్ష, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు: కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయిలు దండుకునేందుకే ప్రైవేటీకరణ చేస్తోందని వైఎస్సార్ సీపీ వలంటీర్ల విభాగ జాయింట్ సెక్రెటరీ షేక్ నాసర్‌వలి అబ్బాస్ తెలిపారు. ప్రైవేటీకరణను నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం కొర్రపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం, విద్య అందుబాటులో లేకుండా పోతోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మీ నారాయణ, మండల పార్టీ ఉపాధ్యక్షులు విజయ్ చంద్రరావు, బూత్ కన్వీనర్ తాడికొండ కోటేశ్వరావు, సాంబయ్య, జిల్లా ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోపి దేశి, శ్రీనివాస్, షేక్ పర్వీన్, తాళ్లూరు భద్రయ్య, ఆదిశవరపు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతమైందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడారు. నియోజకవర్గవ్యాప్తంగా సుమారు 70 వేలకు పైగా సంతకాలు సేకరించినట్లు తెలియజేశారు. సేకరించిన సంతకాలను కంప్యూటరీకరణ చేశామని అన్నారు. సేకరించిన సంతకాల ప్రతులను బుధవారం గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయంలో అందజేయనున్నామని పేర్కొన్నారు. 17వ తేదీన సంతకాల ప్రతులను గవర్నర్‌కు అందజేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు నాలి వెంకట కృష్ణ, అమరా నాగయ్య, బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, తాడిబోయిన శివగోపయ్య, షేక్ మహబూ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

తాడేపల్లి రూరల్: వైఎస్సార్ సెంటర్(కొత్తూరు) ప్యారీ కంపెనీలో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. సేకరించిన వివరాల ప్రకారం.. కట్టి మైనర్‌బాబు నివాసం ఉంటున్న ఇంట్లో విద్యుత్ మీటర్ వద్ద ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో ఇల్లు మొత్తం మంటలు వ్యాపించి నిమిషాల వ్యవధిలో సామానుతో సహా పూర్తిగా ఇల్లు దగ్ధమైంది. మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఫిరంగిపురం: ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక జోన్ కన్వీనర్ పి.నాగినారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా సయ్యద్ జహంగీర్, ప్రధాన కార్యదర్శిగా టి.బాస్కర్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైనవారు షేక్.మహబూబ్ సుభానీ, రవికాంతలను కలిసి ఉపాధ్యాయ సంక్షేమం కోసం పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు షేక్.జిలీరుద్, గౌరవ సలహాదారులు జి.కమల్‌ప్రసాద్, జిల్లా కార్యదర్శి సీహెచ్. వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల సందేహాల నివృత్తి

తాడేపల్లి రూరల్: పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం నాసా శాస్త్రవేత్త హెన్రీ థ్రూప్‌తో ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు. జాతీయ ఏరోనాటిక్స్, స్పేస్ అడ్మినిస్ట్రేషన్(నాసా) సీనియర్ భౌతిక శాస్త్రవేత్త డాక్టర్ హెన్రీ థ్రూప్ వర్చువల్‌గా విద్యార్థులతో మాట్లాడారు.. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసినట్లు పాఠశాల ఉపాధ్యాయులు పి.హరికృష్ణ తెలిపారు.

పొగతో ప్రయాణికుల అవస్థలు!

దుగ్గిరాల: పంట పొలాల్లో మిగిలిన వరి దుబ్బులకు రైతులు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ వ్యాపిస్తోంది పలువురు ప్రయాణికులు వాపోయారు. దుగ్గిరాల మండలం దేవరపల్లి అగ్రహారం గ్రామంలోని పంట పొలాల్లో రైతులు యంత్రాల ద్వారా రైతులు కోతకోశారు. మిగిలిన వరి దుబ్బులకు రైతులు నిప్పు పెట్టగా దట్టమైన పొగ వ్యాపించి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంబంధిత అధికారులు దీనిపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా అవగాహన కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నల్లతామర నివారణకు చర్యలు

ఫిరంగిపురం: మండలంలోని 113.తాళ్ళూరు, యర్రగుంట్లపాడు, శిరంగిపాలెం గ్రామాల్లో ఉద్యానవనశాఖ, లాంపాం ఆధ్వర్యంలో మంగళవారం వైరస్ తెగుళ్లు, నల్లతామర నివారణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసర్చ్ సి.వెంకటరమణ మాట్లాడుతూ.. పొలం గట్లపై కలుపు మొక్కలు నిర్మూలించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి బి.రమేష్‌బాబు, ఏఈవో దర్శనల, వీహెచ్ఏ షేక్. సుభాని పాల్గొన్నారు.

14న మరకత లింగానికి అన్నాభిషేకం

ఫిరంగిపురం: మండలంలోని కోటిఒక్కలింగాల క్షేత్రంలోని మరకత లింగానికి ఆదివారం అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. లోక రక్షణార్థం, గ్రామాభివృద్ధి కోసం పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు విశేష పూజలు, అనంతరం అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే భక్తులు బుధవారం తమ పేర్లు ఆలయం వద్ద నమోదు చేయించుకోవాలన్నారు.

ఫిరంగిపురం మండల వైస్ ఎంపీపీగా అనురాధ

బీఫాం అందజేస్తున్న వనమా బాల వజ్రబాబు

తాడికొండ: ఫిరంగిపురం మండల వైస్ ఎంపీపీగా వేములూరిపాడు ఎంపీటీసీ సభ్యురాలు అమర్ల పూడి అనురాధను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు వెల్లడించారు. మంగళవారం గుంటూరు మల్లికార్జునపేటలోని తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో ఎంపీటీసీలు, ముఖ్య నాయకులతో సమావేశమైన ఆయన ఈనెల 11న వైస్ ఎంపీపీ ఎన్నికకు నామినేషన్లు వేస్తున్న నేపథ్యంలో చర్చించారు. గతంలో వైఎస్సార్ సీపీకి చెందిన గొల్లపాలెం ఎంపీటీసీ గుమ్మడి చంద్రం వైస్ ఎంపీపీగా ఉండగా ఆయన ఇటీవల మరణించిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 11న వైస్ ఎంపీపీ ఎన్నిక జరుగనుంది. ఫిరంగిపురం మండలంలోని మొత్తం 18 మంది ఎంపీటీసీలకు గాను 15 ఎంపీటీసీలను వైఎస్సార్ సీపీ విజయం సాధించింది. దీంతో పార్టీ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేసి దిశా నిర్దేశం చేయడంతో ఇక ఎన్నిక లాంఛనమే కానుంది. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మార్పుల శివారెడ్డి, వివిధ విభాగాల నాయకులు సయ్యద్ హబీబుల్లా, షేక్ పఠిమ్, దాసరి సురేష్, ఇ.అపిరెడ్డి, చేపూరి రామ్మోహనరెడ్డి, పెరికల చిన్నా, మేడా బాబు, కె.ఆనంద్, మోదాల రాజు, ఎస్.నాగరాజు, ఐ.చెన్నారెడ్డి, షేక్ ఖాసిం, ఎం.పుల్లారావు, షేక్ గాంధీ బుడే, ఉప్పాల, రవి, షేక్ సుభాని, ఎ.రత్నం తదితరులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్ జ్వరంపై అవగాహన

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని డోలాస్ నగర్ ప్రాంతంలో తాడేపల్లి మలేరియా అధికారులు మంగళవారం స్క్రబ్ టైఫస్ జ్వరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాడేపల్లి మలేరియా అధికారి సుధీర్ మాట్లాడుతూ.. ఎక్కువ రోజుల పాటు జ్వరం ఉండటం, కండరాల నొప్పులు, మెడ పైభాగాల, శరీరంపై దద్దుర్లు, పొడిదగ్గు, కొన్నిసార్లు నిమోనియా వంటివి ఈ వ్యాధి లక్షణాలని వివరించారు. వాంతులు, కడుపు నొప్పి, వికారంతో మొదలైన వ్యాధి.. ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, మెదడుపై ప్రభావం చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా పొలాలు, కొండ ప్రాంతాల్లో పనిచేవారు ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ఉందని అన్నారు. జిల్లా వైద్యశాలల్లో ప్రత్యేక సదుపాయాలతో ఈ వ్యాధికి ఉచితంగా చికిత్స అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కొల్లి శంకరరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'పై రైతులకు అవగాహన

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం పరిధి పెదవడ్లపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గుంటూరు జిల్లా వ్యవసాయాధికారి ఐ.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ.. నేల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పంట అవశేషాలను కాల్చడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కాలినప్పుడు వెలువడే కార్బన్-డై-ఆక్సైడ్, మిథేన్, నైట్రస్ ఆక్సైడ్ వాయువుల వల్ల వేడి పెరిగి భూతాపం పెరుగుతుందని పేర్కొన్నారు. నేలలో కార్బన్ శాతం తగ్గిపోవడమే కాకుండా నత్రజని, భాస్వరం, గంధకం, పొటాషియం తదితర పోషకాలను నేల నష్టపోతుందన్నారు. పంట అవశేషాలు నేలలో కలియదున్నడం వల్ల విలువైన సేంద్రియ పదార్థం నేలకు అందుతుందని వివరించారు. అనంతరం రైతులకు పంట అవశేషాల యాజమాన్యంపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, మంగళగిరి మండల వ్యవసాయ అధికారి శైలజా రాణి, సిబ్బంది దీప్తి, వెంకయ్య, పవన్‌కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అమరావతిలో ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన

తాడికొండ: రాజధాని ప్రాంతం రాయపూడిలోని ఏపీ సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్‌డీఏ) ప్రధాన కార్యాలయంలో ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ జాయింట్ టెక్నికల్ మిషన్‌లో భాగంగా ప్రతినిధుల 5వ రోజు పర్యటనలో పలు అంశాలపై సమావేశాలు నిర్వహించారు. సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఉదయం అడిషనల్ కమిషనర్ ఎ.భార్గవతేజ ఏపీ సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులతో పలు అంశాలపై సమావేశాలు నిర్వహించారు. రైతుల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మెకానిజం అమలు చేస్తున్న విధానం సీఆర్‌డీఏ అధికారులు వివరించారు. జీఆర్ఎం కార్యకలాపాలు, అమరావతిలో అమలవుతున్న సామాజిక అభివృద్ధి కార్యకలాపాలపై బృందంతో సమావేశం పలు సూచనలు చేశారు. అధికారులతో పాటు ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ, కాంట్రాక్టర్ ప్రతినిధులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైలు దిగుతూ ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి



సింగయ్య మృతదేహం

సత్తెనపల్లి: రైలు దిగే సమయంలో ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఫిరంగిపురంకు చెందిన యద్దనపూడి సింగయ్య (45) రెంటపల్లి తల సెయింట్ జోసెఫ్ పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రతిరోజు శబరి ఎక్స్‌ప్రెస్‌కు వస్తుంటాడు. శబరి ఎక్స్‌ప్రెస్ సత్తెనపల్లి రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం-1 మీద ఆగుతుంది. కానీ మంగళవారం ప్లాట్‌ఫామ్-2 మీద ఆగింది. అది గమనించని సింగయ్య ప్లాట్‌ఫారం-1గా భావించి రోజూ మాదిరిగానే యధావిధిగా ఫ్లాట్ చూసు కుంటూ దక్షిణం వైపు దిగబోయే సమయంలో పిల్లర్ కొట్టుకుని కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సింగయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికల పాఠశాలలో చేతిపంపు చోరీ

దుగ్గిరాల: వారం రోజుల వ్యవధిలో దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాలలో వరుసగా రెండు చోరీలు జరిగాయని పాఠశాల హెచ్ఎం ఎస్.శోభాదేవి తెలిపారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రహరీ గోడ దూకి పాఠశాల ఆవరణలో ఉన్న చేతి పంపును దొంగిలించడానికి యత్నించారని శోభాదేవి తెలిపారు. అది రాకపోయే సరికి హ్యాండిల్‌ను విరగ్గొట్టి దొంగిలించారన్నారు. మంగళవారం పాఠశాలలో సీసీ కెమెరాలు పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించామన్నారు. అనంతరం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆమె పేర్కొన్నారు.

90 ఏళ్లలోనూ ఇబ్బందులు..!

తాడికొండ: 90 ఏళ్ల వృద్ధురాలు అనే కనికరం లేకుండా అధికారులు సర్టిఫికెట్ కోసం ఆమెను ఫైర్ కార్యాలయానికి తీసుకురావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని కారుణ్య మరణం కోరిన నిర్మలా శేషగిరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఆమె పూరిల్లు పూర్తిగా దగ్ధం కావడంతో తానే చిన్నపాటి రేకుల షెడ్డు నిర్మించాను.. మతిస్థిమితం లేని మనుమరాలితో ఆమె ఇబ్బందులు పడుతుందని ఇటీవల సమాచారం అన్నారని వాపోయారు. కావాలంటే వాహనం ఏర్పాటు చేస్తానని.. అధికారులు వచ్చి ఇంటి వద్ద సర్టిఫికెట్ ఇచ్చే వెసులుబాటు కల్పించాలని ఆమె అధికారులను కలిపించాలని కోరారు.

మాదకద్రవ్యాల అనర్థాలను పాఠ్యాంశాల్లో చేర్చాలి

తాడికొండ: సైబర్ క్రైమ్, డ్రగ్ ఎడిక్షన్, మొబైల్ వాడకంతో కలిగే అనర్థాలను విద్యార్థులకు తెలిసేలా పాఠ్యాంశాల్లో చేర్చాలని గుడ్ షెపర్డ్ సిస్టర్స్ సంస్థ సభ్యులు అన్నారు. గుడ్ షెపర్డ్ సిస్టర్స్ సంస్థ, చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం తుళ్లూరు బాలయేసు కోరి బాలికల (గ్రూప్‌లో ఆయా అంశాలపై వర్క్‌షాప్ ద్వారా అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు చిన్నారులకు తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా తుళ్లూరు మండల విద్యాశాఖ అధికారులు అజయ్‌కుమార్, రాజశేఖర్‌లకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గుడ్ షెపర్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

RACPC మంగళగిరి బ్రాంచ్, 1వ అంతస్తు, CA-5, CPC ఏరియా, హోండా షోరూమ్ వెనుక, ఆటోనగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503.

రూల్-8(1) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

[illegible]

ఋణగ్రహీతలు, బకాయి, డిమాండ్ నోటీసు & స్వాధీనత నోటీసు తేదీలు మరియు ఆస్తుల వివరాలు

1. ఋణగ్రహీత పేరు & చిరునామా: [illegible] హోమ్ లోన్ అకౌంట్ నెం. 40609111996. చెల్లించవలసిన మొత్తం బకాయి: తేది.18.07.2025 నాటికి రూ. 4,96,777/- [illegible] డిమాండ్ నోటీసు తేది: 27.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. స్థిరాస్తి వివరములు: [illegible]

2. ఋణగ్రహీత పేరు & చిరునామా: [illegible] హోమ్ లోన్ అకౌంట్ నెం. 40636966279. చెల్లించవలసిన మొత్తం బకాయి: తేది.18.07.2025 నాటికి రూ. 4,28,608/- [illegible] డిమాండ్ నోటీసు తేది: 21.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. స్థిరాస్తి వివరములు: [illegible]

3. [illegible] డిమాండ్ నోటీసు తేది: 21.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. [illegible]

4. [illegible] డిమాండ్ నోటీసు తేది: 21.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. [illegible]

5. [illegible] డిమాండ్ నోటీసు తేది: 21.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. [illegible]

6. [illegible] డిమాండ్ నోటీసు తేది: 21.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. [illegible]

7. [illegible] డిమాండ్ నోటీసు తేది: 22.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. [illegible]

8. [illegible] డిమాండ్ నోటీసు తేది: 22.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. [illegible]

9. [illegible] డిమాండ్ నోటీసు తేది: 22.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. [illegible]

10. [illegible] డిమాండ్ నోటీసు తేది: 22.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. [illegible]

11. [illegible] డిమాండ్ నోటీసు తేది: 22.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. [illegible]

12. [illegible] డిమాండ్ నోటీసు తేది: 22.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. [illegible]

13. [illegible] డిమాండ్ నోటీసు తేది: 22.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. [illegible]

14. [illegible] డిమాండ్ నోటీసు తేది: 22.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. [illegible]

15. [illegible] డిమాండ్ నోటీసు తేది: 22.07.2025. స్వాధీనత నోటీసు తేది: 04.12.2025. [illegible]

తేది: 04.12.2025, ప్రదేశం: మంగళగిరి — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

క్లుప్తంగా...

11, 12 తేదీల్లో చివరి విడత స్పాట్ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి, గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏపీ ఎంసెట్–2025 ర్యాంకుల ద్వారా బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) ప్రవేశాలకు చివరి విడత స్పాట్ కౌన్సెలింగ్ ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంపీ రమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో బైపీసీ విభాగంలోని కన్వీనర్ కోటాలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం నిర్వహించే ఈ స్పాట్ కౌన్సెలింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు https://angrau.ac.in/ వెబ్‌సైట్‌ను వీక్షించాలని సూచించారు.

అమెరికాలో దాచేపల్లి విద్యార్థి దుర్మరణం

దాచేపల్లి: అమెరికాలో దాచేపల్లి విద్యార్థి దుర్మరణం చెందారు. ఈ విషయం మంగళవారం కుటుంబ సభ్యులు వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా దాచేపల్లిలోని అదానీ సిమెంట్స్ ఫౌండేషన్‌లో పినుమల్ల సుధాకర్ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు సంకీర్త్ (24) మెకానికల్ ఇంజినీర్ డిజైనర్‌గా ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లాడు. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈనెల 6న ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈ విషయాన్ని అక్కడ ఉన్న సంకీర్త్ సహచరులు, పోలీసులు సుధాకర్‌కు సమాచారం అందించారు. సుధాకర్ కుమార్తె కీర్తన కూడా అమెరికాలోనే సంకీర్త్‌కి సమీపంలో ఉన్న కళాశాలలో చదువుకుంటోంది. సంకీర్త్ మరణవార్త తెలిసిన వెంటనే ఆమె తన అన్నను చూసేందుకు వెళ్లింది. అమెరికా నుంచి సంకీర్త్ మృతదేహాన్ని హైదరాబాద్‌కి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్నారు. ఈనెల 11న సంకీర్త్ మృతదేహం హైదరాబాద్ వస్తుందని వారు తెలిపారు. హైదరాబాద్‌లోనే సంకీర్త్ అంత్యక్రియలు చేసేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

13 జిల్లాల డీఈవోలకు స్థానచలనం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 13 జిల్లా విద్యాశాఖాధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో కొందరు జిల్లా పాఠశాల విద్యాధికారులను ప్రిన్సిపాల్స్‌గా నియమించగా, మరి కొందరికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం..

సమర సంతకం

చంద్రబాబు సర్కారు తీరుపై కోట్ల మంది కన్నెర్ర

రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణకు భారీ స్పందన

ఈ ఫోటోలో కనిపిస్తున్న గిరిజన ప్రాంతం అల్లూరి జిల్లా అరకులోయ మండలం దుంగ్గియపుట్టులోని బస్కీ పంచాయతీలో ఉంది. అరకులోయ మండలం నుంచి ఇక్కడకు 24 కి.మీ. కాలినడకన మాత్రమే వెళ్లే వీలుంది. మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ అలాంటి మారుమూల గ్రామంలో గ్రామస్తులు స్వచ్ఛందంగా సంతకాలు చేశారు.

అనంతపురంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేస్తున్న కళాశాల విద్యార్థులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ప్రభుత్వమే దళారీగా మారిపోయి వైద్య సేవలు, వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం.. విలువైన సంపదను ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెడుతుండటంపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉద్యోగులు, మేధావులు, యువత ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. అన్ని సదుపాయాలు, అనుమతులతో సిద్ధంగా ఉన్న ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీలను సంతలో సరుకులు, పప్పు బెల్లాల మాదిరిగా చంద్రబాబు సర్కారు తెగనమ్మడంపై ప్రజా ఉద్యమం ఎగసిపడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా మారుమూల గిరిజన గూడేల నుంచి నియోజకవర్గ కేంద్రాల దాకా అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలు బాబు ప్రభుత్వ కక్షపూరిత విధానాలను తీవ్రంగా నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు స్వచ్ఛందంగా కోటి సంతకాల సేకరణలో భారీగా పాల్గొంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాలు, పంచాయతీల్లో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. నవంబరు 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ర్యాలీల్లో విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తూ కదం తొక్కారు. ఇది తమ బిడ్డల ఉజ్వల భవిష్యత్తు, ప్రభుత్వ వైద్య రంగాన్ని పరిరక్షించుకునేందుకు తలపెట్టిన ప్రజా ఉద్యమంగా పేర్కొంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నేతల వెంట స్వచ్ఛందంగా తరలి వచ్చి పెద్ద ఎత్తున సంతకాల సేకరణలో పాల్గొంటున్నారు. అక్టోబరు 10న ప్రారంభమైన కోటి సంతకాల సేకరణ గత రెండు నెలలుగా రచ్చబండ కార్యక్రమం ద్వారా ఉధృతంగా సాగింది. నియోజకవర్గాల వారీగా సేకరించిన సంతకాలను డిసెంబర్ 10వ తేదీకి జిల్లా కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేశారు. ఈ నెల 13 నాటికి జిల్లా కేంద్రాల నుంచి తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి కోటి సంతకాలను ర్యాలీగా తరలించనున్నారు. అనంతరం 17న కోటి సంతకాలను గవర్నర్‌కు అందించేందుకు పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు.

రగిలిన సీమ..

ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంపై రాయలసీమలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. సీమలో సుమారు 32 లక్షల మేర సంతకాలను సేకరించారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, న్యాయవాదులు.. ఇలా అన్ని వర్గాలు కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. అనంతపురం లాంటి ప్రాంతాల్లో తాము టీడీపీకి ఓటు వేసినప్పటికీ.. కోటి సంతకాల సేకరణలో పాల్గొంటామని, ఇది భవిష్యత్ తరాల కోసం చేస్తున్న మంచి కార్యక్రమమని పేర్కొనడం గమనార్హం. ఇక వర్సిటీల్లో కూడా విద్యార్థులు భారీగా సంతకాల సేకరణలో పాలుపంచుకున్నారు. అనంతపురం జిల్లాలో వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో 8 వేల సంతకాలు చేయించారు. పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్లు, డాక్టర్లు, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు ఇందులో భాగస్వాములు అయ్యారు. తాడిపత్రి నియోజకవర్గంలో టీడీపీ నేతలు దీన్ని అడుగడుగునా అడ్డుకునే యత్నం చేశారు. జేసీ వర్గీయులు దాడులకు తెగబడటంతో వైఎస్సార్‌సీపీ నేతలకు చెందిన రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. అయినప్పటికీ వెరవకుండా సంతకాల కార్యక్రమంలో ప్రజలు భారీగా భాగస్వాములు కావడం బాబు సర్కారు పట్ల వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను చాటి చెబుతోంది.

ఉత్తరాంధ్రలో ఉవ్వెత్తున..

ఉత్తరాంధ్రలో ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన కేజీహెచ్ మినహా పేదలకు ఇతర వైద్య సంస్థలు అందుబాటులో లేని పరిస్థితుల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి అరిలోవలో విమ్స్, శ్రీకాకుళంలో రిమ్స్ ఏర్పాటు చేశారు. విశాఖలోని అరిలోవ ప్రాంతంలో హాస్పిటల్స్ నెలకొల్పే ప్రైవేటు సంస్థలకు భూమి అందుబాటులో ఉంచుతూ హెల్త్ సిటీని ఏర్పాటు చేశారు. అనంతరం మాజీ సీఎం వైఎస్ జగన్ అధికారంలో ఉండగా విజయనగరం, పాడేరులో కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారు. అక్కడ క్లాసులు కూడా ప్రారంభమయ్యాయి. అనకాపల్లి జిల్లాలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయి. పార్వతీపురం జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నాయి. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ అందుబాటులోకి రావడం ద్వారా వెనుకబడిన ఉత్తరాంధ్రలో వైద్య విప్లవం మొదలైందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే చంద్రబాబు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తూ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయటాన్ని నిరసిస్తూ ఉవ్వెత్తున జనాగ్రహం పెల్లుబుకుతోంది. వెనుకబడిన ఉత్తరాంధ్రకు మెడికల్ విద్యతో పాటు వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఉద్దేశించిన మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని ప్రభుత్వం పక్కదారి పట్టించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాల్లో 18.30 లక్షల మేర సంతకాల సేకరణను పూర్తి చేశారు. అల్లూరి, పార్వతీపురం లాంటి ఏజెన్సీ జిల్లాల్లోనూ ఊహకు మించి స్పందన వచ్చింది.

కోస్తాలో కన్నెర్ర..

నెల్లూరు నుంచి గోదావరి వరకు కోస్తా జిల్లాలు కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో కదంతొక్కాయి. సుమారు అరకోటి సంతకాల మేరకు కోస్తా జిల్లాల్లోనే సేకరించారు. మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వ్యక్తులను అప్పగించాలని చంద్రబాబు సర్కారు నిర్ణయించడంతో మన విద్యార్థులకు ఉచితంగా రావాల్సిన వైద్య సీట్లతోపాటు పేదలకు చేరువలో నాణ్యమైన ఉచిత వైద్య సేవలు దూరం కానున్నాయని అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఇదేదో రాజకీయం కోసం చేస్తున్న పోరాటం కాదు. మన పిల్లల భవిష్యత్తు కోసం జరుగుతున్న పోరాటం. దీనికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం. వైద్య కళాశాలలు ప్రైవేట్‌పరమైతే పేద, మధ్యతరగతి ప్రజలకు, మన విద్యార్థులకు తీరని నష్టం..''

– సత్యనారాయణ, రిటైర్డ్ తహశీల్దారు, మునగపాక, అనకాపల్లి జిల్లా

మా పాప హిందుమతి ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఎంబీబీఎస్ చదువుతోందంటే కారణం గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభించడమే. వాటిని ప్రైవేటుకు అప్పగిస్తే పేదలకు వైద్య విద్య, వైద్యం పూర్తిగా దూరమవుతాయి. పేదలు అంతంత డబ్బులు పెట్టి చదువుకునే పరిస్థితి ఉండదు. మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు ఇవ్వడాన్ని అందరూ వ్యతిరేకించాలి..''

– మేరుగు చిన్నారావు, మంగమారిపేట, విశాఖ జిల్లా

కుప్పంలోనూ నిరసనలు..

కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా అప్పగించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లాలోనూ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. చివరకు సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలోనూ ప్రజలు తరలివచ్చి మరీ సంతకాల సేకరణ కార్యక్రమంలో గత రెండు నెలలుగా పాల్గొనడం గమనార్హం. తిరుపతి జిల్లాలో సుమారు 5 లక్షల మేర సంతకాలు సేకరించగా... చిత్తూరు జిల్లాలో 4.73 లక్షల మంది కోటి సంతకాల కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో 108 గ్రామ సచివాలయాలు ఉండగా ఒక్కో సచివాలయం పరిధిలో వెయ్యి మంది చొప్పున సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

జీవో ఏదంటూ టీడీపీ నేతలు నవ్వుల పాలు..!

గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి మాజీ సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వంలోనే ఐదు కొత్త మెడికల్ కాలేజీల్లో తరగతులు కూడా మొదలయ్యాయి. పులివెందుల, పాడేరు కాలేజీలు ఎన్నికల నాటికే ప్రారంభానికి సిద్ధం కాగా మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. అయితే కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌కు అప్పగించాలని చంద్రబాబు సర్కారు నిర్ణయించగానే.. అసలు మెడికల్ కాలేజీలు నిర్మాణమే జరగలేదంటూ టీడీపీ నేతలు పచ్చి అబద్ధాలతో దుష్ప్రచారానికి దిగారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఒక అడుగు ముందుకు వేసి... అసలు మెడికల్ కాలేజీల నిర్మాణానికి జీవో ఎక్కడ ఉంది? అంటూ ప్రశ్నించారు. జీవో ఉంటే తనకు చూపించాలంటూ సవాల్ విసిరారు. దీంతో అక్టోబరు 10వ తేదీన మాజీ సీఎం వైఎస్ జగన్ స్వయంగా అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం భీమబోయినపాలెంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీల భవనాలను సందర్శించి జీవో కాపీని చూపించారు. దీంతో అయ్యన్నపాత్రుడు మిన్నకుండిపోయారు. మరోవైపు పెనుకొండలో మెడికల్ కాలేజీ ఎక్కడ ఉంది? అంటూ మంత్రి సవిత హడావుడి చేసి ఓ వీడియో విడుదల చేశారు. ఈ క్రమంలో మాజీ మంత్రి ఉషశ్రీ పెనుకొండలో దాదాపు నిర్మాణం పూర్తి కావచ్చిన భవంతులను మీడియాకు చూపించి మంత్రి సవిత అబద్ధాలను ఎండగట్టారు. ఇలా నిస్సిగ్గుగా అబద్ధాలాడి టీడీపీ ప్రజా ప్రతినిధులు అబాసుపాలయ్యారు.

సాక్షి
SAKSHI.COM
సాక్షి టీవీ ప్రసారాలను నిలిపివేయడం..
చట్టరీత్యా నేరం...
సాక్షి టీవీ ప్రసారాలు మీ హక్కు..
ప్రసారాలను అడ్డుకోవడం చట్టవిరుద్ధం...
ప్రజల కోసమే మా పోరాటం ప్రజా గొంతుకై నినదిస్తాం
వార్తల వెనుక వాస్తవాలు తెలియాలంటే
సాక్షి టీవీ చూడండి
సాక్షి టీవీ ప్రసారాల కోసం...
మీ స్థానిక కేబుల్ ఆపరేటర్‌ను వెంటనే సంప్రదించండి.
డీటీహెచ్‌లో సాక్షి ప్రసారాల కోసం
1456 2449
airtel 907 SUN 184
ఇంటర్నెట్‌లో సాక్షి ప్రసారాల కోసం
youtube.com/SakshiNews
Jio Fiber airtel xstream
సత్యమేవ జయతే

- కర్ణాటక సీఎం తనయుడు యతీంద్ర తరచూ తన తండ్రి సిద్ధరామయ్యే ఐదేళ్లు సీఎంగా కొనసాగుతారని వ్యాఖ్యలు చేస్తుండటంపై సిద్ధరామయ్య యతీంద్రను మందలించినట్లు తెలిసింది. ఆ విషయం హైకమాండ్ చూసుకుంటుందని, నువ్వు సైలెంట్‌గా ఉండాలంటూ కుమారుడిని సీఎం హెచ్చరించినట్లు సమాచారం. సీఎం మార్పు గురించి ఎవరూ మాట్లాడొద్దని కాంగ్రెస్ ఎమ్మెల్యే బేలూరు గోపాలకృష్ణ పరోక్షంగా యతీంద్ర మీద మండిపడ్డారు.

మరోసారి మెరిసిన ఏటికొప్పాక లక్కబొమ్మ

రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అదుకున్న హస్తకళాకారుడు గొర్స సంతోష్ కుమార్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పురస్కారం అందుకుంటున్న గొర్స సంతోష్ కుమార్

పురస్కారం దక్కించుకున్న బొమ్మలకొలువు కళాఖండం

యలమంచిలి రూరల్/వెంకటగిరి రూరల్: ఖండాంతర ఖ్యాతినార్జించిన ఏటికొప్పాక లక్కబొమ్మలు జాతీయస్థాయిలో మరోసారి గుర్తింపు పొందాయి. హస్తకళాకారుడు గొర్స సంతోష్ కుమార్ తయారుచేసిన బొమ్మల కొలువు కళాఖండం 'లక్కబొమ్మ' రాష్ట్రపతి అవార్డును దక్కించుకుంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సంతోష్ జాతీయ అవార్డును అందుకున్నారు. దేశవ్యాప్తంగా హస్తకళాకారులను ప్రోత్సహించి, కళలను అభివృద్ధి పరచడానికి ప్రతిభ, నైపుణ్యం కలిగిన కళాకారులకు జాతీయ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వ టెక్స్‌టైల్ మంత్రిత్వశాఖ అందజేస్తోంది. ఈ పురస్కారం ద్వారా గొర్స సంతోష్‌కుమార్‌కు రూ.2 లక్షల నగదు బహుమతి, ప్రశంసాపత్రం లభించాయి.

కలంకారిలో వెంకటగిరి మహిళకు రాష్ట్రపతి అవార్డు

కళంకారి విభాగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం కుప్పంపల్లి గ్రామానికి చెందిన పోలూరు విజయలక్ష్మి రాష్ట్రపతి అవార్డు దక్కించుకున్నారు. 2023–24కి సంబంధించి ఢిల్లీలో జరిగిన నేషనల్ లెవల్ పోటీల్లో హ్యాండ్ డ్రాయింగ్, పెయింటింగ్ విభాగంలో విజయలక్ష్మి ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు రాష్ట్ర ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మంగళవారం అవార్డు అందుకున్నారు. విజయలక్ష్మిని పలువురు అభినందించారు.

జస్టిస్ జీఆర్‌పై లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు

పదవి నుంచి తప్పించాలని డిమాండ్

ఫిర్యాదు లేఖపై 120 మందికిపైగా ఎంపీల సంతకాలు

స్పీకర్ ఓంబిర్లాకు ఫిర్యాదు చేస్తున్న డీఎంకే టీఆర్‌బాలు, కనిమొళి, ఇండియా కూటమి ఎంపీలు

సాక్షి, చెన్నై: మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్‌ను పదవి నుంచి తప్పించాలని 120 మంది ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌కు లేఖ ఇచ్చారు. జస్టిస్ జీఆర్ స్వామినాథన్‌ను పదవి నుంచి తప్పించే వ్యూహంతో ఇండియా కూటమి ఎంపీల సంతకాల సేకరణలో డీఎంకే సఫలీకృతమైంది. 120 మందికి పైగా ఎంపీల సంతకాలతో కూడిన లేఖను ఫిర్యాదుగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు మంగళవారం అందజేశారు. న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్ ఇచ్చిన అత్యవసర ఉత్తర్వులతో తిరుప్పర కుండ్రం వ్యవహారం రచ్చకెక్కిన విషయం తెలిసిందే. న్యాయమూర్తి తరచు తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని భావిస్తున్న డీఎంకే పాలకులు ఆయన్ని పదవినుంచి తప్పించాలని వ్యూహరచన చేస్తున్నారు. దీన్లో భాగంగా డీఎంకే ఎంపీలు మిత్రపక్షాల ఎంపీల సంతకాల సేకరణపై దృష్టి పెట్టారు. డీఎంకే విజ్ఞప్తిమేరకు ఇండియా కూటమిలోని 120 మందికిపైగా ఎంపీలు జస్టిస్ జీఆర్ స్వామినాథన్‌కు వ్యతిరేకంగా సంతకాలు పెట్టారు. 50 మంది రాజ్యసభ సభ్యులు సంతకాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. జస్టిస్ జీఆర్‌ను పదవీచ్యుతుడ్ని చేయడం లక్ష్యంగా.. ఆయన వ్యవహారం, తిరుప్పర కుండ్రం విషయంలో ఆయన ఇచ్చిన ఉత్తర్వులు, తదుపరి పరిణామాలు, వివాదాలతో సమగ్ర నివేదికగా ఎంపీల సంతకాలతో కూడిన లేఖను సిద్ధం చేశారు. దీన్ని మంగళవారం ఢిల్లీలో లోక్‌సభ స్పీకర్‌కు అందజేశారు. డీఎంకే ఎంపీలు కనిమొళి, టీఆర్ బాలు, ఎ.రాజా విజ్ఞప్తితో ఇండియా కూటమి ఎంపీలు ప్రియాంకాగాంధీ, అఖిలేష్‌యాదవ్, ఎస్.వెంకటేషన్, తిరుమావళవన్ తదితరులు వారితో కలిసి స్పీకర్ చాంబర్‌కు వెళ్లారు. ఈ ఫిర్యాదును స్పీకర్‌కు కనిమొళి అందజేశారు. ఈ ఫిర్యాదుపై స్పీకర్ ఓ కమిటీని ఏర్పాటు చేసి విచారించనున్నారు. ఈ కమిటీ నివేదిక మేరకు జస్టిస్ జీఆర్ స్వామినాథన్‌ను పదవి నుంచి తప్పించే విషయమై లోక్‌సభలో ఓటింగ్ జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే న్యాయమూర్తి యశ్వంత్‌వర్మను పదవి నుంచి తప్పించాలన్న వ్యవహారం లోక్‌సభలో పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉండగా తిరుప్పర కుండ్రంలో దీపం వెలిగింపు వ్యవహారంలో కోర్టుధిక్కార కేసు మంగళవారం మదురై ధర్మాసనంలో న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్ బెంచ్ ముందుకు విచారణకు వచ్చింది. వాడీవేడిగా వాదనలు సాగాయి.

నేటి నుంచి 'టెట్'

- ఈ నెల 21 వరకు 133 సెంటర్లలో నిర్వహణ
- హాజరుకానున్న 2,71,692 మంది
- ఇన్ సర్వీస్ టీచర్లు 32వేల మందే దరఖాస్తు
- దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలోనే 'ఇన్ సర్వీస్' టెట్
- ఉపాధ్యాయుల వినతులను పట్టించుకోని చంద్రబాబు ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్ డిసెంబర్–2025)కు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 133 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఈ పరీక్షలకు 2,71,692 మంది దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం సాయంత్రానికి 96.25 శాతం మంది హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. దరఖాస్తుల్లో తప్పులు ఉంటే నామినల్ రోల్స్‌లో సరిదిద్దుకునేందుకు ఆయా పరీక్ష సెంటర్ల వద్ద సరైన ధ్రువీకరణపత్రాలు చూపించి మార్చుకునేందుకు అవకాశం ఇచ్చినట్లు వివరించారు.

టెట్‌కు హాజరుకానున్న 32వేల మంది టీచర్లు

ఉపాధ్యాయ వర్గాల వినతులను చంద్రబాబు ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా టెట్ (డిసెంబర్)–2025లో తొలిసారి ఇన్ సర్వీస్ టీచర్లను కూడా చేర్చింది. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నిర్వహించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ తొలి రాష్ట్రం కావడం గమనార్హం. ఈ టెట్‌కు 32 వేల మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. వాస్తవానికి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1.91 లక్షల మంది ఉపాధ్యాయులు ఉండగా, వారిలో 1.62 లక్షల మంది 2012కి ముందు నిర్వహించిన డీఎస్సీల ద్వారా సర్వీసులోకి వచ్చారు. అయినా 32 వేల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇదిలా ఉండగా, ఇన్ సర్వీస్ టెట్ నిర్వహణపై తమ ఎమ్మెల్సీల విజ్ఞప్తి మేరకు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేస్తామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ గత నెలలో ప్రకటించినా, ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కానీ, హడావుడిగా టెట్‌లో ఉపాధ్యాయులను కూడా చేర్చారు. దీనిపై ఉపాధ్యాయులు తీవ్రంగా మండిపడుతున్నారు.

'ఇన్ సర్వీస్' టెట్ దేశంలోనే తొలిసారి

విద్యాహక్కు చట్టం–2009లోని నిబంధనల ప్రకారం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు సైతం టెట్ తప్పనిసరి అని ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీన సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. దీనిని అన్ని రాష్ట్రాలు పాటించాలని ఆదేశించింది. దీనిపై దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశంపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయి. అదేవిధంగా విద్యాహక్కు చట్టంలో సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. కానీ, ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు ప్రభుత్వం మాత్రం రివ్యూ పిటిషన్ వేయలేదు. కనీసం కేంద్రంలోని తమ భాగస్వామ్య ప్రభుత్వానికి సైతం ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదు. దీంతో చంద్రబాబు ప్రభుత్వంపై ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఏపీ బ్రాండ్‌ను దెబ్బ తీసింది చంద్రబాబే

- వ్యవసాయం మన రాష్ట్రానికి ప్రత్యేక బ్రాండింగ్
- దేశానికి దక్షిణ ధాన్యాగారంగా నిలిచిన ఏపీ
- ఏపీ బ్రాండ్‌ను సర్వనాశనం చేసింది మీరు కాదా?
- చంద్రబాబు సంపద సృష్టి ఒక అభూత కల్పన
- రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేయడం మాత్రమే వాస్తవం
- మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం

సాక్షి,అమరావతి: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయానికి బ్రాండింగ్ అని, అలాంటి బ్రాండింగ్‌ను సీఎం చంద్రబాబు దెబ్బ తీశారని వైఎస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. దక్షిణ ధాన్యాగారంగా నిలిచిన ఏపీ బ్రాండ్‌ను సర్వనాశనం చేసింది చంద్రబాబు కాదా? అని ఆయన నిలదీశారు. రైతు హితాన్ని గాలిలో కలిపింది చంద్రబాబే అని గుర్తు చేశారు. చంద్రబాబు సంపద సృష్టి ఒక అభూత కల్పన అని, రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేయడం మాత్రమే వాస్తవమని విమర్శించారు. ఏడాదిన్నరలో రికార్డుస్థాయిలో అప్పులకు అదే తార్కాణమని ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పేర్ని మీడియాతో మాట్లాడారు. రైతు సంక్షేమాన్ని పక్కన పెట్టిన చంద్రబాబు ఇప్పుడు బ్రాండింగ్‌పై మాట్లాడటం సిగ్గు చేటని దుయ్యబట్టారు. ప్రజలు తినే పంటలే పండించాలని చంద్రబాబు చెప్పడం రైతులను అవమానించడమేనని పేర్ని వ్యాఖ్యానించారు. అనంతపురం జిల్లా రైతులకు తాను సీఎం అయ్యే వరకు వేరుశనగ తప్ప ఇంకో పంట తెలియదని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. అదే జిల్లాలో అరటి, మామిడి, ఉల్లి రైతులు నష్టపోతే, వారికి మద్దతు కల్పించలేని చంద్రబాబు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని పేర్ని విమర్శించారు. గిట్టుబాటు కాక రైతులు పంటలను రోడ్లపై పారబోస్తున్న దృశ్యాలు చంద్రబాబుకు కనపడడం లేదా అని నిలదీశారు.

అప్పులపై శ్వేతపత్రం ఇవ్వగలరా?

''చంద్రబాబు 18నెలల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు. రూ.2.66 లక్షల కోట్ల అప్పులు చేశారు. దీనిపై శ్వేతపత్రం ఇవ్వగలరా? ప్రజల సొమ్ముతో సీఎం, ఆయన కొడుకు లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక హెలికాప్టర్లు, విమానాల్లో తిరుగుతున్నారు. సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి గన్నవరం ఎయిర్ పోర్టుకు కూడా హెలికాప్టర్‌లో వెళ్తున్నారు. పాఠశాలలను అభివృద్ధి చేయలేని చంద్రబాబు మెగా పీటీఎం పేరుతో డ్రామా, హంగామా చేస్తున్నారు. హామీల అమలులో అట్టర్‌ఫ్లాపై కూడా సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ సిగ్గులేకుండా ప్రచారం చేసుకుంటున్నారు.'' అని పేర్ని విమర్శించారు.

కరెంట్ ఛార్జీలపై ఐవీఆర్ఎస్ సర్వే చేయగలరా?

''ఈ 18 నెలల్లో ఎన్నిసార్లు కరెంట్ చార్జీలు పెంచారో ప్రజలు చెబుతారు. కరెంట్ చార్జీలపై ఐవీఆర్ఎస్ సర్వే చేయగలరా? జగన్ మీరు చేసిన అప్పుల కంటే తక్కువే చేశారు. కరెంటు బకాయిలు తీర్చారు. అప్పులు ఎక్కువ ఎవరు చేశారో గమనించండి. వైఎస్ జగన్ రూ.2 కే యూనిట్ కరెంటు కొంటే ఆ రోజు అమ్మో, అబ్బో అంటూ గగ్గోలు పెట్టారు. మీరు మాత్రం యూనిట్ కరెంటు రూ.4.50కు పాతికేళ్లకు కొన్నారు. మరి ఎవరిది తప్పు?'' అంటూ పేర్ని చంద్రబాబును ప్రశ్నించారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఇండిగో సంక్షోభాన్ని నివారించడంలో విఫలమయ్యారని, టీడీపీకి చెందిన కేంద్ర మంత్రి వైఫల్యంపై సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని మీడియా అడిగిన ఓ ప్రశ్నపై పేర్ని నాని డిమాండ్ చేశారు.

ఆమె ఫ్యాషన్ భవిత

'అనుకోలేదని ఆగవు కొన్ని' అనే కవి మాట భవిత మండవ విషయంలో సరిగ్గా సరిపోతుంది. మోడల్ కావాలని కలలో కూడా అనుకోలేదు భవిత. అయితేనేం.. కలలో కూడా ఊహించని అవకాశం ఆమెను వెదుక్కుంటూ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. ఆ సమయంలో అదృష్టం అనే రైలు ఎక్కిన భవిత... స్వయం ప్రతిభతో మోడలింగ్ ప్రపంచంలో సరికొత్త తారగా వెలుగుతోంది. హైదరాబాద్‌కు చెందిన ఇరవై అయిదు సంవత్సరాల భవిత ప్రఖ్యాత ఫ్రెంచ్ లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ 'చానల్' ఫ్యాషన్ షోలో ఓపెనింగ్ వాక్ చేసింది. ఈ అవకాశం అందుకున్న తొలి భారతీయ మోడల్‌గా ప్రపంచ దృష్టిని ఆకర్షించిన పదహారణాల తెలుగు అమ్మాయి భవిత గురించి...

భవిత

హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ చేసిన భవిత ఇంటరాక్టివ్ డిజైన్ అండ్ మీడియాలో మాస్టర్స్ కోసం అమెరికా వెళ్లింది. ఒకానొక రోజు... న్యూయార్క్ సబ్ వే స్టేషన్‌లో రైలు కోసం ఎదురు చూస్తున్న భవితను ఒక వ్యక్తి చిరునవ్వుతో పలకరించాడు.

'మోడలింగ్ చేస్తారా?' అని అడిగాడు.

ఆ క్షణంలో భవిత మనసులో ఏమనుకుందో తెలియదు.

'సరదాగా అంటున్నాడా?'

'సీరియస్‌గానే అంటున్నాడా?'

మొత్తానికైతే 'యస్' అన్నది. అతడి పేరు... మాథ్యూ బ్లేజీ. మెన్స్ వేర్ డిజైనర్‌గా ఫ్యాషన్ కెరీర్ ప్రారంభించిన మాథ్యూ ఫ్రెంచ్ ఫ్యాషన్ లగ్జరీ బ్రాండ్ 'చానల్'కు క్రియేటివ్ డైరెక్టర్‌గా పని చేశాడు.

అద్భుత దర్శనం

'ఫ్యాషన్‌కి సంబంధించి కొన్నిసార్లు ఆధునికం కానిని కూడా అత్యాధునికం అనిపిస్తాయి' అంటాడు మాథ్యూ.

కొన్నిసార్లు... మోడల్ కాని వారు కూడా అద్భుతమైన మోడల్‌గా దర్శనమివ్వవచ్చు. భవిత విషయంలో అతడికి జరిగింది అదే!

'ఇలా మాత్రమే చేయాలి' అంటూ గంభీరమైన గురువులా ఎప్పుడూ కనిపించేవాడు కాదు మాథ్యూ.

'ఎలాంటి టెన్షన్ వద్దు. సరదాగా చేసేయ్' అన్నట్లుగా మాట్లాడేవాడు.

ఇటాలియన్ లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ బటేగా వనీటా స్ప్రింగ్/సమ్మర్–2025 ఫ్యాషన్ షోలో మోడల్‌గా అరంగేట్రం చేసింది భవిత. ఫస్ట్ షోతోనే మంచి మార్కులు తెచ్చుకుంది... ఇక అక్కడి నుంచి న్యూయార్క్, మిలాన్, పారిస్, లండన్‌లలో ఫ్యాషన్ దిగ్గజాలతో కలిసి షోలు చేసింది.

తాజా విషయానికి వస్తే...

ఫ్రెంచ్ లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ చానల్ 'షనెల్... మేటియే డార్ 2026' టైటిల్‌తో ఫ్యాషన్ షో నిర్వహించింది. 2018 తరువాత 'చానల్' న్యూయార్క్‌లో చేస్తున్న షో కావడంతో ఈ షో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన షోలో ఓపెనింగ్ వాక్ చేసే అవకాశం రావడం అంటే మామూలు విషయం కాదు. ఈ అవకాశం అందుకున్న తొలి భారతీయ మోడల్‌గా ప్రపంచ దృష్టిని ఆకర్షించింది భవిత. మాథ్యూతో కలిసి క్యాంపెయిన్‌లో కూడా పాల్గొంది.

ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్ వీరేన్ షా మాటల్లో చెప్పాలంటే... 'ఆర్డినరీ ప్లేస్‌లో కనిపించిన ఎక్స్‌ట్రార్డినరీ పర్సన్. మాథ్యూ ఆమె జీవితాన్ని మార్చివేశాడు'

ఒక ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో భవితను ఇంటర్వ్యూ చేసిన వ్యక్తి... 'ఇది జస్ట్ ప్రారంభం మాత్రమే' అన్నాడు.

ఇంకా ఎన్నో అద్భుత విజయాలు మోడలింగ్ ప్రపంచంలో ఆమె కోసం ఎదురు చూస్తూ ఉండవచ్చు!

వేయి శుభములు కలుగుగాక.

సబ్ వే టు రన్ వే

● సంవత్సరం క్రితం నేను మోడలింగ్ మొదలుపెట్టాను. మోడలింగ్‌లో నాకు ఎలాంటి ముందస్తు అనుభవం లేదు.

మోడలింగ్‌కు సంబంధించి మొదటి సారిగా కలిసి పనిచేసిన వ్యక్తి మాథ్యూ బ్లేజీ. మాథ్యూ నన్ను పూర్తిగా నమ్మాడు.

నా మొదటి రన్‌వే నుండి నా మొదటి క్యాంపెయిన్ వరకు, నేను ఊహించని జీవితాన్ని సృష్టించి ఇచ్చాడు. అతని 'చానల్'ను అనుసరించడం, అతనితో కలిసి ప్రయాణాన్ని కొనసాగించడం గౌరవం గా భావిస్తున్నాను.

● నిజాయితీగా చెప్పాలంటే మొదట్లో నేను భయపడ్డాను. నేను పని చేసిన బ్రాండ్‌ల గురించి నాకు పెద్దగా తెలియదు. ఫ్యాషన్ ప్రపంచంలో అవి ప్రముఖ బ్రాండ్లు అయినప్పటికీ నేను మధ్యతరగతి కుటుంబంలో పెరగడం వల్ల అవి నాకు పూర్తిగా కొత్త.

● ఒకసారి వెనక్కి వెళితే...'సవాళ్లు నాకు కొత్తేమీ కాదు కదా' అన్నట్లుగా నాకు నేను ధైర్యం చెప్పుకొని ప్రశాంతంగా ఉండగలిగాను. అయితే 'చానల్' అనేది భిన్నమైన అనుభవం. నేను ఇండస్ట్రీలోకి అడుగు పెట్టక ముందే ఆ బ్రాండ్ గురించి తెలుసు. ఆ ప్రసిద్ధ బ్రాండ్‌కు సంబంధించిన షోలో నడవడం(ఓపెనింగ్ వాక్) అనేది మరపురాని విషయం. మ్యాజికల్ ఎక్స్‌పీరియెన్స్. షో తరువాత వేదిక వెనక ఉన్న ప్రతి ఒక్కరు సంతోషంగా నన్ను హగ్ చేసుకున్నారు. కన్నీళ్లతో భావోద్వేగాలను పంచుకున్నారు.

ఈ సీజన్‌లో నాకు సంతోషకరమైన విషయం ఏమిటంటే..?

ఇతర మోడల్స్, టీమ్‌తో ఏర్పర్చుకున్న బంధం. ఈ టీమ్‌లో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన వారు ఉన్నారు. ఒకరినొకరం బాగా అర్థం చేసుకున్నాం. అలా అందరినీ కలుపుకొని పోయే క్రియేటివ్ డైరెక్టర్ ఉంటే ఆ ఫలితం అద్భుతంగా ఉంటుంది. ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు నాకు మాథ్యూపై ఎంతో ప్రేమ ఉంది.

● 'షోలో లేని వ్యక్తులు ఏమి చూడాలనుకోవాలనుకుంటారు?' అనే ప్రశ్నకు నా జవాబు ఇది....

మాథ్యూ బ్లేజీ, 'చానల్' బ్రాండ్ టీమ్ ఎంత అద్భుతమైనవారో ప్రజలు చూడాలని నేను కోరుకుంటున్నాను. వారిలోని ఆప్యాయత, దయాగుణం నా హృదయాన్ని తాకింది. వారిలోని అసాధారణ ప్రతిభ, వృత్తిపట్ల అంకితభావం పనిలోని ప్రతి అంశంలోనూ

భవిత తల్లిదండ్రులు

అమ్మానాన్నల కంట్లో ఆనందం!

తన తల్లిదండ్రులకు సంబంధించి ఒక వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది భవిత. ఈ వీడియో క్లిప్‌లో ఆమె తల్లిదండ్రుల భావోద్వేగాలు కనిపిస్తాయి. న్యూయార్క్‌లోని బోవరీ స్టేషన్ బ్యాక్‌గ్రౌండ్‌తో కూతురు పాల్గొన్న ఫ్యాషన్ షోను చూస్తూ ఆనంద బాష్పాలతో భవిత పేరును పదే పదే ఉచ్చరిస్తుంటుంది ఆమె తల్లి. తండ్రి ఒకింత గర్వంతో చూస్తుంటారు. 'ఇది నాకు ఎంత అద్భుతమో చెప్పడానికి మాటలు చాలవు. థ్యాంక్యూ' అని కాప్షన్‌లో రాసింది భవిత.

'అద్భుత విజయాల వెనుక తల్లిదండ్రుల త్యాగాలు ఉంటాయి. వారి చల్లని ఆశీర్వచనాలు ఉంటాయి' అని చెప్పకనే చెప్పిన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

ఏమీ తెలియని మోడలింగ్ ప్రపంచంలోకి అడుగు పెట్టడం అంటే ఆ సమయంలో రిస్క్‌గానే భావించాలి. ఒకవేళ రిస్క్ అనుకుంటే ఆమె ఈ కొత్త ప్రపంచంలోకి వచ్చేది కాదేమో! తల్లిదండ్రులు ఆమె భుజం తట్టి ప్రోత్సహించారు. ఉత్సాహాన్ని ఇచ్చారు.

మోడలింగ్‌లోకి వచ్చినప్పటికీ చదువుకు దూరం కాలేదు భవిత. ఒకవైపు చదువుకుంటూనే, క్యాంపస్ జాబ్ చేస్తూనే మోడలింగ్ చేసింది.

'అదేమిటో... చిన్న చిన్న విషయాలు కూడా గుర్తుపెట్టుకోలేకపోతున్నాను' అనుకునేవారిలో మీరు కూడా ఉన్నారా? అయితే మీరు అపర కుబేరుడు ఎలాన్ మస్క్ అనుసరించే మెమోరీ ట్రిక్స్ ఫాలో కావాల్సిందే. 'ట్రిక్స్ టు రిమెంబర్ ఎవ్రీథింగ్' అంటున్నాడు మస్క్. వాటిలో కొన్ని...

వికాసం



ఎలాన్ మస్క్ సమర్పించు... మెమొరీ ట్రిక్స్

● బ్రెయిన్ అనేది కొన్నిసార్లు అనవసర సమాచారంతో, అనవసర ఆలోచనలతో చెత్తబుట్టగా మారిపోతుంది. దీంతో అవసరమైన విషయాలకు చోటు ఉండదు. అందుకే అనవసర విషయాలను ఎప్పటికప్పుడూ డిలీట్ చేసి మంచి విషయాల కోసం స్పేస్ ఏర్పాటు చేసుకోవాలి.

● ముఖ్యమైన విషయాలతో 'మెమోరీ ట్రీ' నిర్మించాలి. ఈ చెట్టుకు కొమ్మలుగా కొత్త విషయాలను అనుసంధానిస్తూ పోవాలి.

● ఎవరికివారు పర్సనల్ కోడింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. విషయాలను వేగంగా గుర్తు తెచ్చుకోవడానికి సంఖ్యలు, చిహ్నాలు, చిత్రాలు.. మొదలైన వాటిని ఉపయోగించాలి. 'ఈ ట్రిగ్గర్‌లు మెదడులోని సంక్లిష్ట సమాచారాన్ని త్వరగా, తక్కువ శ్రమతో తిరిగి పొందడానికి ఉపయోగపడతాయి' అంటాడు మస్క్.

● విషయాలు, పేర్లను గుర్తు తెచ్చుకోవడంలో 'మీనింగ్‌ఫుల్ కనెక్షన్' ముఖ్యం అంటాడు ఎలాన్ మస్క్. ఉదాహరణకు ఒక వ్యక్తి పేరును గుర్తు తెచ్చుకోవడానికి వారి హాబీ, ఫన్నీస్టోరీ, వారి ముఖానికి సంబంధించి యూనిక్ ఫీచర్, ఆ వ్యక్తి నవ్వు, మాట్లాడే పద్ధతి... మొదలైన వాటితో పేరును గుర్తు పెట్టుకోవాలి.

● మీనింగ్‌ఫుల్ కనెక్షన్ అనేది ఎందుకు ముఖ్యమైనది అంటే...
మన మెదడు ర్యాండమ్ ఫ్యాక్ట్స్ కంటే స్టోరీలను, ఎమోషన్‌లనూ ఎక్కువగా గుర్తుపెట్టుకుంటుంది.

● 'అసోసియేట్ ఇన్‌ఫర్‌మేషన్' టెక్నిక్ గురించి నొక్కిచెబుతున్నాడు మస్క్. అసాధారణ దృశ్యాలతో, సమాచారాన్ని గుర్తు పెట్టుకోవడమే... అసోసియేట్ ఇన్‌ఫర్‌మేషన్. ఉదాహరణకు... ఆఫీసు నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు అరటిపండ్లు కొనాలనుకున్నారు. ఇందుకోసం ఒక అసాధారణ దృశ్యాన్ని మదిలో ఆవిష్కరించుకోవాలి. ఏనుగంత సైజులో ఉన్న అరటి పండు సన్‌గ్లాసెస్ ధరించి మీ కిచెన్‌లో డ్యాన్స్ చేస్తుంటుంది!

● 'రిపీట్ అండ్ రివ్యూ' మెథడ్‌లో భాగంగా గతంలోకి వెళ్లి మనకు నచ్చిన విషయాలను గుర్తు తెచ్చుకోవాలి. ఇలా తరచుగా చేయడం ద్వారా జ్ఞాపకశక్తి బలోపేతం అవుతుంది.

బులియన్
(బంగారం 10 గ్రా.; వెండి కిలో)
డిసెంబర్ 9న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,28,210	1,32,000	1,30,090	1,32,000	1,27,730	1,30,910
బంగారం (22 క్యారెట్లు)	1,18,080	1,19,250	1,19,250	1,22,830	1,17,120	1,20,000
వెండి	1,78,000	1,83,600	1,99,000	1,83,600	1,76,000	1,99,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా

అఖండ 2 డేట్ ఫిక్స్

● బాలకృష్ణ

బాలకృష్ణ, సంయుక్తా మీనన్ జంటగా నటించిన చిత్రం 'అఖండ 2: తాండవం'. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించారు. ఆది పినిశెట్టి, హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలు పోషించారు. ఎం. తేజస్విని సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదల కావాల్సి ఉంది. అయితే పలు కారణాల వల్ల చివరి నిమిషంలో రిలీజ్ వాయిదా పడిన సంగతి తెలిసిందే. కాగా మంగళవారం కొత్త విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఈ నెల 12న రిలీజ్ చేయనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే ఈ నెల 11న ప్రీమియర్స్ వేయనున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సి.రాంప్రసాద్, సంతోష్ డి, సంగీతం: తమన్ ఎస్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కోటి పరుచూరి.

నారి... మురారి... డేట్ ఫిక్స్

● సాక్షి, శర్వానంద్, సంయుక్త

హీరో శర్వానంద్ మరోసారి సంక్రాంతి బరిలో దిగుతున్నారు. 'ఎక్స్‌ప్రెస్ రాజా' (2016), 'శతమానం భవతి' (2017) వంటి సినిమాలతో సంక్రాంతికి హిట్స్ అందుకున్న ఆయన వచ్చే సంక్రాంతికి 'నారి నారి నడుమ మురారి' మూవీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. 'సామజవరగమన' మూవీ ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన చిత్రం 'నారి నారి నడుమ మురారి'. సంయుక్త, సాక్షీ వైద్య కథానాయికలుగా నటించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్స్‌పై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ సినిమాని జనవరి 14న సాయంత్రం 5:49 గంటలకు థియేటర్లలో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. సాధారణంగా సినిమాలు ఉదయం లేదా తెల్లవారుజామున షోలతో విడుదలవుతాయి. కానీ, ఈ సినిమాని మాత్రం ముహూర్తం పరంగా సాయంత్రం రిలీజ్ చేస్తున్నారు. ''ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'నారి నారి నడుమ మురారి'' అని మేకర్స్ తెలిపారు.

● శైలేష్ కొలను, సందీప్ కిషన్, బాబీ, కార్తీ, కృతీశెట్టి

ఆ నమ్మకంతోనే కోలీవుడ్ వెళ్లాను - సందీప్ కిషన్

''యంగ్ హీరోలు ఇలాంటి వైవిధ్యమైన సినిమాలు చేయాలని కోరుకునే మూడు సినిమాల్లో తప్పకుండా ఒకటి కార్తీ అన్నది ఉంటుంది. ఆయన్ను తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తున్నప్పుడు.. నన్ను తమిళ ప్రేక్షకులు ఇష్టపడరా? అనే నమ్మకంతోనే కోలీవుడ్ వెళ్లాను. అక్కడ నాకు ప్రతిసారీ తన సపోర్ట్ అందిస్తుంటారు కార్తీ అన్న. ఆయన చేసిన 'అన్నగారు వస్తారు' సినిమా విజయం సాధించాలి'' అని హీరో సందీప్ కిషన్ తెలిపారు. కార్తీ హీరోగా, కృతీశెట్టి హీరోయిన్‌గా నటించిన చిత్రం 'అన్నగారు వస్తారు'. నలన్ కుమారస్వామి దర్శకత్వంలో స్టూడియో గ్రీన్ బ్యానర్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 12న తెలుగులో విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'అన్నగారు వస్తారు' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి డైరెక్టర్స్ బాబీ(కేఎస్ రవీంద్ర), వెంకీ కుడుముల, శివ నిర్వాణ, దేవ కట్టా, వివేక్ ఆత్రేయ, రాహుల్ రవీంద్రన్, శైలేష్ కొలను, దర్శక–నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి అతిథులుగా హాజరై, 'అన్నగారు వస్తారు' ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. నిర్మాత 'బన్నీ' వాస్ మాట్లాడుతూ–''సూర్య, జ్ఞానవేల్ రాజాగార్లతో మాకు మంచి అనుబంధం ఉంది. కార్తీగారి మీద ఉన్న అభిమానం వల్లే ఈ వేడుకకి ఇంతమంది యంగ్ డైరెక్టర్స్ వచ్చారు. 'అన్నగారు వస్తారు' సినిమా మంచి విజయం సాధించాలి'' అని చెప్పారు. ''ఈ సినిమాను మా సంస్థ ద్వారా రిలీజ్ చేస్తుండటం సంతోషంగా ఉంది'' అన్నారు మైత్రీ డిస్ట్రిబ్యూషన్ శశిధర్. ''తమిళంలో నా తొలి చిత్రంతోనే కార్తీగారితో కలిసి నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది'' అని కృతీశెట్టి పేర్కొన్నారు. కార్తీ మాట్లాడుతూ–''ఎన్టీఆర్, ఎంజీఆర్‌గార్లు సినిమాను, రాజకీయాలను, ప్రజా జీవితాలను మార్చేశారు. వారు మనకు సూపర్ హీరోస్. అలాంటి వాళ్లు మళ్లీ ఇప్పుడు తిరిగొస్తే ఎలా ఉంటుంది? అనేది 'అన్నగారు వస్తారు' సినిమా కథ'' అన్నారు.

జయశ్రీ... వైఫ్ ఆఫ్ శాంతారామ్

● తమన్నా

'ది రెబల్ ఆఫ్ ఇండియన్ సినిమా'గా పేరు పొందిన లెజెండరీ హిందీ దర్శకుడు–నటుడు–నిర్మాత–ఎడిటర్ వి. శాంతారామ్ జీవితం వెండి తెరపైకి వస్తున్న సంగతి తెలిసిందే. 'వి. శాంతారామ్' టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ బయోపిక్‌లో బాలీవుడ్ యువ నటుడు సిద్ధాంత్ చతుర్వేది టైటిల్ రోల్ చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ తమన్నా భాగమైనట్లు, వి. శాంతారామ్ రెండో భార్య, నటి జయశ్రీ పాత్రలో ఆమె నటిస్తున్నట్లు వెల్లడించి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. అభిజీత్ శిరీష్ దేశ్‌పాండే దర్శకత్వంలో రాహుల్ కిరణ్ శాంతారామ్, సుభాష్ కాలే, సరితా అశ్విన్ వర్దే నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. ఇక 'డాక్టర్ కోట్నిస్ కీ అమర్ కహానీ, దహేజ్' వంటి చిత్రాలతో జయశ్రీ అప్పట్లో మంచి నటిగా గుర్తింపు పొందారు.

నా కెరీర్‌లో స్పెషల్ ప్రాజెక్ట్ ఇది - ఈషా రెబ్బా

ఈషా రెబ్బా, రాశీ సింగ్, కుషిత కల్లపు, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, సత్యం రాజేశ్, సత్య ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'త్రీ రోజెస్ సీజన్ 2'. దర్శకుడు మారుతి షో రన్నర్‌గా ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సిరీస్ ఈ నెల 12 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఈషా రెబ్బా మాట్లాడుతూ– ''అమ్మాయిలంతా ఒకే దగ్గర రెంట్‌కు ఉండటం, వాళ్లు కలిసి సరదాగా చేసే కుకింగ్, గాసిప్స్ చెప్పుకోవడం, లైఫ్ లీడ్ చేయడం వంటి అంశాలు సీజన్ 2లో కనిపిస్తాయి. ఇది నా కెరీర్‌లో ఓ స్పెషల్ ప్రాజెక్ట్. ఇక నా తర్వాతి చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతి'లో కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లు చేశాను. అలాగే విక్రమ్ ప్రభు హీరోగా నటిస్తున్న సినిమాలో నటిస్తున్నాను'' అని చెప్పారు. హర్ష మాట్లాడుతూ– ''సీజన్ 1లోని పగను సీజన్ 2లో తీర్చుకునేలా నా పాత్ర ఉంటుంది. ప్రభాస్‌గారి 'ది రాజా సాబ్'లో చిన్న రోల్ చేశాను. అలాగే ఈ సంక్రాంతి పండక్కి వస్తున్న అన్ని సినిమాల్లోనూ, 'మోగ్లీ 2025'లోనూ మంచి రోల్స్ చేశాను. నేను లీడ్ రోల్‌లో రెండు సినిమాలు తెరకెక్కుతున్నాయి'' అని చెప్పారు.

● హర్ష, ఈషా రెబ్బా

నేను దురదృష్టవంతుణ్ణి!

● సందీప్ రాజ్

''నేను దర్శకత్వం వహించిన 'కలర్ ఫోటో, మోగ్లీ' చిత్రాల మధ్య కొన్ని కామన్ విషయాలు ఉన్నాయి. వాటిలో ఒకటి... అంతా బాగానే జరుగుతుందనుకున్న సమయంలో విడుదల సమయంలో దురదృష్టం ఎదురైంది. రెండోది... బహుశా నేనే దురదృష్టవంతుణ్ణి అనుకుంటున్నాను'' అంటూ దర్శకుడు సందీప్ రాజ్ ఓ ప్రకటన విడుదల చేశారు. రోషన్ కనకాల, సాక్షి సాగర్ మడోల్కర్ జోడీగా నటించిన చిత్రం 'మోగ్లీ 2025'. 'కలర్ ఫోటో' ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న రిలీజ్ కావాల్సి ఉంది. అయితే ఈ నెల 5న రిలీజ్ కావాల్సిన బాలకృష్ణ 'అఖండ 2: తాండవం' విడుదల వాయిదా పడింది. చివరికి ఈ చిత్రాన్ని ఈ నెల 12న రిలీజ్ చేయనున్నట్లు మంగళవారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో 'మోగ్లీ 2025' విడుదల వాయిదా పడనుందట. ''దర్శకత్వం–సందీప్ రాజ్ అనే టైటిల్‌ను థియేటర్‌లో చూసుకోవాలన్న నా కల రోజురోజుకూ కష్టతరం అవుతోంది. వెండితెరకు నేనంటే ఇష్టం లేదేమో? యూనిట్ అంతా 'మోగ్లీ 2025' మూవీ కోసం ఎంతో కష్టపడ్డాం. కనీసం వారి కోసమైనా 'మోగ్లీ'కి మంచి జరగాలని ఆశిద్దాం'' అని పోస్ట్ చేశారు సందీప్ రాజ్.

ఆ సంతృప్తి దక్కింది - వరుణ్ సందేశ్

● ప్రియాంకా జైన్ వరుణ్ సందేశ్

''శేఖర్‌గారు 'నయనం' కథ చెప్పారు. అలాగే స్వాతి, సాధిక గారు ఇచ్చిన నరేషన్ వినగానే షాక్‌లో ఉండిపోయాను. చాలా రోజుల తర్వాత 'నయనం' వంటి ఒక మంచి ప్రాజెక్ట్ చేశాననే సంతృప్తితో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను'' అని వరుణ్ సందేశ్ చెప్పారు. స్వాతి ప్రకాశ్ దర్శకత్వంలో వరుణ్ సందేశ్, ప్రియాంకా జైన్ ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'నయనం'. ఉత్తేజ్, అలీ రెజా, రేఖా నిరోషా కీలక పాత్రలు పోషించారు. ఈ సిరీస్ ఈ నెల 19 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సిరీస్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో స్వాతి ప్రకాశ్ మాట్లాడుతూ– ''సమాజంలోని పది మందిలో పక్కవారి జీవితం తెలుసుకోవాలనే కుతూహలం ఏడెనిమిది మందిలో ఉంటుంది. అలాంటి క్యూరియాసిటీ పీక్స్‌లో ఉంటే ఏం జరుగుతుంది? అనేదే ఈ సిరీస్'' అన్నారు.

కొత్త డేట్ ఫిక్స్

● త్రిగుణ్, హెబ్బా పటేల్

త్రిగుణ్, హెబ్బా పటేల్, అఖిల్ రాజ్, సిరి హనుమంతు ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ థ్రిల్లర్ సినిమా 'ఈషా'. కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో హేమ వెంకటేశ్వరరావు నిర్మించిన చిత్రం ఇది. వంశీ నందిపాటి, 'బన్నీ' వాసు ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ సినిమాను ఈ నెల 12న రిలీజ్ చేయాలని మేకర్స్ ముందుగా ప్లాన్ చేశారు. కానీ, వాయిదా వేశారు. ఈ నెల 25న రిలీజ్ చేయనున్నట్లుగా మంగళవారం తెలిపారు.

సల్లంగుండాలే ఛాంపియన్

● అనస్వర, రోషన్

రోషన్, అనస్వర రాజన్ జోడీగా నటించిన చిత్రం 'ఛాంపియన్'. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నందమూరి కల్యాణ్ చక్రవర్తి, అర్చన కీలక పాత్రల్లో నటించారు. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. మిక్కీ జె. మేయర్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'సల్లంగుండాలే...' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటని రితేష్ జి. రావు, మనీషా ఈరబత్తిని ఆలపించగా, బృందా గోపాల్ కొరియోగ్రఫీ అందించారు. ''భావోద్వేగం, వేడుక రెండింటినీ కలిగి ఉన్న అద్భుతమైన పాట 'సల్లంగుండాలే...'. వివాహంలో జరిగే ప్రతి ఆచారం, భావోద్వేగాన్ని ఈ పాట అందంగా చూపిస్తుంది. కల్యాణ్ చక్రవర్తి, అర్చన వధువు తల్లిదండ్రులుగా ఆకట్టుకోగా, రోషన్, అనస్వర జోడీ తమ డ్యాన్స్‌తో ఈ పాటకు మరింత ఉత్సాహాన్ని తెచ్చారు. 'సల్లంగుండాలే...' పాట ప్రతి వివాహ వేడుకలో మార్మోగబోతోంది'' అని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి కెమెరా: ఆర్. మది.

ఫెయిల్యూర్ అనేది ముగింపు కాదు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని ఉన్నతంగా ఎదగడానికి అదో గొప్ప అవకాశం.

- ఎన్‌విడియా సీఈఓ జెన్‌సెన్ హువాంగ్

మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తి చేసి.. ఆ తర్వాత మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఏఎంఐఈలో అసోసియేట్ మెంబర్‌షిప్ పొందారు. అనంతరం ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి క్రయోజెనిక్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ పట్టా కూడా అందుకున్నారు. డిప్లొమా పూర్తయిన తర్వాత పలు ప్రైవేట్ కంపెనీల్లో పని చేసి.. నాలుగు దశాబ్దాల క్రితం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో ఎంట్రీ లెవల్ సైంటిస్ట్‌గా చేరిన ఆయన.. తన ప్రతిభతో అంచలంచెలుగా ఎదిగి.. అదే సంస్థకు ఈ ఏడాది జనవరిలో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. తమిళనాడులోని ఓ చిన్న గ్రామంలో.. దిగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి.. ఇస్రో ఛైర్మన్ హోదాకు చేరుకున్న **డాక్టర్. వి.నారాయణన్**తో ఈ వారం ప్రత్యేక ఇంటర్వ్యూ..

సానుకూల దృక్పథంతోనే సక్సెస్

సైన్స్, టెక్నాలజీ.. ఈ రెండింటిలో దేనికి ప్రాధాన్యం ఇవ్వాలి?

వాస్తవానికి ఈ రెండూ సమ్మిళితమైన విభాగాలు. సైన్స్, మ్యాథమెటిక్స్ లేకుండా టెక్నాలజీ ఫలాలను ఆస్వాదించలేం. అందుకే టెక్ విభాగంలో కెరీర్ కోరుకునే వారు సైన్స్, మ్యాథమెటిక్స్‌పై పూర్తిగా పట్టు సాధించాలి. అప్పుడు టెక్నాలజీ రంగంలో అవసరమైన పరిశోధనలు చేయడానికి లేదా విధులు నిర్వర్తించడానికి అవసరమైన సమర్థత, నైపుణ్యం పొందుతారు. కానీ చాలా మంది హయ్యర్ సెకండరీ తర్వాత మ్యాథ్స్, సైన్స్‌లపై ఎక్కువగా దృష్టి సారించడంలేదు. ఈ కారణంగానే ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు లభించడం లేదని నా అభిప్రాయం.

అకడమిక్స్‌తోపాటు ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ ముఖ్యం

ఆర్ అండ్ డీలో విస్తృత పరిశోధనలు, అవకాశాలు

'సాక్షి'తో ప్రత్యేక ఇంటర్వ్యూలో ఇస్రో ఛైర్మన్ డాక్టర్.వి.నారాయణన్

నేటి తరం విద్యార్థులు భవిష్యత్తులో రాణించడానికి అకడమిక్ స్థాయిలో ఎలా వ్యవహరించాలి?

ముందుగా ఆయా అంశాలను ఆకళింపు చేసుకునే విషయంలో ఎంతో మార్పు రావాలి. కేవలం పుస్తకాలకే పరిమితం కాకూడదు. ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్ దిశగా కృషి చేయాలి. విద్యాసంస్థలు కూడా మార్కులు, పరీక్షలు అనే విధానం నుంచి బయటికి వచ్చి.. విద్యార్థుల్లోని సహజ నైపుణ్యాలను వెలికితీసే ప్రయత్నం చేయాలి. దీంతోపాటు విలువలు, వ్యక్తిత్వ వికాసంపైనా దృష్టి పెట్టాలి. మనం ఎంత ప్రతిష్టాత్మక స్కూల్, కాలేజ్‌లో చదివామనేది ముఖ్యం కాదు. ఎలా చదువుతున్నాం? అనేదే ముఖ్యం. దీన్ని దృష్టిలో పెట్టుకునే జాతీయ విద్యా విధానం రూపొందింది. ఇందులోని వాల్యూ బేస్ట్ ఎడ్యుకేషన్ విధానం ఫలితంగా విద్యార్థులకు ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ లభిస్తుంది.

దేశంలో ఆర్ అండ్ డీ కార్యకలాపాలపై మీ అభిప్రాయం?

ప్రస్తుతం దేశంలో అన్ని రంగాల్లో విస్తృత స్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా లభిస్తున్నాయి. యువత వీటిని అందిపుచ్చుకోవాలి. అంతరిక్ష రంగాన్నే పరిగణనలోకి తీసుకుంటే.. ఇస్రోలో నిరంతరం పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఫలితంగా ఇప్పుడు అంతరిక్షంలోకి 57 ఉపగ్రహాలను పంపించగలిగాం. 2035 నాటికి ఈ సంఖ్యను మూడింతలు చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నాం. వీటికోసం నిరంతరం ఆర్ అండ్ డీ కార్యకలాపాలు కొనసాగుతూనే ఉన్నాయి. అదే విధంగా సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు చేసేలా నిరంతరం పరిశోధనలు చేస్తున్నాం.

విద్యార్థులు, యువత కెరీర్‌లో సక్సెస్‌కు మార్గం ఏమిటి?

విద్యార్థులకు తమ లక్ష్యంపై స్పష్టత ఉండాలి. గమ్యం చేరుకునే విషయంలో ప్రతి ఒక్కరికి ప్లాన్–బి ఉండాలి. గమ్యం దిశగా అడుగులు వేసేటప్పుడు.. ఒక మార్గంలో ఒడిదుడుకులు ఎదురైతే.. మరో ప్రత్యామ్నాయం ఏంటి అనే విషయంలో ముందుగానే స్పష్టత ఉండాలి. అందుకు ప్లాన్–బి ఎంతో ఉపకరిస్తుంది. ఫలితంగా ఎంచుకున్న మార్గంలో అడ్డంకులు ఎదురైనా.. మరో గమ్యం దిశగా పయనించే మానసిక సంసిద్ధత లభిస్తుంది. ఇప్పుడు ఆవిష్కృతం అవుతున్న టెక్నాలజీ, అందుబాటులోకి వస్తున్న సేవలు ఎన్నో సవాళ్లు, ఒడిదుడుకుల తర్వాతనే సక్సెస్ అయిన విషయాన్ని గుర్తించాలి.

యువత ఉన్నత కెరీర్స్ అందుకోవడానికి మార్గమేమిటి?

ముందుగా ప్రాక్టికల్ థింకింగ్, పాజిటివ్ అటిట్యూడ్ అలవర్చుకోవాలి. ప్రాక్టికల్ థింకింగ్ వల్ల జాబ్ మార్కెట్‌లో అవసరమైన నిజ నైపుణ్యాలపై అవగాహన లభిస్తుంది. అంతేకాకుండా పాజిటివ్ ఆప్టిట్యూడ్ ఫలితంగా.. పోటీని చూసి ఆందోళన చెందడం, నిరుత్సాహ ఫలితం వస్తే కుంగిపోవడం వంటి సమస్యలకు పుల్‌స్టాప్ పెట్టొచ్చు.

ఐఐఎస్‌టీ విద్యార్థులకు ఇస్రోలో నేరుగా ఉద్యోగావకాశాలు కల్పిస్తారా?

ఇస్రో అనుబంధ విభాగమైన ఐఐఎస్‌టీ నుంచి సైన్స్, ఇంజనీరింగ్‌లో డిగ్రీ పూర్తి చేసుకుంటే.. ఇస్రోలో సైంటిస్ట్ పోస్టుల నియామకంలో ప్రాధాన్యత ఉంటుంది. నిర్ణీత ఉత్తీర్ణత శాతం సాధిస్తే.. ఎలాంటి పరీక్ష లేకుండా నేరుగా ఇంటర్వ్యూకు హాజరయ్యే అవకాశం ఉంది. కానీ అక్కడ వారి ప్రతిభను నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఐఐఎస్‌టీ ప్రధాన ఉద్దేశం సైన్స్, ఇంజనీరింగ్ విభాగాల్లో రీసెర్చ్ ఔత్సాహికులను ప్రోత్సహించడం. ఒకవేళ ఇస్రోలో ఉద్యోగం రాకపోయినా.. ఇక్కడి విద్యార్థులకు ఇతర ప్రభుత్వ పరిశోధన శాలలు, ప్రైవేట్ రీసెర్చ్ ల్యాబ్స్‌లో కూడా చక్కటి అవకాశాలు లభిస్తున్నాయి.

విద్యార్థులు వ్యక్తిగతంగా, అకడమిక్‌గా రాణించడానికి మీరిచ్చే సలహా?

చేసే పనిలో నిబద్ధత, ఆసక్తి, సహనం ఈ మూడు లక్షణాలు అలవర్చుకోవాలి. దీనివల్ల ఒక పనిచేయాలనే సంకల్పాన్ని సాధ్యం చేసుకునే వీలవుతుంది. అంతేకాకుండా సహన గుణం వల్ల సుదీర్ఘ సమయం వేచి చూడగలిగే నేర్పు లభిస్తుంది. ఇది ఎంతో కీలకమైన లక్షణం. ముఖ్యంగా ఆర్ అండ్ డీ విభాగంలో.. కొత్త పరిశోధనలు చేస్తున్నప్పుడు వెనువెంటనే ఫలితాలు రావు. ఇలాంటి సందర్భాల్లో సహనశీలత ఎంతో మేలు చేస్తుంది. అంతేకాకుండా.. యువత ప్రతి దానికి నిరుత్సాహ పడకూడదు. ఏదైనా ఫలితం ప్రతికూలంగా వస్తే.. దానికి కారణాలు విశ్లేషించుకోవాలి. ఆ పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకుని మళ్లీ ప్రయత్నించాలి. అంటే ఓటమి నుంచి పాఠం నేర్చుకుని అడుగులు వేయాలి.

నైపుణ్యమే.. గెలుపు మంత్రం

నేటి ఏఐ విప్లవంతో జాబ్ మార్కెట్‌లో పెను మార్పులు సంభవిస్తున్నాయి. గతంలో అకడెమిక్ అర్హతలు, డిగ్రీలు, మార్కులు, మెరిట్‌ను చూసి సంస్థలు ఆఫర్ ఇచ్చేవి. కాని ఇప్పుడు ట్రెండ్ మారిపోతోంది.. డిగ్రీ పట్టాలు లేకపోయినా.. నైపుణ్యాలుంటే చాలంటున్నాయి సంస్థలు. ఉద్యోగ నియామక ప్రక్రియలో కంపెనీలు ప్రాక్టికల్ నాలెడ్జ్‌కి పెద్దపీట వేస్తున్నాయి. జాబ్ స్కిల్స్ ఉన్న వారికే ప్రాధాన్యతనిస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. ఉద్యోగ సాధనలో అవసరమవుతున్న నైపుణ్యాలు.. కంపెనీలు కోరుకునే స్కిల్స్ పెంచుకోవడం ఎలాగో తెలుసుకుందాం..

చేస్తున్న పనిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించే మార్గాలే.. స్కిల్స్. అభ్యర్థుల నుంచి సంస్థలు ఏం ఆశిస్తున్నాయో తెలుసుకుని, అందుకుతగ్గట్టుగా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. స్కిల్స్‌కు సంబంధించి ప్రొఫెషనల్ స్కిల్స్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్ అని రెండు రకాలు ఉంటాయి. కొత్తగా ఏఐ నేపథ్యంలో డిజిటల్ స్కిల్స్ తెరపైకి వచ్చాయి. కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, మేనేజ్‌మెంట్ స్కిల్స్, లీడర్‌షిప్ స్కిల్స్, సృజనాత్మకత.. ఇవన్నీ ప్రొఫెషనల్ స్కిల్స్. ఉన్నత స్థానానికి ఎదగడానికి ఈ నైపుణ్యాలు దోహదం చేస్తాయి. మనం చదువుకున్న సబ్జెక్ట్ ఆధారంగా పెంపొందించుకునేవి టెక్నికల్ స్కిల్స్. టెక్నికల్ స్కిల్స్‌పై పట్టు లేకుంటే ఇంటర్వ్యూకు షార్ట్‌లిస్ట్ అవడం కష్టమే. కెరీర్‌లో విజయం సాధించాలంటే..ప్రొఫెషనల్ స్కిల్స్‌తోపాటు టెక్నికల్ స్కిల్స్, డిజిటల్ స్కిల్స్ కీలకమే.

డిజిటల్ స్కిల్స్ ఇవే: నేడు అన్ని రంగాల్లో కృత్రిమ మేధకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ స్కిల్స్ కీలకంగా మారుతున్నాయి. అందుకే ఉద్యోగ అన్వేషణలో ముందుండాలంటే.. కోడింగ్, ప్రోగ్రామింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ మార్కెటింగ్ వంటి డిజిటల్ నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



జాబ్ స్కిల్స్

కొలువుకు తగ్గ స్కిల్స్: ఏదైనా కంపెనీలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు.. ముందుగా ఆ కొలువుకు ఎలాంటి స్కిల్స్ అవసరమో గుర్తించాలి. సదరు జాబ్ ప్రొఫైల్‌కు అవసరమైన అర్హతలు, నైపుణ్యాల గురించి తెలుసుకోవాలి. కంపెనీల అవసరాలు గుర్తించి, అందుకనుగుణంగా రెజ్యూమెను రూపొందించుకోవాలి. సంస్థ చరిత్ర, ఉత్పత్తులు, మార్కెట్‌లో దాని స్థానం, సాధించిన విజయాలు, భవిష్యత్ లక్ష్యాలు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. దరఖాస్తు చేసుకున్న ఉద్యోగానికి సంబంధించిన విధులు, బాధ్యతలు, అందులో మెరుగ్గా రాణించాలంటే..కావాల్సిన నైపుణ్యాలపై పట్టు సాధించాలి.

అప్‌డేట్ అయ్యేలా: మార్కెట్ స్థితిగతులకు అనుగుణంగా కొత్త స్కిల్స్‌పై పరిజ్ఞానం ఉన్న అభ్యర్థుల వైపు కంపెనీలు మొగ్గు చూపుతాయి. నైపుణ్యాలను అప్‌డేట్ చేసుకునే అభ్యర్థులను ఎంపిక చేసుకోవడానికి సంస్థలు ఆసక్తి చూపిస్తాయి. టెక్నాలజీకి అనుగుణంగా ఉద్యోగులు మార్పులను స్వీకరించాలని ప్రతి కంపెనీ కోరుకుంటుంది. కాబట్టి కొత్తగా ఉద్యోగ జీవితంలో అడుగుపెట్టాలనుకునేవారు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలి. కొన్నాళ్లు ఒక ఉద్యోగంలో పనిచేసి మరో కొలువులో చేరాలనుకునేవారు సంబంధిత కోర్సులను నేర్చుకోవడం ద్వారా ప్రయోజనం పొందొచ్చు.

నెట్‌వర్క్‌తో మేలు: పరిచయంలేని వ్యక్తుల వద్దకు వెళ్లి మాట్లాడడానికి సహజంగా చాలా మంది వెనుకంజ వేస్తారు. ఇలాంటి అభ్యర్థులు పాత స్నేహితులతో నెట్ వర్కింగ్‌ను ప్రారంభించి.. కుటుంబ సభ్యులు, వారి బంధువులతో నెట్‌వర్క్‌ను విస్తరించుకోవాలి. దీంతోపాటు ప్రస్తుత ప్రపంచంలో విభిన్న వ్యక్తులను కలవడానికి ఎన్నో దారులు ఏర్పడ్డాయి. విస్తృత సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. వీటిద్వారా సంబంధిత ప్రొఫెషనల్స్‌తో అనుసంధానమై మన ఆలోచనలను పంచుకోవచ్చు. వారి సహాయాన్ని అడగొచ్చు. ఉదాహరణకు ఏఐ రంగంలో కెరీర్ కోరుకునే వారు.. ఏఐ నిపుణులతో సోషల్ మీడియా వేదికల ద్వారా నెట్‌వర్కింగ్ పెంచుకోవచ్చు. తద్వారా తమ టెక్నికల్, ప్రొఫెషనల్ పరిజ్ఞానాన్ని పెంచుకోవచ్చు. సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

ఇంటర్వ్యూలో సక్సెస్..: ఇంటర్వ్యూ కోసం ముందుగానే సన్నద్ధత ప్రారంభించాలి. ఇంటర్వ్యూకి ఆహ్వానించిన సంస్థ , దాని కార్యకలాపాల గురించి తెలుసుకోవాలి. ఆ సంస్థ లక్ష్యాల సాధనకు ఎలా తోడ్పడగలమో ఆలోచించాలి. ఆ తర్వాత ఉద్యోగ జీవితంలో ఎదురయ్యే వాస్తవ పరిస్థితులపై అవగాహన పెంచుకొని.. అందుకు తగ్గట్లుగా సన్నద్ధమవ్వాలి. ఇంటర్వ్యూలో విజయం సాధించాలంటే.. ముందుగా ప్రతికూల ఆలోచనలను పక్కన పెట్టాలి. కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్, డొమైన్ నాలెడ్జ్ వంటి అంశాల్లో తమ బలహీనతలను అధిగమించాలి. ఉద్యోగానికి ఎంపిక కావడమే లక్ష్యంగా ధైర్యంగా సమాధానాలు చెప్పాలి.

నైపుణ్యాలు, విధేయత..: ఇంటర్వ్యూకు హాజరైనప్పుడు అభ్యర్థులు గతంలో నిర్వహించిన హోదాలతోపాటు సాధించిన విజయాలను, మెరుగుపరచుకున్న నైపుణ్యాలను వివరించడానికి ప్రయత్నించాలి. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగంపై ఆసక్తి, దానికి తాము ఏ విధంగా సరిపోతారనే విషయంలో ఇంటర్వ్యూయర్‌ను సంతృప్తిపర్చాలి. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కొత్త విషయాలను నేర్చుకోవడంపై తమ ఆసక్తిని ప్రదర్శించాలి. గత ఉద్యోగాల్లో విధేయతను నిరూపించిన సందర్భాలను ఇంటర్వ్యూయర్‌కు వివరించడం ద్వారా అదనపు ప్రయోజనం ఉంటుంది. విజయవంతంగా పూర్తిచేసిన పనులు, వాటిని పూర్తిచేసే క్రమంలో అంకితభావం గురించి ప్రస్తావించాలి. ప్రస్తుత జాబ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఏ విధంగా అర్హులో నిరూపించుకోవాలి.

ఉద్యోగంలో చేరిన తర్వాత..: ఉద్యోగంలో చేరిన తర్వాత సంస్థ నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నించాలి. సామర్థ్యాన్ని నిరూపించుకోవాలి. అవసరమైన స్కిల్క్స్‌ను పెంచుకోవాలి. సంబంధిత రంగంలో తాజాగా వస్తున్న మార్పులూ, చేర్పులు గమనించాలి. అప్పుడే కెరీర్‌లో ఉన్నత స్థానానికి చేరుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఉద్యోగ సమాచారం

తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో 94 సివిల్ జడ్జి పోస్టులు

తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్)పోస్టుల కోసం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, రిక్రూట్‌మెంట్ బై ట్రాన్స్‌ఫర్(బదిలీ ద్వారా నియామకం) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 94.
- **పోస్టుల వివరాలు:** డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా–66, ట్రాన్స్‌ఫర్ ద్వారా–28.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి లా డిగ్రీతో పాటు బార్ కౌన్సిల్‌లో అడ్వకేట్‌గా నమోదు చేసి ఉండాలి. మూడేళ్లు తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో లేదా దాని నియంత్రణలో పనిచేసే కోర్టులలో అడ్వకేట్‌గా లేదా ప్లీడర్‌గా ప్రాక్టీస్ చేసి ఉండాలి.
- **వయసు:** 23 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.77,840 నుంచి రూ.1,36,520.
- **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్, రాతపరీక్ష, వైవా–వోస్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 08.12.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.12.2025.
- **వెబ్‌సైట్:** https://tshc.gov.in/

సీబీఎస్‌ఈలో 124 పోస్టులు

సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన గ్రూప్–ఏ, బీ, సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 124.
- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ సెక్రటరీ–08, అసిస్టెంట్ ప్రొఫెసర్–అసిస్టెంట్ డైరెక్టర్(అకడమిక్స్/ట్రైనింగ్/స్కిల్ ఎడ్యుకేషన్)–27, అకౌంట్స్ ఆఫీసర్–02, సూపరింటెండెంట్–27, జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్–09, జూనియర్ అకౌంటెంట్–16, జూనియర్ అసిస్టెంట్–35.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ/బోర్డు నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంఏ, ఐసీడబ్ల్యూఏలో ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ నాలెడ్జ్ ఉండాలి.
- **వయసు:** పోస్టును అనుసరించి 27 ఏళ్ల నుంచి 35 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** గ్రూపును బట్టి ఎంపిక ప్రక్రియ మూడు అంచెలుగా ఉంటుంది. **టైర్–1:** ఎంసీక్యూ ఆధారిత ప్రాథమిక స్క్రీనింగ్ పరీక్ష, **టైర్–2:** ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్(రాత) ప్రధాన పరీక్ష, **టైర్–3:** ఇంటర్వ్యూ/పర్సనల్ ఇంటరాక్షన్ లేదా స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 02.12.2025.
- **ఫీజు చెల్లించడానికి చివరితేది:** 22.12.2025.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.12.2025.
- **వెబ్‌సైట్:** https://www.cbse.gov.in/

మిధాని, హైదరాబాద్‌లో 210 అప్రెంటిస్‌లు

హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్(మిధాని) వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీల సంఖ్య: 210.
- ఖాళీల వివరాలు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు–30, టెక్నీషియన్ డిప్లొమా అప్రెంటిస్–20, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్–160.
- ట్రేడులు: ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, టర్నర్, డీజిల్ మెకానిక్, ఏపీ మెకానిక్, వెల్డర్, సీవోపీఏ, ఫోటోగ్రాఫర్, ప్లంబర్, కార్పెంటర్, మెటలర్జీ, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఐటీ తదితరాలు.
- అర్హత: సంబంధిత ట్రేడులో డిప్లొమా, గ్రాడ్యుయేట్, ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
- స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.12,300, టెక్నీషియన్‌కు రూ.10,900, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.9,600.
- ఎంపిక విధానం: విద్యార్హతల్లో పొందిన మార్కులు, సర్టిఫికేట్‌ల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొని దరఖాస్తు హార్డ్‌కాపీలను అడిషనల్ జనరల్ మేనేజర్, ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్, మిధాని, కంచన్‌బాగ్, హైదరాబాద్–500058 చిరునామకు పంపించాలి.
- దరఖాస్తులకు చివరితేది: 10.12.2025.
- వెబ్‌సైట్: **https://midhaniindia.in/**

డీసీఐఎల్, విశాఖపట్నంలో 26 పోస్టులు

విశాఖపట్నంలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(డీసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 26.
- పోస్టుల వివరాలు: కన్సల్టెంట్ ఫర్ ఇన్‌ల్యాండ్ డ్రెడ్జింగ్–06, ప్రాజెక్ట్ మేనేజర్ ఫర్ ఇన్‌ల్యాండ్ డ్రెడింగ్‌వర్క్–01, హైడ్రోగ్రాఫిక్ సర్వేయర్–13, ప్రాజెక్ట్ కన్సల్టెంట్స్ (ఆపరేషన్స్/ప్రాజెక్ట్స్)–02, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కన్సల్టెంట్–01, లీగల్ కన్సల్టెంట్–01, రెసిడెంట్ మేనేజర్–01, అసిస్టెంట్ కంపెనీ సెక్రటరీ–01.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులవ్వాలి. మాస్టర్స్(ఎఫ్‌జీ)/డ్రెడ్జ్ మాస్టర్స్ సర్టిఫికేట్స్‌తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- వయసు: హైడ్రోగ్రాఫిక్ సర్వేయర్‌కు, ప్రాజెక్ట్ మేనేజర్, లీగల్ కన్సల్టెంట్/రెసిడెంట్ మేనేజర్/ఏసీఎస్, ఐటీ కన్సల్టెంట్ పోస్టులకు 45 ఏళ్లు, ప్రాజెక్ట్ కన్సల్టెంట్‌కు 50 ఏళ్లు మించకూడదు. ఇన్‌లాండ్ డ్రెడ్జింగ్ కన్సల్టెంట్‌కు 40 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక విధానం: షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ, విద్యార్హతలు, ఉద్యోగానుభవం, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 03.12.2025.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.12.2025.
- వెబ్‌సైట్: **https://www.dredgeindia.com/**

మునిషన్స్ ఇండియా లిమిటెడ్‌లో 50 అప్రెంటిస్‌లు

మునిషన్స్ ఇండియా లిమిటెడ్, అమ్యునిషన్ ఫ్యాక్టరీ, ఖడ్కీ యూనిట్‌లో వివిధ విభాగాల్లో డిప్లొమా, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీల సంఖ్య: 50.
- ఖాళీల వివరాలు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్(ఇంజనీర్)–25, డిప్లొమా అప్రెంటిస్(టెక్నీషియన్)–25.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీటెక్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.
- స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.12,300, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.10,900.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా. దరఖాస్తును ది చీఫ్ జనరల్ మేనేజర్, అమ్యునిషన్ ఫ్యాక్టరీ కడ్కీ, పుణె, మహారాష్ట్ర చిరునామకు పంపించాలి.
- దరఖాస్తులకు చివరితేది: 10.12.2025.
- వెబ్‌సైట్: **https://munitionsindia.in**

ఐఐబీఎఫ్, ముంబైలో 10 పోస్టులు

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(ఐఐబీఎఫ్) జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 10.
- అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, గ్రాడ్యుయేట్, ఎంకాం, ఎంఏ /ఎంబీఏ/సీఏ/సీఎంఏ/సీఎస్/సీఎఫ్ఏ ఉ త్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. వయసు:01.11.2025నాటికి 28ఏళ్లు మించకూడదు.
- వేతనం: నెలకు రూ.40,400 నుంచి రూ.1,30,400.
- ఎంపిక విధానం: షార్ట్‌లిస్టింగ్, ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 12.12.2025.
- వెబ్‌సైట్: **https://www.iibf.org.in**

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
436	121
84,666	25,840

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,591	△	44
డోజోన్స్	47,761	△	22
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,645	▽	1
డాక్స్	24,153	△	107
షాంఘై	3,910	▽	15
నికాయ్	50,655	△	73

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	89.70	90.72
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.80	121.76
€	యూరో	ఎస్‌బీఐ	103.70	106.49
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	46.00	59.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	58.53	60.84
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.98	70.69
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.08	24.58
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.58	24.84
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.85	13.67

స్మార్ట్ ఫోన్ రేట్లకు రెక్కలు

సాక్షి, బిజినెస్ డెస్క్

మెమరీ, స్టోరేజ్ చిప్‌లకు కొరత నెలకొన్న నేపథ్యంలో దేశీయంగా స్మార్ట్‌ఫోన్ల రేట్లకు రెక్కలు వస్తున్నాయి. ఇప్పటికే కొన్ని కంపెనీలు ధరలను పెంచేయగా మరికొన్ని అదే బాటలో ఉన్నాయి. డివైజ్‌లలో పర్మనెంట్ డేటాను నిల్వచేసే సెమీకండక్టర్ చిప్‌లను అమర్చే స్టోరేజ్ మాడ్యూల్స్ ధర నెలవారీగా, సామర్థ్యాన్ని బట్టి 20–60 శాతం మేర పెరిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కంపెనీల నుంచి భారీగా డిమాండ్ నెలకొనడంతో 1టీబీ (టెరాబైట్) మాడ్యూల్స్ కొరత తీవ్రంగా ఉంటోందని వివరించారు. అదే సమయంలో పాత టెక్నాలజీల నుంచి పరిశ్రమ దశలవారీగా నిష్క్రమిస్తున్న కొద్దీ 512 జీబీ మాడ్యూల్స్ రేట్లు సుమారు 65 శాతం పెరిగాయి. తీవ్ర కొరత కారణంగా 256 జీబీ మాడ్యూల్స్ ధరలు కూడా పెరుగుతున్నాయి. స్టోరేజ్ మాడ్యూల్స్‌తో పోలిస్తే కాస్త తక్కువే అయినప్పటికీ, తాత్కాలిక, హై–స్పీడ్ డేటాను స్మార్ట్‌ఫోన్లు, పర్సనల్ కంప్యూటర్స్, ఇతరత్రా డివైజ్‌లలో నిల్వ చేసేందుకు ఉపయోగించే డైనమిక్ ర్యాండమ్ యాక్సెస్ మెమొరీ (డీఆర్‌ఏఎం) మాడ్యూల్స్‌పైనా ప్రభావం పడుతోంది. డీఆర్‌ఏఎం రేట్లు 18–25 శాతం పెరిగాయి. వేఫర్‌ల కొరతకు సంబంధించిన పరిస్థితులు ఇప్పుడప్పుడే మెరుగుపడే అవకాశం లేదని నిపుణులు అంటున్నారు. దీంతో కాంట్రాక్ట్ ధరలు వచ్చే ఏడాది కూడా పెరిగే అవకాశమే ఉందని వివరించారు.

- మెమరీ, స్టోరేజ్ చిప్‌ల కొరతే కారణం
- ఇప్పటికే కొంత పెంచిన కొన్ని కంపెనీలు
- మరో 50 శాతం వరకు పెరిగే అవకాశం

బడ్జెట్ సెగ్మెంట్‌పై ప్రభావం..

కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ ప్రకారం, మెమరీ చిప్‌ల ధరలు ఈ ఏడాది ఇప్పటికే 50 శాతం పెరిగాయి. 2025 నాలుగో త్రైమాసికంలో ఇవి మరో 30 శాతం జంప్ చేయొచ్చని, అలాగే 2026 తొలినాళ్లలో ఇంకో 20 శాతం పెరగొచ్చని అంచనాలు నెలకొన్నాయి. ప్రధాన స్రవంతిలో ఉపయోగించే ఉత్పత్తులకు మెమరీ మాడ్యూల్స్ సరఫరాను తగ్గించి ఏఐ అప్లికేషన్స్‌కి అధునాతన చిప్‌లను సరఫరా చేయడంపై సప్లయర్లు మరింతగా దృష్టి పెడుతుండటం ఇందుకు కారణమని నిపుణులు పేర్కొన్నారు. మైక్రాన్‌లాంటి కంపెనీలు ఏఐకి ప్రాధాన్యమిస్తూ కన్జూమర్ మెమరీ ప్రోడక్టుల తయారీని నిలిపివేయనున్నట్లు ఇటీవల ప్రకటించాయి. దీనితో బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ల సెగ్మెంట్‌పై అత్యధికంగా ప్రభావం పడుతోందని నిపుణులు వివరించారు. అయితే, మధ్య స్థాయి నుంచి హై–ఎండ్ డివైజ్‌లపైనా ధరలపరమైన ఒత్తిడి నెలకొంటోందని పేర్కొన్నారు. వివో, ఒప్పో, రియల్‌మీ, ట్రాన్షన్ లాంటి స్మార్ట్‌ఫోన్ బ్రాండ్లు ఇప్పటికే తమ ప్రస్తుత మోడల్స్‌పై రేట్లను రూ. 500 నుంచి రూ. 2,000 వరకు పెంచాయి. ముడి వస్తువుల రేట్లు పెరుగుతుండటంతో, కొత్తగా లాంచ్ చేసే వాటి ధర గత రేటు కన్నా మరో 10 శాతం అధికంగా ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. 2026 ప్రథమార్ధంలోనూ ఇదే ధోరణి కొనసాగవచ్చని రిటైలర్లు అంచనా వేస్తున్నారు.

పీసీలకు కూడా సెగ..

డెస్క్ టాప్ పీసీలు, నోట్‌బుక్‌ల విడి భాగాలకు కూడా కొరత నెలకొంది. దీంతో వాటి ధరలు కూడా పెరుగుతున్నాయి. కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ ప్రకారం చాలా మోడల్స్‌కి సంబంధించి మెటీరియల్స్ వ్యయం 15 శాతం పైగా పెరిగింది. దీంతో కంపెనీల మార్జిన్లపై ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో డెల్, అసూస్, లెనొవొ, హెచ్‌పీ లాంటి కంపెనీలన్నీ మరింతగా రేట్లను పెంచే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలుస్తోంది. రాబోయే రోజుల్లో ఎదురయ్యే కొరతను అధిగమించేందుకు అసూస్, లెనొవొ తదితర సంస్థలు తమ మెమరీ చిప్‌ల నిల్వలను పెంచుకుంటున్నాయి. అయినప్పటికీ వ్యయాలు మాత్రం తగ్గటం లేదు. దీంతో డెల్ లాంటి సంస్థలు తమ ఉత్పత్తుల ధరలు 15–20 శాతం మేర పెరగొచ్చని వెల్లడించాయి. ఇలా ధరల పెరుగుదల వల్ల డిమాండ్ నెమ్మదించి, అమ్మకాల వృద్ధిపైనా ప్రభావం పడొచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

చరిత్ర సృష్టించిన చైనా..!

వాషింగ్టన్: అమెరికా టారిఫ్‌లు చైనా వాణిజ్య జైత్రయాత్రకు బ్రేకులు వేయలేకపోయాయి. ప్రపంచ దేశాలతో వాణిజ్యం ఎలా చేయాలో తనను చూసి నేర్చుకోండన్నట్టుగా.. డ్రాగన్ వాణిజ్య మిగులును అంతకంతకూ పెంచుకుంటూ పోతోంది. ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.90 లక్షల కోట్లు) వాణిజ్య మిగులును సాధించిన తొలి దేశంగా చైనా చరిత్రను సృష్టించింది. ఈ ఏడాది చైనా 3.6 ట్రిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు చేయగా, ఇదే సమయంలో 2.6 ట్రిలియన్ డాలర్ల దిగుమతులు చేసుకుంది. 2010లో ప్రపంచ దేశాలతో చైనా వాణిజ్య మిగులు 0.18 ట్రిలియన్ డాలర్లుగానే ఉంది. 2015 నాటికి 0.59 ట్రిలియన్ డాలర్లు, 2025 నాటికి 1.08 ట్రిలియన్ డాలర్లకు పెంచుకోవడం ద్వారా తయారీలో సూపర్ పవర్‌గా కొనసాగుతోంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టగానే చైనాపై టారిఫ్‌లు బాదేయడం తెలిసిందే. ఈ టారిఫ్‌ల కారణంగా అమెరికాకు చైనా వస్తు ఎగుమతులు నవంబర్‌లో 29 శాతం పడిపోయాయి. వరుసగా ఎనిమిదో నెల చైనా నుంచి యూఎస్‌కు ఎగుమతులు క్షీణతను చూశాయి. అమెరికా బెదిరింపులకు డ్రాగన్ ఏమాత్రం బెదరలేదు. సరికదా తన వాణిజ్యాన్ని మరింత విస్తృతం చేసుకోవడంపై దృష్టి పెట్టింది. ఇతర దేశాలకు ఎగుమతులు పెంచుకోవడం ద్వారా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నట్టు స్పష్టమవుతోంది.





భారీ పెట్టుబడులకు మైక్రోసాఫ్ట్ సై

భారత్‌లో రూ. 1.58 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ రానున్న నాలుగేళ్ల కాలం(2026–29)లో భారత్‌లో ఏఐ–ఫస్ట్ భవిష్యత్‌కు వీలుగా భారీగా ఇన్వెస్ట్ చేసే ప్రణాళికల్లో ఉన్నట్లు వెల్లడించింది. మౌలికసదుపాయాలు, నైపుణ్యాలు, స్వదేశీ(సావరిన్) సామర్థ్యాల పెంపులో భారత్‌కు సహాయంగా 17.5 బిలియన్ డాలర్లు(రూ. 1.58 లక్షల కోట్లు) వెచ్చించే యోచనలో ఉన్నట్లు విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ దిగ్గజం సీఈవో సత్య నాదెళ్ల తాజాగా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తద్వారా దేశ భవిష్యత్‌కు అవసరమైన ఏఐ అభివృద్ధికి సహకరించనున్నట్లు తెలియజేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యాక సత్య నాదెళ్ల తాజా వివరాలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాగా.. భారత్‌లో ఈ ఏడాది 3 బిలియన్ డాలర్లు(రూ. 27,000 కోట్లు) వెచ్చించనున్నట్లు 2025 జనవరిలో మైక్రోసాఫ్ట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. 2026 చివరికల్లా ఈ నిధులను వెచ్చించనుంది.

ఆసియాలో తొలిసారి

ఆసియాలోనే తొలిసారి అత్యంత భారీగా ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఎక్స్‌లో సత్య నాదెళ్ల వివరించారు. దేశ ఏఐ–ఫస్ట్ భవిష్యత్‌కు మద్దతుగా పెట్టుబడులు చేపట్టనున్నట్లు తెలియజేశారు. కాగా.. మైక్రోసాఫ్ట్ ఇండియా ఏఐ టూర్‌కంటే ముందుగా ప్రధాని మోదీని సత్య నాదెళ్ల కలిసినట్లు మైక్రోసాఫ్ట్ ఒక ప్రకటనలో పేర్కొంది. దేశ ఏఐ ప్రణాళికలు(రోడ్‌మ్యాప్), వృద్ధి ప్రాధాన్యతలపై ఈ సందర్భంగా చర్చించినట్లు వెల్లడించింది.

85,000 కిందికి సెన్సెక్స్

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన నిర్ణయాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ బ్యాంకులు, చమురు షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలూ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 436 పాయింట్లు కోల్పోయి 85వేల స్థాయి దిగువన 84,666 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 121 పాయింట్లు పతనమై 25,840 వద్ద నిలిచింది. ఈ ముగింపు సూచీలకు 2 వారాల కనిష్ట స్థాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాల ప్రభావంతో సూచీలు ఉదయం స్వల్ప నష్టాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచే అమ్మకాల ఒత్తిడి నెలకొంది. ఒక దశలో సెన్సెక్స్ 720 పాయింట్లు క్షీణించి 84,383 వద్ద, నిఫ్టీ 233 పాయింట్లు పతనమై 25,728 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. అయితే దిగువ స్థాయిల వద్ద కొన్ని బ్లూచిప్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాలు కొంతమేర తగ్గాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 18 పైసలు బలపడి 89.87 వద్ద స్థిరపడింది.

సాక్షి స్పోర్ట్స్

శ్రీనివాస్ ‘ట్రిపుల్’ ధమాకా... క్యారమ్ ప్రపంచకప్‌లో స్వర్ణాలన్నీ భారత్‌కే

సాక్షి, హైదరాబాద్: క్యారమ్ ప్రపంచకప్ టోర్నమెంట్‌లో తెలంగాణ ఆటగాడు శ్రీనివాస్ ‘ట్రిపుల్’ ధమకా సాధించాడు. మాల్దీవులులో జరిగిన ఈ మెగా ఈవెంట్‌లో అతను మూడు పతకాలు సాధించడం విశేషం. స్విస్ లీగ్ ఈవెంట్‌లో కాంస్యం నెగ్గిన ఈ సీనియర్ ప్లేయర్... పురుషుల డబుల్స్‌లో అభిజిత్ త్రిపాంకర్‌తో కలిసి టైటిల్ సాధించాడు. పురుషుల వ్యక్తిగత ఫైనల్లో ప్రశాంత్ మోరే చేతిలో ఓడిపోవడంతో రజతం సాధించాడు. టైటిల్ పోరులో హైదరాబాదీ ప్లేయర్ 25–5, 11–25, 18–25తో ప్రశాంత్ మోరె చేతిలో కంగుతిన్నాడు. తద్వారా స్వర్ణ, రజత, కాంస్య పతకాలతో శ్రీనివాస్ ప్రపంచకప్‌లో కీలక పాత్ర పోషించాడు. బంగారు పతకాలన్నీ భారత జట్టుకే లభించడం మరో విశేషం. పురుషుల డబుల్స్‌లో స్వర్ణంతో పాటు రజతం కూడా భారత జోడీలకే దక్కాయి. దీంతో భారత్ 7 పసిడి పతకాలు సహా 4 రజతాలు, 3 కాంస్యాలతో మొత్తం 14 పతకాలు నెగ్గింది.


హార్దిక్ పాండ్యా

హార్దిక్ సూపర్ షో

28 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 59 నాటౌట్

భారత జట్టులోకి కొంత విరామం తర్వాత పునరాగమనం చేసిన హార్దిక్ పాండ్యా తన వాడిని, స్థాయిని ప్రదర్శించాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకొని వచ్చి అంచనాలకు తగినట్లుగా చెలరేగుతూ ఒంటి చేత్తో జట్టును గెలిపించాడు. ఇతర బ్యాటర్లంతా విఫలమైన వేళ పాండ్యా మెరుపులతో భారీ స్కోరు నమోదు చేసిన భారత్... ఆ తర్వాత దక్షిణాఫ్రికాను 75 బంతుల్లోనే 74 పరుగులకు కుప్పకూల్చింది. టీమిండియా పటిష్ట బౌలింగ్‌ను ఎదుర్కోలేక సఫారీలు పూర్తిగా చతికిలపడటంతో ఆట ఏకపక్షంగా మారిపోయింది. దాంతో బారాబతి స్టేడియంలో దక్షిణాఫ్రికాపై భారత్ తొలి విజయాన్ని అందుకుంది. ఈ మైదానంలో గతంలో దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టి20 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

- తొలి టి20లో భారత్ ఘన విజయం
- 101 పరుగులతో దక్షిణాఫ్రికా చిత్తు
- ముల్లాన్‌పూర్‌లో రేపు రెండో టి20

తిలక్, బుమ్రా

కటక్: దక్షిణాఫ్రికాతో మొదలైన టి20 సిరీస్‌లో అలవోక విజయాన్ని అందుకొని భారత్ 1–0తో ముందంజ వేసింది. బారాబతి స్టేడియంలో మంగళవారం రాత్రి జరిగిన తొలి టి20లో భారత్ 101 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ హార్దిక్ పాండ్యా (28 బంతుల్లో 59 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఆటతో చెలరేగాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎన్‌గిడికి 3 వికెట్లు దక్కాయి. అనంతరం దక్షిణాఫ్రికా 12.3 ఓవర్లలో 74 పరుగులకే ఆలౌటైంది. టి20ల్లో ఆ జట్టుకు ఇదే అత్యల్ప స్కోరు. డెవాల్డ్ బ్రెవిస్ (22) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇరు జట్ల మధ్య రెండో టి20 గురువారం ముల్లాన్‌పూర్‌లో జరుగుతుంది.

ఓపెనర్లు విఫలం...

భారత్ స్కోరు ఒకదశలో 17/2, ఆపై 48/3... 14 ఓవర్లు ముగిసేసరికి 104/5... ఈ క్రమాన్ని చూస్తే భారత్ భారీ స్కోరు చేయడం అసాధ్యమనిపించింది. కానీ చివర్లో ఒక్క పాండ్యా బ్యాటింగ్‌తో అంతా మారిపోయింది. ఆఖరి 6 ఓవర్లలో భారత్ 71 పరుగులు సాధించగలిగింది. భారత ఇన్నింగ్స్‌కు సరైన ఆరంభం లభించలేదు. పునరాగమనంలో శుబ్‌మన్ గిల్ (4) ఇన్నింగ్స్ మూడు బంతులకే పరిమితం కాగా, ఎన్‌గిడి ఓవర్లో వరుసగా 4, 6 కొట్టిన సూర్యకుమార్ (12) తర్వాతి బంతికి వెనుదిరిగాడు. పవర్‌ప్లేలో జట్టు 40 పరుగులు చేయగా, అభిషేక్ శర్మ (17) జోరు ఎక్కువ సేపు సాగలేదు. ఈ దశలో తిలక్ వర్మ (32 బంతుల్లో 26; 2 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్ పటేల్ (21 బంతుల్లో 23; 1 సిక్స్) కలిసి కొద్దిసేపు పట్టుదల కనబర్చారు. అయితే వీరిద్దరు నెమ్మదిగా ఆడుతూ 31 బంతుల్లో 30 పరుగులే జోడించగలిగారు. అయితే పాండ్యా వచ్చీ రాగానే మహరాజ్ ఓవర్లో 2 సిక్సర్లు బాది ఆటకు ఊపు తెచ్చాడు. తర్వాత నోర్జే ఓవర్లోనూ అతను 2 ఫోర్లు కొట్టాడు. మరో ఎండ్‌లో శివమ్ దూబే (11) అవుటైన తర్వాత పాండ్యా దూకుడు కొనసాగింది. సిపామ్లా వేసిన 19వ ఓవర్లో వరుసగా 6, 4 కొట్టిన పాండ్యా...నోర్జే వేసిన 20వ ఓవర్లోనూ 6, 4 కొట్టి 25 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

టపటపా...

ఛేదనలో దక్షిణాఫ్రికా మొదటి నుంచే తడబడింది. ఇన్నింగ్స్ రెండో బంతికే డికాక్ (0)ను అవుట్ చేసిన అర్ష్‌దీప్, తన తర్వాతి ఓవర్లో స్టబ్స్ (14)ను వెనక్కి పంపాడు. అక్షర్ తన తొలి బంతికే మార్క్‌రమ్ (14) బౌల్డ్ చేయగా, పాండ్యా కూడా తన తొలి బంతికే మిల్లర్ (1) ఆట కట్టించాడు. తర్వాతి ఓవర్లో వరుణ్ బంతిని ఆడలేక ఫెరీరా (5) కీపర్‌కు క్యాచ్ ఇవ్వడంతో దక్షిణాఫ్రికా 50/5 వద్ద నిలిచింది. రెండు సిక్స్‌లు బాదిన యాన్సెన్ (12) కూడా వరుణ్ బంతికే బౌల్డ్ కాగా... మరో ఎండ్‌లో కొన్ని చక్కటి షాట్లతో బ్రెవిస్ పోరాడే ప్రయత్నం చేశాడు. అయితే బ్రెవిస్‌ను చక్కటి బంతితో బుమ్రా డగౌట్‌కు పంపడంతో దక్షిణాఫ్రికా ఆశలు కోల్పోయింది.

101 అంతర్జాతీయ టి20ల్లో బుమ్రా వికెట్ల సంఖ్య. అర్ష్‌దీప్ సింగ్ (107) తర్వాత వంద వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా బుమ్రా నిలిచాడు.

100 అంతర్జాతీయ టి20ల్లో హార్దిక్ పాండ్యా సిక్సర్ల సంఖ్య. కోహ్లి, సూర్యకుమార్, రోహిత్ తర్వాత ఈ మైలురాయిని అందుకున్న నాలుగో భారత ఆటగాడిగా పాండ్యా నిలిచాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) యాన్సెన్ (బి) సిపామ్లా 17; గిల్ (సి) యాన్సెన్ (బి) ఎన్‌గిడి 4; సూర్యకుమార్ (సి) మార్క్‌రమ్ (బి) ఎన్‌గిడి 12; తిలక్ (సి) యాన్సెన్ (బి) ఎన్‌గిడి 26; అక్షర్ (సి) ఫెరీరా (బి) సిపామ్లా 23; పాండ్యా (నాటౌట్) 59; దూబే (బి) ఫెరీరా 11; జితేశ్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 175. వికెట్ల పతనం:** 1–5, 2–17, 3–48, 4–78, 5–104, 6–137. **బౌలింగ్:** ఎన్‌గిడి 4–0–31–3, యాన్సెన్ 4–0–23–0, సిపామ్లా 4–0–38–2, నోర్జే 4–0–41–0, మహరాజ్ 2–0–25–0, ఫెరీరా 2–0–13–1. **దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:** డికాక్ (సి) అభిషేక్ (బి) అర్ష్‌దీప్ 0; మార్క్‌రమ్ (బి) అక్షర్ 14; స్టబ్స్ (సి) జితేశ్ (బి) అర్ష్‌దీప్ 14; బ్రెవిస్ (సి) సూర్యకుమార్ (బి) బుమ్రా 22; మిల్లర్ (సి) జితేశ్ (బి) పాండ్యా 1; ఫెరీరా (సి) జితేశ్ (బి) వరుణ్ 5; యాన్సెన్ (బి) వరుణ్ 12; మహరాజ్ (సి) జితేశ్ (బి) బుమ్రా 0; నోర్జే (బి) అక్షర్ 1; సిపామ్లా (సి) అభిషేక్ (బి) దూబే 2; ఎన్‌గిడి (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (12.3 ఓవర్లలో ఆలౌట్) 74.**
వికెట్ల పతనం: 1–0, 2–16, 3–40, 4–45, 5–50, 6–68, 7–68, 8–70, 9–72, 10–74. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 2–0–14–2, బుమ్రా 3–0–17–2, వరుణ్ 3–1–19–2, అక్షర్ 2–0–7–2, పాండ్యా 2–0–16–1, దూబే 0.3–0–1–1.

శ్రీలంకతో టి20 సిరీస్‌కు శ్రీచరణి, అరుంధతి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే ప్రపంచకప్ గెలిచిన అనంతరం భారత జట్టు ఆడనున్న తొలి టి20 సిరీస్ కోసం మంగళవారం జట్టును ప్రకటించారు. 15 మందితో కూడిన ఈ జట్టులో తెలుగమ్మాయిలు నల్లపురెడ్డి శ్రీచరణి, అరుంధతి రెడ్డి చోటు దక్కించుకున్నారు. సీనియర్ ప్లేయర్లతో పాటు ఇద్దరు కొత్త ప్లేయర్లను ఈ సిరీస్ కోసం ఎంపిక చేశారు. మహిళల ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 17 ఏళ్ల వికెట్ కీపర్ బ్యాటర్ కమలినితో పాటు 19 ఏళ్ల వైష్ణవి శర్మ తొలిసారి జాతీయ సీనియర్ జట్టులోకి ఎంపికయ్యారు. రాధ యాదవ్, ఉమ ఛెత్రీ స్థానాల్లో వీరు జట్టులోకి వచ్చారు. ఈ నెల 21 నుంచి సొంతగడ్డపై టీమిండియా శ్రీలంకతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. తొలి రెండు మ్యాచ్‌లు విశాఖపట్నంలో జరగనుండగా... మిగిలిన మూడు మ్యాచ్‌లకు తిరువనంతపురం వేదిక కానుంది. భారత జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహిస్తుండగా... స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. వన్డే ప్రపంచకప్ స్టార్‌లు షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్ జట్టులో ఉన్నారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం భారత జట్టు బంగ్లాదేశ్‌తో సిరీస్ ఆడాల్సి ఉండగా... రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో దాన్ని వాయిదా వేసి ఆ స్థానంలో శ్రీలంక సిరీస్‌ను ఏర్పాటు చేశారు. భారత జట్టు గతేడాది ప్రపంచకప్‌లో శ్రీలంకతో చివరిగా టి20 మ్యాచ్ ఆడింది.

భారత మహిళల టి20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), దీప్తి శర్మ, స్నేహ్ రాణా, జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, హర్లీన్ డియోల్, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, రేణుక సింగ్ ఠాకూర్, రిచా ఘోష్, కమలిని, శ్రీచరణి, వైష్ణవి శర్మ.

ఐపీఎల్ వేలం బరిలో 350 మంది

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

‘సాక్షి’ చానల్‌ను ఎలా బ్లాక్ చేస్తారు?

- వార్తా చానల్‌ను అంధకారంలోకి నెట్టేయడం అత్యంత తీవ్రమైన అంశం
- బాబు సర్కారుపై సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ నరసింహ ధర్మాసనం ఆగ్రహం
- ఇది ముమ్మాటికీ భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమేనని మండిపాటు
- ఈ అన్యాయంపై తక్షణమే విచారణ జరపాలని టీడీ శాట్‌కు ఆదేశాలు
- ‘సాక్షి’ గొంతు నొక్కాలన్న కుతంత్రంపై సర్వోన్నత న్యాయస్థానం నిలదీత
- ప్రసారాల నిలిపివేతపై తీవ్ర ఆగ్రహం.. బాబు సర్కార్‌కు మొట్టికాయలు
- ట్రిబ్యునల్ విచారణను మార్చి నెలకు వాయిదా వేయడంపై అసహనం
- వెంటనే విచారణ చేపట్టి న్యాయం చేయాలని స్పష్టమైన ఆదేశాలు
- ప్రభుత్వం మారాక కక్షగట్టారు.. ఫైబర్ నెట్ అబద్ధాలు ఆడుతోంది
- ‘సాక్షి’ తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదన

సాక్షి, న్యూఢిల్లీ: చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ‘సాక్షి’ టీవీపై సాగిస్తున్న కక్షసాధింపు చర్యలకు దేశ సర్వోన్నత న్యాయస్థానంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సాక్షి టీవీ ప్రసారాలను రాష్ట్రవ్యాప్తంగా అడ్డగోలుగా నిలిపివేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ‘‘ఒక వార్తా చానల్‌ను పూర్తిగా అంధకారంలోకి నెట్టేయడం (కంప్లీట్ బ్లాక్ ఔట్) అత్యంత తీవ్రమైన అంశం’’ అని మండిపడింది. ఈ అన్యాయంపై తక్షణమే విచారణ జరిపి పరిష్కరించాలని టెలికం డిస్ప్యూట్స్ సెటిల్‌మెంట్ అండ్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (టీడీ శాట్)ను ఆదేశించింది. పూర్తిగా ప్రసారాలు నిలిపివేసిన తరుణంలో... ట్రిబ్యునల్ తదుపరి విచారణను వచ్చే ఏడాది మార్చి నెలకు వాయిదా వేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. పిటిషనర్ అభ్యర్థన మేరకు విచారణను ముందే ముగించాలని టీడీ శాట్‌ను ఆదేశించింది. ఇది అత్యవసరమని, భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన అంశమని స్పష్టం చేసింది. చానల్ ప్రసారాలను పునరుద్ధరించేలా ఆదేశించాలంటూ సాక్షి టీవీ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారణ సందర్భంగా జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్కర్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది.

ఫైబర్‌నెట్ నుంచే కుట్ర

సాక్షి ప్రసారాల నిలిపివేత కుట్రలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఏపీ ఫైబర్‌నెట్ ప్రధాన పాత్ర పోషిస్తోందని సాక్షి తరపు న్యాయవాదులు వాదించారు. ఈ వ్యవహారంపై గతంలోనే ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ పటేల్ తీవ్రంగా స్పందించారని, ఫైబర్ నెట్ అధికారులు పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని మండిపడ్డారని రోహత్గీ ప్రస్తావించారు. అయినా, ప్రభుత్వం తీరు మారలేదని, బ్లాక్ ఔట్ కొనసాగుతూనే ఉందని తెలిపారు.

ప్రజల గొంతుకను అణచివేస్తున్నారు

‘‘ఏపీలో ప్రభుత్వం మారిన కేవలం రెండు వారాల్లోనే, రాజకీయ దురుద్దేశంతో సాక్షి టీవీ ప్రసారాలను నిలిపివేశారు. 2024 జూన్ 3 వరకు ప్రజలకు అత్యంత చేరువలో ఉన్న చానల్‌ను జూన్ 20 తర్వాత కుట్రపూరితంగా అడ్డుకున్నారు’’ అని ‘సాక్షి’ టీవీ తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, నిరంజన్‌రెడ్డి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. ప్రభుత్వం నేరుగా ఆదేశాలు ఇవ్వకుండా, వెనుక ఉండి ఎంఎస్‌వోలను భయభ్రాంతులకు గురిచేస్తోందని రోహత్గీ వాదించారు. ఎలాంటి రాతపూర్వక ఉత్తర్వులు లేకుండానే, కేవలం మౌఖిక ఆదేశాలతో సాక్షి ప్రసారాలను అడ్డుకుంటున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసినా చానల్‌ను ఆపేశామని చెబుతున్నారే తప్ప, కనీసం వినియోగదారుడు కోరుకుంటే ఇచ్చే పద్ధతిలోనూ ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని నివేదించారు. మీడియా స్వేచ్ఛను బాబు సర్కారు కాలరాస్తోందని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు.

ఇంటికొక పారిశ్రామికవేత్త సంగతి సరే... మమ్మల్ని బిచ్చగాళ్లుగా మార్చొద్దు

- చంద్రబాబు ప్రభుత్వంపై ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల ఆగ్రహం
- పారిశ్రామిక రాయితీలు విడుదల చేయకుండా ఆర్థికంగా దెబ్బతీస్తున్నారని మండిపాటు
- ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ఆరో రోజూ కొనసాగిన ధర్నా

మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశ్రామికవేత్తలు

సాక్షి, అమరావతి/మంగళగిరిటౌన్: ‘ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేస్తానని సీఎం చంద్రబాబు చెబుతున్నారు. కానీ, ఆచరణలో మాత్రం ఆయన ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలపై తీవ్ర వివక్ష చూపుతున్నారు. మాకు రావాల్సిన పారిశ్రామిక రాయితీలను విడుదల చేయకుండా ఆర్థికంగా దెబ్బతీస్తున్నారు. అప్పులు చేసి పరిశ్రమలు పెట్టుకున్న మేమంతా కుదేలైపోతున్నాం. ఇంటికొక పారిశ్రామికవేత్త సంగతేమో గానీ చిన్నచిన్న పరిశ్రమలు పెట్టుకుని ఉపాధి పొందుతూ నలుగురికి పని కల్పిస్తున్న మమ్మల్ని భిక్షగాళ్లుగా మార్చొద్దు...’ అని పలువురు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఆగ్రహం వ్యక్తంచేశారు. పారిశ్రామిక రాయితీలు విడుదల చేయాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా ఆరో రోజు మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు ఎస్సీ, ఎస్టీ ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలు మాట్లాడుతూ తమకు వెంటనే ప్రభుత్వం పారిశ్రామిక రాయితీలు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. వీరికి జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడా శ్రావణ్‌కుమార్ మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు అంటే చంద్రబాబు ప్రభుత్వానికి చిన్నచూపని ఆగ్రహం వ్యక్తంచేశారు. బడా పారిశ్రామికవేత్తలకు 100 శాతం రాయితీలు విడుదల చేసిన ప్రభుత్వం, ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపుతూ కేవలం 20 నుంచి 40 శాతం మాత్రమే రాయితీలు విడుదల చేయడం దుర్మార్గమన్నారు. ఒకవైపు బడా పారిశ్రామికవేత్తలకు వేల కోట్ల రూపాయల విలువైన భూములను ఉచితంగా దోచిపెడుతున్నారని, మరోవైపు అప్పులు చేసి చిన్నచిన్న పరిశ్రమలు పెట్టుకున్న ఎస్సీ, ఎస్టీలు న్యాయంగా తమకు రావాల్సిన రాయితీల కోసం ఆరు రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం చంద్రబాబు ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తల జేఏసీ నాయకులు ఈదుపుగంటి అనార్‌బాబు, ఈరా రాజశేఖర్, పినమాల నాగకుమార్, కనపర్తి విజయరాజు, కొడాలి రాంబాబు, అన్నవరపు అవినాష్ రామకృష్ణ, సరిహద్దు దయాకర్, రామ్మూర్తి నాయక్, భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

1,299 గ్రామీణ రహదారులు బలోపేతం

సాక్షి, అమరావతి: రాష్ట్ర గ్రామీణ రహదారుల బలోపేతం ప్రాజెక్టు కింద 1,299 గ్రామీణ రహదారుల నిర్మాణానికి రూ.2,123 కోట్లకు పరిపాలన అనుమతి మంజూరు చేస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశి భూషణ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఏపీలో 484 మండలాల్లోని 4,007 కిలో మీటర్ల మేర రహదారులను బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యాజ్య విధానం పరిశీలనకు మంత్రుల కమిటీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాజ్య (లిటిగేషన్) విధానం–2025 పరిశీలనకు మంత్రులతో కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయ, రెవెన్యూ, హోం, పౌరసరఫరాలు, వైద్యశాఖ మంత్రులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ కార్యకలాపాలను సమన్వయం చేయడానికి న్యాయ శాఖ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించడానికి, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి అవసరమైన సిఫార్సులను ఈ కమిటీ చేయనుంది.

డేటా గవర్నెన్స్ ఎథిక్స్ కమిటీ ఏర్పాటు

ప్రణాళికా శాఖ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: జీరో పావర్టీ సాధనలో భాగంగా కుటుంబ ప్రయోజన నిర్వహణ వ్యవస్థ కార్యక్రమం అమలు కోసం రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలతో స్కోర్ లెక్కించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇందుకోసం ఒక విధానాన్ని అభివృద్ధి చేయడం, అమలు చేయడానికి ఐటీ శాఖ డైరెక్టర్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, కాన్పూర్ ఐఐటీ, ఐఐటీ తిరుపతి ప్రతినిధులు, ప్రణాళికా శాఖ డైరెక్టర్లతో డేటా గవర్నెన్స్ ఎథిక్స్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరుగురు పదో తరగతి విద్యార్థుల అదృశ్యం

రాంబిల్లి (అచ్యుతాపురం): అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని బీసీటీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు అదృశ్యమయ్యారు. ఈ విషయమై పాఠశాల యాజమాన్యం మంగళవారం రాత్రి 8 గంటలకు ఫిర్యాదు చేసినట్లు సీఐ నర్సింగరావు మీడియాకు తెలిపారు. మధ్యాహ్నం ఒకటిన్నర గంటల నుంచి వారు కనిపించలేదని పాఠశాల యాజమాన్యం చెబుతోంది. విద్యార్థుల కోసం మూడు పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. అదృశ్యమైన వారిలో అచ్యుతాపురం మండలం మడుతూరుకు చెందిన దేశెట్టి జశ్వంత్, రాంబిల్లి మండలం మర్రిపాలేనికి చెందిన మడగల హేమతేజ, కూర్మన్నపాలేనికి చెందిన భరత్, రోలుగుంట మండలం బలిజపాలేనికి చెందిన లక్ష్మణరావు, మాకవరపాలెం మండలం జి.కోడూరుకు చెందిన వరుణ్, ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలేనికి చెందిన రాజారావు ఉన్నారు.

నకిలీ మద్యం కేసులో జయచంద్రారెడ్డి పీఏ రాజేష్ అరెస్ట్

ములకలచెరువు : రాష్ట్రంలో సంచలనం రేపిన ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి పీఏ పి.రాజేష్‌ను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె కోర్టులో మంగళవారం రాత్రి హాజరు పరిచారు. ఈ కేసులో ఇతను ఏ5 గా ఉన్నాడు. రెండు నెలలుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న రాజేష్‌ను ఎట్టకేలకు పట్టుకుని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా, 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ కేసులో 33 మంది నిందితులు ఉండగా, ఇప్పటి వరకు 30 మందిని అరెస్టు చేసి రిమాండ్ విధించారు.

లైంగిక వేధింపుల నిందితులపై చర్యలు తీసుకోండి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

సాక్షి, అమరావతి: తిరుపతి సంస్కృత వర్సిటీలో విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన అధ్యాపకులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఆదేశించారు. మంగళవారం తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడుతో ఆమె మాట్లాడి.. ఘటన గురించి తెలుసుకున్నారు. బాధితురాలు పది రోజుల క్రితమే వర్సిటీ వీసీ కృష్ణమూర్తికి ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదుపై చేపట్టిన చర్యలు, వర్సిటీలోని అంతర్గత ఫిర్యాదుల కమిటీ పనితీరును పరిశీలించి నివేదిక పంపాలని మహిళా కమిషన్ సభ్యురాలు రుకియా బేగంను శైలజ ఆదేశించారు. అలాగే తిరుపతిలో ఓ బాలికపై అఘాయిత్యం చేసిన ఆటో డ్రైవర్‌పై తక్షణమే పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని పోలీసులకు శైలజ ఆదేశాలు ఇచ్చారు.

కలుపుగోలు వ్యాపారం

అంపోలు జంక్షన్ వద్ద రెడ్డిచెరువులో కంపు మొక్కలు కోస్తూ..

సీఎస్పీ రోడ్డులో లోడింగ్ కోసం ఉంచిన కంపు మొక్కలు

ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ..

- చెరువులో దొరికే రబ్బరు మొక్కలతో శ్రీకాకుళం జిల్లాలో భలే వ్యాపారం
- ఇసుక వాహనాలు నదుల్లో కూరుకుపోకుండా వాడుకుంటున్న వ్యాపారులు
- జోరుగా కొనసాగుతున్న మొక్కల తీత

గార: అదో కలుపు మొక్క.. రబ్బరు మొక్కలని, కంపు మొక్కలని రైతులు పిలుచుకుంటూ ఉంటారు. చెరువులో విపరీతంగా పెరిగే ఈ మొక్కలతో ఎవరికీ ఎలాంటి ఉపయోగం లేదు. పైగా చేపలు పెంచేవారికి, రైతులకు దీని వల్ల ఇబ్బంది కూడా. కానీ ఇప్పుడు అదే మొక్కతో భలే వ్యాపారం సాగుతోంది. ఈ మొక్క శాస్త్రీయ నామం 'ఐపోమియా కార్నియా'. ఉదయాన్నే పుష్పించే ఈ మొక్కను మార్నింగ్ గ్లోరీ అని కూడా పిలుస్తారు. తేమ ఉన్న ప్రాంతాలు, నీరు ఉన్న చెరువులు, జలాశయాల్లో విరివిగా పెరుగుతుంది.

వంశధార, నాగావళి నదీ ప్రాంత సాగునీటి చెరువుల్లో ఎక్కువగా కనిపిస్తుంది. చేపలు పెంచే వారితో పాటు ఉపాధి వేతనదారులు ఈ చెరువుల్లో పనులు చేయాలంటే ముందు వీటిని తొలగించాల్సి ఉంటుంది. వీటిని తొలగించేందుకు ఎలాంటి డబ్బులివ్వరు. కానీ ఈ మొక్కలను ఇటీవల కొందరు తెలివిగా ఉపయోగించుకుంటున్నారు.

గార ర్యాంపులో బాట కింద కంపు మొక్కలను పరిచి ఉంచిన దృశ్యం

రబ్బరు వంటి కాడలు ఉండటం వల్ల వీటిని పొలాల్లో ట్రాక్టర్లు దిగిపోయే సమయాలు, వరి కుప్పలు ఇంటికి తరలించే సమయాల్లో గతంలో వాడేవారు. ప్రస్తుతం ఆధునిక యంత్రాలు రావడంతో అవి బురదలో కూరుకుపోకుండా వీటి ని వాడుతున్నారు. ముఖ్యంగా నదుల నుంచి ఇసుకను తరలించేందుకు వీలుగా బాటలు వేస్తుంటారు. వీటిని ఇసుకపై వేసి మళ్లీ కొద్దిగా ఇసుక వేసి, మరోసారి ఈ రబ్బరు మొక్కలను బాటలు నిండా పరుస్తారు. 40 టన్నుల ఇసుక వాహనమైనా ఈ కంపు మొక్కలు వేసిన బాటలో దిగిపోకుండా సేఫ్‌గా నది లోంచి ఒడ్డుకు ఉపయోగిస్తుంటారు.

మరీ ముఖ్యంగా ఇసుక వ్యాపారం చేస్తున్న వారికి ఇది చక్కగా ఉపకరిస్తోంది. ఎండిపోకుండా, రబ్బరులా సాగే గుణం ఉండటంతో ఇసుక వ్యాపారస్తులు వాడుతుంటారు. వీటిని జిల్లాలో ఎచ్చెర్ల మండలం వాసులు చెరువుల నీటిలో దిగి కోత కోసి వెంటనే లోడుల ద్వారా అమ్ముతున్నారు. ట్రాక్టర్ లోడు రూ.15 వేలు వరకు గిట్టుబాటు అవుతోందని చెబుతున్నారు.

కంపు మొక్కలతో చెరువులకు ఇబ్బందే



చెరువుల్లో కంపు మొక్కలు ఏడాదికేడాది పెరిగి మొత్తం నిండిపోతాయి. దీని వల్ల చెరువంతా కప్పేసినట్టు ఉంటుంది. ఆవు లేదా ఎద్దులు వెళితే పట్టుకోవడానికి ఇబ్బందే. అదేవిధంగా చేపలు పట్టేందుకు వెళ్లే వారికి అడ్డుగా ఉంటాయి.

– శీర ఎర్రప్పడు, రైతు, వాడాడ

ఫోన్ ద్వారా ఆర్డర్

చెరువుల్లో నీటిలో ఉండే మొక్కలను కోసేందుకు మాత్రమే మనుషులను పెడతాను. ఎక్కువగా ఇసుక ర్యాంపు పాటదారులు జిల్లాలో ఎక్కడైనా నాకు ఫోన్ ద్వారా ఆర్డర్ పెడతారు. అక్కడికి వెళ్లి అమ్మేస్తుంటాను.

– కూర్మారావు, మేస్త్రీ, ఎచ్చెర్ల మండలం

చిన్న చిన్న విషయాలకే రాజీనామా చేస్తారా?

- విమాన ప్రయాణికుల ఇక్కట్లపై మంత్రి సత్యప్రసాద్ వివాదాస్పద వ్యాఖ్యలు
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును వెనకేసుకొచ్చిన మంత్రి
- మీడియా ప్రశ్నించడంతో తానలా అనలేదంటూ మాట మార్చిన అనగాని
- రుషికొండ భవనాలు వైఎస్ జగన్ సొంతానివంటూ వ్యాఖ్యలు

సాక్షి, అమరావతి: ఇండిగో ఎయిర్‌లైన్స్ సంక్షోభంపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అది ఓ చిన్న సమస్య అంటూ చులకనగా మాట్లాడారు. ఇంత చిన్నదానికే తమ పార్టీకి చెందిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడిని రాజీనామా చేయాలనడం సమంజసం కాదంటూ వెనకేసుకొచ్చారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా ఇండిగో సంక్షోభంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. చిన్న చిన్న సమస్యలకే రాజీనామా చేయాలంటే కేబినెట్లు ఉండవు, గవర్నమెంట్లు ఉండవు అని అన్నారు. ఇండిగో కావచ్చు.. రైతుల సమస్య కావచ్చు.. వాటి కోసం రాజీనామా చేయాలనడం నాట్ రైట్ అని వ్యాఖ్యానించారు. 'వారం రోజులుగా విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు కదా? దానిని చిన్న సమస్య అని ఎలా అంటారు' అని విలేకరులు అనగా.. ఎయిర్‌లైన్స్ వాళ్లదే తప్పు అని, మోనోపలీ అనేది ఇబ్బందికర పరిస్థితి వచ్చిందని అన్నారు. అయినా తాను చిన్న సమస్య అని అనలేదని, చిన్న సమస్యలకే రాజీనామా చేయడం కరెక్ట్ కాదనే అన్నానంటూ మాట మార్చారు. కానీ, పర్యవేక్షించాల్సిన బాధ్యత కేంద్ర మంత్రిపై ఉందని, కాకపోతే నిబంధనలు అమలులోకి తెచ్చినప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వానికి, కార్యదర్శులకు మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఉందని అన్నారు. రుషికొండ భవనాలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంతానికి కట్టుకొన్నాడని వ్యాఖ్యానించారు. అవి ప్రభుత్వ భవనాలని విలేకరులు అనగా.. ఆ అంశాన్ని దాటవేస్తూ యోగాడేకి కేంద్రం నిధులిచ్చిందని అన్నారు.

2027 జనవరికి రీ సర్వే 2.0 పూర్తి

రాష్ట్రంలో రీ సర్వే 2.0 ను 2027 జనవరి నాటికి పూర్తి చేస్తామని మంత్రి సత్యప్రసాద్ చెప్పారు. టెండర్ నిబంధనల కారణంగా కొత్త పాస్ పుస్తకాల జారీ ఆలస్యమౌతోందని చెప్పారు. రెవెన్యూ సమస్యలను ఏడాదిలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్లపై బాధ్యత పెడుతున్నామని చెప్పారు. రెండు నెలల్లో ఫ్రీ హోల్డ్ భూముల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ నెల 17, 18 తేదీల్లో రాష్ట్ర స్థాయి కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నట్లు మంత్రి సత్యప్రసాద్ తెలిపారు.

ఓ కారు..రూ.కోట్లు

- వారం క్రితం శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపాన కారులో నగదు స్వాధీనం
- రూ.1.20 కోట్లు ఉన్నట్లు తెలిపిన సీఐ.. కానీ రూ.20 కోట్ల దాకా ఉన్నట్లు స్థానికంగా చర్చ

సాక్షి, పుట్టపర్తి: ఓ కారు..ఇద్దరు వ్యక్తులు..రూ.కోట్ల నగదు.. పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. కానీ విషయం బయటకు చెప్పలేదు. ఎలాగోలా బయటకు వచ్చి హాట్ టాపిక్ అయ్యింది. దీంతో పెనుకొండ సీఐ రాఘవన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. పెనుకొండ సమీపంలోని ఓ ప్రాంతంలో ధ్వంసమైన కారులో నుంచి రూ.1.20 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నామని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఆ డబ్బు ఎవరిదన్నది మాత్రం తెలపలేదు.

అన్నీ అనుమానాలే

పోలీసులు స్వాధీనం చేసుకున్న డబ్బు ఎవరిది? ఎక్కడి నుంచి ఎక్కడికి తీసుకెళ్తున్నారనే అంశాన్ని పోలీసులు వెల్లడించలేదు. రూ.20 కోట్ల వరకు కారులో ఉన్నట్లు స్థానికంగా చర్చ నడుస్తోంది. దీనిపైనా క్లారిటీ ఇవ్వడం లేదు. ఘటన జరిగి వారం రోజులవుతున్నా పోలీసులు ఎందుకు గోప్యంగా ఉంచారన్నది అనుమానాలకు తావిస్తోంది. డబ్బు బడా వ్యాపారవేత్తలదా? రాజకీయ నాయకులదా అన్నది వారం రోజుల తర్వాత కూడా చెప్పలేకపోతున్నారు. కనీసం తమ అదుపులో ఉన్న వారెవరన్న విషయాన్నీ మీడియాకు వెల్లడించలేదు.

గోరంట్ల పోలీసులకు సమాచారం.. 'కియా' స్టేషన్‌లో కేసు

పెనుకొండ శివారులోని జాతీయ రహదారిపై ధ్వంసమైన కారులో నగదు పట్టుబడినట్లు సోమవారం పెనుకొండ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ రాఘవన్ తెలిపారు. తొలుత పెనుకొండ సమీపంలో ధ్వంసమైన ఓ కారులో డబ్బు ఉందంటూ గోరంట్ల పోలీసులకు సమాచారం అందిందని, వెంటనే అప్రమత్తమైన పోలీసులు అక్కడికి చేరుకుని డబ్బు స్వాధీనం చేసుకున్నారని, అయితే అది కియా పోలీస్ స్టేషన్ పరిధి కావడంతో ఇక్కడ కేసు నమోదు చేశారని చెబుతున్నారు. ఇదంతా నిజమే అయితే ఆ డబ్బు ఎవరిది? పోలీసుల అదుపులో ఉన్న ఆ ఇద్దరు ఎవరన్నది స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఇక కారులోని వ్యక్తులే సమాచారం ఇచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. అలాగైతే కియా స్టేషన్ పోలీసులకు లేదా పెనుకొండ పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అలా కాకుండా గోరంట్ల పోలీసులకు ఎందుకిచ్చారు? ఈ అంశంలో గోరంట్ల పోలీసుల ప్రమేయం ఏమిటన్నది కోట్ల రూపాయల ప్రశ్నగా మిగిలింది.

హవాలా డబ్బేనా?

పెనుకొండ పరిధిలో ఇంత భారీ మొత్తంలో నగదు పట్టుబడటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంపకాల్లో తేడా కారణంగా హవాలా మనీ గురించి తరలిస్తున్న వారే బయట పెట్టారా? లేక దారి దోపిడీదారులు వెంబడించి ఎత్తుకెళ్లారా? మిగిలిన డబ్బు మాత్రమే పోలీసులకు పట్టించారా? అనేది సస్పెన్స్‌గా మారింది.

విచారణ చేస్తున్నాం

ఈ నెల 5న సూరత్ నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న కారును స్వాధీనం చేసుకుని..ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కియా పోలీస్ స్టేషన్ పరిధిలో విచారణ చేపట్టాం. డబ్బు ఎవరిదన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. లోతుగా విచారణ చేసి త్వరలోనే వివరాలు వెల్లడిస్తాం. కారులో డబ్బు తీసుకెళ్తుండగా.. కొందరు దుండగులు దారి కాచి దోపిడీ చేసి నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. ఇద్దరు వ్యక్తులు గోరంట్ల పోలీసులను ఆశ్రయించగా.. వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ధ్వంసమైన కారుతో పాటు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు విచారణ చేయగా.. డబ్బు తమదేనని చెబుతున్నారు. అయితే అంత డబ్బు ఎక్కడికి తీసుకెళ్తున్నారనే దానిపై విచారణ చేస్తున్నాం.

– రాఘవన్, సీఐ, పెనుకొండ

'టీడీఆర్ పాలసీలో మార్పులు'

సాక్షి,అమరావతి: పట్టణ సంస్కరణలను వేగవంతం చేస్తూ భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చే దిశగా అడుగులు వేస్తున్నామని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్–అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ– స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్పీఏ) మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం ఏర్పాటైన వర్కింగ్ గ్రూప్ పురోగతిని మంగళవారం ఆయన సమీక్షించారు. ఎస్పీఏకు అప్పగించిన రెండు ప్రధాన విధానపరమైన అంశాలపై సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్(టీడీఆర్) విధానానికి ప్రత్యామ్నాయంగా మార్కెట్‌కు అనుకూలమైన కొత్త విధానాన్ని రూపొందించడం, ఆధునిక, పెట్టుబడులకు అనుకూలమైన 'ల్యాండ్ వాల్యూ క్యాప్చర్' పద్ధతులకు రూపకల్పన చేయాలన్నారు. అలాగే, వాతావరణ మార్పుల నేపథ్యంలో రాష్ట్రంలోని తీరప్రాంత నగరాలకు సమగ్ర డ్రైనేజీ విధానం–వరద నివారణ ప్రణాళికను రూపొందించాలన్నారు. ఈ రెండు ప్రాజెక్టులను ఒక మిషన్‌లా భావించి, వాటాదారులతో పాటు నిపుణులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు.

వక్ఫ్ బోర్డు చట్టబద్ధతను తేల్చండి

హైకోర్టులో న్యాయవాది ఆరీఫ్ పిటిషన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర వక్ఫ్ బోర్డును ఏర్పాటు చేయడాన్ని, చైర్మన్ ఎన్నికను ప్రశ్నిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. వక్ఫ్‌బోర్డు ఏర్పాటు చట్టబద్ధతను తేల్చాలని అభ్యర్థిస్తూ వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన న్యాయవాది షేక్ ఆరీఫ్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. వక్ఫ్ చట్టం ప్రకారం బోర్డులో ఎన్నికై న సభ్యుల సంఖ్య ఎల్లప్పుడూ నామినేట్ అయిన సభ్యుల కంటే ఎక్కువగా ఉండాలని పిటిషనర్ పేర్కొన్నారు. కానీ ప్రస్తుత బోర్డులో కేవలం ముగ్గురు మాత్రమే ఎన్నికై న సభ్యులు ఉండగా, ఎనిమిది మంది నామినేటెడ్ సభ్యులు ఉన్నారన్నారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. ఎమ్మెల్యే కోటా కింద సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ప్రభుత్వం వారిని నామినేట్ చేసిందని, ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. న్యాయవాదుల ద్వారా ఎన్నుకోవాల్సిన సభ్యుడి నియామకం జరగలేదని తెలిపారు. దీనివల్ల బోర్డులో న్యాయపరమైన నైపుణ్యం లోపించిందని చెప్పారు. బోర్డు కూర్పు చట్టవిరుద్ధంగా ఉన్నప్పుడు, ఆ బోర్డు సభ్యులు ఎన్నుకున్న చైర్మన్ నియామకం కూడా చెల్లదని తెలిపారు. ఈ విషయాలన్నింటిపై ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించినా పట్టించుకోవడం లేదన్నారు.

గోదావరి డెల్టా ముంపు సమస్యపై లైడార్ సర్వే

మంత్రి నిమ్మల రామానాయుడు

సాక్షి, అమరావతి: గోదావరి డెల్టా ముంపు, సాగునీటి కాలువల సమస్యలను పరిష్కరించడానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను తయారు చేయాలని అధికారులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం జలవనరుల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గోదావరి డెల్టాలో ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించి చేపట్టే లైడార్ సర్వే కోసం రూ.13.4 కోట్లు మంజూరు చేశామని మంత్రి చెప్పారు. ఆ సర్వేను పూర్తి చేసి ఈ నెలాఖరుకు ముంపు సమస్య, లాకులు, గేట్ల మరమ్మతులకు డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించారు. గోదావరి డెల్టా ఆధునికీకరణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ముంపు సమస్య తలెత్తిందన్నారు. ధవళేశ్వరం బ్యారేజీకి కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.150 కోట్లు మంజూరు చేశామన్నారు. జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ కె.నరసింహామూర్తి, గోదావరి డెల్టా సీఈ, ఎస్ఈ, ఈఈలు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

సాక్షి, అమరావతి: యూరియా సరఫరా, పంపిణీ, నిల్వల్లో అంతరాయం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సూచించారు. రబీ సీజన్‌లో యూరియాతో సహా డిమాండ్‌కు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచేందుకు ముందస్తు కార్యాచరణ రూపొందించామన్నారు. ప్రస్తుతానికి తగినంత యూరియా నిల్వలున్నాయని, రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. మంగళవారం ఆయన యూరియా లభ్యతపై జరిగిన సమీక్షలో మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌లో ఎదురైన ఇబ్బందులు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. యూరియా సరఫరా వ్యవస్థలో భాగమైన సంస్థలు, ఏజెన్సీలు, విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. యూరియా కొనుగోలు లేదా పంపిణీపై మీడియాలో ప్రచురించబడే ఏవైనా ప్రతికూల వార్తలకు తక్షణమే స్పందించి, చేపట్టిన చర్యలపై రోజువారీగా నివేదికలివ్వాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి సమస్యలున్నా అధికారులు తనకునేరుగా తెలియజేయాలన్నారు. ఐఎఫ్ఎంఎస్ (ఇంటిగ్రేటెడ్ ఫర్టిలైజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) వ్యవస్థలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సరఫరా, విక్రయ సంస్థల వద్ద యూరియా నిల్వలు ఐఎఫ్ఎంఎస్‌లో యూరియా స్టాక్‌తో ఎప్పటికప్పుడు సరిపోల్చుకుని చూసుకోవాలన్నారు. యూరియా వినియోగాన్ని నియంత్రించాలని, అధిక వినియోగం వల్ల నేల ఆరోగ్యం, పంట దిగుబడి, పర్యావరణంపై కలిగే దుష్ప్రభావాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు క్షేత్ర స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

నల్ల తామర పురుగు ఉధృతి నివారణపై దృష్టి పెట్టండి

మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: మిర్చి పంటపై నల్ల తామర పురుగు ఉధృతిని నియంత్రించేందుకు సత్వరమే నివారణా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడ క్యాంప్ కార్యాలయం నుంచి ఉద్యానవన శాఖాధికారులతో బుధవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పురుగు ప్రభావం ఉన్న ప్రాంతాలకు శాస్త్రవేత్తల బృందాలను క్షేత్రస్థాయికి పంపాలని మంత్రి సూచించారు. మందుల పిచికారీపై శాస్త్రీయ సూచనలు, సాంకేతిక సలహాలను రైతులకు అందించాలన్నారు. నల్లతామర పురుగు నివారణపై ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు వివరించారు.

టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్‌కు డిప్యూటీ కలెక్టర్ పోస్టు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ సాయి మైనేనిని ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కింద ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది. ఏపీపీఎస్సీ, యువజన శాఖ సిఫార్సులు ప్రకారం ఈ పోస్టింగ్ ఇస్తున్నట్టు తెలిపింది. 30 రోజుల్లో విధుల్లో చేరాలని, రెండేళ్ల ప్రొబేషన్ పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఫారెస్ట్ పోదాం... షూటింగ్ చేద్దాం... చలో చలో

● అడవి నేపథ్యంలో సినిమాలు చేస్తున్న తెలుగు హీరోలు

అడవి నేపథ్యంలో సినిమాలు తీయాలంటే ఆషామాషీ కాదు. ఎన్నో సాహసాలు చేయాలి. ఎన్నో సవాళ్లను స్వీకరించాలి. అయినా సరే... తగ్గేదేలే అంటూ ఫారెస్ట్ నేపథ్యంలో సినిమాలు చేసేస్తున్నారు మన తెలుగు హీరోలు. 'ఫారెస్ట్ పోదాం... షూటింగ్ చేద్దాం... చలో చలో...' అంటూ ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్ సినిమాలు చేస్తున్నారు. ఈ ఫారెస్ట్ సినిమాల వివరాలు, విశేషాలపై ఓ లుక్ వేయండి.


● మహేశ్‌బాబు

● ఎన్టీఆర్

● శర్వానంద్

● నాగచైతన్య

● శ్రీవిష్ణు

● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

● రోషన్, బండి సరోజ్‌కుమార్


● విరాట్ కర్ణ

● సాయిధరమ్ తేజ్

ఫారెస్ట్‌లో అడ్వెంచర్

కెన్యా అడవుల్లోకి వెళ్లొచ్చారు మహేశ్‌బాబు. ఒడిశా అడవుల్లోనూ సంచారం చేశారు. మహేశ్ బాబు ఇలా అడవుల్లో తిరుగుతున్నది 'వారణాసి' సినిమా కోసమే అని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో రూపొందుతున్న ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ మూవీ 'వారణాసి'. ఈ చిత్రంలో పృథ్వీ రాజ్ సుకుమారన్, ప్రియాంకా చోప్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. రుద్రగా మహేశ్‌బాబు, మందాకినిగా ప్రియాంకా చోప్రా, కుంభగా పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. ఆల్రెడీ వీరి పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్స్ విడుదల అయ్యాయి. అయితే ఈ సినిమాలోని మేజర్ సన్నివేశాలు ఫారెస్ట్ నేపథ్యంలోనే సాగుతున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవల 'వారణాసి' సినిమా గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేయగా, ఈ గ్లింప్స్‌లోనూ ఫారెస్ట్ విజువల్స్ స్పష్టంగా కనిపించాయి. ఇక తొలుత ఒడిశా ఫారెస్ట్ లొకేషన్స్, ఆ తర్వాత కెన్యా ఫారెస్ట్ లొకేషన్స్‌లో మహేశ్‌బాబు అండ్ రాజమౌళి టీమ్ కొంత చిత్రీకరణ జరిపిన సంగతి తెలిసిందే. సినిమాలోని మరికొన్ని కీలక సన్నివేశాల కోసం 'వారణాసి' చిత్ర యూనిట్ వచ్చే ఏడాది ప్రారంభంలో మరోసారి కెన్యా ఫారెస్ట్ లొకేషన్స్‌కు వెళ్లనుందని తెలిసింది. ఇంకా ఈ సినిమాలో మహేశ్ బాబు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించనున్నారని సమాచారం. ఆల్రెడీ రుద్రగా మహేశ్‌బాబు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. రాముడి పాత్రలో మహేశ్‌బాబు కనిపిస్తారని స్వయంగా రాజమౌళియే కన్ఫార్మ్ చేశారు. మరో మూడు గెటప్స్‌లో కూడా మహేశ్‌బాబు కనిపిస్తారని, మొత్తంగా 'వారణాసి' సినిమాలో ఆయన ఐదు గెటప్స్‌లో కనిపించనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇంకా ఈ సినిమాలో విభిన్న యుగాల మధ్య టైమ్ ట్రావెల్ అనే కాన్సెప్ట్ కూడా ఉంటుందని భోగట్టా. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ 'వారణాసి' సినిమా వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది.

ఫారెస్ట్‌లో డ్రాగన్

ఫారెస్ట్‌లో అదిరిపోయే చేజింగ్ యాక్షన్ సీక్వెన్స్ చేశారట ఎన్టీఆర్. ఈ చేజ్‌ని 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్) సినిమాలో చూడొచ్చు. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ మూవీ 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్). ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా ఈ సినిమాలోని కీలక పాత్రల్లో నటించనున్నారంటూ హీరోయిన్ రష్మికా మందన్నా, బాలీవుడ్ నటి కాజోల్, మలయాళ యువ నటుడు టోవినో థామస్, బాలీవుడ్ సీనియర్ యాక్టర్ అనిల్ కపూర్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈ సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలు ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో ఉండనున్నట్లుగా తెలిసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కర్ణాటకలోని కొన్ని లొకేషన్స్‌లో 'ఎన్టీఆర్‌నీల్' సినిమా చిత్రీకరణ జరిగిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ షూటింగ్ షెడ్యూల్‌లోనే ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే ఓ చేజింగ్ సీన్‌ను చిత్రీకరించారట ప్రశాంత్ నీల్. ఈ యాక్షన్ సీక్వెన్స్ ఈ సినిమాకే ఓ హైలైట్‌గా ఉంటుందట. అంతేకాదు... విదేశీ ఫారెస్ట్ లొకేషన్స్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరగనున్నట్లుగా తెలిసింది. ఇక ఈ సినిమాలో ఎన్టీఆర్ డిఫరెంట్ లుక్స్‌లో కనిపించనున్నారు. తాజా షెడ్యూల్ షూటింగ్ కోసం ఎన్టీఆర్ సన్నబడిన సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ మళ్లీ ప్రారంభం కానుంది. నందమూరి కల్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ను అనుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

గుహలో ఫైట్

'విరూపాక్ష' వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత దర్శకుడు కార్తీక్ వర్మ దండు తెరకెక్కిస్తున్న అడ్వెంచరస్ అండ్ మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'వృషకర్మ'. ఈ చిత్రంలో నాగ చైతన్య హీరోగా నటిస్తున్నారు. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా కనిపిస్తారు. బాలీవుడ్ నటుడు స్పర్ష్ శ్రీవాస్తవ ఈ చిత్రంలోని విలన్ రోల్ చేస్తున్నారని తెలిసింది. ఈ మిథికల్ థ్రిల్లర్ సినిమాలో కొన్ని మేజర్ సన్నివేశాలు ఫారెస్ట్ నేపథ్యంలో ఉంటాయని తెలిసింది. కొన్ని సన్నివేశాలను రియల్ లొకేషన్స్‌లో, మరి కొన్ని సన్నివేశాలను అడవిని తలపించేలా వేసిన సెట్స్‌లో చిత్రీకరిస్తున్నారట. ఆల్రెడీ ఓ పెద్ద గుహ సెట్ వేసి, అక్కడ కొన్ని సీన్స్‌ను చిత్రీకరించారు. ఈ గుహ నేపథ్యంలో సాగే సీన్స్ ఈ సినిమాలో మేజర్ హైలైట్‌గా ఉంటాయట. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోందని తెలిసింది. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ .బి నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుందని తెలిసింది.

భోగి

ఈ ఏడాది వేసవిలో ఉత్తర తెలంగాణలో 'భోగి' సినిమాను ఆరంభించారు శర్వానంద్. ఈ చిత్రానికి సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. అనుపమా పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేకే రాధా మోహన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 1960 నేపథ్యంలో సాగే ఈ పీరియాడికల్ మూవీ ప్రధానంగా ఉత్తర తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దుల్లో జరుగుతుందని తెలిసింది. ఈ సినిమా చిత్రీకరణ కోసం మేకర్స్ ఇరవై ఎకరాల్లో ఓ భారీ సెట్‌ను కూడా క్రియేట్ చేశారు. అయితే కథ రీత్యా ఈ సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలు అడివి నేపథ్యంలో సాగుతాయని తెలిసింది. అడివి నేపథ్యంలో కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లు కూడా ఉంటాయట. ప్రస్తుతం 'నారీ నారీ నడుమ మురారి' సినిమా చిత్రీకరణతో శర్వానంద్ బిజీగా ఉన్నారు. జనవరి 14న ఈ చిత్రం విడుదల కానుంది. అలాగే శర్వానంద్ హీరోగా నటించి, షూటింగ్ పూర్తి చేసుకున్న 'బైకర్' చిత్రం వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. 'భోగి' సినిమా కూడా వచ్చే ఏడాదే రిలీజ్ అయ్యే అవకాశం ఉందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తుంది. ఇదే నిజమైతే శర్వానంద్ వచ్చే ఏడాది మూడుసార్లు థియేటర్స్‌లో సందడి చేస్తారు.

పురాతన ఆలయం

దట్టమైన అడవిలో ఉన్న ఓ పవిత్రమైన పురాతన దశావతార ఆలయాన్ని ధ్వంసం చేసేందుకు కొంతమంది దుండగులు సాహసించారు. ఈ దుశ్చర్యను అడ్డుకునేందుకు హీరో బరిలోకి దిగాడు. మరి... ఇందులో ఈ హీరో సక్సెస్ అయ్యాడా? ఈ హీరోకు దైవం నుంచి ఎలాంటి సహాయం లభించింది? అనే విషయాలను వెండితెరపై చూడాలంటే 'హైందవ' సినిమా చూడాల్సిందే. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా, సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్న సినిమా 'హైందవ'. లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో మహేశ్ చందు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది థియేటర్స్‌లో రిలీజ్ కానుంది.

ఫారెస్ట్‌లో ప్రేమ

తన ప్రేమ కోసం 30 మందిని అడవిలో పరిగెత్తించాడు ఓ కుర్రాడు. ప్రేమ కోసం ఎంతటికైనా తెగించే అతని సాహసాలను 'మోగ్లీ 2025' సినిమాలో వెండితెరపై చూడొచ్చు. రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'మోగ్లీ 2025'. ఈ చిత్రంలో బండి సరోజ్‌కుమార్ విలన్‌గా నటించగా, 'వైవా' హర్ష మరో కీలక పాత్రలో నటించారు. ఈ సినిమా అంతా ఫారెస్ట్ నేపథ్యంలోనే సాగుతుందని ఇటీవల విడుదలైన ట్రైలర్ స్పష్టం చేస్తోంది. అంతేకాదు... ఈ సినిమాలో బదిర యువతి పాత్రలో సాక్షి మడోల్కర్ ఓ చాలెంజింగ్ రోల్ చేశారు. సందీప్ రాజ్ దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 12న విడుదల చేసేందుకు మేకర్స్ ఏర్పాట్లు చేశారు. కానీ బాలకృష్ణ 'అఖండ 2' చిత్రం ఈ తేదీకి థియేటర్స్‌లో విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో 'మోగ్లీ– 2025' సినిమా రిలీజ్ వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కామ్రేడ్ కళ్యాణ్

శ్రీవిష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కల్యాణ్'. టైటిల్‌ని బట్టి ఈ సినిమాకు నక్సలిజమ్ బ్యాక్‌డ్రాప్ ఉంటుందని ఊహించవచ్చు. ఈ సినిమా ప్రధానంగా ఫారెస్ట్ నేపథ్యంలోనే సాగుతుందని, ఇటీవల విడుదలైన 'కామ్రేడ్ కల్యాణ్' ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్ స్పష్టం చేస్తున్నాయి. 1992లో ఆంధ్ర – ఒడిశా సరిహద్దులోని విశాఖ జిల్లా మాడుగుల గ్రామం నేపథ్యంలో ఈ సినిమా ప్రధాన కథాంశం ఉంటుందని తెలిసింది. అలాగే ఈ సినిమాలో శ్రీవిష్ణు ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఓ పాత్రలో నక్సలైట్ లీడర్ కామ్రేడ్ కల్యాణ్‌గా శ్రీవిష్ణు కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ సగానికి పైగా పూర్తయింది. మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రాధికా శరత్ కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కోన వెంకట్ సమర్పణలో జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

అడవిలో డిష్యుం... డిష్యుం...

'సేవ్ ది టైగర్స్' వెబ్ సిరీస్‌తో వీక్షకులను అలరించారు దర్శకుడు తేజ కాకమాను. ఇప్పుడు ఫారెస్ట్ నేపథ్యంలో ఓ సినిమా తీసేందుకు తేజ కాకమాను ఓ కథను రెడీ చేశారని తెలిసింది. ఈ సినిమా కథను సాయిధరమ్ తేజ్‌కు వినిపించగా ఈ హీరో ఈ సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. ఈ సినిమాలోని మేజర్ యాక్షన్ సీక్వెన్స్‌లు అడవి నేపథ్యంలోనే ఉంటాయని తెలిసింది. ప్రస్తుతం 'సంబరాల ఏటిగట్టు' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నారు సాయిధరమ్ తేజ్. ఈ సినిమా పూర్తయిన తర్వాత తేజ కాకుమాను దర్శకత్వంలోని చిత్రాన్ని సాయిధరమ్ తేజ్ స్టార్ట్ చేస్తారని ఊహించవచ్చు.

నాగబంధం

భారతదేశంలోని ప్రాచీన విష్ణు ఆలయాల నేపథ్యం, శతాబ్దాలుగా రహస్యంగా కొనసాగుతున్న 'నాగబంధం' అనే ఆధ్యాత్మిక సంప్రదాయం, అనంత పద్మనాభ స్వామి దేవాలయం – పూరి జగన్నాథ్ దేవాలయాల్లోని మిస్టరీల స్ఫూర్తి... ఇలాంటి ఆసక్తికరమైన అంశాలతో రూపొందుతున్న సినిమా 'నాగబంధం'. ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాలో ఫారెస్ట్ నేపథ్యంలో కూడిన సన్నివేశాలు ఉంటాయని తెలిసింది. ఇందుకోసం ప్రత్యేకమైన సెట్స్‌ను వేశారట మేకర్స్. అంతేకాదు... ఈ సినిమాలోని క్లైమాక్స్ సన్నివేశం కోసమే మేకర్స్ రూ. 20 కోట్ల భారీ బడ్జెట్‌తో సెట్‌ను వేశారు. ఈ సెట్‌లోనే ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. అభిషేక్ నామా దర్శకత్వంలో కిశోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నభా నటేశ్, ఐశ్వర్య మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతి బాబు, జయప్రకాశ్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ చిత్రం రిలీజ్ కానుంది.

పొలిమేర 3

అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలోని 'పొలిమేర' హారర్ ఫ్రాంచైజీ నుంచి ఇప్పటికే వచ్చిన తొలి భాగం 'మా ఊరి పొలిమేర, పొలిమేర 2' చిత్రాలు మంచి విజయాలు సాధించాయి. దీంతో 'పొలిమేర 3' సినిమాకు శ్రీకారం చుట్టారు దర్శకుడు అనిల్ విశ్వనాథ్. ఆల్రెడీ ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. 'పొలిమేర 2' చిత్రంలోని కొన్ని సన్నివేశాలు ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటాయని తెలిసిందే. 'పొలిమేర 3'లో అంతకు మించి ఫారెస్ట్ సీన్స్ ఉంటాయని తెలిసింది. పైగా ఈ సినిమాకు పదో శతాబ్దం నేపథ్యం కూడా ఉంటుందని, ఈ చిత్రంలో మెయిన్ లీడ్ రోల్ చేస్తున్న 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్లతో పాటు మరో హీరో కూడా ఓ కీ రోల్ చేయనున్నారని తెలిసింది. ఆల్రెడీ ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది.

ఈ సినిమాలే కాదు... ఫారెస్ట్ నేపథ్యంలో రూపొందుతున్న సినిమాలు మరికొన్ని ఉన్నాయి.

- ముసిమి శివాంజనేయులు

● ఆది పినిశెట్టి

హ్యాకర్‌ని పట్టుకున్నాడా?

ఓ వైపు హీరోగా, మరోవైపు విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటిస్తున్నారు ఆది పినిశెట్టి. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'డ్రైవ్'. జెనూస్ మొహమ్మద్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మడోన్నా సెబాస్టియన్ హీరోయిన్‌గా నటించారు. భవ్య క్రియేషన్స్ బ్యానర్‌పై వి. ఆనంద్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ను మంగళవారం రిలీజ్ చేశారు. ట్రైలర్ ఎలా ఉందో చూస్తే... ప్రజా మీడియా కార్పొరేషన్ సౌతిండియాలో పేరున్న మీడియా సంస్థ. ఈ సంస్థ అధిపతి జె (ఆది పినిశెట్టి) తన ఫియాన్సీ (మడోన్నా సెబాస్టియన్)తో కలిసి లండన్‌లో స్థిరపడేందుకు సిద్ధమవుతుంటాడు. ఇంతలో జె సంస్థ అకౌంట్స్‌ను హ్యాకర్ హ్యాక్ చేస్తాడు. అంతేకాదు... జె ప్రతి కదలికను గమనిస్తూ చంపేస్తానని బెదిరిస్తుంటాడు. ప్రజా మీడియా కార్పొరేషన్ విషయాలను ఆన్‌లైన్‌లో ఉంచుతూ ఆ సంస్థ పరువు, గౌరవాన్ని రోడ్డున పడేస్తాడు. తన పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్‌తో ఆడుకుంటున్న ఆ హ్యాకర్‌ని జె పట్టుకున్నాడా? లేదా అనేది ట్రైలర్‌లో చూపించారు. ఈ చిత్రానికి సంగీతం: ఓషో వెంకట్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అన్నే రవి, క్రియేటివ్ ప్రొడ్యూసర్: తాతినేని సత్యారావు, కెమెరా: అభినందన్ రామానుజన్.

వీరోచిత పోరాటం

● అహాన్ శెట్టి

సన్నీ డియోల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బోర్డర్'. ఈ వార్ డ్రామాలో వరుణ్ ధావన్, దిల్జీత్ సింగ్, అహాన్ శెట్టి, మేధా రాణా, మోనా సింగ్, సోనమ్ బజ్వా ప్రధాన పాత్రల్లో నటించారు. అనురాగ్ సింగ్ దర్శకత్వంలో భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, జేపీ దత్తా, నిధి దత్తా నిర్మించిన ఈ చిత్రం జనవరి 23న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని అహాన్ శెట్టి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. నేవల్ ఆఫీసర్‌గా యుద్ధభూమిలో అహాన్ శెట్టి వీరోచిత పోరాటం చేస్తున్నట్లుగా ఫస్ట్ లుక్ పోస్టర్ స్పష్టం చేస్తోంది. ఇక ఇండియా–పాకిస్తాన్ వార్ నేపథ్యంలో 1997లో సన్నీ డియోల్ హీరోగా నటించిన బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'బోర్డర్'కు సీక్వెల్‌గా 'బోర్డర్ 2' చిత్రం రూపొందుతోందని బాలీవుడ్ సమాచారం. 'బోర్డర్' సినిమాలో సునీల్ శెట్టి ఓ లీడ్ రోల్ చేయగా, సీక్వెల్‌లో సునీల్ శెట్టి తనయుడు అహాన్ శెట్టి ఓ లీడ్ రోల్ చేస్తుండటం విశేషం.

వేలం బరిలో 350 మంది

ఈనెల 16న అబుదాబిలో ఐపీఎల్ వేలం

- 77 స్థానాల కోసం పోటాపోటీ
- చివరి నిమిషంలో వేలంలోకి వచ్చిన డికాక్
- గ్రీన్, కాన్వే, ఇన్‌గ్లిస్, లివింగ్‌స్టోన్‌లపై అందరి దృష్టి
- పృథ్వీ షా, సర్ఫరాజ్‌లకు చాన్స్ దక్కేనా!


పృథ్వీ షా
సర్ఫరాజ్
డికాక్

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌కు సంబంధించిన వేలం కార్యక్రమంలో పాల్గొనే ప్లేయర్ల జాబితా సిద్ధం అయింది. ఈ నెల 16న అబుదాబి వేదికగా ఈ వేలం జరగనుంది. 77 స్థానాల కోసం మొత్తం 350 మంది క్రికెటర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఇందులో 240 మంది భారత క్రికెటర్లు కాగా... 110 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. మొత్తం 10 ఫ్రాంచైజీలు కలిసి గరిష్టంగా 77 మందిని ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. అందులో 31 విదేశీ ప్లేయర్ల స్థానాలు కాగా... 46 భారత ఆటగాళ్లవి. దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ క్వింటన్ డికాక్ చివరి నిమిషంలో వేలం జాబితాలోకి రాగా... ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్, దక్షిణాఫ్రికా హిట్టర్ డేవిడ్ మిల్లర్, న్యూజిలాండ్ ప్లేయర్ డెవాన్ కాన్వే, భారత ఆటగాళ్లు వెంకటేశ్ అయ్యర్, పృథ్వీ షా, సర్ఫరాజ్ ఖాన్ వంటి వాళ్లు వేలం జాబితాలో ఉన్నారు. మొదట 1390 మంది ప్లేయర్లు వేలంలో తమ పేర్లు నమోదు చేసుకోగా... అందులో ఫ్రాంచైజీల ఆసక్తి మేరకు 350 మందిని షార్ట్ లిస్ట్ చేశారు. ఒక్కో సెట్‌లో పది మంది చొప్పున 35 సెట్‌ల పాటు వేలం సాగనుంది. ఈ జాబితాలో 238 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్లు ఉన్నారు. అత్యధిక ప్రాథమిక ధర రూ. 2 కోట్లతో మొత్తం 40 మంది వేలంలో ఉండగా... ప్రాథమిక ధర రూ. 30 లక్షలతో 227 మంది పోటీలో ఉన్నారు.

- టీమిండియా ప్లేయర్లు పృథ్వీ షా, సర్ఫరాజ్ ఖాన్ తమ ప్రాథమిక ధరను రూ. 75 లక్షలుగా నిర్ణయించుకున్నారు. పృథ్వీ షా 2018 నుంచి 2024 వరకు ఐపీఎల్ ఆడగా... 2025 సీజన్ కోసం జరిగిన మెగా వేలంలో అతడిని ఏ జట్టూ తీసుకోలేదు. ఇక సర్ఫరాజ్ 2021 సీజన్ నుంచి ఐపీఎల్ ఆడలేదు.
- 2025 సీజన్‌కు ముందు రికార్డు స్థాయిలో రూ. 23.75 కోట్ల ధర పెట్టి కొనుగోలు చేసుకున్న వెంకటేశ్ అయ్యర్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీ వేలానికి వదిలేసింది. అతడు ప్రాథమిక ధర రూ. 2 కోట్లతో వేలానికి రానున్నాడు. ముస్తాక్ అలీ టి20 టోర్నీలో రాణిస్తున్న కునాల్ చండేలా, అశోక్ కుమార్‌లపై కూడా ఫ్రాంచైజీలు ఆసక్తి చూపే అవకాశాలున్నాయి.
- పది ఫ్రాంచైజీల్లో అత్యధికంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ దగ్గర రూ. 64.3 కోట్లు అందుబాటులో ఉండగా... చెన్నై సూపర్ కింగ్స్ రూ. 43.4 కోట్లతో రెండో స్థానంలో ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 25.5 కోట్లతో మూడో స్థానంలో ఉంది.
- వేలంలో ఇంగ్లండ్ నుంచి అత్యధికంగా 21 మంది ప్లేయర్లు పోటీ పడుతున్నారు. ఇందులో జేమీ స్మిత్, అట్కిన్సన్, లివింగ్‌స్టోన్, బెన్ డకెట్ వంటి వారు ఉన్నారు.
- ఆస్ట్రేలియా పేస్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ కోసం అన్నీ ఫ్రాంచైజీలు పోటీపడే అవకాశం ఉంది. గ్రీన్, స్మిత్‌తో పాటు ఇన్‌గ్లిస్, షార్ట్, కూపర్, వెబ్‌స్టర్ వంటి 19 మంది ప్లేయర్లు ఆస్ట్రేలియా నుంచి ఈ వేలం బరిలో ఉన్నారు.
- డికాక్, మిల్లర్‌లతో పాటు దక్షిణాఫ్రికా నుంచి 15 మంది వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఇందులో నోర్జే, ఎంగిడి, కోట్జీ, ముల్డర్ తదితరులు ఉన్నారు.
- వెస్టిండీస్ నుంచి అల్జారీ జోసెఫ్, షామర్ జోసెఫ్, షై హోప్, రోస్టన్ ఛేజ్ సహా 9 మంది ఆటగాళ్లు వేలం బరిలో ఉన్నారు.
- శ్రీలంక నుంచి హసరంగ, దునిత్ వెల్లలాగె, తీక్షణ, నిసాంక, కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరా సహా 12 మంది ఆటగాళ్లు ఈ జాబితాలో ఉన్నారు.
- న్యూజిలాండ్ నుంచి రచిన్ రవీంద్ర, కాన్వే సహా మొత్తం 16 మంది ప్లేయర్లు వేలం బరిలో ఉన్నారు.
- అఫ్గానిస్తాన్ నుంచి రహ్మానుల్లా గుర్బాజ్, నవీన్ ఉల్ హక్ సహా మొత్తం 10 మంది ప్లేయర్లు ఈ జాబితాలో ఉన్నారు.

అంకెల్లో...

వేలంలో ఉన్న మొత్తం ఆటగాళ్లు	350
భారత క్యాప్డ్ ఆటగాళ్లు	16
విదేశీ క్యాప్డ్ ఆటగాళ్లు	96
భారత అన్‌క్యాప్డ్ ఆటగాళ్లు	224
విదేశీ అన్‌క్యాప్డ్ ఆటగాళ్లు	14

ప్రాథమిక ధర	ఆటగాళ్ల సంఖ్య
రూ. 2 కోట్లు	40
రూ. 1.50 కోట్లు	9
రూ. 1.25 కోట్లు	4
రూ. 1 కోటి	17
రూ. 75 లక్షలు	42
రూ. 50 లక్షలు	4
రూ. 40 లక్షలు	7
రూ. 30 లక్షలు	227

కార్ల్‌సన్‌కు అర్జున్ షాక్

కేప్‌టౌన్: ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్ టోర్నీలో భారత నంబర్‌వన్, తెలంగాణ గ్రాండ్ మాస్టర్ ఇరిగేశి అర్జున్ సంచలనం నమోదు చేశాడు. ప్రపంచ నంబర్‌వన్, మూడు ఫార్మాట్‌లలో ప్రపంచ మాజీ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన అర్జున్ 34 ఎత్తుల్లో గెలుపొందాడు. ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య ముందుగా రౌండ్ రాబిన్ లీగ్ గేమ్‌లు నిర్వహించారు. అనంతరం నాకౌట్ మ్యాచ్‌లు ఏర్పాటు చేశారు. విన్సెంట్ కీమెర్ (జర్మనీ)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో అర్జున్ 0.5–1.5తో ఓడిపోయాడు. అర్జున్–కీమెర్ తొలి గేమ్ 50 ఎత్తుల్లో 'డ్రా'గా ముగియగా... రెండో గేమ్‌లో అర్జున్ 39 ఎత్తుల్లో ఓటమి పాలయ్యాడు. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో సిందరోవ్ 2–0తో పర్హామ్ (ఇరాన్)పై, కార్ల్‌సన్ 3–1తో ఫాబియానో కరువానా (అమెరికా)పై, అరోనియన్ 3–1తో హాన్స్ నీమన్ (అమెరికా)పై గెలిచి సెమీఫైనల్లోకి ప్రవేశించారు. సెమీఫైనల్ చేరడం ద్వారా కార్ల్‌సన్ 2025 సీజన్ గ్రాండ్‌స్లామ్ టూర్ ఓవరాల్ చాంపియన్‌గా అవతరించాడు.

కోల్‌కతాలో చెప్టెగయ్ పరుగు

ఈ నెల 21న 'ప్రపంచ 25కె రన్' ● బరిలో 23 వేల పైచిలుకు రన్నర్లు

కోల్‌కతా: టాటా స్టీల్ ప్రపంచ 25 కిలోమీటర్ల రన్‌కు దిగ్గజాలు కూడా సై అంటున్నారు. ఈ 25 కిలోమీటర్ల పరుగులో ఇప్పటికే 23 వేల మంది పాల్గొనేందుకు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. రెండుసార్లు ఒలింపిక్ చాంపియన్, మరో మూడుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన జొషువా చెప్టెగయ్ (ఉగాండా) కూడా కోల్‌కతా ఈవెంట్‌లో పరుగు పెట్టేందుకు సిద్ధమవుతున్నాడు. మహిళల డిఫెండింగ్ చాంపియన్ సుతుమ్ అసిఫా కెబెడే సైతం 25కె రన్‌పై ఆసక్తి కనబరిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21న ఈ రేసు జరుగుతుందని ప్రమోటర్స్ ప్రోకామ్ ఇంటర్నేషనల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇది వరకు నమోదైన 1 గంటా 11.08 నిమిషాల రికార్డును బ్రేక్ చేసిన రన్నర్‌కు ప్రైజ్‌మనీకి అదనంగా 25 వేల డాలర్లు (రూ.22.46 లక్షలు) బోనస్‌గా అందజేస్తామని ప్రోకామ్ సంస్థ తెలిపింది. కాగా ఈవెంట్ మొత్తం ప్రైజ్‌మనీ 1,42, 214 డాలర్లు (రూ.కోటి 28 లక్షలు). ఈ మొత్తాన్ని మహిళలు, పురుషుల విజేతలకు సమానంగా బహూకరించనున్నారు. 29 ఏళ్ల ఉగాండ రన్నర్ చెప్టెగయ్ సుదీర్ఘ పరుగు పందెంలో ఎదురేలేని చాంపియన్. మూడుసార్లు 10 వేల మీటర్ల పరుగులో విజేతగా నిలిచాడు. 5కె, 10కె పరుగులు కలుపుకొని నాలుగుసార్లు ప్రపంచ రికార్డులు నమోదు చేశాడు. గతేడాది ఢిల్లీ హాఫ్ మారథాన్, ఈ ఏడాది బెంగళూరులో జరిగిన వరల్డ్ 10కె రన్‌లోనూ ఈ ఉగాండా రన్నర్ విజేతగా నిలిచాడు. తొలిసారిగా భారత్‌లో 25కె రన్‌లో పాల్గొనేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పాడు. పురుషుల విభాగంలో చెప్టెగయ్‌తో పాటు అల్ఫోన్స్ ఫెలిక్స్ సింబు (టాంజానియా) సహా ఇథియోపియన్ రన్నర్ హేమనొట్ అలివ్, లెసోతొకు చెందిన టిబెలో రమకొంగొన తదితర మేటి అథ్లెట్లు కోల్‌కతా ఈవెంట్‌కు విచ్చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇథియోపియన్ మహిళా రన్నర్ అసిఫా కెబెడె పదేళ్ల క్రితమే 25కె పరుగులో ప్రపంచ రికార్డు సృష్టించింది. బెర్లిన్‌లో 2015లో జరిగిన ఆ ఈవెంట్‌లో రికార్డు నెలకొల్పిన ఆమె 2023లో కోల్‌కతాలో జరిగిన ఈవెంట్‌లోనూ మరో రికార్డు సాధించింది. మేటి అథ్లెట్లు పాల్గొననుండటంతో నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

ర్యాంప్‌పై మెస్సీ నడక

స్వారెజ్, రోడ్రిగోలు సైతం జతగా
- 14న ముంబైలో సెలబ్రిటీలతో ఫ్యాషన్ షో
- 15న ప్రధానితోనూ భేటీ

కోల్‌కతా: అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లయోనల్ మెస్సీ భారత్ పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలన్నీ ఒక్కొక్కటిగా వెల్లడవుతున్నాయి. ఇన్నాళ్లు ఫుట్‌బాల్ మైదానంలో అతని కిక్‌లు, పాస్‌లు చూసిన అభిమానులు ముంబైలో మాత్రం కొత్త మెస్సీని చూడబోతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆటలో అలరించిన అతను ఓ ప్రత్యేక ఫ్యాషన్ షోలో ర్యాంప్‌పై నడకతో ఆకట్టుకునే ప్రయత్నం చేయబోతున్నాడు. 'జీఓఏటీ (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) ఇండియా టూర్'లో భాగంగా మెస్సీ ఈ వారాంతంలో భారత్‌లో పర్యటించనున్నాడు. దీనికి సంబంధిన ఏర్పాట్లన్నీ ఇది వరకే పూర్తయ్యాయి. ఈ మూడు రోజుల పర్యటనలో నాలుగు ప్రధాన నగరాల్లో సెలబ్రిటీలతో కలిసి భారత అభిమానుల్ని అలరించనున్నాడు. పర్యటనలో తొలిరోజు 13న ముందుగా కోల్‌కతాలో అడుగుపెట్టే మెస్సీ అక్కడి నుంచి అదే రోజు హైదరాబాద్‌కు విచ్చేస్తాడు. ఆ మరుసటి రోజు ఆదివారం ముంబై చేరుకుంటాడు. సోమవారం ఢిల్లీలో జరిగే కార్యక్రమాలతో అతని పర్యటన ముగుస్తుంది. ఆఖరి రోజు భారత ప్రధాని నరేంద్ర మోదీని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకుంటాడని నిర్వాహకులు షెడ్యూల్‌ను విడుదల చేశారు.

కోల్‌కతాలో వర్చువల్‌గా...

కోల్‌కతాలో క్రికెట్‌తో పాటు ఫుట్‌బాల్ అంటే చెవికోసుకుంటారు. విపరీతమైన క్రేజ్ ఉంటుంది. అర్జెంటీనా దివంగత దిగ్గజం మారడోనా అంటే పడిచచ్చేంత అభిమానం కోల్‌కతా వాసులది. ఇప్పుడు మెస్సీ అంటే కూడా అదే స్థాయిలో ప్రాణమిస్తారు. కాబట్టి కోల్‌కతా పోలీసులు కోల్‌కతాలో మెస్సీ 70 అడుగుల భారీ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ఏర్పాటు చేశారు. భద్రతా కారణాలరీత్యానే హోటల్ నుంచే ఈ ఆవిష్కరణ ఉంటుందని పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. అనంతరం బిజిబిజీగా ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటాడు.

హైదరాబాద్‌లో....

'గోట్' పాన్ ఇండియా టూర్‌ను దేశం నలువైపులా కవర్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తూర్పున కోల్‌కతా నుంచి దక్షిణాన హైదరాబాద్, పశ్చిమాన ముంబై, ఉత్తరాన ఢిల్లీ నగరాలకు వస్తాడు. హైదరాబాద్‌లో సెలబ్రిటీ ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడతాడు. ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలో 'గోట్ కప్'లో పాల్గొంటాడు. ఇందులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా మెస్సీతో కలిసి కిక్‌లు కొట్టనున్నారు.

ప్రధానితో ఢిల్లీలో...

హైదరాబాద్ నుంచి నేరుగా ఆదివారం ముంబైకి వెళ్లి అక్కడ క్లబ్ సహచరుడు స్వారెజ్, అర్జెంటీనా సహచరుడు రోడ్రిగోలతో కలిసి ఫ్యాషన్ షోలో పాల్గొంటాడు. చివరగా ఢిల్లీ చేరుకొని ప్రధాని మోదీతో భేటీ అవుతాడు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాలు పూర్తయ్యాక అదే రోజు రాత్రి స్వదేశానికి బయలుదేరతాడు.

మెయిన్ 'డ్రా'కు సంస్కార్

కటక్: ఒడిశా మాస్టర్స్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత వర్ధమాన తార సంస్కార్ సరస్వత్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో సంస్కార్ 21–13, 21–23, 21–9తో భారత్‌కే చెందిన హిమానిశ్ దాస్‌పై గెలుపొందాడు. గతవారం జరిగిన గువాహటి ఓపెన్ సూపర్–100 టోర్నీలో సంస్కార్ సంచలన ప్రదర్శనతో విజేతగా నిలిచాడు. భారత్‌కే చెందిన అన్ష్ విశాల్ గుప్తా, రౌనక్ చౌహాన్, మానవ్ చౌధరీ, షేక్ నుమైర్, కలగోట్ల లోకేశ్ రెడ్డి, ఆదిత్య దివాకర్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు. మహిళల క్వాలిఫయింగ్ విభాగం నుంచి భారత ప్లేయర్ మేధావి నాగర్ మెయిన్ 'డ్రా'కు బెర్త్ దక్కించుకుంది. పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో హైదరాబాద్ ప్లేయర్, టాప్ సీడ్ తరుణ్ మన్నేపల్లికి నేరుగా రెండో రౌండ్‌కు 'బై' లభించింది.

'యాషెస్' సిరీస్‌కు హాజల్‌వుడ్, వుడ్ దూరం

మూడో టెస్టుకు కమిన్స్ సిద్ధం

హాజల్‌వుడ్

వుడ్

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా పేసర్ జోష్ హాజల్‌వుడ్... ఇంగ్లండ్ పేసర్ మార్క్ వుడ్ 'యాషెస్' సిరీస్‌కు దూరమయ్యారు. కండరాల గాయంతో ఇప్పటికే జరిగిన రెండు టెస్టులకు దూరమైన హాజల్‌వుడ్ మిగిలిన మూడు మ్యాచ్‌లకు సైతం అందుబాటులో ఉండబోడని ఆస్ట్రేలియా హెడ్ కోచ్ మెక్‌డొనాల్డ్ మంగళవారం వెల్లడించాడు. వచ్చే ఏడాది ఆరంభంలో జరగనున్న టి20 ప్రపంచకప్ వరకు అతడు ఫిట్‌నెస్ సాధించే అవకాశాలున్నాయని పేర్కొన్నాడు. 'ఈ సిరీస్‌కు హాజల్‌వుడ్ దూరమయ్యాడు. ఇక ఇప్పుడు అతడి దృష్టి అంతా టి20 వరల్డ్‌కప్ పైనే' అని మెక్‌డొనాల్డ్ అన్నాడు. సొంత గడ్డపై ఇంగ్లండ్‌తో జరుగుతున్న 'యాషెస్' సిరీస్‌లో ఆస్ట్రేలియా రెండు మ్యాచ్‌లు నెగ్గి ప్రస్తుతం 2–0తో ఆధిక్యంలో ఉంది. గాయంతో ఈ రెండు మ్యాచ్‌లూ ఆడని రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్... ఈ నెల 17 నుంచి అడిలైడ్ వేదికగా జరగనున్న మూడో టెస్టు మ్యాచ్‌లో బరిలోకి దిగే అవకాశాలున్నాయి. కమిన్స్ గైర్హాజరీలో స్టీవ్ స్మిత్ రెండు మ్యాచ్‌ల్లో ఆసీస్‌కు సారథిగా వ్యవహరించగా... కమిన్స్ రాకతో అతడు కేవలం బ్యాటర్‌గా బరిలోకి దిగనున్నాడు. గత రెండు టెస్టుల్లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన మిచెల్ స్టార్క్ దెబ్బకు ఇంగ్లండ్ బ్యాటర్లు చేతులెత్తేయగా... ఇప్పుడు కమిన్స్ రాకతో కంగారూల పేస్ బలం మరింత పేరగనుంది. ఇక ఇంగ్లండ్ పేసర్ మార్క్ వుడ్ ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. తొలి మ్యాచ్ అనంతరం గాయంతో జట్టుకు దూరమైన వుడ్... మిగిలిన మూడు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడం లేదని సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు.

చాంప్స్ కీ స్టోన్, సెయింట్ ఫ్రాన్సిస్ జట్లు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా వార్షిక లీగ్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పురుషుల విభాగంలో కీ స్టోన్ బాస్కెట్‌బాల్ అకాడమీ... మహిళల విభాగంలో సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీ జట్టు విజేతలుగా నిలిచాయి. ఫైనల్స్‌లో కీ స్టోన్ జట్టు 75–66తో టైటాన్స్‌పై గెలుపొందింది. మ్యాచ్ మరో ఆరు నిమిషాల్లో ముగుస్తుందనే వరకు ఇరు జట్లు హోరాహోరీగా పోరాడగా... ఆఖర్లో జోరు పెంచిన కీ స్టోన్ జట్టు... కీలక పాయింట్లు ఖాతాలో వేసుకొని విజేతగా అవతరించింది. మ్యాచ్ ఆరంభంలో టైటాన్స్ చక్కటి ప్రదర్శన కనబర్చింది. ఒకదశలో 12–3తో స్పష్టమైన ఆధిక్యం సాధించింది. ఆ తర్వాత తేరుకున్న కీ స్టోన్ ప్లేయర్లు సత్తాచాటి జట్టును పోటీలోకి తెచ్చారు. కీ స్టోన్ అకాడమీ తరపున సహర్ష్ 21 పాయింట్లతో విజృంభించగా... సుభాశ్ 17, ప్రీతమ్ 10 పాయింట్లు సాధించారు. క్రిష్య, ఆర్యన్ చెరో 8 పాయింట్లు సాధించగా... ప్రతీక్ 5, కార్తీక్ 4 పాయింట్లు ఖాతాలో వేసుకున్నారు. టైటాన్స్ తరపున సల్మాన్ 16 పాయింట్లతో టాప్‌లో నిలవగా... నందిత్ 12, సూర్య 111, క్రిస్ 11, విక్కీ 10 పాయింట్లు సాధించారు. మహిళల విభాగంలో సెయింట్ ఫ్రాన్సిస్ జట్టు 57–55 పాయింట్లతో నిజాం బాస్కెట్‌బాల్ జట్టుపై గెలిచింది. సెయింట్ ఫ్రాన్సిస్ తరపున పరీ 17 పాయింట్లతో విజయంలో కీలకపాత్ర పోషించింది. సంహిత 14, సానియా 11, హిబా 6, రేఖ 5 పాయింట్లు సాధించారు. నిజాంబాస్కెట్‌బాల్ జట్టు తరపున అమిత 16, జాహ్నవి 14, శ్రుతి 10, లాస్య 9, ఖుష్బూ 6 పాయింట్లు సాధించారు.

ఆకాశ వీధిలో... వింత ప్రకాశం

దెయ్యపు వెలుగులు?

ఎర్రని ఎరుపు రంగుతో వింతగా మెరిసిపోయే వెలుతురు స్తంభాలు. రకరకాల ఆకృతుల్లో చూపరులకు కనువిందు చేసే తీరు వర్ణించనలవి కాదు. ఇంతా చేసి వినువీధిలో అవి కనువిందు చేసేది రెప్పపాటు కన్నా కూడా తక్కువ సేపు మాత్రమే. అలా ఇటీవల ఆకాశంలో కనిపించిన ఈ వింత వెలుగులను అమెరికాకు చెందిన ఔత్సాహిక ఫోటోగ్రాఫర్ ఒకరు కెమెరాలో బంధించి ఇదుగో, ఇలా అందరి కంటికీ విందు చేశారు...!

స్ప్రైట్స్ స్ప్రైట్స్...!

ఈ అందాల వెలుగులను సైంటిస్టులు స్ప్రైట్స్ గా పిలుస్తారు. కనిపించేది ఒక క్షణంలో కొద్దిసేపు పాటే అయినా, ఆకాశంలో అల్లంత ఎత్తు నుంచి అమాంతం రాలిపడుతూ విస్మయపరచడం వీటి ప్రత్యేకత. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ప్రయోగాత్మకంగా చేపట్టిన స్ప్రైటాక్యులర్ సిటిజన్ సైన్స్ ప్రాజెక్టులో భాగస్వామి అయిన నికోలస్ ఎస్క్యూరాట్ అనే సామాన్య పౌరుడు ఈ స్ప్రైట్స్ ను తన సాధారణ కెమెరాలో బంధించడం విశేషం. వాటిని నాసా తన ఎక్స్ అకౌంట్ లో తాజాగా షేర్ చేసింది.

అతీత శక్తుల పనా?

ఈ వింత వెలుగులను అతీత శక్తులే సృష్టిస్తాయని చాలా మంది నమ్ముతుంటారు. అసలు ఆ వెలుగులు స్వయానా దెయ్యాలేనని విశ్వసించేవారికి కూడా కొదవ లేదు. అయితే అదంతా కేవలం అభూత కల్పన మాత్రమేనని సైంటిస్టులు స్పష్టం చేస్తున్నారు. 'కుండపోత వర్షాల వేళ ఆకాశంలో కమ్ముకునే కరి మబ్బుల మీదుగా ఈ వెలుగులు పుట్టుకొస్తుంటాయి. అయితే ఇవి మన కంటికి కనిపించడమన్నది నిజానికి చాలా అరుదు. ఎందుకంటే ఉరుములు, మెరుపులమయంగా ఆ మబ్బులు సృష్టించే విలయమే ఆ వెలుగులను చాలాసార్లు కప్పేస్తూ ఉంటుంది. వీటిని స్పష్టంగా పట్టిస్తూ ఫొటోలు రావడం, అందులోనూ అవి తీసింది ఒక ఔత్సాహికుడు కావడం ఈ కారణం చేతనే చాలా విశేషమైనది' అని నాసా పేర్కొంది.

90 కి.మి. ఎత్తున...

ఈ స్ప్రైట్స్ మామూలు ఉరుములు, మెరుపుల మాదిరిగా తక్కువ ఎత్తులో ఏర్పడే బాపతు కావు. భూ ఉపరితలానికి ఏకంగా 50 నుంచి 90 కిలోమీటర్ల ఎత్తులో మెసోస్ఫియర్ లో పలుచని గాలిగుండా పుట్టుకొస్తాయి. దిగువన మేఘ మండలంలో పుట్టుకొచ్చే ఉరుములు, మెరుపుల వాతావరణం కారణంగా వీటి ఉత్పత్తి జరుగుతుంది. దిగంతాలను ధిక్కరిస్తూ అంతరిక్షంలో సుదూరాల దాకా విద్యుదయస్కాంత క్షేత్రాన్ని కదలబారుస్తాయి. దాంతో మెసోస్ఫియర్ లో విద్యుదావేశం భారీ పరిమాణంలో ఒక్కపాటున వచ్చిపడుతుంది. ఆ ఫలితమే ఈ స్ప్రైట్స్.

1989లో తొలిసారిగా...

ఈ స్ప్రైట్స్ 'ట్రాన్సియెంట్ ల్యూమినస్ ఈవెంట్స్' తరహాకు చెందినవి. ఎగువ ఆకాశంలో ఈ తరహా వెలుగులను గురించి విమాన పైలట్లు దశాబ్దాలుగా రిపోర్ట్ చేస్తూనే వచ్చారు. అయితే వీటి తాలూకు కాస్తో కూస్తో స్పష్టమైన ఫోటో 1989లో తొలిసారిగా కెమెరాకు చిక్కింది. తాజాగా గత జూలై 5న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి నాసా వ్యోమగామి నికోలస్ అయెర్స్ శక్తిమంతమైన కెమెరాల బంధించిన రాకాసి స్ప్రైట్స్ తాలూకు అపరిమితమైన వెలుగులు అందరినీ విస్మయపరిచాయి. అంతకుముందు 2022లో ఇద్దరు ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు టిబెట్ పీఠభూమి ఎగువన ఒకేసారి ఏకంగా 105 స్ప్రైట్స్ వెలుగులను కెమెరాల్లో బంధించారు. దక్షిణాసియా ప్రాంతం మీదుగా ఒకే విడతలో అత్యంత ఎక్కువ సంఖ్యలో పుట్టుకొచ్చిన స్ప్రైట్స్ గా ఇవి నెలకొల్పిన రికార్డు ఇప్పటికీ పదిలంగానే ఉంది!

- సాక్షి, నేషనల్ డెస్క్

టీనేజర్ల డిజిట్రబుల్స్!

ఆస్ట్రేలియా టీనేజర్ల డిజిటల్ స్వేచ్ఛపై నిషేధం

డిసెంబర్ 10.. బుధవారం సూర్యోదయం కాగానే, ఆస్ట్రేలియా చరిత్రలో తొలిసారిగా ఒక చట్టం అమల్లోకి రానుంది. దేశంలోని 16 ఏళ్ల లోపు యువతకు సోషల్ మీడియా తలుపులు మూసుకుపోతాయి. అయితే, ప్రపంచంలోనే ఈ తొలి నిషేధం, రిలే అలెన్ అనే 15 ఏళ్ల స్కూల్ బాయ్‌కి నిద్ర లేకుండా చేస్తోంది. దక్షిణ ఆస్ట్రేలియాలోని కేవలం 1,000 మంది జనాభా ఉన్న 'వుడిన్నా' అనే చిన్న కమ్యూనిటీకి 5 కిలోమీటర్ల దూరంలో రిలే కుటుంబం నివసిస్తోంది. గొర్రెల ఫారంలో నివసించే ఈ కుర్రాడికి, దూరంగా ఉన్న స్నేహితులతో మాట్లాడడానికి సోషల్ మీడియానే ఏకైక మార్గం. బుధవారం అర్ధరాత్రి దాటితే, 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న తన సహాధ్యాయులతో ఎలా అందుబాటులో ఉండాలి?.. ఒక్క మీట నొక్కగానే.. తమ ప్రపంచం తెగిపోతుందనే భయం ఈ పల్లెటూరి పిల్లాడిని వెంటాడుతోంది.

ఉల్లంఘిస్తే భారీ జరిమానా

బుధవారం నుంచి 16 ఏళ్లలోపు ఉన్నవారు ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్, కిక్, రెడ్డిట్, స్నాప్‌చాట్, థ్రెడ్, టిక్‌టాక్, ఎక్స్, యూట్యూబ్, ట్విచ్ తదితర ప్లాట్‌ఫాంలలో ఖాతాలను కలిగి ఉండకుండా చట్టం నిషేధిస్తుంది. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే, ఆయా ప్లాట్‌ఫాంలపై 32.9 మిలియన్ల వరకు భారీ జరిమానాలు విధిస్తారు. 'మెటా'.. ఇప్పటికే అనుమానిత యువకుల ఖాతాలను తొలగించడం ప్రారంభించింది. రిలేకు.. ఇంకా నోటిఫికేషన్ రాలేదు, కానీ ఏ క్షణమైనా తనను తొలగిస్తారేమోనని భయపడుతున్నాడు.

నా కొడుక్కి సాయం చేసేదే లేదు..

రిలే తల్లి, స్కూల్ టీచర్ అయిన సోనియా అలెన్ మాత్రం.. నిషేధాన్ని తప్పించుకోవడానికి తన కొడుక్కి సహాయం చేయనని స్పష్టం చేసింది. అయితే, ఇతర తల్లిదండ్రులు సహాయం చేస్తారని ఆమె అనుమానం వ్యక్తం చేసింది. గతంలో రిలే.. అర్ధరాత్రి వరకు సోషల్ మీడియాలో మునిగితేలుతూ హోంవర్క్ చేయనందుకు, రెండు నెలలపాటు అతని సోషల్ మీడియాను ఆమె నిషేధించింది. 'అప్పటి నుంచే తన కొడుకు మరింత బాధ్యతాయుతంగా సోషల్‌మీడియాను ఉపయోగించడం నేర్చుకున్నాడు'.. అని అలెన్ గుర్తు చేసుకుంది. ఏప్రిల్‌లో 16 సంవత్సరాలు నిండనున్న రిలే.. ఈ నిషేధం లక్ష్యాలను అర్థం చేసుకున్నానని, అయితే వాటిని సాధించడానికి ఇతర మార్గాలు కూడా ఉన్నాయని స్పష్టం చేశాడు. చిన్న పిల్లలు నిద్రకు దూరం కాకుండా, రాత్రి 10 గంటల నుండి సామాజిక మాధ్యమాల వినియోగాన్ని తప్పనిసరిగా నిషేధించాలని సూచించాడు.

- సాక్షి, నేషనల్ డెస్క్

నిషేధం దాటేస్తారు: నిపుణుల హెచ్చరిక

డిజిటల్ ఫ్రీడమ్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు జాన్ రూడిక్.. ఈ నిషేధం అమలులోకి రాకుండా కోర్టు నిషేధాజ్ఞ కోసం ప్రయత్నించాలని భావించారు, కానీ న్యాయవాదుల సలహా మేరకు విరమించుకున్నారు. ఈ రాజ్యాంగ సవాలుపై పూర్తిస్థాయి విచారణ ఫిబ్రవరి చివరిలో జరగనుంది. పిల్లలు ఈ నిషేధాన్ని తప్పించుకోవడానికి వీపీఎన్‌లను ఉపయోగించి తమ స్థానాన్ని మార్చుకుంటారని ఆయన అంచనా వేశారు. 'పిల్లలు దీన్ని తప్పించుకుంటారు, ఆ తర్వాత వారు తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకుండా, మరింత ప్రమాదకరమైన 'అండర్‌గ్రౌండ్' సోషల్ మీడియాను ఉపయోగిస్తారు'.. అని రూడిక్ హెచ్చరించారు.

హైకోర్టులో టీనేజర్ల పోరాటం

రిలేకు.. ఆస్ట్రేలియాలోని అతిపెద్ద నగరమైన సిడ్నీలో ఒక మిత్రుడు ఉన్నాడు. ఆగస్టులో 16 ఏళ్లు వచ్చే నోహ్ జోన్స్. మరో విద్యార్థిని మేసీ నైలాండ్‌లు ఈ చట్టాన్ని హైకోర్టులో సవాలు చేస్తున్నారు. ఈ చట్టం అక్రమంగా 2.6 మిలియన్ల యువ ఆస్ట్రేలియన్ల రాజకీయ భావవ్యక్తీకరణ స్వేచ్ఛ హక్కును లాగేసుకుంటుందని వారు వాదిస్తున్నారు. కాగా, సోషల్ మీడియా వల్ల తమ పిల్లలకు కలుగుతున్న హానిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారని ఆస్ట్రేలియా ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు ఈ సోషల్ మీడియా నిషేధాన్ని వ్యతిరేకిస్తూ 140 మందికి పైగా అంతర్జాతీయ విద్యావేత్తలు.. ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌కు రాసిన బహిరంగ లేఖపై సంతకం చేశారు.

'ఘాటైన' ముగింపు

ఆలుమగల మధ్య ఆహారపుటలవాట్ల చిచ్చు..

ఆరోజు గుజరాత్ హైకోర్టు గది నిశ్శబ్దంగా ఉంది.. కానీ అక్కడున్న ప్రతి ఒక్కరి చెవుల్లో రెండు పేర్లే మారుమోగుతున్నాయి.. అవి ఉల్లి, వెల్లుల్లి. దశాబ్దానికి పైగా సాగిన వైవాహిక బంధం, విడాకులకు దారి తీయడానికి కారణం ఈ రెండు వంట గది పదార్థాలే అంటే ఎవరైనా నమ్ముతారా?.. వంట గదిలో మొదలైన ఈ 'ఘాటైన' పోరు, దశాబ్దానికి పైగా సాగిన బంధానికి విడాకులతో తెరదించింది.

ఉల్లి, వెల్లుల్లితో గిల్లికజ్జాలు

2002లో ఒక్కటైన ఓ జంటకు.. అప్పటి వరకూ తమ భోజన అలవాట్లలోని తేడా ఒక సమస్యగా అనిపించలేదు. భార్య స్వామినారాయణ్ భక్తురాలు కావడంతో, మత నిబంధనల ప్రకారం ఉల్లి, వెల్లుల్లిని దూరంగా ఉంచేది. కానీ, భర్త, అత్తగారు మాత్రం వాటిని యథావిధిగా తీసుకునేవారు. మెల్లగా.. ఈ 'రుచుల' తేడా వారి బంధంలో చిచ్చు పెట్టింది. ఆలుమగల బంధంలో చీలిక తెచ్చింది. ఇంట్లో వేర్వేరుగా వంట చేసుకోవడం సర్వసాధారణమైంది. దాంతో ఆ ఇంట్లో ఆనందానికి బదులు అశాంతి పెరగడం మొదలైంది. అది ఉద్రిక్తతకు దారితీయడంతో భార్య బిడ్డను తీసుకుని అత్తారింటిని వీడింది. 2013లో భర్త ఫ్యామిలీ కోర్టులో విడాకులకు దరఖాస్తు చేస్తూ, ఆమె రాజీ పడకపోవడం క్రూరత్వమని వాదించాడు. సుదీర్ఘ వాదోపవాదాల తర్వాత, 2024లో ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసింది. భర్త భార్యకు భరణం చెల్లించాలని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ భార్య గుజరాత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టులో జరిగిన విచారణలో భార్య తరపు న్యాయవాది వాదిస్తూ.. మతపరమైన ఆహార నియమాలను భర్త పట్టించుకోకుండా, వాటి ప్రభావాన్ని పెంచి చూపారని వాదించారు. కాగా, తాము, తమ తల్లి ఎన్నిసార్లు ప్రయత్నించినా, ఉల్లి, వెల్లుల్లి లేని వంటలు వండి పెట్టినా.. ఆమె వైఖరి మారలేదని, అందుకే సమస్య కొనసాగిందని భర్త వివరించారు. ఒకానొక దశలో ఉద్రిక్తత కారణంగా ఉమెన్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశానని తెలిపారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

పదకొండేళ్ల బంధానికి బీటలు

ఒక చిన్న ఆహారపు అలవాటు.. వ్యక్తిగత నమ్మకంగా మొదలై, రెండు కుటుంబాలను విడదీసింది. చివరికి, దశాబ్దానికి పైగా సాగిన బంధం.. శూన్యమైన అంగీకారంతో ముగిసింది. ఆ రోజు కోర్టు గదిలో ఒక్కసారిగా ఉద్వేగం అలముకుంది. అర్థంపర్థం లేని పోరాటంతో ఇద్దరు దంపతులు కోల్పోయిన 11 ఏళ్ల విలువైన జీవితం.. అక్కడున్న వారి మనసుల్ని భారంగా మార్చింది.

విడాకులకు సరే..

అయితే, హైకోర్టులో వాదనల సందర్భంగా భార్య అనూహ్య నిర్ణయం తీసుకుంది. తాను విడాకులను వ్యతిరేకించడం లేదని కోర్టుకు తెలియజేసింది. దాంతో భర్త కూడా.. చెల్లించాల్సిన భరణం మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో.. కోర్టులో జమ చేయడానికి అంగీకరించారు. దంపతుల మధ్య పరస్పర అంగీకారం కుదరడంతో, హైకోర్టు భార్య పిటిషన్‌ను కొట్టివేసింది. ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన విడాకుల ఉత్తర్వును సమర్థించింది.

చట్టాలను భారంగా మారనీయం

ఎన్డీయే ఎంపీలతో భేటీలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రజల రోజువారీ జీవనం మరింత సులభంగా మార్చడమే వరుసగా మూడోసారి ఏర్పాటైన ఎన్డీయే ప్రభుత్వ అత్యంత ముఖ్యమైన లక్ష్యమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశంలోని పౌరులెవ్వరికీ ఏ చట్టమూ భారంగా మారనీయమన్నారు. నియమనిబంధనలు ఎల్లప్పుడూ ప్రజల సౌలభ్యం కోసమేనని ఆయన ఉద్ఘాటించారు. మంగళవారం ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. దేశంలో ప్రస్తుతం పూర్తిస్థాయి సంస్కరణలు స్పష్టమైన లక్ష్యంతో, ఎంతో వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఇవి పూర్తిగా పౌరుల సంక్షేమమే లక్ష్యంగా చేపట్టిన సంస్కరణలే తప్ప,ఆర్థిక, పరిపాలన పరమైన, లాభాపేక్షతో జరుగుతున్నవి కావన్నారు. ప్రజలకు నిత్యం ఎదురయ్యే అవరోధాలను, ఆటంకాలను తొలగించి, వారు తమ శక్తిసామర్థ్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని అభివృద్ధి చెందేందుకు వీలుకల్పించేవి అని ఆయన వివరించారు. ప్రజలకు హానిని, వేధింపులను, అసౌకర్యాలను కల్గించే ఎలాంటి చట్టాలను ప్రభుత్వం చేయబోదని స్పష్టీకరించారు. సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మీడియాకు ఈ విషయాలను వెల్లడించారు.

నేడు నూతన సీఐసీ ఎంపిక

ప్రధాని అధ్యక్షతన సమావేశం కానున్న కమిటీ

న్యూఢిల్లీ: సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్(సీఐసీ), ఇతర కమిషనర్లను ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగే సమావేశంలో ఖరారు చేయనున్నారు. కమిటీలో ప్రధాని మోదీ, ఓ కేంద్ర మంత్రితోపాటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఉన్నారు. సమావేశంలో ఖాళీగా ఉన్న సీఐసీ చీఫ్ పదవితోపాటు మరో ఎనిమిది మంది కమిషనర్ల పేర్లను ఖరారు చేస్తారని భావిస్తున్నారు. సీఐసీలో పలు పోస్టులు ఏళ్లుగా ఖాళీగా ఉన్నాయంటూ దాఖలైన పిటిషన్‌పై ఈ నెల ఒకటో తేదీన స్పందించిన కేంద్రం 10వ తేదీన ఎంపిక చేస్తామని సుప్రీం కోర్టుకు తెలపడం తెల్సిందే.

చైనాలో మాజీ అధికారికి ఉరి శిక్ష

బీజింగ్: తీవ్ర అవినీతి ఆరోపణలున్న ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థ మాజీ అధికారిని చైనా కమ్యూనిస్ట్ ప్రభుత్వం మంగళవారం ఉరి శిక్ష అమలు చేసింది. హువారొంగ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ లిమిటెడ్ అనే ప్రభుత్వ సంస్థకు బాయి తియాన్‌హుయి 2014–2018 మధ్య కాలంలో జనరల్ మేనేజర్‌గా వ్యవహరించారు. ఆ సమయంలో ఆయన రూ.1,300 కోట్ల లంచాలు తీసుకుని, రుణాల మంజూరు, ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. వీటితో సామాజికంగా ప్రతికూల ప్రభావం పడిందని, ప్రభుత్వ, ప్రజల ప్రయోజనాలు దెబ్బతిన్నాయని దర్యాప్తు అధికారులు ఆరోపించారు. ఈ నేరాలు రుజువు కావడంతో తియాంజిన్‌లోని మధ్యంతర పీపుల్స్ కోర్టు 2024 మేలో బాయి తియాన్‌హుయికి మరణశిక్ష విధించింది. అతడి ఆస్తులన్నిటినీ తక్షణమే స్వాధీనం చేసుకుని, ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కేసుపై మళ్లీ విచారణ చేపట్టాలని బాయి పెట్టుకున్న అర్జీని 2025 ఫిబ్రవరిలో తియాంజిన్‌లోని హయ్యర్ పీపుల్స్ కోర్టు కొట్టివేసింది. తాజాగా, సుప్రీం పీపుల్స్ కోర్టు(ఎస్‌పీసీ) ధ్రువీకరించడంతో మంగళవారం ఉరి శిక్షను అమలు చేశారు.

సీఏఐఆర్ ఉగ్రవాద సంస్థ: ఫ్లోరిడా గవర్నర్

ఫ్లోరిడా: అమెరికాలోని అతి పెద్ద ముస్లిం పౌర హక్కుల సంఘాన్ని ఉగ్రవాద సంస్థగా ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిసాంటిస్ ప్రకటించారు. కౌన్సిల్ ఆన్ అమెరికన్–ఇస్లామిక్ రిలేషన్స్(సీఏఐఆర్)ను విదేశీ ఉగ్రవాద సంస్థగా ప్రకటిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వును సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సీఏఐఆర్, ఇతర ముస్లిం బ్రదర్‌హుడ్ సంస్థలకు మద్దతిచ్చినవారికి ఎలాంటి కాంట్రాక్టులు, ఉపాధి, నిధులు అందించకుండా ఉండాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. అయితే.. ఈ లేబులింగ్‌ను సీఏఐఆర్ వ్యతిరేకించింది. ఫ్లోరిడా ప్రకటన రాజ్యాంగ విరుద్ధమని, పరువు నష్టం కలిగించేలా ఉందని సీఏఐఆర్ ప్రకటించింది. డిసాంటిస్‌పై కోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు సీఏఐఆర్ ఫ్లోరిడా చాప్టర్ తెలిపింది.

ఉమర్‌కు ఆశ్రయమిచ్చిన వైద్యుడి అరెస్ట్

న్యూఢిల్లీ: ఢిల్లీలో కారు పేలుడుతో సంబంధమున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు మరో వైద్యుడిని అరెస్ట్ చేశారు. ఆత్మాహుతికి పాల్పడిన డాక్టర్ ఉమర్–ఉన్–నబీకి ఆశ్రయమివ్వడంతోపాటు నిషేధిత జైషే మహ్మద్ గ్రూప్ కుట్రకు సంబంధించిన సాక్ష్యాలను ధ్వంసం చేసిన ఆరోపణలపై డాక్టర్ బిలాల్ నసీర్ మల్లాను అదుపులోకి తీసుకున్నారు. కశ్మీర్‌లోని బారాముల్లాలో మంగళవారం బిలాల్‌ను అరెస్ట్ చేశారు. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లయింది. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు పదార్థాలున్న కారును నడిపి 15 మంది మృతికి కారణమైన డాక్టర్ ఉమర్‌ను గురించి ఇతడికి పూర్తిగా తెలుసని ఎన్ఐఏ అధికారులు తెలిపారు.

పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం పార్లమెంట్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ. చిత్రంలో రాహుల్, ప్రియాంక, ఖర్గే, అఖిలేశ్ తదితరులు

గోవా నైట్ క్లబ్ ప్రమాదం... ఇద్దరిపై లుకౌట్ నోటీసులు

న్యూఢిల్లీ/పనజీ: 25 నిండు ప్రాణాలు బలిగొన్న గోవా నైట్ క్లబ్ అగ్నిప్రమాదం ఉదంతంపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. దీనికి సంబంధించి క్లబ్ యజమానులుగా భావిస్తున్న అజయ్ గుప్తా అనే భారతీయునితో పాటు సురేందర్ కుమార్ ఖోస్లా అనే బ్రిటిష్ జాతీయునిపై మంగళవారం లుకౌట్ సర్క్యులర్ జారీ చేశారు. ప్రాథమిక యజమానులుగా చెబుతున్న సౌరబ్ లూథ్రా, గౌరవ్ లూథ్రా ప్రమాదం జరిగిన గంటల వ్యవధిలోనే థాయ్ లాండ్ కు పారిపోవడం తెలిసిందే. వారిని తిరిగి రప్పించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నట్టు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం వారిపై ఇంటర్ ఆయిల్ బ్లూ కార్నర్ నోటీసు జారీ చేసినట్టు పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి దాకా ఐదుగురిని అరెస్టు చేసినట్టు డీఐజీ వర్షా శర్మ తెలిపారు. మరోవైపు నిబంధనలు ఉల్లంఘించి కట్టిన ఆ క్లబ్ మొత్తాన్నీ మంగళవారం నేలమట్టం చేశారు.

సింధు దేశ్ డిమాండ్ నేపథ్యంలో కరాచీలో ఉద్రిక్తతలు

కరాచీ: పాకిస్తాన్‌లో ప్రత్యేక సింధుదేశ్‌ను డిమాండ్ చేస్తూ జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. రాళ్లదాడి, విధ్వంసం, పోలీసులతో ఘర్షణలతో కరాచీలో ఉద్రిక్తతలు చెలరేగాయి. సింధీ సంస్కృతి దినోత్సవం సందర్భంగా నిరసనకారులు 'జియే సింధ్ ముత్తహిదా మహజ్'(జేఎస్ఎస్ఎమ్) సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వీధుల్లోకి వచ్చారు. ప్రత్యేక సింధు దేశ్‌ను డిమాండ్ చేస్తూ 'ఆజాదీ', 'పాకిస్తాన్ ముర్దాబాద్' నినాదాలు చేశారు. అధికారులు ర్యాలీ మార్గాన్ని మళ్లించడం ఉద్రిక్తతలకు దారి తీసింది. నిరసనకారుల్లో కొందరు ఆగ్రహంతో భద్రతా సిబ్బందిపై రాళ్ళు రువ్వారు. ఈ ఘటనలో ఐదుగురు పోలీసులు గాయపడ్డారు. నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు టియర్‌గ్యాస్ ప్రయోగించారు. ఆస్తులను ధ్వంసం చేయడం, పోలీసులపై దాడులు చేసినవారిని అరెస్టు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు 45 మందిని అరెస్టు చేశారు.

హక్కుల ఉల్లంఘన ఆరోపణలు..

ప్రావిన్స్‌లో మానవహక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని సింధీ సంస్థ జేఎస్ఎస్ఎమ్ ఐక్యరాజ్యసమితికి విజ్ఞప్తి చేసింది. కిడ్నాప్‌లు, హింస, హక్కుల కార్యకర్తలు, జర్నలిస్టుల హత్యలు జరుగుతున్నాయని సంస్థ చైర్ పర్సన్ షఫీ బర్ఫత్ ఆరోపించారు. సింద్, భారత్ మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాల రీత్యా ప్రధాని నరేంద్రమోదీ తమకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

విభజనతో ప్రత్యేక డిమాండ్..

సింధునదికి సమీపంలో ఉన్న ఈ ప్రాంతం 1936 వరకు బాంబే ప్రెసిడెన్సీలో ఉండేది. ఆ తరువాత 1947 విభజన వరకు సింధ్ ప్రావిన్స్ ప్రత్యేక ప్రాంతంగా ఉంది. విభజన తరువాత పాకిస్తాన్‌లో భాగమైంది. పాక్ బంజాబీల అణచివేత, దోపిడీకి ఈ ప్రాంతంలోని ప్రజలు గురవుతున్నార నే ఆందోళనతో ప్రత్యేక సింద్ దేశ్ డిమాండ్ 1967లో ప్రారంభమైంది. 1971లో బంగ్లాదేశ్ విభజన తరువాత ఇది మరింత ఊపందుకుంది.

సమస్యలను పరిష్కరించండి.. లేకుంటే అరాచకానికి దారి తీస్తుంది

ఎస్ఐఆర్‌లో పాల్గొనే బీఎల్‌వోల ఆత్మహత్యలు.. ఇతర అధికారుల ఒత్తిళ్లపై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో కొనసాగుతున్న ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)లో పాల్గొనే బూత్ లెవల్ అధికారు(బీఎల్‌వో)ల బలవన్మరణాలు, సిబ్బందిపై అధికారుల ఒత్తిళ్లపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి ఒరవడులకు వెంటనే చెక్ పెట్టాలని, లేకుంటే అరాచకానికి దారి తీసే ప్రమాదముందని వ్యాఖ్యానించింది. అదే సమయంలో, ఎస్ఐఆర్ ప్రక్రియకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అంతగా సహకరించకపోవడంపైనా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. క్షేత్రస్థాయిలో ఎలాంటి అడ్డంకులు లేకుండా ఎస్ఐఆర్ కొనసాగాలని కోరుతున్నట్లు తెలిపింది. రాష్ట్ర యంత్రాంగాల నుంచి సహకారం అందని సందర్భాలు, బీఎల్‌వోలకు ఏవైనా అడ్డంకులు ఎదురవుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని, అవసరమైన ఆదేశాలను జారీ చేస్తామని ఎన్నికల కమిషన్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీకి ధర్మాసనం హామీ ఇచ్చింది.రాష్ట్ర ప్రభుత్వం సహకరించకుంటే స్థానిక పోలీసుల సాయం కోరుతామని, అప్పటికీ పరిస్థితిలో మార్పు రాకుంటే కేంద్ర బలగాలను అడుగుతామని రాకేశ్ ద్వివేది తెలపగా, రాష్ట్ర పోలీసులు ఈసీ పరిధిలోకి రారని ధర్మాసనం పేర్కొంది. ఎస్ఐఆర్‌లో పాలుపంచుకునే, బీఎల్‌వోలు, ఇతర అధికారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా ఈసీకి రాజ్యాంగ అధికారాలున్నాయని రాకేశ్ ద్వివేది తెలిపారు. స్పందించిన ధర్మాసనం.. పరిస్థితి చేయజారకుండా తగు చర్యలు తీసుకోండి, లేకుంటే అరాచక తలెత్తుతుందని హెచ్చరికలు చేసింది. బెంగాల్‌లో ఎస్ఐఆర్‌లో పాల్గొనే బీఎల్‌వోలు ఇతర అధికారులకు బెదిరింపులు వస్తున్నాయని, ఓటర్ల జాబితా ప్రచురించే వరకు రాష్ట్ర పోలీసులను ఈసీకి డిప్యూటేషన్‌పై పంపించేలా ఆదేశాలివ్వాలని సనాతని సన్సద్ సంస్థ వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం పై విధంగా పేర్కొంది. పిటిషనర్ పేర్కొన్న అంశాలపై స్పందించాలని ఆదేశిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఈసీకి ఆదేశాలు జారీ చేసింది.

మద్రాస్ హైకోర్టు జడ్జిని తొలగించాలి

లోక్‌సభ స్పీకర్‌కు డీఎంకే, ప్రతిపక్షాల నోటీస్

న్యూఢిల్లీ: మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్‌ను తొలగించాలంటూ ప్రవేశపెట్టే తీర్మానంపై డీఎంకే సారథ్యంలో ప్రతిపక్షాల ఎంపీలు మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు నోటీసు అందజేశారు. తమిళనాడులోని మదురై జిల్లాలో ఉన్న సుబ్రమణ్య స్వామి ఆలయం వద్ద దర్గా సమీపంలోని స్తంభంపై దీపం వెలిగించేందుకు అడ్డంకులు తొలగించాలంటూ జడ్జి అధికారులను ఆదేశించారు. అలా దీపం వెలిగించడం ముస్లింల హక్కులకు భంగం కలిగించినట్లు కాదని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ తీర్పు మత పరమైన ఉద్రిక్తతలకు కారణమైందని అధికార డీఎంకే అంటోంది. డీఎంకే పార్లమెంటరీ పార్టీ నేత కనిమొళి సారథ్యంలో స్పీకర్‌ను కలిసిన బృందంలో ఎస్పీ నేత అఖిలేశ్, కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ తదితరులున్నారు. నోటీసుపై 100 మంది ఎంపీలు సంతకాలు చేశారు. దీనిని లోక్‌సభ స్పీకర్‌దే అంతిమ నిర్ణయం.

జడ్జి ఛాంబర్ నుంచి రెండు యాపిల్స్ చోరీ.. కేసు నమోదు చేసిన పాక్ పోలీసులు

లాహోర్: పాకిస్తాన్‌లోని ఓ సెషన్స్ కోర్టు జడ్జి ఛాంబర్ నుంచి రెండు యాపిల్స్‌తో పాటు ఒక హ్యాండ్‌వాష్ బాటిల్ చోరీకి గురైన ఘటనపై కేసు నమోదైంది. దీనిపై పాకిస్తానీ పీనల్ కోడ్ సెక్షన్ 380 కింద కేసు నమోదు చేశారు. నేరం రుజువైతే, దొంగకు కనీసంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండు పడే అవకాశాలున్నాయి. ఈ నెల 5వ తేదీన జరిగిన చోరీపై అదనపు సెషన్స్ జడ్జి నూర్ ముహమ్మద్ బసోమ్లీ ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సిబ్బంది తెలిపారు. దొంగ ఎత్తుకుపోయిన రెండు యాపిల్స్, హ్యాండ్ వాష్ బాటిల్ మొత్తం విలువ వెయ్యి పాకిస్తానీ రూపాయలుగా పేర్కొంటూ పంజాబ్ ప్రావిన్స్‌లోని లాహోర్ నగర పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పాకిస్తాన్ చరిత్రలో అతిపెద్ద చోరీ కేసుగా పేర్కొంటూ దీనిపై హక్కుల కార్యకర్తలు జోకులు పేలుస్తున్నారు.

ఢిల్లీని నిర్మించిన తోమార్ రాజు?

మధ్యయుగ భారతదేశ చరిత్ర
(8వ శతాబ్దం - 18వ శతాబ్దం)

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

సోలంకీలు

అనిల్‌వారా రాజధానిగా గుజరాత్, కథియవార్ ప్రాంతాలను దాదాపు నాలుగు శతాబ్దాల పాటు సోలంకీలు పాలించారు. వీరిని అనిల్‌వారా చాళుక్యులు అని కూడా అంటారు.

మూలరాజు

అనిల్‌వారా కేంద్రంగా సోలంకీ రాజ్యాన్ని స్థాపించిన రాజు మూలరాజు. రాజధానిలో రెండు శైవాలయాలను నిర్మించాడు.

మొదటి భీమ

ఇతడి పాలనా కాలంలో గజనీ మహ్మద్ సోమనాథ్‌లోని దేవాలయాన్ని ముట్టడించాడు. భీముడు ఈ దాడిని ఎదుర్కోలేక కచ్‌కు పారిపోయాడు. ఇతడు తన కుమారుడు కర్ణ కోసం సింహాసనాన్ని త్యాగం చేశాడు.

కర్ణ

ఇతడు తన రాజ్యంలో అనేక నిర్మాణాలు చేపట్టాడు. పలు దేవాలయాలతోపాటు తన పేరుతో ఒక నగరాన్ని కూడా నిర్మించాడు. అదే నేటి అహ్మదాబాద్.

జయసింహ సిద్ధరాజు

సిద్ధరాజ అనే బిరుదుతో ఇతడు సింహాసనాన్ని అధిష్టించాడు. సోలంకీలందరిలో అగ్రగణ్యుడిగా పేరుగాంచాడు. అనేక యుద్ధాలు చేసి పరమారులు, చాందేలులు, చౌహాన్‌లు, కల్యాణి చాళుక్యలను ఓడించాడు. మరోవైపు భాషా సాహిత్యాలను ప్రోత్సహించాడు. ఇతడి ఆస్థానంలోని ప్రముఖ కవి హేమచంద్రుడు. జయసింహుడు సిద్ధపురలో రుద్ర మహాకాల దేవాలయాన్ని నిర్మించాడు.

కుమారపాల

హేమచంద్రుడు ఇతడి ఆస్థాన కవిగానూ కొనసాగాడు. కుమారపాల చరిత్ర, త్రిశస్తి శలక పురుష, పరిశిష్ట పర్వన్ అనే గ్రంథాలను రచించాడు. ఇతడి ప్రభావంతో కుమారపాలుడు జైనమతాన్ని పోషించడమే కాకుండా తన రాజ్యంలో జంతువధను, జూదాన్ని నిషేధించాడు.

అజయపాల

ఇతడు జైన దేవాలయాలను ధ్వంసం చేసి, జైన మత గురువు రామచంద్రను వధించాడు.

రెండో మూలరాజు

ఇతడు బాలుడు కావడంతో తల్లి నాయికీదేవి సంరక్షకురాలిగా ఉండి రాజ్య పాలనను చేపట్టింది. వీరి ఆధ్వర్యంలోనే 1178 మౌంట్ అబూ యుద్ధంలో సోలంకీ సేనలు ఘోరీ మహ్మద్‌ను ఓడించాయి.

రెండో భీమ

ఇతడి వద్ద తేజపాల, వస్తుపాల అనే సోదరులు మంత్రులుగా ఉండేవారు. రెండో భీముడి పాలనా కాలంలో క్రీ.శ. 1197లో కుతుబుద్దీన్ ఐబక్ ఇతడి రాజ్యంపై దాడి చేశాడు. ఇల్‌టుట్‌మిష్ దాడిని వస్తుపాలుడు తిప్పికొట్టాడు. భీముడి తర్వాత ఈ రాజ్యాన్ని వాఘేలా వంశస్థులు ఆక్రమించారు. చివరికి అల్లావుద్దీన్ ఖిల్జీ మొత్తం గుజరాత్‌ను ఆక్రమించాడు.

చౌహాన్‌లు

ప్రతీహారుల తరహాలో చౌహాన్‌ల్లోనూ అనేక శాఖలున్నాయి. శాకంబరిని(అజ్మీర్)కేంద్రంగా చేసుకొని పాలించిన చౌహాన్ రాజ్యం వాటన్నింటిలోకి అతి ముఖ్యమైంది. వీరు మొదట ప్రతీహారులకు సామంతులుగా ఉండి తర్వాత స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు.

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

ద్రవ్య విధానం- చక్రవర్తి కమిటీ సిఫారసులు

- స్వాతంత్ర్యానంతరం దేశంలో పంచవర్ష ప్రణాళికల అమలు కోసం అవసరమైన వనరుల సమీకరణకు భారత ద్రవ్య వ్యవస్థ తోడ్పడింది.
- ఆర్థికాభివృద్ధిని త్వరితగతిన సాధించే క్రమంలో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించే దిశగా ద్రవ్య వ్యవస్థ పనిచేసింది.
- ద్రవ్యవ్యవస్థ పనితీరును సమీక్షించే నేపథ్యంలో రిజర్వ్‌బ్యాంకు 1982లో సుఖమోయ్ చక్రవర్తి అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసింది.
- ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతి నేపథ్యంలో ద్రవ్యవ్యవస్థ నిర్మాణ, నిర్వహణను సమీక్షించాలని కమిటీని కేంద్ర బ్యాంకు కోరింది.

వాసుదేవుడు

క్రీ.శ. 6వ శతాబ్దంలో చౌహాన్ వంశాన్ని స్థాపించిన రాజు వాసుదేవుడు.

వాక్పతి రాజు

వాసుదేవుడి అనంతరం పలువురు రాజులు పాలించిన తర్వాత వాక్పతి రాజు రాజ్యానికొచ్చాడు. ఇతడు పుష్కరలో ఒక శైవాలయాన్ని నిర్మించాడు. దీన్ని విమర్శకులు శివుడి కైలాసంతో పోల్చారు.

సింహరాజు

చౌహాన్ వంశంలోని తొలి స్వతంత్ర పాలకుడు సింహరాజు. ఇతడు మహారాజాధిరాజ అనే బిరుదును పొందాడు.

రెండో విగ్రహరాజు

ఇతడు చౌహాన్ రాజ్య వాస్తవ స్థాపకుడు. గుజరాత్‌పై దాడి చేసి మూలరాజును ఓడించాడు.

మొదటి పృథ్వీరాజు

రెండో విగ్రహరాజు తర్వాత పాలకుల్లో ముఖ్యమైన రాజు మొదటి పృథ్వీరాజు. పుష్కర్‌పై జరిగిన చాళుక్యుల దాడిని తిప్పికొట్టాడు. 700 మందిని అంతం చేశాడు.

రెండో అజయరాజు

శాకంబరికి గజ్నవీ రాజుల నుంచి పొంచి ఉన్న ముప్పును దృష్టిలో ఉంచుకొని ఇతడు అజయ యేరు(అజ్మీర్) అనే నూతన నగరాన్ని, కోటను నిర్మించాడు. తన రాజధానిని శాకంబరి నుంచి అజ్మీర్‌కు మార్చాడు. ఇతడు తన చివరికాలంలో రాజ్యాన్ని తన కుమారుడు అర్న రాజుకు అప్పగించి సన్యాసాన్ని స్వీకరించాడు.

నాలుగో విగ్రహరాజు

ఇతడు గొప్ప విజేత. అనేక ప్రాంతాలను జయించి తన రాజ్యంలో కలుపుకున్నాడు. తోమారులను ఓడించి వారి నుంచి ఢిల్లీని ఆక్రమించాడు. ఇతడు స్వయంగా కవి, సాహిత్య పోషకుడు. హరికేళి అనే నాటకాన్ని రచించాడు. మహాకవి సోమదేవుడు ఇతడి గురించి లలిత విగ్రహ రాజనాటకం అనే గ్రంథాన్ని రచించాడు. భోజుడు ధారలో నిర్మించిన సరస్వతి కంఠాభరణ విద్యాలయ నమూనాలో ఇతడు అజ్మీర్‌లో సంస్కృత కళాశాలను నిర్మించాడు. విశాల్‌పూర్ అనే నూతన నగరాన్ని కూడా నిర్మించాడు.

మూడో పృథ్వీరాజు

మూడో పృథ్వీరాజుకు ముందు అపరాంగ గేయ, రెండో పృథ్వీరాజు, సోమేశ్వర అనే రాజులు పాలించారు. చౌహాన్ రాజుల్లో అగ్రగణ్యుడు మూడో పృథ్వీరాజు. ఇతడు తన సమకాలీన రాజులైన గహద్వాలులు, చాందేలులు, సోలంకీలతో అనేక యుద్ధాలు చేశాడు. ఘోరీ మహ్మద్‌తో రెండు యుద్ధాలు చేశాడు. 1191లో మొదటి తరైన్ (స్థానేశ్వర్) యుద్ధంలో ఘోరీని ఓడించాడు. 1192లో జరిగిన రెండో తరైన్ యుద్ధంలో ఘోరీ మహ్మద్, పృథ్వీరాజును ఓడించి అంతమొందించాడు. అనంతరం పృథ్వీరాజు వారసులు రణతంభోర్ కేంద్రంగా కొంతకాలం పాటు పాలించారు. చివరికి అల్లావుద్దీన్ ఖిల్జీ ఈ రాజ్యాన్ని జయించి ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపివేశాడు.

మాదిరి ప్రశ్నలు

1. మహ్మద్ ఘోరీని మౌంట్ అబూ యుద్ధంలో ఓడించిన రాజు?
   1) మొదటి భీమ 2) రెండో మూలరాజ
   3) నాలుగో విగ్రహరాజు
   4) మూడో పృథ్వీరాజు
2. గుజరాత్‌పై జరిగిన ఇల్‌టుట్‌మిష్ దాడిని తిప్పికొట్టిన రాజు?
   1) రెండో భీమ 2) మొదటి భీమ
   3) మొదటి నాగభట 4) రెండో నాగభట
3. మౌంట్ అబూలోని విమల దేవాలయ నిర్మాతలు?
   1) చౌహాన్‌లు 2) సోలంకీలు
   3) పరమారులు 4) గహద్వాలులు
4. సోలంకీలు నిర్మించిన సూర్య దేవాలయం ఎక్కడ ఉంది?
   1) మార్తాండ్ 2) కోణార్క్
   3) మధుర 4) బరోడా
5. గజనీ మహ్మద్ ధ్వంసం చేసిన సోమనాథ్ దేవాలయాన్ని పునర్నిర్మించినవారు?
   1) రెండో భీమ 2) రెండో మూలరాజు
   3) విగ్రహరాజు 4) సామంతరాజు
6. అజ్మీర్ నగర నిర్మాత?
   1) నాలుగో విగ్రహరాజు
   2) మొదటి అజయరాజు
   3) రెండో అజయరాజు
   4) మూడో పృథ్వీరాజు
7. హరికేళి నాటకం అనే గ్రంథంలోని వ్యాఖ్యలు గోడలపై కలిగి ఉన్న కట్టడం?
   1) అర్హై దిన్‌కా జోప్రామసీద్
   2) కువ్వాతుల్ ఇస్లామ్ మసీద్
   3) అజ్మీర్‌లోని సరస్వతి మందిరం
   4) చిత్తోర్ కీర్తి స్తంభం
8. కవిబాంధవ అనే బిరుదు ఉన్న రాజు?
   1) మూడో పృథ్వీరాజు
   2) నాలుగో విగ్రహరాజు
   3) కుమార పాల
   4) జయసింహ సిద్ధరాజు
9. ముస్లిం చరిత్రకారులు రామ్‌పితూర అని ఎవరిని పిలిచారు?
   1) రాణా ప్రతాప్‌సింగ్
   2) రాణా సంగ్రామ్‌సింగ్
   3) మూడో పృథ్వీరాజు
   4) గహద్వాల జయచంద్ర
10. మూడో పృథ్వీరాజు ఆస్థానంలోని ప్రముఖ కవులు?
    1) విద్యాపతి, జనార్దన
    2) జనార్దన, విశ్వరూప
    3) విశ్వరూప, జయనాక, పద్మనాభ
    4) పై వారందరూ
11. రాణీ సంయుక్తతో మూడో పృథ్వీరాజు ప్రేమాయణం గురించి రాసిన 'పృథ్వీ రాజ రాసో'' అనే గ్రంథ రచయిత?
    1) చాంద్ బర్దాయ్
    2) మాలిక్ మహ్మద్ జయసీ
    3) జయనాక 4) అల్ బెరూనీ
12. ఢిల్లీని నిర్మించిన తోమార్ రాజు?
    1) వజ్రపాలుడు 2) అనంగపాలుడు
    3) వస్తుపాలుడు 4) తేజపాలుడు
13. 'నవ సాహసాంక చరితం' అనే గ్రంథాన్ని రచించిన సంస్కృత కవి?
    1) పద్మగుప్త 2) పద్మసాంభవ
    3) ధనంజయ 4) జోనరాజ
14. చౌహాన్‌ల ఆగర్భ శత్రువులు?
    1) చాందేలులు 2) గహద్వాలులు
    3) సోలంకీలు 4) ప్రతీహారులు
15. జ్ఞానపీఠ్ అవార్డ్‌లోని వాగ్దేవి ప్రతిమతో సంబంధం ఉన్న రాజు?
    1) పరమార భోజుడు
    2) చాందేల విద్యాధరుడు
    3) చాళుక్య జయసింహుడు
    4) మూడో పృథ్వీరాజు
16. సోమనాథ్ దేవాలయాన్ని ఏ దేవుడికి అంకితమిచ్చారు?
    1) సూర్యుడు 2) గణేశుడు
    3) కార్తికేయుడు 4) శివుడు
17. శపథ లక్ష దేశమని ఎవరి రాజ్యానికి పేరు?
    1) చాందేలు 2) గహద్వాలు
    3) పరమారు 4) చౌహాన్
18. గజనీ మహ్మద్ దాడితో రాజధాని కనౌజ్‌ను వదిలి పారిపోయిన ప్రతీహార రాజు?
    1) యశ పాలుడు 2) రాజ్య పాలుడు
    3) రెండో భోజుడు 4) విజయ పాలుడు
19. దాసరూప గ్రంథాన్ని రచించిన పరమారుల ఆస్థాన కవి?
    1) హలాయుధుడు 2) ధనిక
    3) ధనంజయ 4) పద్మగుప్త
20. కవి రాజు అనే బిరుదు ఉన్న రాజులు?
    1) హాలుడు 2) సముద్ర గుప్తుడు
    3) భోజుడు 4) పై వారందరూ
21. పతంజలి యోగ సూత్రాలపై వ్యాఖ్యానం రాసిన రాజు?
    1) ముంజ 2) భోజ
    3) మొదటి భీమ 4) కర్ణ
22. ఏ రాజు పాలనా కాలంలో గజనీ మహ్మద్ సోమనాథ్ దేవాలయంపై దాడి చేశాడు?
    1) మొదటి భీమ 2) మొదటి నాగభటుడు
    3) మొదటి భోజ 4) జయసింహ సిద్ధరాజ
23. సిద్ధ హేమచంద్ర అనే ప్రముఖ వ్యాకరణ గ్రంథ రచయిత?
    1) సోమదేవుడు 2) హేమచంద్రుడు
    3) మహావీరాచార్యుడు 4) శ్రీహర్షుడు
24. తన రాజ్యంలో జంతువధను నిషేధించిన జైన రాజు?
    1) జయసింహ సిద్ధరాజ
    2) అమోఘవర్ష 3) కుమారపాల
    4) వాక్పతి ముంజ
25. కలికాల సర్వజ్ఞ అనే బిరుదు కలిగిన జైనకవి?
    1) సోమదేవసూరి
    2) హరి విజయసూరి
    3) కాలకాచార్యుడు
    4) హేమ చంద్రుడు

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 3; 5) 1; 6) 3; 7) 1; 8) 2; 9) 3; 10) 4; 11) 1; 12) 2; 13) 1; 14) 2; 15) 1; 16) 4; 17) 4; 18) 2; 19) 3; 20) 4; 21) 2; 22) 1; 23) 2; 24) 3; 25) 4.

ధ్వని దేనిలో ప్రయాణించదు?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
ఫిజికల్ సైన్స్

ధ్వని

ధ్వని ధర్మాలు

ధ్వని ప్రధానంగా నాలుగు రకాల ధర్మాలు కలిగి ఉంది. అవి..

1) పరావర్తనం 2) వివర్తనం
3) ప్రతిధ్వని 4) అనునాదం

1. **పరావర్తనం:** ధ్వని జనకం నుంచి విడుదలైన ధ్వని తరంగాలు, అవరోధ తలాన్ని తాకి వెనక్కి మరలే ధర్మాన్ని 'పరావర్తనం' అంటారు.

ఉదా: i) గబ్బిలాలు అతి ధ్వనులను విడుదల చేస్తాయి. అవి అవరోధ తలాన్ని తాకి వెనక్కి రావడం ద్వారా ఆ ధ్వనిని విని గబ్బిలాలు సంచరిస్తాయి.
ii) గోల్కొండ కోట ప్రధాన ద్వారం వద్ద శబ్దం చేస్తే, అది బహుళ పరావర్తనం చెంది కోటపై ఏడుసార్లు వినిపిస్తుంది.
iii) వైద్యులు ఉపయోగించే స్టెతస్కోప్ బహుళ పరావర్తన ధర్మం ఆధారంగా పని చేస్తుంది.

- **స్టెతస్కోప్ కనుగొన్నవారు:** లెన్నెక్

2. **వివర్తనం:** ధ్వని తరంగాలు అవరోధ అంచుల వెంట వంగి ప్రయాణించే ధర్మాన్ని 'వివర్తనం' అంటారు.

ఉదా: i) పక్కగదిలోని వ్యక్తుల మాటలు వినపడటం.
ii) ట్రాఫిక్ నుంచి వచ్చే ధ్వని తరగతి గదిలోని విద్యార్థికి వినిపించడం.

3. **ప్రతిధ్వని:** ధ్వని జనకం నుంచి విడుదలైన ధ్వని తరంగం ముందు దిశలో ప్రయాణిస్తూ, ఒక అవరోధ తలాన్ని తాకి తిరిగి ఉత్పత్తి అయిన బిందువుకు చేరే ప్రక్రియను 'ప్రతిధ్వని' అంటారు.

వినికిడి స్థిరత కాలం: ధ్వనికి, పరావర్తన ధ్వనికి మధ్య ఉండాల్సిన కనీస కాల వ్యవధిని వినికిడి స్థిరత కాలం అంటారు.

- **వినికిడి స్థిరత కాలం:** 0.1 సెకను

ప్రతిధ్వని వినిపించడానికి ధ్వని జనకానికి, పరావర్తన తలానికి మధ్య ఉండాల్సిన కనీస దూరం: 16.5 మీ.

వివరణ : ధ్వని వేగం = దూరం / కాలం

$$v = \frac{d}{t}$$

v → 330 మీ/సె (గాలిలో ధ్వని వేగం)
t → 0.1 సె (వినికిడి స్థిరత కాలం)
d → 2x (ధ్వని తరంగం ప్రయాణించిన మొత్తం దూరం)

$$\therefore 330 = \frac{2x}{0.1}$$

$$2x = 330 \times 0.1$$

$$x = \frac{330}{2} \times \frac{1}{10}$$

$$\therefore x = 16.5\ m$$

ప్రతిధ్వని ప్రయోజనాలు:
i) బావులు, లోయల లోతులు కొలవడానికి.
ii) రెండు భవనాల మధ్య దూరం (కచ్చితంగా) లెక్కించడానికి.

4. **అనునాదం:** దాదాపు సమాన పౌనఃపున్యం ఉన్న రెండు వస్తువుల్లో, ఒకదాన్ని కంపింపజేసినప్పుడు దాని ప్రాబల్యం వల్ల రెండో వస్తువు కూడా కంపించే దృగ్విషయాన్ని 'అనునాదం' అంటారు.

ఉదా:
i) పిల్లనగ్రోవి ఊదడం, ఈల వేయడం, రేడియో పనిచేయడం.
ii) గాజు పలక పౌనఃపున్యానికి, సమానమైన పౌనఃపున్యం ఉన్న ధ్వని చేసినప్పుడు అనునాదం వల్ల గాజు పలక పగిలిపోతుంది.
iii) బాంబు పేలినప్పుడు ఇల్లు కూలడం, బీటలు వారడం, కిటికీ అద్దాలు పగలడం.
iv) మూసిన గొట్టాల్లో ధ్వని తరంగాలు కలవడం వల్ల ధ్వని బిగ్గరగా వినపడటం.

మూసిన గొట్టాల్లో ధ్వని తరంగాలు విడుదల చేసేందుకు ఉపయోగించే పరికరం శృతి దండం. దీన్ని 1711లో ఇంగ్లండ్‌కు చెందిన సంగీత విద్వాంసుడు 'జాన్‌షోర్' కనుగొన్నాడు.

vii) కవాతు(మార్చ్‌ఫాస్ట్)తో వెళ్లే సైనికులు బ్రిడ్జిపై సాధారణంగా నడుస్తారు. కవాతు చేస్తే బ్రిడ్జి కూలిపోయే ప్రమాదం ఉంది.
viii) బ్రిడ్జి కింది నుంచి నీరు ప్రవహిస్తున్నప్పుడు దాని పౌనఃపున్యం నిరంతరం మారడం వల్ల సైనికులు కవాతు చేసినా కూలిపోదు.

విస్పందనాలు: రెండు పౌనఃపున్యాల మధ్య వ్యత్యాసాన్ని 'విస్పందనాలు' అంటారు.

- మానవుడు ఒక సెకనులో వినగలిగే గరిష్ట విస్పందనాల సంఖ్య 10.

డాప్లర్ ప్రభావం: ధ్వని జనకానికి, పరిశీలకుడికి మధ్య సాపేక్ష చలనం ఉన్నప్పుడు పరిశీలకుడు వినే దృశ్య పౌనఃపున్యంలో మార్పును 'డాప్లర్ ప్రభావం' అంటారు.

ప్రయోజనాలు:
i) సముద్ర గర్భంలో జలాంతర్గామి ఉనికి, లోతు, కదిలే దిశ, వేగాన్ని కనుగొనడానికి ఉపయోగించే సోనార్ పనిచేయడంలో.
ii) రక్త ప్రసరణలో లోపాలు తెలుసుకునేందుకు.
iii) గర్భస్థ శిశువు హృదయ స్పందనరేటు తెలుసుకోవడానికి.
iv) సూర్యుడి ఆత్మభ్రమణ రేటుని లెక్కించడానికి.
v) శని గ్రహంలో వలయాలను పరిశీలించడానికి.

గాలి

- గాలి వివిధ వాయువుల మిశ్రమం.
- ధ్వని వేగం యాంత్రిక తరంగాల రూపంలో ప్రయాణిస్తుంది.
- గాలిలో ధ్వనివేగాన్ని అనునాద ధర్మం ఆధారంగా 'డి.సి. మిల్లర్' కనుగొన్నారు.
- గాలిలో ధ్వని వేగం కనుగొనడానికి 'న్యూటన్' సమీకరణాన్ని ప్రతిపాదించారు.

న్యూటన్ సమీకరణం

$$V = \sqrt{\frac{P}{d}}$$

P → పీడనం; d → సాంద్రత

- న్యూటన్ సమీకరణం ద్వారా గాలిలో ధ్వని వేగాన్ని 280 మీ/సె.గా గుర్తించారు.
- న్యూటన్ సమీకరణం ద్వారా వచ్చిన విలువ 51 మీ/సె. తక్కువ.
- న్యూటన్ సమీకరణాన్ని లాప్లాస్ సరిచేశారు.
- 'న్యూటన్ – లాప్లాస్' ధ్వనివేగ సమీకరణం

$$V = \sqrt{\frac{\gamma P}{d}}$$

'γ' వాయు విశిష్టోష్ణాల నిష్పత్తి $\gamma = \frac{C_p}{C_v}$

C_P– స్థిరపీడనం వద్ద వాయు విశిష్టోష్ణం.
C_V– స్థిర ఘన పరిమాణం వద్ద వాయు విశిష్టోష్ణం.

గాలిలో ధ్వని వేగాన్ని ప్రభావితం చేసే భౌతిక రాశులు: గాలిలో ధ్వని వేగాన్ని ప్రధానంగా నాలుగు భౌతికరాశులు ప్రభావితం చేస్తాయి. అవి...

1) ఉష్ణోగ్రత 2) పీడనం
3) సాంద్రత 4) ఆర్ద్రత

1) ఉష్ణోగ్రత: గాలిలోని ధ్వనివేగం పరమోష్ణోగ్రత వర్గమూలానికి 'అనులోమానుపాతంలో' ఉంటుంది.

$$V \propto \sqrt{T}$$

1°C ఉష్ణోగ్రత పెరుగుదలకు గాలిలోని ధ్వని వేగంలో పెరుగుదల 0.61 మీ/సె.

2) పీడనం: ప్రమాణ వైశాల్యంపై పనిచేసే బలాన్ని 'పీడనం' అంటారు.

$$\text{పీడనం}\ (P) = \frac{F}{A}$$

ఎస్.ఐ. ప్రమాణం: న్యూ/మీ^{2}
సి.జి.ఎస్. ప్రమాణం: డైన్/సెం.మీ^{2}

- ధ్వనివేగంపై పీడన ప్రభావం ఉండదు.

$$\text{గాలిలో ధ్వని వేగం}\ (V) = \sqrt{\frac{\gamma P}{d}}$$

γ → స్థిరం
$\sqrt{P} \propto \sqrt{d}$

పీడనం పెరుగుదలకు అనుగుణంగా సాంద్రత కూడా పెరుగుతుంది. ఫలితంగా ధ్వని వేగంలో ఎలాంటి మార్పు ఉండదు.

3) సాంద్రత: ప్రమాణ ద్రవ్యరాశి ఉన్న వస్తువు ఆక్రమించే ఘన పరిమాణాన్ని 'సాంద్రత' అంటారు.

$$\text{సాంద్రత}\ (d) = \frac{m}{V}$$

ఎస్.ఐ. ప్రమాణం: కేజీ/మీ^{3}
సి.జి.ఎస్. ప్రమాణం: గ్రా/సెం.మీ^{3}

- ధ్వని వేగం సాంద్రత వర్గమూలానికి విలోమానుపాతంలో ఉంటుంది.

$$V \propto \frac{1}{\sqrt{d}}$$

- గాలి సాంద్రత పెరిగితే, ధ్వని వేగం తగ్గుతుంది.
- గాలి సాంద్రత తగ్గితే, ధ్వని వేగం పెరుగుతుంది.
- హైడ్రోజన్‌కు అత్యల్ప సాంద్రత ఉండటం వల్ల దానిలో ధ్వని వేగం అధికంగా 1230 మీ/సె. ఉంటుంది.
- పొడి గాలి సాంద్రత = 1 గ్రా/సెం.మీ.^{3}
- తడిగాలి సాంద్రత = 0.61 గ్రా/సెం.మీ.^{3}
- తడిగాలి సాంద్రత, పొడిగాలి సాంద్రత కంటే తక్కువ. కాబట్టి పొడిగాలిలో ధ్వని వేగం కంటే తడిగాలిలో ధ్వని వేగం అధికం.

4. ఆర్ద్రత (తేమ): గాలిలోని నీటి ఆవిరి శాతాన్ని 'ఆర్ద్రత' అంటారు.

- తేమ శాతం పెరిగితే గాలి సాంద్రత తగ్గి ధ్వని వేగం పెరుగుతుంది.
- తేమ శాతం పెరిగితే వర్షాకాలంలో ధ్వని వేగం పెరుగుతుంది.
- CO_2లో ధ్వని వేగం 260 మీ/సె.
- శూన్యంలో ధ్వని వేగం శూన్యం

ద్రవ పదార్థాల్లో ధ్వనివేగం:

- నీటిలో ధ్వని వేగం 1435 మీ/సె.
- ఉప్పు నీటిలో ధ్వని వేగం 1485 మీ/సె.
- 37 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద మానవ రక్తంలో ధ్వని వేగం 1570 మీ/సె.

ఘన పదార్థాల్లో ధ్వని వేగం: ఘన పదార్థాలకు ఉన్న ఒక ప్రత్యేక ధర్మం స్థితిస్థాపకత.

స్థితిస్థాపకత: ఒక వస్తువుపై బాహ్య బలాన్ని ప్రయోగించి, తొలగించినప్పుడు అది యథాస్థితికి వచ్చే ధర్మాన్ని 'స్థితిస్థాపకత' అంటారు. లేదా బాహ్యబలాల ప్రభావానికి గురికాకుండా వస్తువు తన స్థితిని కాపాడుకునే ధర్మాన్ని 'స్థితిస్థాపకత' అంటారు.

- స్థితిస్థాపకత ధర్మాన్ని రాబర్ట్‌హుక్ వివరించారు.
- రబ్బర్ కంటే స్టీల్‌కు స్థితిస్థాపకత ధర్మం అధికం.

కారణం: స్టీల్‌కు రబ్బర్ కంటే అధిక యంగ్ గుణకం, స్వల్ప విరూపణం ఉంటాయి.

- ప్రకృతిలో పరిపూర్ణ స్థితిస్థాపక వస్తువు లేదు. క్వార్ట్జ్ కానీ పరిపూర్ణ స్థితిస్థాపక వస్తువులా ప్రవర్తిస్తుంది.
- క్వార్ట్జ్ నుంచి బంగారాన్ని తయారు చేస్తారు.
- బంగారం పరమాణు సంఖ్య: 79
- ఇది అక్వారీజియంలో కరుగుతుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ధ్వని ఎందులో నెమ్మదిగా ప్రయాణిస్తుంది?
   ఎ) గాలి బి) గాజు
   సి) నీరు డి) చెక్క
2. ధ్వని దేని ద్వారా ప్రయాణించదు?
   ఎ) శూన్యం బి) ఉదజని
   సి) నీరు డి) ఉక్కు
3. గాలిలో ధ్వనివేగం?
   ఎ) 0 బి) 330 మి.మీ./సె.
   సి) 330 సెం.మీ/సె. డి) 330 మీ/సె.
4. తేమ ఉన్న గాలిలో ధ్వని వేగం పొడిగాలిలో కంటే ... ?
   ఎ) తక్కువ బి) ఎక్కువ
   సి) సమానం డి) చెప్పలేం
5. ధ్వని వేగం అత్యధికంగా సంభవించేది?
   ఎ) 0°C పొడిగాలిలో
   బి) 30°C పొడిగాలిలో
   సి) 0°C తడిగాలిలో
   డి) 30°C తడిగాలిలో
6. ధ్వని ఎందులో కంటే ఎందులో వేగంగా ప్రయాణిస్తుంది?
   ఎ) నీటిలో కంటే పొడిగాలిలో
   బి) ఇనుములో కంటే కొయ్యలో
   సి) గాలిలో కంటే ఇనుములో
   డి) నీటిలో కంటే హైడ్రోజన్‌లో
7. ధ్వని వేగం దేనిలో అధికం?
   ఎ) ద్రవ పదార్థాల్లో బి) ఘన పదార్థాల్లో
   సి) వాయువుల్లో డి) పైవన్నీ
8. హుక్ సూత్రం దేనితో సంబంధం కలిగి ఉంది?
   ఎ) స్థితిస్థాపకత బి) కాంతి
   సి) రేడియోధార్మికత డి) సాంద్రత

మాదిరి ప్రశ్నలు

9. వాయువుల్లో ఉష్ణోగ్రత పెరిగితే ధ్వనివేగం?
   ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
   సి) మారదు డి) తగ్గి, పెరుగుతుంది
10. కింది వాటిలో గాలిలో ధ్వని వేగాన్ని ప్రభావితం చేయనిది?
    ఎ) ఉష్ణోగ్రత బి) పీడనం
    సి) సాంద్రత డి) ఆర్ద్రత
11. 'స్టెతస్కోప్'ను ఎవరు కనుగొన్నారు?
    ఎ) పాల్సన్ బి) బాయిల్
    సి) లెన్నెక్ డి) ఎడిసన్
12. మానవుడు ఒక సెకన్‌లో వినగలిగే గరిష్ట విస్పందనాల సంఖ్య?
    ఎ) 50 బి) 10
    సి) 20 డి) 28
13. స్థితిస్థాపకత ధర్మం అధికంగా ఉండే పదార్థం?
    ఎ) రబ్బర్ బి) ఉక్కు
    సి) ప్లాస్టిక్ డి) మట్టిముద్ద
14. ప్రతిధ్వనిని వినేందుకు వ్యక్తికి, పరావర్తన తలానికి మధ్య ఉండాల్సిన కనిష్ట దూరం?
    ఎ) 6.5 మీ. బి) 16.5 మీ.
    సి) 16.5 సెం.మీ. డి) 26.5 మీ.

సమాధానాలు

1) డి; 2) ఎ; 3) డి; 4) బి; 5) డి; 6) సి; 7) బి; 8) ఎ; 9) ఎ; 10) బి; 11) సి; 12) బి; 13) బి; 14) బి.

‘పండితారాధ్య చరిత్ర’ను రాసిందెవరు?

కాకతీయ వాస్తు, శిల్ప రీతికి తలమానికం రామప్ప దేవాలయం. ఈ దేవాలయంలోని నందికి ఒక ప్రత్యేకత ఉంది. వీక్షకులు ఏ వైపు నుంచి చూసినా అది వారివైపే చూస్తున్నట్లు కనిపిస్తుంది. ఓరుగల్లు కోటలోని నిర్మాణాలు కాకతీయుల కాలంనాటివాస్తు, శిల్ప కౌశలాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ కోటను ఏకశిల చుట్టూ నిర్మించారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

కాకతీయ యుగ విశేషాలు

పన్నులు

కాకతీయుల కాలంలో స్థూలంగా అయిదు రకాల పన్నులుండేవి.

అవి: 1. భూమి పన్ను, 2. పారిశ్రామిక, ఆస్తి పన్నులు, 3. వృత్తి పన్నులు, 4. వ్యాపార పన్నులు, 5. ఇతర పన్నులు.

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ మార్గం భూమి శిస్తు. వర్తకం, పరిశ్రమలు, వృత్తులపై విధించే పన్నులు రెండో ఆదాయ మార్గం. పశుగ్రాసానికి పనికి వచ్చే పచ్చికబయళ్లపై వసూలు చేసే పన్ను, అడవుల కలపపై వేసే పన్ను మూడో ఆదాయ మార్గంగా ఉండేది. వర్తక సరకులు, ఎగుమతి దిగుమతులు, తయారైన వస్తువుల మీద వేసే పన్నును ‘సుంకం’గా పేర్కొనేవారు. సాధారణంగా సుంకాలు వసూలు చేసే అధికారం వర్తక శ్రేణులకు ఇచ్చేవారు.

న్యాయ పాలన

సామాన్యమైన వివాదాలన్నింటినీ గ్రామ సభల్లో గ్రామ ప్రభువులు పరిష్కరించేవారు. గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా ‘తలారి’ అనే గ్రామోద్యోగి చూసేవాడు. రాజే అంతిమ న్యాయ నిర్ణేత. యాజ్ఞవల్క్య స్మృతి లాంటి ప్రాచీన స్మృతి గ్రంథాల్లో పేర్కొన్న సూత్రాలను అనుసరించి ధర్మాసనాలు ఏర్పరిచేవారు. ఒకరిద్దరు రాజాధికారులతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సభల్లో న్యాయ సమస్యలు పరిష్కారమయ్యేవి. వీరిని ‘మహాజనులు’గా పేర్కొనేవారు. సమస్య పరిష్కారమైన వెంటనే సభ రద్దయ్యేది. ప్రస్తుతం గ్రామ పెద్దల మాదిరిగా ఈ మహాజనులు పనిచేసేవారు. తెగల్లో వివాదాలను ‘సమయాలే’ పరిష్కరించేవి.

సైనిక వ్యవస్థ

కాకతీయ సైన్యంలో చక్రవర్తి సైన్యం, నాయంకర సైన్యం అని రెండు విభాగాలు ఉండేవి. కాకతీయ చక్రవర్తులు సైన్యానికి స్వయంగా నాయకత్వం వహించేవారు. వీరి రాజ్యంలో స్థల, జల, వన, గిరి అనే నాలుగు రకాల కోటలు ఉన్నట్లు తెలుస్తోంది. కాకతీయుల కాలంలో ఓరుగల్లు, రాయచూరు, గోల్కొండ, భువనగిరి, రాచకొండ, దేవరకొండ, నల్లగొండ, పానుగల్లు కోటలు శత్రు దుర్భేద్యమైనవిగా పేరు పొందాయి.

ఆర్థిక పరిస్థితులు

కాకతీయుల కాలంలో ఆంధ్రదేశం సిరి సంపదలతో విలసిల్లినట్లు అమీర్ ఖుస్రూ, అబ్దుల్లా వాసఫ్, మార్కోపోలో లాంటి విదేశీ యాత్రికుల రచనల ద్వారా తెలుస్తోంది.

వ్యవసాయం: తెలంగాణా ప్రాంతంలో సాగు భూమిని, నీటి వనరులను పెంచడానికి కాకతీయులు ఎనలేని కృషి చేశారు. వీరు చెరువులు నిర్మించి నీటి పారుదలపై శ్రద్ధ వహించారు. రెండో బేతరాజు సెట్టి సముద్రం, కెరె సముద్రం, కేసరి సముద్రం చెరువులను నిర్మించాడు. గణపతిదేవుడు రాజ్యం నలుమూలలా అనేక చెరువులు నిర్మించాడు. గణపతిదేవుడి సేనాని రేచర్లరుద్రుడు 17,258 ఎకరాలకు సాగు నీరు అందించేవిధంగా పాకాల చెరువును నిర్మించాడు. దీని విస్తీర్ణం 12 చ.కి.మీ. రామప్ప చెరువును నిర్మించింది కూడా ఇతడే. రేచర్ల రెడ్లు 35 నీటి వనరులను ఏర్పాటు చేశారు. కాటచమూపతి కాట సముద్రం ; చౌడ చమూపతి చౌడ సముద్రం; నామిరెడ్డి సబ్బి సముద్రం, గౌర సముద్రం, కోమటి చెరువు; ఎరకసాని ఎరక సముద్రం నిర్మించారు. వీటితో పాటు చింతల సముద్రం, నామా సముద్రం కూడా ఉండేవి. చెరువుల నిర్మాణంలో పాల్గొన్న శ్రామికులకు దినసరి వేతనాలు చెల్లించేవారు. చెరువులతో పాటు ఊట కాలువలను కూడా నిర్మించారు. మూసీ నది నుంచి సాగే మూసెటి కాలువ; ఆలేరు నది నుంచి ఆలేటి కాలువ; కూచినేని కాలువ, రావిపాటు కాలువ, బొమ్మకంటి కాలువ, ఉటుంకాలువ, చింతల కాలువల గురించి పిల్లలమర్రి శాసనాల్లో పేర్కొన్నారు. ఏతం, మోటలతో కూడా వ్యవసాయం చేసేవారు. కొత్తగా పొలాలను సాగు చేయడానికి కాకతీయ రాజులు కృషి చేశారు. ప్రతాపరుద్రుడి కాలంలో అడవులను నరికేసి విశాల భూభాగాలను సాగులోకి తీసుకువచ్చారు. నేటి రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లోని అనేక గ్రామాలు ప్రతాపరుద్రుడి కాలంలో రూపొందిన వేనని ఆ గ్రామ కైఫీయతుల ద్వారా తెలుస్తోంది. తెలంగాణలోని మంథెన, కాళేశ్వరం, చెన్నూరు, నర్సంపేట, అచ్చంపేట, ఖమ్మం మెట్టు, కొత్తగూడెం అటవీ ప్రాంతాల్లోని గ్రామాల్లో ఎక్కువ భాగం కాకతీయుల కాలంలోనే ఏర్పడినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. గ్రామం, చెరువును నిర్మించడం నాడు పుణ్యకార్యంగా భావించేవారు. గ్రామాలను ఏర్పరచడానికి అన్ని వృత్తుల వారికి ప్రోత్సాహకాలు ఇచ్చేవారు. చాలా మంది కాకతీయ రాజులు, రాణులు అటవీ, బీడు భూములను వ్యవసాయ యోగ్యంగా చేశారు. వీరి పేరు మీద అనేక గ్రామాలు ఏర్పడ్డాయి. గణపవరం, ఘన్‌పూర్, మహాదేవపురం, రుద్రవరం, బయ్యారం, ముప్పవరం, కుందవరం మెదలైనవన్నీ వీటికి ఉదాహరణ. భూమిపై ప్రాథమిక స్వామ్యం రాజుది, ద్వితీయ స్వామ్యం వ్యక్తిది.

రైతులు వరి, గోధుమలు, కొర్రలు, జొన్నలు, మొక్కజొన్నలు, నీలిమందు, ఆముదాలు, నువ్వులు, పెసలు, కందులు, చెరకు, నూనెగింజలు, ఆవాలు, సజ్జలు, మినుములు, ఉలవలు, పత్తి, అల్లం, పసుపు, ఉల్లి తదితర పంటలు పండించేవారు. ఓరుగల్లు ప్రాంతంలో సువాసనలు వెదజల్లే బియ్యం తయారైనట్లు సాహిత్యం ద్వారా తెలుస్తోంది. ఆ కాలంలో కొబ్బరి, చెరకు, మామిడి, జామ, అరటి తోటలు విస్తారంగా ఉండేవి. సాధారణంగా ప్రతి గ్రామంలో బెల్లం, నూనె గానుగలు ఉండేవి. పశు సంపద పుష్కలంగా ఉండేది.

పరిశ్రమలు: నాడు వ్యవసాయంతో పాటు అనేక పరిశ్రమలు కూడా ఉండేవి. పాల్కురికి సోమనాథుడు ‘పండితారాధ్య చరిత్ర’లో ఇరవైకి పైగా వస్త్రాల గురించి పేర్కొన్నాడు. ఓరుగల్లులో రత్న కంబళ్లు, ముఖమల్ వస్త్రాలు నేసేవారు. ఏకామ్రనాథుడు ఓరుగల్లులో చిత్తరువులు రాసే ఇళ్లు 1500 వరకు ఉండేవని పేర్కొన్నాడు. నాడు చిత్రకళకు మంచి ఆదరణ ఉండేది. పాల్కురికి ‘బసవపురాణం’లో యాభై రకాల దుస్తుల పేర్లను ప్రస్తావించాడు. కాకతీయుల రాజ్యంలో శ్రేష్ఠమైన సన్నని వస్త్రాలు నేసేవారని, అవి సాలెపురుగు జాలె మాదిరిగా ఉండేవని మార్కోపోలో ప్రశంసించాడు. వీటి ఆధారంగా ఆ కాలంలో పద్మశాలీలకు మంచి నైపుణ్యం ఉండేదని తెలుస్తోంది. పల్లకీల మీద చెక్కిన నగిషీల వర్ణనను పరిశీలిస్తే నాటి వడ్రంగుల పని నైపుణ్యం అర్థమవుతుంది. పంచలోహాలతో వివిధ రకాల వస్తువులను తయారు చేసేవారు. నిర్మల్‌లో తయారైన కత్తులకు డమాస్కస్‌లోనూ మంచి ఆదరణ ఉండేది. గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులున్నట్లు మార్కోపోలో రాశారు. వ్యవసాయానికి అవసరమైన పరికరాలను గ్రామాల్లోనే తయారు చేసేవారు. పానగల్లు, చండూరులో దేవాలయాల్లో ఉపయోగించే కంచు గంటలు, పళ్లాలు, పాత్రలను రూపొందించేవారు.

వర్తక – వాణిజ్యం: శాతవాహనుల తర్వాత క్రమంగా క్షీణించిన దేశీయ, విదేశీ వాణిజ్యాన్ని కాకతీయులు పునరుద్ధరించారు. కాకతీయుల కాలంలో దేశీయ వాణిజ్యానికి ప్రధాన కేంద్రం ఓరుగల్లు. ఆ తర్వాత తెలంగాణలో మంథెన, అలంపురం, జడ్చర్ల, మగతల, పేరూరు ప్రధాన వాణిజ్యకేంద్రాలుగా ఉండేవి. పలనాటి సీమ నుంచి వాడపల్లి, నకిరెకల్, పిల్లలమర్రి మీదుగా వ్యాపారులు వరంగల్ వచ్చేవారు. బళ్లారి–చిత్తూరు, రాయచూరు–కొలనుపాక, బీదరు–కొలనుపాక, కల్యాణి–కొలనుపాక–అనుమకొండ, బీదరు–పటాన్‌చెరువు–వరంగల్ మొదలైనవి ముఖ్యమైన వాణిజ్య మార్గాలుగా ఉండేవి.

కాకతీయుల పాలనలో తెలంగాణలో వర్తక శ్రేణుల నిర్మాణంలో గుర్తించదగిన మార్పు వచ్చింది. ఆ కాలంలో వ్యాపారం బలిజలకు, వైశ్యులకే పరిమితం కాలేదు. రెడ్లు, నాయుళ్లు, బోయలు, దాసర్లు, తెలికలు, పద్మశాలీలు, వ్యవసాయదారుల లాంటి ఉత్పత్తిదారులు, కమ్మరి, కంసాలి, మేదరి లాంటి వృత్తి కులాల వారు వ్యాపారంలోకి వచ్చారు. వివిధ వృత్తికారులు, ఉత్పత్తిదారులు సొంత సమయాలను ఏర్పరచుకొని తమ కులవృత్తులతో పాటు వ్యాపారాలను నిర్వహించుకునేవారు. వీరిలో కొంత మంది కేవలం తమ ఉత్పత్తులనే అమ్ముకునేవారు. అందువల్ల ఇంత మంది వ్యాపారంలోకి వచ్చినప్పటికీ ప్రధానంగా వ్యాపారం వైశ్యుల చేతిలోనే ఉండేది. గోధుమ, పెసలు, వడ్లు, జొన్నలు, ఉప్పు, నూనె, నెయ్యి, మిరియాలు, ఆవాలు, తేనె, తగరం, రాగి, కర్పూరం, కస్తూరి, పట్టు, రత్నాలు, ముత్యాలు, పూసలు, పసుపు, ఉల్లిగడ్డలు, అల్లం, నూలు, దుంపలు మొదలైన ఉత్పత్తుల వ్యాపారం జరిగేది.

విదేశీ వాణిజ్యం: కాకతీయుల కాలంలో ‘మోటుపల్లి’ విదేశీ వాణిజ్యానికి ప్రసిద్ధమైన రేవు పట్టణంగా గుర్తింపు పొందింది. చాళుక్య, చోళ రాజుల కారణంగా దెబ్బతిన్న విదేశీ వ్యాపారాన్ని గణపతిదేవుడు ఈ రేవు పట్టణం ద్వారా పునరుద్ధరించాడు. దీని ద్వారా ఇండోనేషియా, జావా, సుమత్రా, జపాన్, మలయా, బర్మాతో వ్యాపారం చేసేవారు. మార్కోపోలో ఈ రేవు పట్టణాన్ని సందర్శించాడు. ఇక్కడి నుంచి ఎగుమతయ్యే వస్తువుల్లో వజ్రాలు, పట్టుతో తయారయ్యే సన్నని వస్త్రాలు ముఖ్యమైనవని అతడు పేర్కొన్నాడు. కాకతీయుల నాణేలు ఎక్కువగా లభించలేదు. కానీ శాసనాలు, సాహిత్యంలో నాణేల ప్రస్తావన ఉండేది.

సాంఘిక పరిస్థితులు

కాకతీయుల కాలంనాటి సంఘంలో ప్రధానంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలు ఉండేవి. ప్రతి కులంలో అనేక ఉపకులాలు ఏర్పడ్డాయి. ఏకామ్రనాథుడు ‘ప్రతాపచరిత్ర’లో, వినుకొండ వల్లభరాయుడు ‘క్రీడాభిరామం’లో కాకతీయుల కాలంనాటి వివిధ వృత్తుల గురించి ప్రస్తావించారు. కోమట్లు, ఈదురవారు, గొల్లవారు, అక్కలవారు (ఆగసాల), సాలెవారు, మంగలులు, కుమ్మరివారు, బోయవారు, రుంజులు, పిచ్చుకుంట్లు, పంబల, బవని, మేదర, గాండ్ల మొదలైన కులాల పేర్లను శాసనాల్లోనూ పేర్కొన్నారు.

హిందూ మతాన్ని సంస్కరించే ఉద్దేశంతో శైవ, వైష్ణవ మతాలు ఆవిర్భవించాయి. కుల నిర్మూలన కోసం పుట్టిన వీటి ద్వారా సంఘంలో కొత్త కులాలు ఏర్పడ్డాయి. ఈ విధంగా శైవుల్లో లింగాయతులు, బలిజలు, జంగాలు, తంబళ్ల మొదలైన కులాలు ఏర్పడ్డాయి. వైష్ణవుల్లో నంబులు, సాతానులు, దాసర్లు మొదలైన కులాలు ఆవిర్భవించాయి. ‘అష్టాదశ కులాలు’ అప్పటికే ప్రాచుర్యంలో ఉన్నాయి.

కాకతీయుల కాలంలో బాల్యవివాహాలు జరిగాయి. అనులోమ, ప్రతిలోమ వివాహ పద్ధతులు ఉండేవి. రుద్రమదేవి కుమార్తె రుయ్యమను బ్రాహ్మణ మంత్రి ఇందులూరి అన్నయ్య దేవుడు పెళ్లి చేసుకోవడం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. అయినప్పటికీ కుల నిర్మూలన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కాకతీయుల కాలంలో వెలమలు సంఘ సంస్కర్తలుగా, రెడ్లు పూర్వాచార పరాయణులుగా ఉన్నట్లు తెలుస్తోంది. నాడు రాజకీయంగా ప్రాబల్యం వహించిన రెడ్లు, వెలమల మధ్య అధికారం కోసం పోటీ ప్రారంభమైంది. ఈ కాలంలో అష్టాదశ వర్ణాల్లో అగ్రవర్ణమైన బ్రాహ్మణ వర్గానికి చెందినవారు రాజకీయ ప్రాబల్యాన్ని కోల్పోయారు. రాజకీయాధికారం చతుర్థ వర్ణ పరమైంది. క్షత్రియ వంశాలు నామామాత్రంగా అధికారంలో ఉండేవి.

కాకతీయుల కాలంనాటి సాంఘిక జీవితానికి సంబంధించిన ఒక ప్రధాన లక్షణం కుల సంఘాలు. వీటిని ‘సమయములు’ అనేవారు. నగరాలు, గ్రామాలు పేటలుగా విభజించి ఉండేవి. అక్కలవాడ, భోగంవీధి, వెలిపాళె, మేదరవాడ, మోహరినాడు మొదలైనవి ఇలాంటివే. పూటకూళ్ల ఇళ్లు ఉండేవి. బసవ పురాణం ఆధారంగా ఆనాటికే వెట్టి వ్యవస్థ ఉన్నట్లు తెలుస్తోంది. మహిళలు పాత్ర, గొండ్లి, పేరణి, కోలాటం, గొబ్బిళ్లు, గుర్రం, భంజళి మొదలైన క్రీడలతో వినోదం పొందేవారు.

వాస్తు, శిల్ప కళ

కాకతీయ రాజులు, వారి సామంతులు అనేక జైన, శైవ, వైష్ణవాలయాలను నిర్మించారు. దేవాలయ నిర్మాణంలో కాకతీయులు పశ్చిమ చాళుక్యుల వాస్తు విధానాన్ని అనుసరించారు. వీరు త్రికూటాలయాలను ఇదే పద్ధతిలో నిర్మించారు. బేతిరెడ్డి భార్య ఎరకేశ్వరాలయం నిర్మించారు. నామిరెడ్డి పిల్లలమర్రిలో కాటేశ్వర, కాచేశ్వర, నామేశ్వర ఆలయాలను నిర్మించాడు. పాలంపేట, పిల్లలమర్రి, పానగల్లు, హన్మకొండలో ఉన్న ఆలయాలను త్రికూట పద్ధతిలోనే నిర్మించారు.

నంది విగ్రహాలు కాకతీయ శిల్ప ప్రాభవానికి నిదర్శనాలు. కాకతీయ శిల్పం చాళుక్యుల శిల్పం కంటే నిగ్గ తేలి ఉంది. ఇది కొంత ప్రాంతీయ లక్షణాలను సంతరించుకొని ఉంటుంది. దేశీయ నృత్య రీతులకు ప్రాతినిధ్యం వహిస్తున్న నాట్యగత్తెల కోలాట దృశ్యాలు కూడా కాకతీయుల కళా నైపుణ్యానికి తార్కాణంగా ఉన్నాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఏ కాకతీయ పాలకుడి కాలంలో విశాల భూభాగాలు సాగులోకి వచ్చాయి?
   1) గణపతిదేవుడు
   2) ప్రతాపరుద్రుడు
   3) రుద్రదేవుడు
   4) రెండో బేతరాజు
2. రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లోని అనేక గ్రామాలు ఎవరి కాలంలో ఏర్పడ్డాయని కైఫీయత్తుల ద్వారా తెలుస్తోంది?
   1) బేతరాజు 2) ప్రోలరాజు
   3) ప్రతాపరుద్రుడు 4) రుద్రమదేవి
3. కాకతీయ రాజ్యంలో శ్రేష్ఠమైన వస్త్రాలు ఉన్నాయని ప్రశంసించిన విదేశీ యాత్రికుడు?
   1) మెగస్తనీస్ 2) ప్లీని
   3) మార్కోపోలో 4) నికోలో కాంటి
4. గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులు ఉన్నట్లు రాసిన విదేశీ యాత్రికుడు?
   1) టాలెమి 2) మార్కోపోలో
   3) ప్లీని 4) కొలంబస్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 2.

Hacker (Computer security)

Hacker is considered as hero of computer programs. In computer security, a hacker is someone who focuses on security mechanisms of computer and network systems. He is someone who lives and breathes computers, who know all about computers, who can get a computer to do anything. Equally important, though, is the hacker's attitude. Computer programming must be a hobby, something done for fun, not out of a sense of duty. Hackers are generally computer geniuses because it is due to the extraordinary computer knowledge and skills that they can conveniently break into other computer systems.

CRACKER

Cracker is considered as villain of computer programs. A cracker is someone who breaks into someone else's computer system, often on a network; bypasses passwords or licenses in computer programs; or in other ways intentionally breaches computer security. A cracker does this for profit, maliciously, for some altruistic purpose.

CLASSIFICATION OF HACKERS BASED ON THEIR ATTITUDE:

WHITE HAT

A "White hat" hacker breaks security for non-malicious reasons, perhaps to test their own security system or while working for a security company which makes security software. The term "white hat" in Internet slang refers to an ethical hacker.

BLACK HAT

A "Black hat" hacker is a hacker who "violates computer security for little reason beyond maliciousness or for personal gain". Black hat hackers break into secure networks to destroy, modify, or steal data; or to make the network unusable for those who are authorized to use the network. Black hat hackers are also referred to as the "crackers" within the security industry and by modern programmers.

Who is BLACK HAT hacker?

BANK EXAMS

COMPUTER AWARENESS

GREY HAT

A grey hat hacker lies between a black hat and a white hat hacker. Grey hat hackers sometimes find the defect of a system and publish the facts to the world instead of a group of people. Even though grey hat hackers may not necessarily perform hacking for their personal gain, unauthorized access to a system can be considered illegal and unethical.

ELITE HACKER

A social status among hackers, elite is used to describe the most skilled. Newly discovered exploits circulate among these hackers.

SCRIPT KIDDIE

A script kiddie (also known as a skid or skiddie) is an unskilled hacker who breaks into computer systems by using automated tools written by others.

NEOPHYTE

A neophyte ("newbie", or "noob") is someone who is new to hacking or phreaking and has almost no knowledge or experience of the workings of technology and hacking.

BLUE HAT

A blue hat hacker is someone outside computer security consulting firms who is used to bug-test a system prior to its launch, looking for exploits so they can be closed.

PHREAKS

A phreak is a hacker who specializes in phone systems. These days, however, phreaking is more of a cracker activity. At one time, phreaks were enthusiastic about telephone networks and simply wanted to understand how they worked and explore them. Ethical phreaks didn't steal services or cause damage; they just used their technical skill to play with the system. Phone systems have changed and are less susceptible to technological hacks. As a result, modern phreaks intent on cracking the telecommunications systems often rely on criminal acts such as stealing phone cards and cloning cell phones.

HACKTIVISTS

The hacktivist is a gray hat or cracker who defaces Web pages to bring attention to a political agenda or social cause. Companies, organizations, and governments that engage in controversial practices or that have unpopular policies are likely targets of hacktivists. How ethical this behaviour is depends on whether or not you support the hactivist's agenda or believe in his cause.

MODEL QESTIONS

1. Retail employees typically use _________ terminals to process sales transactions.
   1) Point of sale
   2)Transaction point
   3) Automatic teller
   4) Sales processing
   5) None of these
2. The simultaneous processing of two or more programs by multiple processors is _____
   1) Multiprogramming
   2) Multiprocessing
   3) Time-sharing
   4) Multitasking
   5) None of these
3. The ___ folder retains copies of messages that you have started but are not yet ready to send.
   1) Drafts 2) Sent Items
   3)Address Book
   4) Outbox
   5) None of these
4. Inheritance is the ability of an object to pass on its characteristics to its ________.
   1) Subclasses 2)off-spring
   3) Super classes 4) Parents
   5) None of these
5. Which of the following is used for close a tab on a browser?
   1) Ctrl + T 2) Ctrl + Y
   3) Ctrl + A 4) Ctrl + W
   5) None of these
6. A program that converts high level language to machine Language is _______
   1) Linker 2) Assembler
   3) Compiler
   4) All of the above
   5) None of these
7. At a time how many operating system can be at work on a computer?
   1) Only one 2) Two
   3) Three 4) Four
   5) None of these
8. A computer that combines the characteristic of analog and digital computers_________
   1) Hybrid Computer
   2) Analog Computer
   3) Digital Computer
   4) Super Computer
   5) None of these
9. The technique that extends storage capacities of main memory beyond the actual size of the main memory is called _______
   1) Multitasking
   2) Switching
   3) Multiprocessing
   4) Multiprogramming
   5) Virtual storage
10. The maximum Zoom percentage in MS WORD is________
    1) 100% 2) 200%
    3) 400% 4) 500%
    5) None of these
11. The smallest memory size is?
    1) Byte 2) GigaByte
    3) KiloByte 4) MegaByte
    5) None of these
12. Android Operating system is an example of which kind of Source Model?
    1) Open Source
    2) Vertical Market Software
    3) Horizontal Market Software
    4) Shareware 5) None of these
13. Which process checks to ensure the components of the computer and operating are connected properly?
    1) Booting 2) Processing
    3) Editing 4) Saving
    5) None of these
14. Codes consisting of lines of varying widths or lengths that are computer-readable are known as?
    1) An ASCII code
    2) An OCR scanner
    3) A magnetic tape
    4) A bar code 5)None of these
15. What is the ultimate purpose of Defragmentation?
    1) Make the PC faster
    2) Create More Free Space
    3) Delete temporary files
    4) Reduce Power consumption
    5) None of these
16. Which input device cannot be used to work in MS Office?
    1) Scanner 2) Mouse
    3) Keyboard 4) Joy stick
    5) Light pen
17. Storage that retains its data after the power is turned off is referred to as?
    1) Volatile storage
    2) Sequential storage
    3) Non-volatile storage
    4) Direct storage
    5) None of these
18. Accessing data on tapes is much ______ than that accessing data on disks?
    1) Same 2) Faster
    3) Slower 4) All of the above
    5) None of these
19. IP-Address 192.5.48.3 belongs to-
    1) Class A 2) Class B
    (3) Class C 4) Class D
    5) None of these
20. Which type of web document is run at the client site?
    1) Static 2) Dynamic
    3) Active 4) All of the above
    5) None of these
21. UDP (User Diagram Protocol) is-
    1) Connectionless
    2) Network Oriented
    3) Connection oriented
    4) a & b 5) None of these
22. Which of the following is NOT a Microsoft Internet tool or technology?
    1) Dreamweaver 2) Silver light
    3) Internet Explorer
    4) Expression Web
    5) None of these
23. Which Software protects the resources of a private network from users from other networks?
    1) Cache server
    2) proxy server
    3) Firewall
    4) Router
    5) None of these

KEY

1) 1; 2) 2; 3) 1; 4) 1;
5) 4; 6) 3; 7) 1; 8) 1;
9) 5; 10) 4; 11) 3; 12) 1;
13) 1; 15) 2; 14) 4; 16) 4;
17.3; 18) 3; 19) 3; 20) 1;
21.1; 22) 1; 23) 3.